ఈనాడు

Joyalukkas
World's favourite jeweller
Shop online @ joyalukkas.com

కరీంనగర్ 15-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 156

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi





ఈనాడు



కరీంనగర్ 15-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 156

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


ఆదాయపు పన్ను మినహాయింపు

పరిమితి రెట్టింపు?

రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే యోచన

దిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం మరో తాయిలం ప్రకటించే అవకాశం ఉంది. ఉద్యోగులు, మధ్య తరగతిని ఆకర్షించేందుకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో దీనిని ప్రస్తావిస్తారని సమాచారం. సాధారణంగా ఎన్నికలు ...మిగతా 2లో





కోటి ఆశల ధాన్యరాశులు తెలుగు గాదెల నిండగా
సంబరంగా సాగి వచ్చెను సంకురాతిరి పండగ
గంగిరెద్దుల గాలిపటముల జంగమయ్యల జాతరై
గొబ్బియల్లో గొబ్బియల్లో గొబ్బిపూవుల పాటలై
కీర్తనల హరిదాసు గళమున భక్తి గోవిందార్చనై
జాను తెనుగున జాలువార్చిన జానపదముల గుచ్ఛమై
రంగవల్లులు ఊరువాడల రత్నకాంతులు చల్లగా
అందరొకటై ఉండవలె ఆనందమే వర్థిల్లగా

–చైతన్య ప్రసాద్

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
'ఈనాడు' సంక్రాంతి శుభాకాంక్షలు

సెలవు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం 'ఈనాడు' కార్యాలయానికి సెలవు. బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం. - మేనేజింగ్ డైరెక్టర్

తాజా వార్తల కోసం www.eenadu.net చూడగలరు

ముందు 8 మందే!



- జాబితాను సిద్ధం చేసుకున్న సీఎం కేసీఆర్
- సభాపతి తేలితేనే మంత్రివర్గంపై పూర్తి స్పష్టత

ఈనాడు, హైదరాబాద్: శాసన సభాపతి ఎంపిక తర్వాత మంత్రివర్గ విస్తరణపై పూర్తి స్పష్టత రానుంది. సభాపతిగా ఎంపికయ్యే నేత సామాజికవర్గం నుంచి ఒకరిని తగ్గించి గానీ, లేదా మినహాయించి గానీ మంత్రివర్గ కూర్పు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ యోచిస్తున్నట్లు సమాచారం. సభాపతిగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయితే మంత్రివర్గంలో ఆ సామాజికవర్గం నుంచి ఒక అభ్యర్థి తగ్గే వీలుంది. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నుంచి సభాపతి ఎంపికైనా మంత్రివర్గ కూర్పులో ఆ సామాజికవర్గాల ఎంపికలో మార్పులు జరుగుతాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో సీఎం కేసీఆర్‌తో పాటు మహమూద్ అలీ ఉన్నారు. మొదటి మంత్రివర్గ విస్తరణలో ఆయన 8 మందికి చోటు కల్పిస్తారని తెలుస్తోంది. ఆతర్వాత మరో ఎనిమిది మందిని తీసుకుంటారని సమాచారం. ఈ మేరకు జాబితా కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ...మిగతా 2లో

శాఖల కుదింపు పూర్తి

- 34 నుంచి 18కి మార్పు • సీఎంకు నివేదిక 2 లో

మరో భారీ కుంభకోణం!

- మైక్రోవేవ్ స్పెక్ట్రం కేటాయింపులో రూ.69,381 కోట్ల నష్టం... కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు 11 లో

కోటా షురూ

పేదలకు 10 శాతం రిజర్వేషన్లపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్

ఈనాడు, దిల్లీ: పేదలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో జనరల్ కేటగిరీలో కల్పించిన 10 శాతం కోటా రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. దీనిపై సోమవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రిజర్వేషన్లు కల్పించేందుకు తీసుకొచ్చిన 'రాజ్యాంగ (103వ సవరణ) చట్టం, 2019' జనవరి 14 (సోమవారం) నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ వెల్లడించింది. ఈ చట్టంలోని సబ్‌సెక్షన్ (2)కింద దఖలు పడిన అధికారాలకు లోబడి కేంద్ర ప్రభుత్వం అమలు తేదీని ప్రకటించింది. ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజల ముందడుగు కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16లకు చట్టంలో సవరణలు చేస్తూ ...మిగతా 2లో


పేదరికాన్ని పునర్నిర్వచించాల్సిందే

- పదిశాతం కోటాతో పలు పథకాలపై ప్రభావం 2 లో



చమురు ధరలు మళ్లీ పైకి

2 లో



శాఖల పునర్వ్యవస్థీకరణ పూర్తి

- 34 నుంచి 18కి కుదింపు
- సీఎంకు నివేదిక
- మంత్రివర్గ విస్తరణకు మార్గం సుగమం
- చట్టాలన్నింటిని తెలుగులోకి అనువదించాలని ఆదేశాలు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో ప్రభుత్వ శాఖల పునర్ వ్యవస్థీకరణ పూర్తయింది. దీనిపై రూపొందించిన నివేదికను సోమవారం అధికారులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందించారు. దానిని పరిశీలించిన సీఎం ఒకటి రెండు మార్పులతో ఆమోదించారు. పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ముగియడంతో మంత్రివర్గ విస్తరణకు మార్గం సుగమమైనట్లుగా భావిస్తున్నారు. రాష్ట్రంలో శాసనసభ్యుల సంఖ్యకు అనుగుణంగా 18 మందితోనే మంత్రివర్గం ఏర్పాటు చేయాల్సి రావడం, ఇతర పాలనాపరమైన సమస్యలున్నాయని భావించిన సీఎం శాఖలను పునర్ వ్యవస్థీకరించి, వాటిని మంత్రుల సంఖ్యకు అనువుగా మార్చాలని అధికారులను ఆదేశించారు. సీఎం సూచనలకు అనుగుణంగా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి నిపుణులు, ఉన్నతాధికారులకు ఈ బాధ్యతలు అప్పగించారు. వారు అధ్యయనం చేసి మొత్తం 34 శాఖలను 18గా మార్చారు. వ్యవసాయం, నీటి పారుదల, సంక్షేమం, పంచాయతీరాజ్, పరిశ్రమలు, ఇంధనం, సాంస్కృతిక, మౌలిక వసతులు, రోడ్లు, భవనాలు తదితర ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. ఒకే రకమైన కార్యకలాపాలను నిర్వహించడంతో పాటు అనుబంధ విభాగాలుగా ఉన్న వాటిని ప్రధాన శాఖలో విభాగంగా మార్చారు. ప్రతీ శాఖకు ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి అధిపతులుగా వ్యవహరించాలని, వారి కింద కార్యదర్శులు, కమిషనర్లు పనిచేసేందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరిగింది. పునర్ వ్యవస్థీరణలో శాఖల మార్పులు చేర్పులు మాత్రమే జరిగాయని, వేటిని కుదించడంగానీ , విలీనం చేయడం గానీ జరగలేదని, అధికారులు, సిబ్బంది సంఖ్య యథాతథంగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

సీఎం సంతృప్తి

అధికారులు సమర్పించిన నివేదికను పరిశీలించి సీఎం సంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఒక్క సాంస్కృతిక శాఖ పరిధిని విస్తరించాలని ఆయన సూచించారు. సమాచార పౌరసంబంధాల శాఖను, చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ)ని సైతం సాంస్కృతిక శాఖ పరిధిలో చేర్చాలని సూచించారు. దీనికి అనుగుణంగా అధికారులు మార్పులు చేశారు. నివేదిక సిద్ధమయింది.

అన్ని చట్టాలు తెలుగులో..

దీంతో పాటు తెలంగాణలో ఇటీవల రూపొందించిన పంచాయతీరాజ్ చట్టం మొదలుకొని అన్ని చట్టాలను ఆంగ్లం నుంచి తెలుగులోకి వెంటనే అనువదించాలని సీఎం ఆదేశించారు. సచివాలయ, సాధారణ పరిపాలన శాఖకు సంబంధించిన కార్యకలాపాల నిబంధనల (బిజినెస్ రూల్స్)ను సైతం తెలుగులోకి మార్చాలని సూచించారు. ఆంగ్లంలో ఉండడం వల్ల వీటిపై అందరికీ అవగాహన కలగడం లేదని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టాన్ని అనువదించి, వెంటనే అన్ని గ్రామాలకు పంపించాలన్నారు.

పునర్ వ్యవస్థీకరణ తర్వాతే మంత్రివర్గ విస్తరణ...

శాఖల పునర్వ్యవస్థీకరణ తర్వాతే మంత్రివర్గవిస్తరణ జరగాలని సీఎం కేసీఆర్ భావించారు. ఈ అంశాన్ని ఇప్పటికే వెల్లడించారు. తాజాగా జరగడంతో సీఎం కేసీఆర్ మంత్రివర్గ విస్తరణపై దృష్టి సారిస్తారనే అంచనాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఈ నెల 18న విస్తరణపై ఊహగానాలుండగా... సీఎం తుది నిర్ణయం తీసుకుంటే అప్పుడు జరిగే వీలుంది. మరింత గడువు అవసరమయితే మరో తేదీని పరిశీలిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

గవర్నర్ ప్రసంగం సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి ఉభయసభల్లో ఈ నెల 19న గవర్నర్ ప్రసంగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రసంగపాఠాన్ని సిద్ధం చేసింది. దీనిని బుధవారం అధికారులు గవర్నర్‌కు అందజేయనున్నారని తెలిసింది. తెలంగాణ రెండో శాసనసభ ఏర్పాటును పురస్కరించుకొని సంప్రదాయం ప్రకారం గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలి. దీనికి సంబంధించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వమే సిద్ధం చేసి గవర్నర్‌కు అందజేస్తుంది. ఈ నెల 17 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న విషయం విదితమే. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రసంగ పాఠం తయారయింది. దాదాపు పదిపేజీల ప్రసంగపాఠాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అధికారులు సోమవారం అందజేసినట్లు తెలిసింది. ఆయన ఆమోదం పొందిన తర్వాత దానిని గవర్నర్‌కు సమర్పిస్తారు. ఆ తర్వాత ప్రసంగ ప్రతులను ముద్రించి సభలో సభ్యులకు అందజేస్తారు.

ధన్యవాద తీర్మానాలపై...

రాష్ట్ర గవర్నర్ ఈ నెల 19న ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత దానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని 20న ప్రవేశపెడతారు. శాసనసభలో ఎమ్మెల్యేలు కొప్పుల ఈశ్వర్ ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టనుండగా ప్రశాంత్‌రెడ్డి మద్దతుగా ప్రసంగిస్తారని తెలిసింది. మరోవైపు శాసనమండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీర్మానాన్ని ప్రతిపాదిస్తారని, మరో విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు మద్దతుగా మాట్లాడుతారని సమాచారం. ఈలోగా మంత్రివర్గ విస్తరణ జరగకపోతే శాసనసభలో సీఎం, మండలిలో మంత్రి మహమూద్‌అలీలు దీనిపై ప్రసంగిస్తారని తెలిసింది.

18న బీఏసీ సమావేశాలు

ఈ నెల 18న శాసనసభకు సంబంధించి కొత్త సభాపతి ఆధ్వర్యంలో, మండలిలో ఛైర్మన్ స్వామిగౌడ్ అధ్యక్షతన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు జరుగుతాయి. మంత్రులు ఉంటే దీనికి వారు హాజరవుతారు. లేని పక్షంలో సీఎం శాసనసభ బీఏసీకి, మంత్రి మహమూద్‌అలీ మండలి బీఏసీకి హాజరయ్యే వీలుంది.

శాసనసభ వ్యవహారాల బాధ్యతలు సీఎంకే

శాసనసభ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభావ్యవహారాల బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే శాసనసభ అధికారులు ఆయన ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 18న మంత్రివర్గ విస్తరణ జరగని పక్షంలో ఆ రోజు, మరుసటి రోజు సీఎం శాసనసభా వ్యవహారాలను పర్యవేక్షించే వీలుంది. మరోవైపు శాసనమండలిలో సభానాయకునితో పాటు సభానిర్వహణ బాధ్యతలను మంత్రి మహమూద్ అలీ నిర్వర్తించవచ్చని తెలుస్తోంది.

17న శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం

రాష్ట్ర శాసనసభలో ఈ నెల 17న శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తాత్కాలిక సభాపతి ముంతాజ్ అహ్మద్ ఖాన్ మొదట ముఖ్యమంత్రి కేసీఆర్‌తో శాసనసభ్యునిగా ప్రమాణం చేయించనున్నారు. ఆ తర్వాత విపక్ష నేత ప్రమాణం ఉంటుంది. నిబంధనల మేరకు సీఎం అనంతరం మంత్రులు ప్రమాణం చేయాలి. తెరాస మంత్రివర్గంలో ప్రస్తుతం ఒకే మంత్రి ఉండగా ఆయన ఎమ్మెల్సీ కావడంతో శాసనసభలో మంత్రుల కోటాలో ప్రమాణ స్వీకారాలు ఉండవు. అందువల్ల సీఎం తర్వాత విపక్ష నేతతో ప్రమాణస్వీకారం చేయించాలని నిర్ణయించారు. ఈ నెల 16న సీఎల్పీ నేత ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సమాచారం అందించడంతో ఈ మేరకు శాసనసభ అధికారులు జాబితాలో పేర్లు పెట్టినట్లు తెలుస్తోంది. విపక్ష నేత అనంతరం మహిళా సభ్యురాళ్లు ప్రమాణం చేస్తారు.

దైవ విరుద్ధం

భగవంతుడు ఏ ఒక్క వ్యక్తినైనా న్యూనతకు ప్రతిరూపంగా ఈ లోకంలోకి తెచ్చి ఉండడు. అలా తెచ్చి ఉంటే ఆయన భగవంతుడు కావటం అసంభవం!

– మహాత్మా గాంధీ

ఆదాయపు పన్ను మినహాయింపు

పరిమితి రెట్టింపు?

(మొదటి పేజీ తరువాయి)

సమీపిస్తున్న సందర్భంలో పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా ఆదాయ వ్యయాలకు వీలు కల్పించే ఓట్ ఆన్ అకౌంట్‌ను ప్రవేశపెడుతారు. దీంట్లో పన్నుల పరంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదన్న సంప్రదాయం ఉంది. రానున్న ఫిబ్రవరి ఒకటో తేదీన కూడా ఓట్ ఆన్ అకౌంట్‌నే ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అయినప్పటికీ, ఇందులో ఐటీ పరిమితిపై కీలక ప్రకటన చేయనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వార్షికాదాయం రూ.2.5 లక్షల వరకు ఎలాంటి పన్ను లేకపోగా, ఆ పరిమితిని రెట్టింపు చేసి రూ.5 లక్షలకు పెంచే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఇంతవరకు ఏమి చేసింది?

గత ఏడాది..2018లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆదాయపు పన్ను రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ‘‘గత మూడేళ్లుగా వేతనజీవులకు ప్రభుత్వం తగినంత ఊరట కలిగించింది. అందువల్ల ఈ సారి ఆదాయపు పన్నులో ఎలాంటి మార్పులను ప్రతిపాదించడం లేదు’’ అని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. రవాణా, వైద్యం కోసం చేసే ఖర్చుల్లో రూ.40 వేల వరకు పన్ను మినహాయింపు ఇచ్చారు.

- 2017లో కింది శ్లాబులో పన్ను రేటును తగ్గించారు. అంతవరకు రూ.2.5 లక్షలు- రూ.5 లక్షల శ్లాబుకు 10% పన్ను ఉండగా, దాన్ని 5 శాతానికి తగ్గించారు.

తొలి దశలో 8 మందే

(మొదటి పేజీ తరువాయి)

ఇంద్రకరణ్‌రెడ్డి/పద్మాదేవేందర్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి/ప్రశాంత్‌రెడ్డి, ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్/జోగురామన్న, జగదీశ్‌రెడ్డి/గుత్తా సుఖేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి/పువ్వాడ అజయ్, నిరంజన్‌రెడ్డి/లక్ష్మారెడ్డి, రెడ్యానాయక్/రేఖానాయక్‌లు ఈ జాబితాలో ఉన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సభాపతి పదవి వస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రశాంత్‌రెడ్డికి అవకాశం వస్తుంది. పద్మా దేవేందర్‌రెడ్డికి అవకాశం వస్తే సామాజికవర్గంతో పాటు మహిళా కోటాగా పరిగణిస్తారు. రేఖానాయక్‌ను ఎంపిక చేస్తే ఆమెను మహిళా కోటాతో పాటు ఎస్టీ కోటా కింద చూస్తారు. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలు ఎవరైనా వస్తే మంత్రివర్గ కూర్పులో మార్పులు ఉండే అవకాశం ఉంది. సామాజిక సమీకరణాలపరంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా కోటా నుంచి మాత్రం విధిగా ఒకరుండే అవకాశముంది.

సభాపతిపై 16న తుది నిర్ణయం

- పోచారం, ఇంద్రకరణ్ రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డిలలో ఒకరికి అవకాశం
- తాజాగా ముగ్గురితోనూ సీఎం చర్చలు

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి ఎంపికపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 16న తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నెల 17న సభాపతి నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉన్నందున అంతకు ఒక రోజు ముందు విధిగా పేరు ఖరారు చేస్తారని తెలుస్తోంది. మాజీ మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఉప సభాపతి పద్మా దేవేందర్‌రెడ్డిలలో ఒకరిని ఈ పదవికి ఎంపిక చేసే అవకాశం ఉంది. 2014లో సభాపతి ఎంపిక సత్వరమే జరిగినా... ఈసారి ఎంపిక మాత్రం సీఎం కేసీఆర్‌కు క్లిష్టంగా మారింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి (నిర్మల్), ఈటల రాజేందర్ (హుజురాబాద్), కొప్పుల ఈశ్వర్ (ధర్మపురి), రెడ్యానాయక్ (డోర్నకల్), పద్మా దేవేందర్‌రెడ్డి (మెదక్)ల పేర్లను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలించినట్లు తెలిసింది. అనుభవం, సామాజిక సమీకరణాలను పరిగణనలోనికి తీసుకొని ఈ జాబితా రూపొందించిన తర్వాత సీఎం వారితో మాట్లాడినట్లు తెలిసింది. మొదట్లో అంతా విముఖత వ్యక్తంచేశారు. తాజాగా సీఎం పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించి ఆయనతో మాట్లాడారు. ఆరోగ్యపరమైన సమస్యలను, సభాపతిగా పోటీ వల్ల ఓటమి భయాన్ని ఆయన వ్యక్తంచేయగా సీఎం భరోసా ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు ఇంద్రకరణ్‌రెడ్డితోనూ మాట్లాడారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. గతంలో దేవాదాయ శాఖ మంత్రులు ఓడిపోతారనే ఆనవాయితీ ఉండేదని, దేవాదాయ శాఖ మంత్రిగా పోటీ చేసి చరిత్ర తిరగరాశావు అని సీఎం ఇంద్రకరణ్‌ను అభినందించినట్లు తెలిసింది. సభాపతిగానూ పనిచేయడం వల్ల ఓటమి భయం ఉండదని సీఎం చెప్పినట్లు తెలిసింది. పద్మా దేవేందర్‌రెడ్డితోనూ ఆయన చర్చించారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సీఎం ఈ నెల 16న సభాపతి పేరును ప్రకటించే వీలుంది. సభాపతి ఎంపికకు అనుగుణంగా మరో సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేను ఉప సభాపతిగా ఎంపిక చేస్తారు.



ఇరాన్‌లోని అల్‌బోర్జ్ ప్రావిన్స్‌లో సోమవారం సైనిక విమానం కుప్పకూలడంతో ఎగసిపడుతున్న మంటలు

ఇరాన్ సైనిక విమానానికి ప్రమాదం

- 15 మంది మృతి

టెహ్రాన్: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు సమీపంలో ఆ దేశ సైన్యానికి చెందిన ఓ సరకు రవాణా విమానం సోమవారం ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న 15 మంది దుర్ఘటనలో మృత్యువాతపడ్డారు. ఒకరు మాత్రమే ప్రాణాలతో మిగిలారు. ప్రమాదానికి గురైన విమానం బోయింగ్ 707 రకానికి చెందినదని ఇరాన్ సైన్యం వెల్లడించింది. కిర్గిజ్‌స్థాన్ నుంచి ఇది మాంసం లోడుతో బయల్దేరినట్లు పేర్కొంది. ఫాత్ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తుండగా విమానం రన్‌వేపై నుంచి జారిపోయిందని.. కొద్ది దూరంలో ఉన్న గోడను ఢీకొట్టి మంటల్లో చిక్కుకుందని వివరించింది. అంతకుముందు ఇరాన్ విమానయాన విభాగం ఆ విమానం కిర్గిజ్‌స్థాన్‌కు చెందినదిగా ప్రకటించింది.

చమురు ధరలు మళ్లీ పైకి

- అయిదు రోజులుగా వరుస పెరుగుదల
- పెట్రోలుపై రూ. 1.73, డీజిల్‌పై రూ.2.11 పెంపు

ఈనాడు, హైదరాబాద్: చమురు ధరలు మళ్లీ చుక్కలనంటుతున్నాయి. గడిచిన అయిదు రోజులుగా వరుసగా రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటు చేసుకున్న మార్పులే ఇందుకు కారణమని చమురు సంస్థలు చెబుతున్నాయి. అయిదు రోజుల్లో పెట్రోలుపై లీటరుకు రూ.1.73.. డీజిల్‌పై రూ.2.11 పెరిగింది. హైదరాబాద్‌లో సోమవారం లీటరు పెట్రోలు ధర రూ.74, డీజిల్ రూ.69.24కు చేరింది. గడిచిన పది రోజుల్లో అయిదు సార్లు ధరలు పెరిగాయి. ఈ నెలలో ఇప్పటి వరకు లీటరు పెట్రోలు ధర అత్యధికంగా రూ.74.40, అత్యల్పం రూ.72.82గా ఉంది. లీటరు డీజిల్ అత్యధికంగా రూ.69.77, అతి తక్కువగా రూ.67.57గా ఉంది. అయిదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా తగ్గుతూ వచ్చిన ధరలు.. ఎన్నికలు ముగియగానే అడపాదడపా పెరుగుతూనే ఉన్నాయి.

నాలుగు రోజుల్లో పెరుగుదల తీరు (రూ.)

తేదీ	పెట్రోలు ధర	పెరుగుదల	డీజిల్ ధర	పెరుగుదల
జనవరి 14	74.40	0.40	69.77	0.53
13	74.00	0.53	69.24	0.64
12	73.47	0.20	68.60	0.32
11	73.27	0.20	68.28	0.30
జనవరి 10	73.07	0.40	67.98	0.32

కోటా షురూ

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనను చేర్చారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం మైనారిటీ తప్పించి ప్రైవేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు అవకాశం కలుగుతుందని నోటిఫికేషన్ పేర్కొంది. ఈ కోటా ప్రస్తుతమున్న రిజర్వేషన్లకు అదనమని, ప్రతి విభాగంలోని మొత్తం సీట్లలో గరిష్ఠంగా 10 శాతానికి వర్తిస్తుందని వెల్లడించింది. ఆయా పరిస్థితులకు అనుగుణంగా కుటుంబ ఆదాయం, ఆర్థిక వెనుకబాటుతనానికి సంబంధించిన ఇతర సూచీల ఆధారంగా ఆర్థికంగా బలహీన వర్గాల నిర్ధరణ జరుగుతుందని నోటిఫికేషన్ వివరించింది. చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేటికవి ప్రత్యేకంగా విడుదల చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఈ పది శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. ఇది వరకటి రిజర్వేషన్లు 50 శాతంలోపు ఉన్నాయా? అంతకు మించాయా? అనేది ఈ 10 శాతం రిజర్వేషన్లకు వర్తించదని, ఇవి ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇచ్చేవి కాబట్టి ప్రత్యేకంగా చూడాలని కేంద్ర న్యాయశాఖ అధికారులు తెలిపారు. ఈ రాజ్యాంగ సవరణ చట్టంలోనే ఇప్పటికే అమల్లో ఉన్న రిజర్వేషన్లకు అదనంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గరిష్ఠంగా పదిశాతం అమలు చేయాలని ఉన్నందున ఇప్పుడున్న రిజర్వేషన్ల అంశం దీని పరిధిలోకి రాదని చెప్పారు.

అమలు తీరిలా..

రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన విధివిధానాలను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత వాటిని కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగాలకు వర్తింపజేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ ఆఫీస్ మెమోరాండం విడుదల చేయాల్సి ఉంటుంది. అలాగే ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలకు వర్తింపజేస్తూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మరో నోటిఫికేషన్ విడుదల చేయాల్సి వస్తుంది. ఇదే ప్రకారం ఈ రిజర్వేషన్లను రాష్ట్రాలకు వర్తింపజేస్తూ ఆయా రాష్ట్రాల్లోని సాంఘిక సంక్షేమ శాఖలు తొలుత అర్హత విధివిధానాలు విడుదల చేయాల్సి వస్తుంది. దాని తర్వాత విద్య, ఉద్యోగాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వంలోని సాధారణ పరిపాలన శాఖ, మానవ వనరుల అభివృద్ధిశాఖలు ప్రత్యేక నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉంటుంది.

రాష్ట్రాలకు అవకాశం..

103వ రాజ్యాంగ సవరణ చట్టం కేంద్ర, రాష్ట్రాల్లోని విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు గరిష్ఠంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ద్వారాలు తెరిచింది. ఈ బిల్లును రాష్ట్ర శాసనసభలు మళ్లీ ఆమోదించాల్సిన అవసరం లేదు. కేవలం అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తే సరిపోతుంది. కేంద్రం జారీ చేసే విధివిధానాలను యథాతథంగా రాష్ట్రాల్లో అమలు చేయాలా? వద్దా? అనేది రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టం. అందులో మార్పులు చేర్పులు చేసుకొనే అధికారం ఆయా రాష్ట్రాలకే ఉంటుంది. గరిష్ఠంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చెప్పినందున వాటిని తమకు ఇష్టం వచ్చిన శాతానికి పరిమితం చేసే అధికారం కూడా రాష్ట్రాలకు ఉంటుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు. గరిష్ఠంగా పది శాతం వరకు రిజర్వేషన్లు కల్పించాలనే నిబంధన చట్టంలో చెప్పినందున కచ్చితంగా అంతవరకూ ఇవ్వాలని ఏమీలేదని, ఆలోపు ఎంత శాతమైనా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఈనెల 9వ తేదీన రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ చట్టం మూలస్వరూపం గురించి విస్పష్టంగా చెప్పారు. ‘‘రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు సవరణ చేస్తున్నాం. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకే కాదు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ వర్తిస్తుంది. రూ.8 లక్షల పరిమితి గురించి చాలామంది ప్రశ్నిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఆ పరిమితిని రూ.5 లక్షలకే పరిమితం చేస్తామని చెప్పుకొనే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది. రాజ్యాంగం రాష్ట్రాలకు ఆ మేరకు అధికారం ఇస్తోంది. భారత్ సమాఖ్య లక్షణాలున్న దేశం. కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలున్నాయి. కానీ ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రాల్లోనూ ఆర్థికంగా బలహీనవర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే. అందుకు విధివిధానాలు ఎలా ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకుంటాయి. మేం రిజర్వేషన్ల అమలుకు అవసరమైన పరిస్థితులను ప్రాథమిక హక్కుల సవరణ ద్వారా కల్పిస్తున్నాం. ఈ చట్టం ఆర్టికల్ 368 కింద చేస్తున్నారు. ఆర్టికల్ 54, 55, 73, 162, చాప్టర్ 4, పార్ట్ 4, షెడ్యూల్ 7లోని జాబితాలో మార్పులు చేసినప్పుడే రాష్ట్రాలతో సంప్రదించాల్సి ఉంటుంది. ఆర్టికల్ 368 ప్రకారం పార్లమెంటు ప్రాథమిక హక్కుల అధ్యాయంలో సవరణలు చేపట్టినప్పుడు ఆ బిల్లు రాష్ట్రాల శాసనసభలకు వెళ్లాల్సిన అవసరం లేదు’’ అని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఈ చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉంటుంది. స్థానికపరిస్థితులకు అనుగుణంగా చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాలు రాష్ట్రాలు రూపొందించుకొని కార్యరూపంలోకి తేవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ప్రస్తుతం 49.5% కోటానే అమలవుతోంది. ఈ 10% దానికి అదనం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యావకాశాలకు సంబంధించి ఒక్కోరాష్ట్రంలో ఒక్కోకోటా అమలవుతోంది. కనీసం 50 నుంచి 69% దాకా వివిధ రాష్ట్రాల్లో కోటాలు అమలవుతున్నాయి. 103వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం వాటిని అలాగే కొనసాగిస్తూ ఈ 10% అమలుచేయాల్సి ఉంటుంది. ఈ గరిష్ఠ పరిమితులపై కోర్టులు స్పష్టమైన తీర్పులు ఇచ్చేంతవరకూ పాతకోటాలతోపాటు ఈ కొత్త కోటా అమల్లో ఉంటుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ అధికారులు వ్యాఖ్యానించారు.

అమలులో తొలి రాష్ట్రంగా గుజరాత్

అహ్మదాబాద్: భాజపా నేతృత్వంలోని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాల రిజర్వేషన్లను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో కొత్త నిబంధనలు అమలు చేయడంలో దేశంలోనే తొలిరాష్ట్రంగా పేరొందనుంది. ప్రస్తుతం జరుగుతున్న అన్ని నియామకాల్లో, ప్రకటనలు మాత్రమే వెలువడి, తొలిదశ పరీక్షలు పూర్తికాని వాటిలోనూ కోటా అమలవుతుందని సీఎం విజయ్‌రూపానీ ఒక ట్వీట్‌లో తెలిపారు. ఉన్నత విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో జనరల్ కేటగిరీలో 10 శాతం కోటా ఆర్థికంగా బలహీన వర్గాలకు జనవరి 14నుంచి అమల్లోకి వస్తుందని, అంతకన్నా ముందుగా జరిగిన నియామకాలు, ప్రవేశాలు, ముఖాముఖిలకు వర్తించదని ప్రభుత్వం తెలిపింది. జనవరి 14కన్నా ముందు ప్రకటనలు వెలువడినా, అసలైన ప్రక్రియ ప్రారంభం కాకపోతే కోటా అమలు జరుగుతుందని పేర్కొంది. ఈ నెల 20న నిర్వహించాల్సిన ప్రిలిమినరీ పరీక్షల్ని వాయిదా వేస్తామని, కొత్త లబ్ధిదారులకు రిజర్వేషన్ ధ్రువపత్రాల జారీ తర్వాత పరీక్ష తేదీల్ని ప్రకటిస్తామని గుజరాత్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది.

‘ఉపా’ చట్టాన్ని ఎత్తివేయాలని కోరుతూ ఈ నెల 19న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది.

పేదరికాన్ని పునర్నిర్వచించాల్సిందే!

ఈనాడు, దిల్లీ: జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో పదిశాతం రిజర్వేషన్లు తీసుకురావడం పలు కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా పట్టణప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)పై దీని ప్రభావం అధికంగా పడనుంది. రూ.ఎనిమిది లక్షల వార్షికాదాయం కంటే తక్కువగా ఉన్న వారికి పదిశాతం రిజర్వేషన్లు కల్పించనున్న సంగతి తెలిసిందే. దీని వల్ల జనరల్ కేటగిరీలో ‘పేదరికాన్ని’ పునర్నిర్వచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు పట్టణప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు(ఈడబ్ల్యూఎస్)గా గుర్తించాలంటే వార్షికాదాయం రూ.మూడు లక్షలకు మించకూడదు. రూ.మూడు-ఆరులక్షల వరకు ఉంటే అల్పాదాయ వర్గాలు(ఎల్ఐజీ)గా గుర్తిస్తున్నారు. ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్ కింద ప్రాధాన్య రంగాల్లో రుణాలు ఇవ్వాలన్నా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం ఇదే నిర్వచనాలను ప్రామాణికంగా అనుసరిస్తోంది. రూ.ఎనిమిది లక్షల వరకు ఆదాయం ఉన్న జనరల్ కేటగిరీ వారిని ‘ఈడబ్ల్యూఎస్’వర్గంగా గుర్తిస్తూ కేంద్రం తాజాగా గరిష్ఠ పరిమితిని 2.6రెట్లు చేసింది. దీంతో దాదాపు 90 శాతం మంది పన్ను చెల్లింపుదారులు ‘ఈడబ్ల్యూఎస్’లోకి వచ్చేశారు. పైగా వీరంతా సంఘటిత రంగంలో ఉన్నవారు. అసంఘటిత రంగంలోనివారిని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య 90శాతాన్ని మించిపోతోంది.

దారిద్ర్య రేఖకు దిగువన ఎంతమంది?

మన దేశ జనాభాలో ఐదోవంతు జనాభా దారిద్ర్య రేఖకు దిగువ(బీపీఎల్)న ఉన్నట్లు అంచనా. అధికారిక నిర్వచనం ప్రకారం ఐదుగురు సభ్యులు గల గ్రామీణ కుటుంబం నెలకు రూ.4,080 లోపు వ్యయం చేస్తుంటే, ఆ కుటుంబం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు లెక్క. పట్టణంలో అయితే రూ.5000లోపు వ్యయం చేస్తున్నవారిని ‘బీపీఎల్’ కింద ఉన్నట్లు పరిగణిస్తారు. ఈ లెక్కల ప్రకారం దేశంలోని 25శాతం గ్రామీణులు, 14శాతం మంది పట్టణవాసులు ‘బీపీఎల్’వర్గంవారే.

గ్రహం అనుగ్రహం

15-1-2019 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
నవమి: రా. 7.42 తదుపరి దశమి
అశ్విని నక్షత్రం: ఉ.9.42 తదుపరి భరణి
అమృత ఘడియలు: తె. 5.16 నుంచి
వర్జ్యం: ఉ.శే. 6.33 వరకు
తిరిగి రా. 7.22 నుంచి 9.01 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.50 నుంచి 9.35 తిరిగి
రా. 10.51 నుంచి 11.43 వరకు
రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; **సూర్యాస్తమయం:** సా.5-40
సంక్రాంతి పండుగ

గ్రహం అనుగ్రహం

16-1-2019 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
దశమి: రా. 7.23 తదుపరి ఏకాదశి
భరణి నక్షత్రం: ఉ. 10.10 తదుపరి కృత్తిక
అమృత ఘడియలు: ఉ. 6.54 వరకు
వర్జ్యం: రా. 1.09 నుంచి 11.45 వరకు
దుర్ముహూర్తం: మ. 11.47 నుంచి 12.32 వరకు
రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; **సూర్యాస్తమయం:** సా.5-41
కనుమ పండుగ

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
కడప	13.0	33.0
రామగుండం	15.6	28.8
హైదరాబాద్	15.7	29.5
ఆదిలాబాద్	15.7	30.5
హన్మకొండ	16.0	29.0
కరీంనగర్	17.0	30.0
నల్గొండ	17.0	30.0
మహబూబ్‌నగర్	17.0	32.5
నిజామాబాద్	17.4	30.0
సూర్యాపేట	19.0	29.0


Reliance
Growth is Life
NOW OPEN AT
MANCHERIAL; ASIAN SRIDEVI MALL, HANUMAKONDA.
Reliance digital
PERSONALISING TECHNOLOGY
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
సంక్రాంతి పండుగకి, తగ్గింపు ధరలు.
32 (81 cm) TCL ₹9 990/- 3 Year WARRANTY
55 (139 cm) 55U5570 RECONNECT UHD LED TV EMIs of ₹3 499/-* UHD 2 YEAR WARRANTY
₹34 990/-
OFFER GET SOUNDBAR WORTH ₹10000/-*
5% క్యాష్‌బ్యాక్* HDFC BANK We understand your world
క్రెడిట్ కార్డు (ఇంఎంఐ మరియు రెగ్యులర్), డెబిట్ కార్డు ఇంఎంఐ మరియు కన్స్యూమర్ లోన్‌పై ఆఫర్ లభిస్తుంది.
మరుసటి రోజు డెలివరి మరియు ఇన్‌స్టలేషన్ లేకపోతే ₹5000/- విలువ గల గిఫ్ట్** + వడ్డీ లేని ఇంఎంఐ 30 నెలల* వరకు
NOW ALSO SHOP ON RELIANCEDIGITAL.IN
15% CASHBACK* ON SELECT DEBIT & CREDIT CARDS
43 (109 cm) 43N5370 SAMSUNG FHD SMART LED Full HD 1080 2 YEAR WARRANTY*
EMIs of ₹2 999/-*
55 (140 cm) 55UK6360 LG UHD SMART LED UHD SMART 2 YEAR WARRANTY*
EMIs of ₹4 999/-*
APPLE iPad (2018)
Starting From ₹28 000/-
OFFER Get iPad CASE + TEMPERED GLASS WORTH ₹3000/- FREE with iPad(2018) + 5% CASHBACK on CITI CREDIT OR AXIS CREDIT CARD*
Cashback Valid upto 31st Jan 2019*
Intel® Core™ i3 Laptops Starting from ₹30 499/-*
Intel® Core™ i5 Laptops Starting from ₹44 999/-*
Gaming Laptops Starting from ₹65 999/-*
BRANDS OFFERS
Dell Gaming Upto 10% Additional Cashback on HDFC Credit Card
HP New Year Benefits worth ₹31067/- at ₹1298/-*
Lenovo 2 yrs Additional Warranty starting at ₹999/-*
Microsoft Surface Pro Lenovo acer ASUS
NIKON D5600 DZ KIT
• Lens 18-55mm+70-300mm • 24.2 MP CMOS Sensor
₹49 990/-* EMIs of ₹5 554/-
OFFER Samsung Level U Bluetooth Headset ₹2 999/-
NEW PRICE XIAOMI REDMI NOTE 5 PRO
• 15.2cm (5.99) Display • 12MP+5MP Dual rear Camera • 20MP Front Selfie Camera • 4000 mAh Battery
Starting From ₹13 569/- INCLUDING TEMPERED GLASS
OFFER Instant Jio Benefits Worth ₹2200/-* + Double Data
NEW LAUNCH OPPO A7
• 15.8 cm (6.2) display • 3 GB RAM + 64 GB ROM • 13 MP + 2 MP Dual rear camera 16MP Front Camera • 4230 mAh Battery
Starting From ₹14 990/-
NEW PRICE VIVO Y95
• 15.8 cm (6.22) Halo Full View Display • 20 MP AI Selfie Camera • 4 GB RAM+ 64 GB ROM
₹15 990/-
OFFER Instant Jio Benefits Worth ₹4000/-*
SAMSUNG A7
• 15.2 cm (6) FHD+ Infinity Display • 24 MP+ 8 MP+ 5 MP Triple Camera • Side Fingerprint • 3300 mAh Battery
Starting From ₹18 990/-
10 YEARS MOTOR WARRANTY
4 STAR EXCLUSIVE LG 190 L DIRECT COOL REFRIGERATOR GL-D201ASDX
• Smart Inverter Compressor • Smart Connect
₹16 990/-* EMIs of ₹1 416/- Under exchange
DIGITAL DISPLAY 3 STAR EXCLUSIVE SAMSUNG 253 L REFRIGERATOR RT28N3423S8
• Power Cool • Smart Connect Inverter
10 YEARS WARRANTY ON COMPRESSOR
₹22 990/-* EMIs of ₹1 916/- Under exchange
LG 7 kg TOP LOAD T8081NEDLJ
• Smart Inverter Technology • TurboDrum • Waterfall Circulation
₹23 490/-* EMIs of ₹1958/- Under exchange
SAMSUNG EXCLUSIVE 6.5 kg FRONT LOAD WW65M206K0B
• 1000 RPM • Digital Inverter Motor • Touch Panel
₹26 990/-* EMIs of ₹2 249/- Under exchange
LG 6 kg FRONT LOAD FHT1006SNW
• 1000 RPM • 6 Motion direct drive • Spa Steam
₹27 490/-* EMIs of ₹2 291/- Under exchange
resQ EXTENDED WARRANTY SERVICING & REPAIR ACROSS BRANDS PROFESSIONAL IN-HOME INSTALLATION
MULTIPLE FINANCE OPTIONS AVAILABLE HDFC BANK BAJAJ FINSERV CAPITAL FIRST kotak HDB FINANCIAL SERVICES
VISIT US AT: KARIMNAGAR: OPP. SRR GOVT. COLLEGE, VIVEKANANDAPURI PH: 0878-2228418/19 • KHAMMAM: RR COMPLEX, BESIDE DISTRICT COURT, VYRA ROAD, KHANAPURAM 08742-248221/23 • NALGONDA: VISIT US AT: METRO COMPLEX, PRAKASSAM BAZAR, NEAR MAISAIH STATUE. 08682 231170/73 • WARANGAL: VISIT US AT: JAKOTIA COMPLEX, POCHAMMAMAIDAN, OPP RATNA HOTEL, MGM ROAD 0870 6668100 /200 • HANUMAKONDA: • KAKATIYA UNIVERSITY CROSS ROAD, LASHKARSINGARAM VILLAGE, NAYEEMNAGAR, HANUMAKONDA 0870 2444400/10 • FIRST FLOOR, ASIAN SRIDEVI MALL 0870-2461100/56200 • SIDDIPET: OPP GOVT HIGH SCHOOL, MOHINPURA STREET, MEDAK ROAD 08547 225001 / 002 • NIZAMABAD: VISIT US AT: 2ND FLOOR, REALIANCE MALL, VINAYAK NAGAR, NIZAMABAD. PH: 08462-243144/145 • MANCHERIAL: CCC ROAD, THOLLAVAGU 9014190528/ 9014178193

ఈనాడు

ఆర్థిక ఆరళ్లు ఇంకెన్నేళ్లు?

భారతావని ప్రగతి సౌధం పటిష్ఠంగా ఉండాలంటే ఒక్క ఢిల్లీయే కాదు, అన్ని రాష్ట్రాలూ గట్టి మూల స్తంభాలై నిలవాల్సిన భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కొత్తల్లో నరేంద్ర మోదీ చెప్పిన మాటే. రాష్ట్రాల సౌరభ్యంలోనే జాతీయాభివృద్ధి జోరందుకొనే నమూనాను ఆవిష్కరిస్తామన్న కమలనాథులు- పదిహేనో ఆర్థిక సంఘానికి పరిశీలనాంశాలను నిర్దేశించిన తీరు- అక్షరాలా శరాఘాతమే! 'విధానాల రూపకల్పన వ్యవస్థగా ఆర్థిక సంఘం రూపాంతరం చెందితే మేలు. విభాజ్య నిధులు రాష్ట్రాల హక్కు. అవసరాల రీత్యా చూస్తే ఆయా రాష్ట్రాల మధ్య ఎంతో భిన్నత్వం ఉంది' అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా ఎలుగెత్తారు. 'ప్రతి రాష్ట్రానికి వాటికంటూ సొంత సమస్యలున్నాయి... విధానాలు రూపొందించేది కేంద్రమే అయినా, వాటిని అమలు చేయాల్సింది రాష్ట్రాలే' నని పశ్చిమ్‌బంగ ముఖ్యమంత్రి మమత బెనర్జీ లోగడే నిష్ఠుర సత్యం పలికారు. ఇన్నేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఆర్థిక సంఘం పరిశీలనాంశాలే తీవ్రాందోళనకు కారణం నేపథ్యంలో పది రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల అమాత్యులు- వాటిలో సవరణలు చెయ్యాలంటూ రాష్ట్రపతికి నిరుడు మే నెలలో మహజరు సమర్పించారు. ఎప్పటి మాదిరిగా 1971నాటి జనాభా లెక్కల్ని కాకుండా 2011 జనగణనను ప్రాతిపదికగా పరిగణించాలనడంతో, జన నియంత్రణకు విశేష కృషి సల్పిన ప్రగతి శీల రాష్ట్రాలకు వాస్తవంగా నష్టం జరుగుతుందన్న ఆందోళన ఏమాత్రం తోసిపుచ్చేది కాదు. 2011 జనగణన లెక్కలే ప్రామాణికంగా ఉంటాయని ఇటీవల స్పష్టీకరించిన కేంద్ర విత్తమంత్రి- ఆయా రాష్ట్రాల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల్ని ఆర్థిక సంఘం పరిశీలించే అవకాశం ఉందంటున్నారు. గత ఆర్థిక సంఘం ప్రకటించిన 42శాతం రాష్ట్రాల వాటాను సమీక్షించాలని కేంద్రం అభిలషిస్తుండటే, పరిశీలనాంశాల పేరిట ఆర్థిక సంఘం స్వేచ్ఛకు గిరిగీసే ధోరణులు పోవాలని, రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తికి బాటలు పరవాలన్న డిమాండ్లు గట్టిగా వినవస్తున్నాయి. కేంద్రం విస్మరించలేని సూచనలవి!

రాష్ట్రాల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి భరోసా ఇస్తూ కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో సామరస్యానికి పాటుపడతామని భాజపా ఎన్నికల ప్రణాళిక 2014లో ఘనంగా చాటింది. కొత్తగా ఆర్థిక సంఘం పరిశీలనాంశాలను చూడబోతే, గతంలో లేనివిధంగా, భిన్న అంశాల్లో ఆయా రాష్ట్రాల పనితీరును మదింపువేసే పెత్తందారీతనాన్ని దానికి కట్టబెట్టడం నిర్ధారణవుతోంది. కేంద్రం విధులు బాధ్యతలు గణనీయంగా పెరిగినందున రాష్ట్రాలకు ఇస్తున్న 42శాతం వాటాను సమీక్షించాలని మోదీ ప్రభుత్వం సూచిస్తుంటే- కమలనాథుల ఏలుబడిలోనే ఉన్న గుజరాత్ క్షేత్రస్థాయి వాస్తవాల్ని ఆర్థిక సంఘానికి నివేదించింది. గాడ్గిల్-ముఖర్జీ ఫార్ములా ప్రకారం రాష్ట్రాలకు రావల్సిన ఏడున్నర శాతాన్ని పరిగణనలోకి తీసుకొంటే, గత ఆర్థిక సంఘం అదనంగా కేటాయించింది కేవలం రెండున్నర శాతమేనన్న గుజరాత్- పనిలో పనిగా కేంద్ర సర్కారు చేతి వాటాన్నీ ఏకరువు పెట్టింది. కేంద్ర పథకాల్ని 66నుంచి 28కి కుదించి, అత్యధిక స్కీముల్లో రాష్ట్రాల వాటాను పాతికనుంచి నలభైశాతానికి పెంచారని స్పష్టీకరించింది. దశాబ్దాలుగా కేంద్రానికి పన్నేతర రాబడులు గణనీయంగా పెరుగుతున్నాయంటూ వాటినీ విభాజ్య నిధిలో కలిపి, రాష్ట్రాల వాటాను 50శాతానికి పెంచాలని గుజరాత్ గట్టిగా కోరింది. అడిగింది తమ పార్టీ సర్కారే కాబట్టి- రాజకీయ కోణమే ఈ తరహా సూచనలకు ప్రేరణ అని కేంద్రంలోని ఏలికలు కొట్టిపారేసే వీల్లేదు. కేరళ వరదల్లాంటి భయానక ప్రకృతి విపత్తులు కోరసాచినప్పుడు రాష్ట్రాలకు కాళ్లూ చేతులూ ఆడని పరిస్థితి నేటికీ ఎందుకు కొనసాగాలో, ఆదుకొనే మహా ప్రభో... అంటూ కేంద్రానికి ఎందుకు మొరపెట్టుకోవాలో అర్థం కాదు. రాష్ట్రాల సమాహారమైన భారతావనిలో ఆర్థికాంశాల్లోనూ సమాఖ్య స్ఫూర్తి ప్రతిఫలించకపోతే- దేశ ప్రగతి చోదక శక్తులుగా అవి ఎలా ఎదుగుతాయన్న సదాలోచనే పాదుకోవాలిప్పుడు!

సంప్రతింపుల పర్వంలో భాగంగా పదిహేనో ఆర్థిక సంఘం ఇప్పటికి పదహారు రాష్ట్రాల్ని చుట్టబెట్టింది. ప్రస్తుతం పశ్చిమ్ బంగ దాదాపు మూడు లక్షల 95వేల కోట్ల రూపాయల రుణ భారంతో కుంగుతోందని, ఏడేళ్లలో రెండు లక్షల పాతిక వేల కోట్లు రుణ సేవలకే వెచ్చించాల్సి వచ్చిందంటూ, దాన్ని పునర్ వ్యవస్థీకరిస్తే రాష్ట్రాభివృద్ధికి వనరులు సమకూరతాయన్న మమత విజ్ఞప్తికి ఆర్థిక సంఘం సానుకూలంగా స్పందించింది. ప్రజలకు జవాబుదారీగా నిర్వర్తించాల్సిన బాధ్యతల బరువు పెరిగి, రాబడి మార్గాలు తరిగి దాదాపు రాష్ట్రాలన్నీ దారుణ రుణ భారంతో కిందుమీదుల వుతున్న దురవస్థ దేశవ్యాప్తంగా కళ్లకు కడుతోంది. ఈ అవ్యవస్థ రూపుమాసిపోవాలంటే, ఆయా రాష్ట్రాల రుణాలొక్కటే కాదు; రాష్ట్రాల ఆర్థిక స్వావలంబనకు బాటలుపరచేలా మొత్తం వ్యవస్థాగత పునర్వ్యవస్థీకరణే జరగాలి. 130 కోట్ల పైచిలుకు జనభారతం పరిపాలన క్రతువంతా రాష్ట్రాల పరిధిలోనిదే అయినప్పుడు- ఏటికేడు బాధ్యతలు పెరుగుతున్నాయంటూ ఇతోధిక వాటాలకు కేంద్రం పెరపెరలాడటం సమాఖ్య స్ఫూర్తికే విరుద్ధం. రాష్ట్రాల రుణభారాన్ని సాకుగా చూపి వాటిపై ఆర్థిక బాధ్యతారాహిత్యం ముద్ర వేయడం- పూర్తిగా అసంబద్ధం! ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబాటులో, సామాజిక ప్రగతి సూచీలపై ప్రత్యేక శ్రద్ధతో నవ్య పథకాలను సవ్య రీతిలో అమలు చేయడంలో రాష్ట్రాల అభినివేశం ప్రస్ఫుటమవుతూనే ఉంది. కేంద్రం లేదా రాష్ట్రాల చెంత పోగుపడే ప్రతి పైసా ప్రజాధనమే. ఆర్థిక వనరులు గరిష్ఠ ప్రయోజనదాయకమయ్యేలా, రాష్ట్రాల విధివిహిత బాధ్యతల నిర్వహణకు సరిపడా నిధుల కేటాయింపులు రాజ్యాంగబద్ధంగా ఒనగూడేలా- సంస్థాగత దిద్దుబాట్లు సత్వరం సాగాలి. సమాఖ్య స్ఫూర్తికి గొడుగుపట్టే వాస్తవిక కార్యాచరణతోనే రాష్ట్రాలకు సిసలైన సంక్రాంతి!



కనీస ఆదాయంతో కొండంత భరోసా

రైతాంగాన్ని ఆదుకునే దిశగా పాలకుల తర్జనభర్జనలు

రైతు ఆదాయాన్ని 2022కల్లా రెట్టింపు చేస్తానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చడానికి విధానపరంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఓం ప్రథమంగా సార్వజన కనీస ఆదాయ (యూబీఐ) పథకం కింద కొంత నగదును నెలనెలా రైతు ఖాతాల్లో జమ చేసే విషయాన్ని గంభీరంగా పరిగణిస్తోంది. ప్రభుత్వం తమను అలక్ష్యం చేస్తోందని రైతుల్లో గూడుకట్టిన ఆగ్రహం ఇటీవల ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ ఓటమికి మూలకారణమైంది. దేశంలో మొట్టమొదటిసారిగా రైతులకు నేరుగా ఆదాయం అందించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చేపట్టిన రైతుబంధు పథకం ఆయనకు భారీ మెజారిటీతో రెండోసారి అధికారాన్ని కట్టబెట్టింది. గతంలో ఈ పథకం కింద రైతులకు రూ.8,000 ఇవ్వగా, ఇకనుంచి రూ.10,000 ఇవ్వాలని కేసీఆర్ తలపెట్టారు. రైతుబంధు వంటి పథకాన్ని దేశమంతటికీ విస్తరించడం సాధ్యమా అని కేంద్రప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. 75 శాతం రైతులకు తలా రూ.8,000 చొప్పున కనీసాదాయాన్ని అందించాలంటే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 2.8 శాతం నుంచి 3.2 శాతం వరకు వెచ్చించాల్సి ఉంటుంది. రైతు ఆదాయాలను పెంచాలంటే ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో నగదు చేయడం భేషైన మార్గమని కేంద ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఇప్పటికే గట్టిగా ప్రతిపాదించి ఉన్నారు. సార్వజన కనీస ఆదాయ పథకం గురించి ప్రపంచమంతటా చర్చోపచర్చలు, పైలట్ ప్రాజెక్టులు నడుస్తున్నందువల్ల భారత్ ఇలాంటి పథకాన్ని పూర్తిస్థాయిలో కాని, పాక్షికంగా కాని చేపట్టాలన్నారు. ఈ దిశగా రైతుబంధు తరహా పథకం తొలి అడుగు అవుతుంది. 2017 ఆర్థిక సర్వే ఏదో ఒకరూపంలో సార్వజన కనీస ఆదాయ (యూబీఐ) పథకం వంటిది ప్రవేశపెట్టాలని సూచించింది.

తెగనమ్ముకోవలసిన దుస్థితి

మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రైతు ఆదాయాలను పెంచడానికి కొన్ని చర్యలు తీసుకోలేకపోలేదు. భూసార పరీక్ష కార్డులు, సమర్థ నీటి వినియోగ పద్ధతులకు ప్రాధాన్యమివ్వడం, ప్రభుత్వ సేకరణ పద్ధతులను పటిష్ఠపరచడం, వేపు పూత యూరియా పంపిణీ, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఇ-మార్కెట్ వ్యవస్థలను ప్రవేశపెట్టడం గురించి ఇక్కడ ప్రస్తావించాలి. అయితే వీటివల్ల లాభపడుతున్నవారు కొద్దిమంది మాత్రమే. వరి, గోధుమ వంటి కొన్ని పంటలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) వల్ల రైతుల స్థితిగతులు మెరుగుపడ్డాయనీ చెప్పలేం. మద్దతు ధరకూ విపణి ధరకూ మధ్యనున్న తేడాను ప్రభుత్వమే భర్తీ చేయడానికి ఉద్దేశించిన మార్కెట్ భరోసా పథకాన్ని ఇంతవరకు పాక్షికంగా అమలుచేసి చూశారు. దీన్ని పూర్తిస్థాయిలో చేపట్టే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. రైతుల చేతికి నగదు అందించడం ఎంతో ఉపయోగకరమని ఇప్పటికే నిరూపితమైంది. నెలనెలా కొంత ఆదాయం వచ్చేట్లు చూడటం దగ్గర నుంచి ఇతర మార్గాలపైనా మదింపు జరుగుతోంది. ఉదాహరణకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు, వాస్తవ విక్రయ ధరకు మధ్య తేడాను నగదు రూపంలో రైతు ఖాతాకు జమ చేయవచ్చు. అలాగే పంటల బీమా పథకాల ప్రీమియాలను తగ్గించడం ద్వారా రైతు చేతిలో నగదు మిగిలేట్లు చూడవచ్చు. ప్రభుత్వం చేపట్టే నగదు బదలీ పథకం ఈ మూడు మార్గాల కలగలుపుగా ఉండవచ్చు. సార్వజన కనీసాదాయ పథకం వల్ల ప్రజలు సోమరులవుతారన్న వాదన సరికాదు. ఈ పథకం కింద లభించే సొమ్ము కనీసావసరాలు తీర్చుకోవడానికి సరిపోతుంది. పూట ఎలా గడుస్తుందని ఆలోచించాల్సిన అగత్యం లేకపోతే చొరవ, ఉత్సాహం, నైపుణ్యం కలిగినవారికి సొంత వ్యాపారాలు, వృత్తులు చేపట్టి పైకి ఎదగడమెలా అని ఆలోచించగలుగుతారు. నిరుడు జులైలో ప్రభుత్వం వరి, పత్తి, సోయా బీన్ పంటల మద్దతు ధరలను పెంచింది. సాగు వ్యయం మీద కనీసం 50 శాతం ఎక్కువ ధర రైతుకు దక్కేట్లు చూడటమే దీని లక్ష్యం. కానీ, ప్రభుత్వం ఈ వ్యవసాయోత్పత్తులను సరిగ్గా కొనుగోలు చేయకపోవడంతో రైతులు పంటలను తెగనమ్ముకోక తప్పలేదు. ఇకపై ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకన్నా విపణి ధర తక్కువగా ఉంటే ఆ తేడాను నగదు రూపంలో రైతుకు చెల్లించాలని సర్కారు యోచిస్తోంది. దీంతోపాటు పంటల బీమా పథకాన్నీ పునర్వ్యవస్థీకరించే సూచనలున్నాయి. రైతు చెల్లించాల్సిన ప్రీమియాన్ని తగ్గించడం, కౌలుదారులను, మరిన్ని పంటలను బీమా పరిధిలోకి తీసుకురావడం గురించీ పరిశీలన జరుగుతోంది.

ప్రపంచంలోని పేదల్లో మూడోవంతు భారత్‌లో నివసిస్తున్నా, మన ప్రభుత్వం జీడీపీలో రెండు శాతంకన్నా తక్కువ మొత్తాన్ని సామాజిక భద్రతకు వెచ్చిస్తోంది. ఇంతకన్నా ఎక్కువ మొత్తం కేటాయించాలంటే ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి తగ్గించాల్సి ఉంటుంది. సర్కారు ఇతర ఖర్చులను తగ్గించుకొంటే ద్రవ్యలోటును పరిమితిలో ఉంచుతూ సామాజిక భద్రతకు ఎక్కువ ఖర్చు చేయగలుగుతుంది. గత ఎన్నికల్లో పార్టీలు రైతు రుణ మాఫీకి హామీ ఇచ్చాయి. తదనుగుణంగా కనీసం ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయల రైతు రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. కానీ, నిధుల కొరత వల్ల రాష్ట్రాలు తమ హామీని సరిగ్గా నెరవేర్చలేకపోయాయి. అదీకాకుండా రుణమాఫీకి అర్హులైనవారిని ఈ పథకంలో చేర్చలేదు. ఉదాహరణకు పంజాబ్ ప్రభుత్వం 2017 జూన్‌లో రైతు రుణమాఫీని ప్రకటించినా ఇంతవరకు కేవలం 35 శాతం రైతులకే లబ్ధి చేకూర్చగలిగింది. ఇలాంటి అనుభవాలనుబట్టి రైతు రుణమాఫీ పథకంకన్నా మద్దతు ధరలను అందించడం, నగదు బదిలీ చేయడంవల్ల ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని రుజువైంది. పాత రుణాల మాఫీ వల్ల తదుపరి పంటలకు బ్యాంకు రుణాలు తగ్గిపోతాయి. ప్రభుత్వం ఎలాగూ రుణాలను మాఫీ చేస్తుందనే భరోసాతో రైతులు సక్రమంగా రుణ వాయిదాలను కట్టకపోవచ్చు. దీన్ని కారణంగా చూపి బ్యాంకులు కొత్త రుణాలను తగ్గించేస్తాయి. ఇలా కాకుండా ప్రభుత్వం నేరుగా రైతుల చేతికి నగదు అందిస్తే బ్యాంకులపై భారం తగ్గుతుంది. రైతులు ప్రత్యక్షంగా ప్రయోజనం పొందుతారు. మరో విషయం- ఏ కనీసాదాయ పథకమైనా విజయవంతం కావాలంటే, దాన్ని కౌలుదారులకు, వ్యవసాయ కూలీలకు సంపూర్ణంగా వర్తింపజేయాలి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాలే పూనుకోవాలి. మొత్తం మీద భవిష్యత్తులో రాయితీలకు బదులు నేరుగా ఆదాయం అందించే పథకాలు రంగప్రవేశం చేయవచ్చు. కానీ, పదే పదే ధరల పతనం వల్ల రైతులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలకు ఈ పథకాలు పూర్తి పరిష్కారం చూపలేవు. తెలంగాణలో విజయవంతంగా అమలైన రైతుబంధును ఆదర్శంగా తీసుకుని ఒడిశా, పశ్చిమ్ బంగ, ఝార్ఖండ్‌లు కూడా రైతులకు కనీస ఆదాయం సమకూర్చే పథకాలను ప్రకటించాయి. హరియాణ ప్రభుత్వం రైతులకు, అసంఘటిత రంగ కార్మికులకు పింఛన్ చెల్లింపులు చేపట్టాలని యోచిస్తోంది. అటల్ పెన్షన్ పథకం కింద ఇప్పటికే కేంద్రం తనవంతుగా రూ.1,000 చెల్లిస్తోంది. హరియాణ ప్రభుత్వం రూ.2,000 వృద్ధాప్య పింఛన్ ఇస్తోంది. దీన్ని కూడా రైతుల పింఛన్ పథకంలో అంతర్భాగం చేసే అవకాశం ఉంది. మొత్తం మీద రైతులకు ఏదో ఒక రూపంలో కనీస ఆదాయం కల్పించడంపై దేశవ్యాప్త చర్చ జరగాలి. ఈ పథకానికి సానుకూల, ప్రతికూల అంశాలను లోతుగా పరిశీలించాలి.



డాక్టర్ పరిటాల పురుషోత్తం

పేదరికం నిర్మూలనకు ఊతం

కనీసాదాయ పథకం పేదరిక నిర్మూలనకు అమోఘ సాధనమవుతుంది. జీవితంలో అనివార్యంగా ఎదురయ్యే కష్టనష్టాల నుంచి కొంతైనా రక్షణ లభిస్తుంది. అందుకు ఆహార ధాన్యాలను ఇవ్వడం కన్నా నగదు బదిలీయే మేలు. ధనికులను ఈ పథకం నుంచి మినహాయించి పేదలకు మాత్రమే వర్తింపజేయడానికి అవసరమైన సాధనాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఆదాయ నష్టం, అనారోగ్య పరిస్థితుల్లో కనీసాదాయ పథకం ఎంతో ఆదుకుంటుంది. దీనికింద బ్యాంకు ఖాతాలను విరివిగా వినియోగిస్తారు కాబట్టి పల్లెల్లో బ్యాంకుల వ్యాపార ప్రతినిధులకు ప్రయోజనం చేకూరుతుంది. చేతిలో నికర ఆదాయం ఉంటుంది కాబట్టి వృత్తివ్యాపారాలకు రుణాలు తేలిగ్గా మంజూరవుతాయి. లబ్ధిదారులకు మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. అనేకానేక ప్రభుత్వ సంక్షేమ పథకాల స్థానంలో ఒకే కనీసాదాయ పథకం రావడంతో పాలనా పరంగా, ఆర్థిక పరంగా సామర్థ్యం పెరుగుతుంది. ప్రతికూలాంశాలను తీసుకుంటే, రైతులకు లభించే కనీసాదాయాన్ని వారు వ్యవసాయ పనులకోసం కాకుండా ఇతర వస్తుసేవల కొనుగోళ్లకు వెచ్చించే అవకాశముంది. కొంతమంది దీన్ని దుబారా చేయవచ్చు కూడా. నెలనెలా చేతికి డబ్బు వస్తున్నప్పుడు వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు శ్రామికులు దొరక్కుండా పోవచ్చు కూడా. కనీసాదాయాన్ని పురుషులు పూర్తిగా తమ చేతిలోకి తీసుకోవచ్చు. మహిళల మాటకు విలువ లేకుండా పోవచ్చు. మరోవైపు కనీసాదాయ చెల్లింపులు బ్యాంకుల పనిభారాన్ని మరింత పెంచుతాయి. ఈ పథకాన్ని ప్రవేశపెట్టాక ఒకవేళ అది విఫలమైనా ప్రభుత్వం దాన్ని వెనక్కుతీసుకోలేకపోవచ్చు. ఓటర్ల ఆగ్రహానికి జడిసి ఏ ప్రభుత్వమూ ఈ సాహసం చేయదు. ద్రవ్యోల్బణం వల్ల కనీసాదాయాన్ని పదేపదే పెంచాల్సి రావడం ఖజానాకు పెనుభారమవుతుంది. పార్లమెంటు ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో దేశమంతటా కనీసాదాయ పథకంపై చర్చ జరిపి సరైన నిర్ణయం తీసుకోవాలి!

(రచయిత- సామాజిక, ఆర్థిక విశ్లేషకులు)

అసలైన సవాలు



భారత్ వంటి సువిశాల దేశంలో పిడుక్కీ బియ్యానికీ ఒకే మంత్రమంటే కుదరదు. రైతుబంధు వంటి పథకాల అమలులో కొన్ని ఇబ్బందులు ఎదురవక మానవు. ఉదాహరణకు భూముల విభజన రెవిన్యూ రికార్డులకు ఎక్కని సందర్భాల్లో చిన్న రైతులకు ఎటువంటి ఆదాయ పథకాన్నైనా వర్తింపజేయడం కష్టం. అదీకాకుండా 2011లో తొమ్మిది రాష్ట్రాల్లో జరిపిన ఒక సర్వేలో పాల్గొన్నవారిలో మూడింట రెండు వంతులు నగదు బదిలీకన్నా ఆహార వస్తు బదిలీయే మేలన్నారు. 2016లో జరిపిన కుటుంబాల సర్వేలో పరిస్థితి మారింది. ఈ సర్వేలో 29 శాతమే ఆహార ధాన్య బదిలీని కోరగా, 53 శాతం నగదు బదిలీ కోరారు. ఆర్థిక స్తోమత కలిగినవారు వంటగ్యాస్ కనెక్షన్లను స్వచ్ఛందంగా వదులుకున్నట్లు సార్వజన కనీసాదాయాన్నీ వదులుకోవాలని 2016-17 ఆర్థిక సర్వే సూచించింది. ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా మధ్యప్రదేశ్‌లో అమలుచేసి చూశారు.

కొత్త చట్టంతో చైనా కట్టడి

గత ఏడాది చివరి రోజున అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన ఓ బిల్లుతో చైనాకు నిద్ర పట్టడంలేదు. ఆసియా రీఎస్యూరెన్స్ ఇనిషియేటివ్ యాక్ట్-2018కి డిసెంబరు 31న చట్టబద్ధత లభించింది. దీంతో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మిత్రదేశాలను ఆర్థిక, రక్షణపరంగా బలోపేతం చేయాలన్నది అమెరికా లక్ష్యం. ఆయా దేశాల్లో ప్రజాస్వామ్య విలువలు, సైబర్ భద్రత, అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛగా ప్రయాణించేలా, రక్షణ రంగాలను బలోపేతం చేయడం వంటి అంశాలను ఇందులో పొందుపరచారు. అమెరికా కాంగ్రెస్‌లో భారీ మద్దతు లభించడమే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. బిల్లుపై సంతకం చేసిన మర్నాడే చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ దూకుడుగా స్పందించారు. అవసరమైతే తైవాన్‌పై బలప్రయోగం చేసైనా విలీనం చేసుకునే హక్కు తమకు ఉందన్నారు. 'ఒకే దేశం రెండు వ్యవస్థలు' విధానానికి చైనా-తైవాన్ల ఏకీకరణ ఆమోదయోగ్యమని సంకేతాలు పంపారు. అమెరికా అమలులోకి తెచ్చిన బిల్లు ఏక చైనా విధానానికి ఎసరు పెట్టనుందన్న భయం డ్రాగన్‌లో స్పష్టంగా కనిపించింది. ఇదే జరిగితే మళ్లీ తమ అస్థిత్వానికే ప్రమాదమని కమ్యూనిస్టు రాజ్యానికి తెలుసు. వాణిజ్య యుద్ధంపై అమెరికాతో చర్చలకు ముందు ఇటువంటి పరిస్థితి తలెత్తడం చైనాను ఆత్మరక్షణలో పడేసింది.

వివాదానికి ఆరంభం

ప్రపంచంలో అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన దక్షిణ చైనా సముద్రాన్ని కబ్జా చేయాలన్న డ్రాగన్ ఆలోచనతో అసలు సమస్య మొదలైంది. ఇక్కడ కృత్రిమ ద్వీపాలను నిర్మించి వాటిల్లో సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడం, ఆ మార్గంలోని అంతర్జాతీయ సముద్ర జలాల్లోకి వచ్చే నౌకలకు హెచ్చరికలు జారీ చేయడం, చివరికి ఆ గగనతల మార్గంలో ప్రయాణించే విమానాలపైనా చైనా నిఘా పెట్టింది. అది అమెరికా మిత్ర దేశాలైన జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, వియత్నామ్‌లకు సమస్యాత్మకంగా మారింది. చివరికి అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పును సైతం డ్రాగన్ తుంగలోకి తొక్కింది. దీంతో తైవాన్‌లో ఎసరు పెడితేగాని చైనా దారికి రాదని అమెరికాకు అర్థమైంది. ఇప్పటికే వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరడంతో చైనాపై భౌగోళిక రాజకీయ ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ కొత్త చట్టాన్ని ఆయుధంగా వాడుకోవాలని నిర్ణయించింది. ఈ చట్టం అమలులో అమెరికాకు ప్రధాన వ్యూహాత్మక భాగస్వాములు తైవాన్, భారత్, జపాన్, దక్షిణ కొరియాలే.

డ్రాగన్ ఆర్థిక బలిమి కారణంగా ఏక చైనా విధానానికి అనుకూలంగా అమెరికా సహా ఏ దేశమూ తైవాన్ స్వతంత్రతను గుర్తించలేదు. కేవలం 22 చిన్న దేశాలు మాత్రమే తైవాన్‌తో దౌత్య సంబంధాలు నెరపుతున్నాయి. వీటి సంఖ్యా ఏటా తగ్గిపోతోంది. కొన్నాళ్లకు అంతర్జాతీయంగా తైవాన్‌ను ఏకాకి చేసి నయానో భయానో చైనాలో కలిపేసుకోవాలన్నది వ్యూహం. ఇప్పుడు ఆసియా రీఎస్యూరెన్స్ ఇనిషియేటివ్ చట్టం కింద తైవాన్‌తో అమెరికా దౌత్య సంబంధాలను మెరుగుపరచుకొంటుంది. ఇప్పటి వరకు అమెరికా అధికారుల తైవాన్ ప్రయాణాలు గోప్యంగా జరిగేవి. 2018 ఫిబ్రవరిలో తైవాన్ ట్రావెల్ యాక్ట్‌ను ట్రంప్ సర్కార్ తీసుకొచ్చింది. దీని ప్రకారం అమెరికా అధికారులు బహిరంగంగానే తైవాన్‌కు వెళ్లే వెసులుబాటు లభించింది. దీంతో అమెరికా వంటి అగ్రరాజ్యం తైవాన్‌తో దౌత్య సంబంధాలను పెంపొందించుకునే దిశగా చర్యలు చేపడితే మిగిలిన దేశాలూ ఏకచైనా విధానానికి వ్యతిరేకంగా తైవాన్‌తో సంబంధాలను పెంచుకొంటాయి. చైనా అసహనానికి ఇదే అసలు కారణం.



ఆసియా మిత్రదేశాలకు అగ్రరాజ్యం అండ

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని మిత్రదేశాల భద్రతను మెరుగుపరచేందుకూ ఈ సరికొత్త చట్టం కింద చర్యలు చేపట్టనుంది. కమ్యూనికేషన్ వ్యవస్థల మెరుగు సంయుక్త సైనిక విన్యాసాల నిర్వహణ వంటి చర్యలను అమెరికా చేపట్టనుంది. దీంతోపాటు తైవాన్‌కు ఆయుధ విక్రయాలకు బాటలుపరచింది. చైనా భూభాగానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తైవాన్‌కు చెందిన కిన్‌మెన్ ద్వీపాన్ని ఆక్రమించుకునేందుకు డ్రాగన్ చేయని ప్రయత్నం లేదు. ఈ ద్వీపంపై చైనా పేల్చిన శతఘ్ని గుండ్ల శకలాల ఇనుముతో అక్కడ ప్రత్యేకమైన కిన్‌మెన్ కత్తుల తయారీ పరిశ్రమ రూపుదిద్దుకుందంటే- ఏ స్థాయిలో ఫిరంగి గుండ్ల (షెల్లింగ్) దాడి జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు అమెరికా ఆయుధాలు భారీయెత్తున తైవాన్‌కు చేరడం మొదలైతే చైనా ఫిరంగి గుండ్ల దాడికి తగిన సమాధానాలు ఇక్కడి నుంచి వెళ్తాయి. ఈ కొత్త చట్టం కింద అమెరికా ఏటా 150 కోట్ల డాలర్లను వచ్చే అయిదేళ్లపాటు వెచ్చించనుంది. వీటిల్లో సింహభాగం తైవాన్‌కు ఆయుధాల రూపంలో వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

భారత్ పాత్ర లేకుండా ఆసియా-పసిఫిక్‌పై పట్టు సాధించడం అసాధ్యమని అమెరికాకు తెలుసు. కొత్తగా తెచ్చిన ఈ చట్టం సెక్షన్ 204ను ఏకంగా భారత్‌తో సంబంధాలకు కేటాయించిందంటే అర్థం చేసుకోవచ్చు. చైనాను శాంతియుతంగా కట్టడి చేయడానికి భారత్ సహకారం తప్పనిసరి. జరుగుతున్న పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది. ఆసియా పసిఫిక్ దేశాల్లో ఉగ్రవాద నిర్మూలనకు సాయపడాలని దీనిలో పేర్కొంది. ఒక పక్క అఫ్గానిస్థాన్ నుంచి సైన్యాన్ని వెనక్కి పిలిపిస్తూ తాలిబన్ల ప్రభావం భారత్‌పై పడకుండా ఏవిధంగా జాగ్రత్త పడుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. అఫ్గాన్‌లో భారత్ నేరుగా సైనిక జోక్యం చేసుకోవాలని అమెరికా ఆశిస్తున్నట్లు ఉంది. ట్రంప్ 'గ్రంథాలయ వ్యాఖ్యలు' ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఇటువంటి జోక్యాన్నే తైవాన్ విషయంలో ఆశిస్తే భారత్ ఇబ్బందిపడాల్సి ఉంటుంది. చైనా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం పారిశ్రామికీకరణ అనంతర దశకు చేరుకొంది. ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పెరిగింది. దీంతో చైనా దిగుమతులు ఇనుమడించాయి.

తొందరపాటు తగదు

చైనాతో సైనికంగా తలపడటం భారత్ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. మరోపక్క తనకు వ్యతిరేక గ్రూపుల్లో భారత్ అధికారికంగా భాగస్వామి కావాలని డ్రాగన్ కోరుకోదు. అందువల్ల సైనికేతర మార్గాల్లో చైనాను కట్టడి చేయడానికి భారత్ ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఒక్క భారత్ మాత్రమే కాదు, చైనా పొరుగు దేశాలు చాలావరకు ఈ అవకాశాన్ని వాడుకొని చైనాపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. మరోపక్క ప్రబల సైనిక శక్తిగా ఎదుగుతున్న చైనాను కట్టడి చేసేందుకు భారత్‌కు అమెరికా రక్షణ రంగానికి చెందిన కీలక సాంకేతికతను అందజేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నాటోయేతర ప్రధాన రక్షణ భాగస్వామి హోదా దక్కించుకున్న భారత్‌కు వీటిని అందజేయడంలో పెద్దగా అభ్యంతరాలు ఏవీ ఉండకపోవచ్చు. కాకపోతే ఇక్కడ ఒక కీలక అంశం ఉంది. అమెరికాను నమ్ముకొని చైనా విషయంలో భారత్ ఎంతవరకు ముందుకు వెళ్లవచ్చనేది సందేహాస్పదమే. ఎందుకంటే సిరియా, అఫ్గానిస్థాన్‌లో అమెరికా తీరు మిత్రుల నమ్మకాన్ని వమ్ము చేసేదిగా ఉంది. ఈ నేపథ్యంలో కొత్త చట్టం అమలులో అమెరికా చిత్తశుద్ధి తైవాన్‌కే పరిమితం అవుతుందా ఉగ్రవాద నిర్మూలనకూ ఉపయోగపడుతుందా అనేది తేల్చుకోకుండా తొందరపడకూడదు!

– పెద్దింటి ఫణికిరణ్

సంక్రమణ సౌందర్యం

సంక్రమణాల్లో మకర సంక్రమణం మహా పుణ్యకాలంగా సనాతన ధర్మశాస్త్రాలు పలు ప్రత్యేకతలను వివరించాయి. సంవత్సరాన్ని ఒకరోజుగా నిర్ణయించితే, ఉత్తరాయణాన్ని పగటి కాలంగా గణిస్తారు. ఆ పగటికి ఉదయకాలం వంటిది ఈ సంక్రమణం.

సూర్యరశ్మి దక్షిణాయనంలో వానల చలువతో పంటలు పండించితే, ఆ ఫలం ఉత్తరాయణ ప్రారంభంలో కాంతిమయ సౌరశక్తికి నివేదించి ప్రసాదంగా అనుభవిస్తాం.

దేవతలకు, పితృదేవతలకు, సమాజానికి కూడా బాధ్యత కలిగి కృతజ్ఞతగా, దానాలతో, ధ్యానాలతో, స్నానతర్పణాలు అర్పించి సంతృప్తిపరచే ఘట్టాలు ఈ పర్వంలో అంశాలయ్యాయి.

సౌరమానం ప్రకారం ఈ రోజు నుంచి మకర మాసం. స్నానప్రాధాన్యం కలిగిన ఈ మాసంలో స్నాన వ్రతానికి ఇది తొలిదివసం. అందుకే అనేక పుణ్యతీర్థాల్లో ఎందరో భారతీయులు సంకల్పసహితంగా పుణ్య స్నానాలు ఆచరిస్తారు.

ఈ రోజున లక్ష్మీపూజకు ప్రాధాన్యాన్ని దేవీభాగవతం పేర్కొంది. ప్రతిమయందుగానీ, కలశమందుగానీ మహాలక్ష్మిని ఆరాధించాలనే విధిని వర్ణించింది. అదే విధంగా సూర్యారాధనకు, విష్ణుపూజకు విశిష్టతను వర్ణించాయి. శివపూజావ్రతాన్ని ఈ రోజు విశేషవిధిగా కొన్ని ధర్మశాస్త్రాలు వివరించాయి.

సూర్యోదయానికి పూర్వమే బ్రాహ్మీముహూర్తంలో స్నానవిధిని నిర్దేశించాయి ధర్మశాస్త్రాలు. సూర్యోదయ సమీపకాలం శ్రేష్ఠమని స్పష్టపరచాయి. తిలలు దానానికేకాక, నైవేద్యానికి, ఆహారంగా స్వీకరించడానికి, తెల్లతిలలతో మధుర పదార్థాలు కలిపి ఒకరికొకరు పంచుకొంటూ శుభాకాంక్షలు తెలపడానికి వినియోగించడం కొన్ని ప్రాంతాల ప్రత్యేక ఆచారం.

ఈ పర్వాన పితృదేవతలను ఉద్దేశించి ప్రత్యేక తర్పణాలు, దానాలు చేసే పద్ధతులున్నాయి. కొందరు పర్వశ్రాద్ధాన్నీ నిర్వర్తిస్తారు. అమ్మానాన్నలకు, పూర్వీకులకు సద్గతులు కలగాలనే సద్భావం వెనక బాధ్యతాయుతమైన కృతజ్ఞతానుబంధం ఉంది.

పాడిపంటలకు మూలమైన పశుసంపదను ఆరాధించడం నేటి వైశిష్ట్యం. పనికొచ్చే పశువుపై ప్రేమతో కూడిన దైవభావాన్ని ప్రసరించడం కృతజ్ఞతకు గొప్ప తార్కాణం. ఆవుపేడను బంతిపువ్వుతో అలంకరించి 'గొబ్బిగౌరి'గా కొలుచుకొనే భావనలో సుకుమార



సౌందర్య దృష్టి ఒక అద్భుతం.

మానవ సంబంధాల మాధుర్యాలు, ప్రకృతి బంధాల దివ్యత్వాలు, దేవతానుగ్రహాల కారుణ్యాలు... ఇటువంటి పండుగలతో అల్లికలై ఏకంగా గోచరిస్తాయి.

వేదఋషులు 'అన్నం ఆదిత్యాత్మకం' అని దర్శించారు. మనం స్వీకరించే శాకపాకాలన్నీ సూర్యశక్తిని స్వీకరించి మనకు అందించేవే. అందుకే ఈ పుణ్యకాలం నుంచి సౌరమాన మకరం, చాంద్రమాన మాఘం సూర్యారాధనా ప్రాధాన్యం ఉన్నవి.

కొన్ని ప్రాంతాల్లో కొత్తబియ్యంతో ఆవుపాలు కలిపి సూర్యుడికి నివేదిస్తారు. ఇది సామాన్యులు సైతం ఆచరించే యజ్ఞప్రక్రియే. వేదమూలం కలిగిన ఈ విధి కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతికి సమీపంగా వచ్చే మాఘసప్తమి, ఆదివారాలు చేస్తారు. 'పొంగల్' అనే తమిళుల వ్యవహారం ఇదే.

సంవత్సర స్వరూపమైన దినానికి ఇది శుభోదయం కనుక, శుభాకాంక్షలకు తగిన పండుగ ఇది. అతిథి అభ్యాగతులు, బంధుమిత్రులు, పుట్టింటికి కూతుళ్లు, అత్తింటికి అల్లుళ్లు విచ్చేసి ఆనందంగా గడిపే ఉల్లాసం ఏడాది కాలపు సంతోషాన్ని దట్టించుకున్న వైభవం.

దేవుణ్ని, మనిషిని, పశువును కూడా ప్రేమించి అంతటా ఈశ్వరరూపం దర్శించే అందమైన ఎన్నో ఆచారాలు మేళవించిన ఈ సంక్రమణ శుభవేళగా సనాతన ధర్మనిష్ఠమైన భారతదేశానికి సామరస్య, అభ్యుదయాలు సిద్ధించాలని శుభాకాంక్షిద్దాం!

– సామవేదం షణ్ముఖశర్మ

సా...క్షర భారత్!



- సాగదీత ఇంకెంత కాలం?
- పేరుకే పథకం..అమలు అంతంతమాత్రం
- స్పష్టత కొరవడి..పడకేసిన వైనం

ఈనాడు, హైదరాబాద్: వయోజనులను దేశ వ్యాప్తంగా అక్షరాస్యులను చేయడమే 'సాక్షర భారత్' లక్ష్యం. అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకం అమలు సాగదీతకు మారుపేరుగా మారింది. కేంద్రప్రభుత్వం దాదాపు రెండేళ్ల నుంచి ఏ విధమైన స్పష్టతా ఇవ్వడం లేదు. ఏదీ తేల్చిచెప్పకుండా పొడిగిస్తూ వస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే, అంతా అయోమయంలో పడింది. నిజానికి 2017 మార్చితోనే పథకం ముగిసింది. ఆ తర్వాత ఒకటీ రెండూ కాదు...మూడుసార్లు పొడిగించారు. క్షేత్రస్థాయిలో అసలే అంతంతమాత్రంగా ఉన్న సాక్షర భారత్ ఏడాది నుంచి పూర్తిగా అటకెక్కింది. ఆ కేంద్రాలను నడిపే, పర్యవేక్షించే సిబ్బందికి గౌరవ వేతనాలూ కరవే! ఏ ఒక్కరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. వయోజన విద్యాశాఖలోనివారికి సైతం ఏ పనిచేయాలో తెలియనంత దురవస్థగా ఉంది. దేశమంతటా ఇటువంటి స్థితిగతులే...!

సాక్షర భారత్ పథకాన్ని 2009 అక్టోబరు నుంచి సర్వత్రా అమలుచేస్తున్నారు. మొత్తం 70లక్షలమందిని అక్షరాస్యులను చేయదలచారు. కానీ 2017 మార్చినాటికే 76.40 లక్షల మందికి చదువునేర్పామని కేంద్రం ఇటీవల ప్రకటించింది. పథకం పర్యవేక్షణ పనులను చూస్తున్న వయోజన విద్యాశాఖ పలు గ్రామాల్లో విద్యాకేంద్రాలను నెలకొల్పింది. వాటిని నడిపేందుకు, సిబ్బంది పారితోషికాలకు కేంద్రం నుంచి ఏటా రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు నిధులిచ్చింది. ఇదే పథకం అమలు కింద తెలంగాణ రాష్ట్రంలో 47 లక్షలమందిని అక్షరాస్యులను చేశామని సంబంధిత అధికారులు కేంద్రానికి లెక్కలు సమర్పించారు. జాతీయ సార్వత్రిక పాఠశాల (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్..ఎన్‌ఐఓఎస్) తరఫున పరీక్షలు నిర్వహించి, అక్షరాస్యులైనట్లు ధ్రువపత్రాలు కూడా అందించారు. 2011 గణాంకాల ప్రకారం తెలంగాణ.. 66.54 శాతం అక్షరాస్యతతో దేశంలో దిగువ నుంచి మూడో స్థానంలో నిలిచింది. సాక్షరత శాతం పెంచుకోవడం ముఖ్యమన్న వయోజన విద్యాశాఖ '100 రోజుల్లో 50 లక్షలమందిని అక్షరాస్యులను చేస్తాం' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 2014లోనే ప్రతిపాదనలు సమర్పించినా, అవేవీ అమలు కాలేదు. మరోవైపు 2017 మార్చి (12వ పంచవర్ష ప్రణాళిక)తోనే సాక్షర భారత్ ముగిసింది. అప్పటి నుంచీ పథకం అమలు కుంటువడినట్లే!

ఇదీ పొడిగింపుల పరంపర...


★ సాక్షర భారత్ పథకం అమలు గడువు: 2017 మార్చి వరకు
★ మొదటిసారి పొడిగింపు: 2018 మార్చి 31దాకా
★ రెండోసారి „ : 2018 డిసెంబరు 31వరకు
★ మూడోసారి „ 2019 మార్చి 31దాకా

రెండేళ్లుగా తేల్చని కేంద్రం

2017 మార్చితో పథకం ముగిసిందంటున్నా, అమలును ఆ తర్వాతా కేంద్రప్రభుత్వం పొడిగించుకుంటూ రావడం గమనార్హం. చదవడం... రాయడం పేరిట కొత్త పథకం తీసుకొచ్చే ఆలోచన ఉన్నా, దాన్నీ ఆచరణకు తేలేదు. ఉన్న పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టంగా చెప్పడమూ లేదు. ఇప్పటివరకు మూడుసార్లు పొడిగించారు. 2018 మార్చి తర్వాత- నిధుల వినియోగం, వాటి లెక్కలు తేల్చుకోవాలనీ సూచించారు. గత ఏడాది మార్చి నుంచి నిధుల మంజూరునూ ఆపి ఉంచారు. కేంద్రం నుంచి ఎంతకీ స్పష్టత లేకపోవడం, మరోవైపు గ్రామాల అక్షరాస్యత కేంద్రాల్లోని 18 వేలమంది గ్రామ, మండలస్థాయి సమన్వయకర్తలకు ఏడాదిన్నరగా వేతనాలు లేకపోవడం దుస్థితిని చాటుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వయోజన విద్యాశాఖలో పలువురు శాశ్వత ఉద్యోగులున్నారు. వారికి కూడా పనిలేకుండాపోయింది. ఈ శాఖను తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠంలో విలీనం చేయాలని ఏడాదిక్రితమే కమిటీని నియమించారు. కమిటీ నివేదిక ఇచ్చినా, అదీ అమలుకు నోచుకోలేదు.

రైలు దూసుకెళ్లి ముగ్గురు కార్మికుల దుర్మరణం

ముంబయి: రైల్వే ట్రాకు నిర్మాణ పనులు చేసే కార్మికులపై నుంచి రైలు దూసుకెళ్లడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. మహారాష్ట్ర రాయగఢ్ జిల్లా జితే రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. కాంట్రాక్టు కార్మికులు పట్టాల్ని దాటుతుండగా ముంబయి వెళ్లే తేజస్ ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చింది. రైలును వారు గమనించలేదు. రైలు ముగ్గురినీ ఢీకొట్టగా, వారు అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. కార్మికులంతా మధ్యప్రదేశ్‌కు చెందిన వారని తెలుస్తోంది.



విన్యాసాలను వీక్షించిన సీతారామన్

అండమాన్ నికోబార్ దీవుల్లోని కాంబుల్ తీరంలో సమీకృత బలగాల కమాండ్ (ఏఎన్‌సీ) సోమవారం సంయుక్త విన్యాసాలు నిర్వహించింది. త్రివిధ దళాల బలగాలు ఇక్కడ చేసిన అభ్యాసాలను వీక్షించేందుకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ హాజరయ్యారు.



సాధ్వి.. మహామండలేశ్వరి

ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమాన్ని కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి సోమవారం సందర్శించారు. ఆమెకు నిరంజన్ అఖాడా 'మహామండలేశ్వరి' హోదాను ప్రదానం చేసింది. మంగళవారం నుంచి ఇక్కడ కుంభమేళా ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే.

నారాయణ్‌ఝా పదవీకాలం పెంపు

దిల్లీ: కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి నారాయణ్‌ఝా పదవీకాలాన్ని మరో నెల పెంచుతూ కేంద్ర సిబ్బంది శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఆయన పదవీ కాలం ఈ నెల 31తో ముగుస్తుంది. మార్చి 1 నుంచి 15వ ఆర్థిక కమిషన్ సభ్యుడిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. మణిపుర్‌కు చెందిన ఝా 1982వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి. నవంబరు 30న ఆర్థికశాఖ కార్యదర్శిగా హస్‌ముఖ్ అధియా పదవీకాలం పూర్తికావడంతో, ఝా డిసెంబరులో ఆయన స్థానంలో నియమితులయ్యారు. మరోవైపు ఝా స్థానంలో గుజరాత్ సీనియర్ ఐఏఎస్ జీసీముర్మును కేంద్రం నియమించింది. ఇప్పటికే ఆర్థికశాఖలో ప్రత్యేకాధికారి (ఓఎస్డీ)గా పనిచేస్తున్న ఆయన.. మార్చిలో కార్యదర్శిగా బాధ్యతలు చేపడతారు.

సిరియాలో కుర్దు సేనల జోలికొస్తే నాశనం చేస్తాం!

టర్కీకి ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: సిరియాలో కుర్దు సేనల జోలికొస్తే సహించేది లేదని, అదే జరిగితే టర్కీని ఆర్థికంగా సర్వనాశనం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశాన్ని హెచ్చరించారు. నిత్యం యుద్ధ వాతావరణంతో అట్టుడికిపోతున్న సిరియా నుంచి తమ సేనలను ఉపసంహరించుకుంటున్నట్లు గత నెలలో ట్రంప్ ప్రకటించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఈ క్రమంలోనే- "సిరియా నుంచి మా దళాలు వెనుదిరుగుతున్నాయి. అలాగని ఐసిస్ ఉగ్రవాదులు పేట్రేగితే ఊరుకునేది లేదు. సమీప స్థావరాల నుంచి మళ్లీ దాడులు చేసి అణచివేస్తాం. మా మద్దతుతో అక్కడ కొనసాగుతున్న కుర్దు సేనల జోలికి టర్కీ వెళ్లదని భావిస్తున్నాం. అందుకు విరుద్ధంగా జరిగితే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఆ దేశాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేస్తాం" అంటూ ఆయన ట్విట్టర్‌లో తీవ్రంగా హెచ్చరించారు. ఆ వెంటనే టర్కీ కూడా స్పందించింది. "మిస్టర్ ట్రంప్! మన మధ్యనున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని గౌరవిస్తారని ఆశిస్తున్నాం. ఉగ్రవాదుల నుంచి కుర్దులు, సిరియన్లకు రక్షణ కల్పిస్తాం. కానీ... మా తిరుగుబాటుదారులతో చేతులు కలిపిన కుర్దుల వైపీజీ సంస్థకు, ఉగ్రవాదులకు మధ్య తేడా లేదు. వారందరికీ వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగుతుంది" అని ఆ దేశ అధ్యక్షుడి అధికార ప్రతినిధి ఇబ్రహీం కాలిన్ పేర్కొన్నారు.

గోవధ కేసులో నిందితులపై జాతీయ భద్రత చట్టం

బులంద్‌శహర్(ఉత్తర్ ప్రదేశ్): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బులంద్‌శహర్ గోవధ కేసులో ముగ్గురు నిందితులపై అధికారులు జాతీయ భద్రత చట్టాన్ని ప్రయోగించారు. దీంతో బెయిలుపై విడుదలైనా వారిని తిరిగి అదుపులోకి తీసుకునేందుకు వీలవుతుంది. బులంద్‌శహర్ జిల్లా సియానా పరిధిలోని మహావ్ గ్రామం వెలుపల గత నెల 3న గోవుల కళేబరాలు కనిపించడంతో స్థానికులు ఆగ్రహించారు. చింగ్రావతి పోలీసు స్థావరంపై వారు దాడి చేయడంతో ఇన్‌స్పెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్, ఓ పౌరుడు మృత్యువాతపడ్డారు. స్థానికుల దాడి, గోవధకు సంబంధించి పోలీసులు రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గోవధ ఆరోపణలపై ఏడుగురిని అరెస్టు చేశారు. వారిలో అజార్ ఖాన్, నదీమ్ ఖాన్, మెహబూబ్ అలీలపై సోమవారం జాతీయ భద్రత చట్టాన్ని ప్రయోగించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ అనూజ్ ఝా వెల్లడించారు.

ఇరాన్‌పై సైనిక దాడికి అమెరికా వ్యూహం?

వాషింగ్టన్: గత సెప్టెంబరులో ఇరాక్‌లోని తమ రాయబార కార్యాలయంపై ఇరాన్‌కు చెందిన ముఠాలు మోర్టారు దాడులకు పాల్పడటాన్ని అమెరికా తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు శ్వేతసౌధ జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సీ) వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ కథనం అందించింది. అయితే రకరకాల దాడులను తిప్పికొట్టేందుకు అధ్యక్షుడి పరిశీలనార్థం ఎన్ఎస్‌సీ ఇలాంటి ప్రణాళికలను ప్రతిపాదిస్తుందని, ఇది సాధారణ ప్రక్రియేనని పెంటగాన్ వర్గాలు పేర్కొన్నాయి.

పరిశ్రమలతో కలిసి పనిచేయాల్సిందే

- ప్రతి ఇంజినీరింగ్ కళాశాలకు 5 ఎంఓయూలు తప్పనిసరి
- అనుమతులకు ఏఐసీటీఈ నిబంధన

ఈనాడు - హైదరాబాద్

పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకునే ఇంజినీరింగ్ కళాశాలలకే అనుమతులు ఇచ్చేలా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిబంధన విధించింది. తద్వారా ఉపాధి అవకాశాలను పెంచే దిశగా చర్యలకు ఉపక్రమించింది. ఇకనుంచి ఏఐసీటీఈ అనుమతి కావాలంటే ఇంజినీరింగ్ కళాశాలలు.. పరిశ్రమలతో కనీసం అయిదు పరస్పర అవగాహన ఒప్పందాల (ఎంఓయూల)ను కుదుర్చుకోవడం తప్పనిసరి. వచ్చే విద్యాసంవత్సరానికి అనుమతుల నిబంధనల పుస్తకాన్ని ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. అమెరికాతో సహా పలు దేశాల్లో మాదిరిగా పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని, దానివల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఏఐసీటీఈ భావిస్తోంది. దాంతో ఈ నిబంధనను అనుమతుల నియమావళిలో చేర్చింది. 2020-21 విద్యాసంవత్సరానికి అనుమతులు ఇచ్చే సమయంలో ఈ నిబంధనను పాటించారో? లేదో చూస్తారు. ఇంటర్న్‌షిప్, పరిశోధనలపై ఎంఓయూలు తప్పనిసరిగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

మరికొన్ని కొత్త నిబంధనలివీ..

★ ఒక కోర్సులో వరుసగా అయిదేళ్లపాటు 30% కంటే తక్కువ సీట్లు భర్తీ అయితే సగం సీట్లు తగ్గిస్తారు.
★ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ విధానం అమలు చేయడం తప్పనిసరి.
★ కళాశాలలు అంతర్గత నాణ్యత హామీ విభాగం (ఐక్యూఏసీ) ఏర్పాటు చేసుకోవాలి. న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపు సాధించడం, విద్యానాణ్యత పెంచడంపై ఈ విభాగం పనిచేస్తుంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో ఇది అమలవుతోంది.
★ విద్యార్థులు కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి, ఇతర విద్యార్థులు, అధ్యాపకులతో పరిచయాలు ఏర్పరచుకునేందుకు అనువుగా 'స్టూడెంట్స్ ఇండక్షన్' కార్యక్రమం నిర్వహించాలి.
★ అధ్యాపకులకు శిక్షణ తప్పనిసరి.
★ ప్రతి రెండు అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులకు, ప్రతి పీజీ కోర్సుకు సెమినార్ హాళ్లు తప్పనిసరిగా ఉండాలి.
★ ఆంగ్ల నైపుణ్యం పెంచుకునేందుకు ఇకనుంచి ప్రతి 300 మందికి 20 కంప్యూటర్లతో లాంగ్వేజ్ ల్యాబ్ ఉండాలి. గతంలో ప్రతి వెయ్యి మంది విద్యార్థులకు 25 కంప్యూటర్లతో ఒక ల్యాబ్ ఉండాలన్న నిబంధనను ఈ మేరకు మార్చారు.

రేషన్ షాపుల్లో చిరుధాన్యాలు!

పౌర సరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్



జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థలో బియ్యంతో పాటు చిరుధాన్యాల పంపిణీకి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ అకున్ సబర్వాల్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్‌నాయక్ తండాలో సోమవారం డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహించిన 'పాత పంటల జాతర' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతుకుటుంబంలో పుట్టిన తనకు అన్నదాత కష్టాలు తెలుసునంటూ... వ్యవసాయం, సాగు విధానాల పరిశీలనకే ఈ ప్రాంతానికి వచ్చానన్నారు. ప్రాంతీయంగా పండించే పంటలను రేషన్ దుకాణాల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇప్పటికే చిరుధాన్యాలు పంపిణీ చేస్తున్న పొరుగు రాష్ట్రాల పరిస్థితులను పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. నచ్చిన పంటలను పండించుకునే హక్కు రైతులకు ఉందని, ఒకే రకమైనవి పండించాలని నిర్దేశించడం సరికాదని అభిప్రాయపడ్డారు. రెండు దశాబ్దాలుగా సేంద్రియ వ్యవసాయం వైపు నడిపిస్తున్న డీడీఎస్ డైరెక్టర్ పీవీ సతీష్ కృషి అభినందనీయమన్నారు. చిరుధాన్యాల సంరక్షణ ద్వారా డీడీఎస్ మహిళా రైతులు జీవవైవిధ్యాన్ని కాపాడుతున్నారని సెంటర్ ఫర్ ఎకనామిక్, సోషల్ స్టడీస్(సెస్)కు చెందిన ఆచార్య గాలబ్ ప్రశంసించారు.

చైనాలో కెనడా పౌరుడికి మరణశిక్ష

మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కోర్టు తీర్పు
ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం

బీజింగ్: చైనాలోని డేలియన్ నగర కోర్టు మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. కెనడా పౌరుడికి మరణశిక్ష ఖరారు చేసింది. మాదకద్రవ్యాల సరఫరా ఆరోపణలపై కెనడా జాతీయుడు రాబర్ట్ లాయిడ్ షెలెన్‌బర్గ్(36)ను చైనా పోలీసులు 2015లో అదుపులోకి తీసుకున్నారు. అతడికి 15 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ గతేడాది నవంబరులో తొలుత తీర్పు వెలువడింది. ఆ శిక్ష చాలా తక్కువని లియావోనింగ్‌లోని హైకోర్టు అభిప్రాయపడటంతో తాజాగా డేలియన్ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు షెలెన్‌బర్గ్‌కు మరణశిక్ష విధించింది. ఇదే కేసులో ఇద్దరు చైనీయులు దోషులుగా తేలగా, వారిలో ఒకరికి మరణశిక్ష ఖరారైంది. మరొకరికి జీవితఖైదు పడింది. డేలియన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేసే అవకాశం షెలెన్‌బర్గ్‌కు ఉంది.

ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలపై అమెరికా విన్నపం మేరకు కెనడా పోలీసులు టెలికాం దిగ్గజ సంస్థ 'హువావే' ఉన్నతాధికారి మెంగ్ వాంజౌను గత నెల్లో అరెస్టు చేశారు. ఆమె 'హువావే' వ్యవస్థాపకుడు రెన్ జెంగ్ఫీ కుమార్తె. ప్రస్తుతం ఆమె బెయిలుపై కెనడాలో ఉన్నారు. ఆపై జాతీయ భద్రతకు ముప్పుగా మారారని అనుమానిస్తూ ఇద్దరు కెనడా వాసులను చైనా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు మాజీ దౌత్యవేత్త కాగా, మరొకరు వ్యాపార సలహాదారుడు. మెంగ్ అరెస్టుకు ప్రతీకారంగానే చైనా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో షెలెన్‌బర్గ్‌కు మరణశిక్ష ఖరారవ్వడంతో ఇరుదేశాల మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశముంది.

పరిశోధనను 'వరి'ంచిన అధిక దిగుబడులు!

ప్రపంచ ఆహార కొరతను తీర్చే నూతన వంగడాల సృష్టి

బీజింగ్: అధిక దిగుబడులిచ్చే కొత్తరకం వరి వంగడాలను చైనా వ్యవసాయ శాస్త్రవేత్తలు సృష్టించారు! ప్రపంచ వ్యాప్తంగా ఆహార కొరతను ఎదుర్కోవడంలో ఇవి కీలకం కానున్నట్లు భావిస్తున్నారు. పగటి సమయం, కాంతి తక్కువగా ఉన్నాసరే... వీటి దిగుబడులు మాత్రం ఎక్కువగానే ఉంటాయట! సౌత్ చైనా అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన జిన్ జియాంగ్ పెంగ్ బృందం ఈ జన్యుమార్పిడి వంగడాలను రూపొందించింది.

"జీవక్రియల నిమిత్తం మొక్కలు కొంత ఆక్సిజన్‌ను స్వీకరించి, కార్బన్-డై-ఆక్సైడ్‌ను విడిచిపెడతాయి. అయితే ఈ వాయువు నారు కణాల బలోపేతానికి వినియోగమయ్యేలా పరిశోధన సాగించాం. 'జీవోసీ'గా పిలిచే ఈ విధానం ద్వారా వాటి కిరణజన్య సంయోగక్రియ మెరుగుపడింది. ఎండ అంతగా లేకపోయినా మంచి దిగుబడులు వచ్చాయి. ఇక పగటి సమయం, వేడి ఎక్కువగా ఉండే చోట్ల మరింత ఉత్పత్తిని ఆశించొచ్చు. జీవోసీ పైరు మిగతా వాటికంటే పచ్చగా ఉంటూ, ఏపుగా ఎదుగుతుంది. వీటి దిగుబడులు 27% ఎక్కువ. ధాన్యం పరిమాణమూ సుమారు రెట్టింపుగా ఉంటుంది. పలు రకాల వరి వంగడాలపైనా, ఇతరత్రా ఆహార పంటల్లోనూ ఈ పరిజ్ఞానాన్ని అమలుచేసి చూస్తాం" అని పెంగ్ వివరించారు. 'మాలిక్యులర్ ప్లాంట్' పత్రిక దీనిపై కథనం అందించింది.

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ నియామకాన్ని సవాల్ చేస్తూ వ్యాజ్యం

దిల్లీ: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ సోమవారం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. డైరెక్టర్‌గా ఉన్న ఆలోక్ వర్మను ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని అత్యున్నత స్థాయి సంఘం తొలగించింది. అనంతరం ప్రభుత్వం అదనపు డైరెక్టర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించింది. ఇది సరికాదంటూ కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో పాటు, సమాచార హక్కు చట్టం కార్యకర్త అంజలి భరద్వాజ్ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన ఉన్నత స్థాయి సంఘం డైరెక్టర్‌ను నియమించాల్సి ఉండగా, ఆ నిబంధనను ఏ మాత్రం పాటించలేదని వారి తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. సీబీఐ డైరెక్టర్ నియామకానికి సంబంధించిన అన్ని పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచేలా కేంద్రాన్ని ఆదేశించాలని కూడా కోరారు.

కొనసాగుతున్న బదిలీలు

దిల్లీ: సీబీఐలో బదిలీలు కొనసాగుతున్నాయి. సంస్థ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమితులైన ఎం.నాగేశ్వరరావు సోమవారం కొందరు అధికారులను బదిలీ చేశారు. అక్రమ మైనింగ్ కేసులో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్ పాత్రపై దర్యాప్తు చేస్తున్న బృందంలో పనిచేస్తున్న సీబీఐ డీఐజీ గగన్‌దీప్ గంభీర్‌ను బదిలీ చేశారు. ఇకపై ఆమె శ్రీజన్ కుంభకోణం, పాత్రికేయురాలు ఉపేంద్రరాయ్ హత్యోదంతాన్ని విచారించే యూనిట్‌లో పనిచేయాల్సి ఉంటుంది. ఉత్తర్‌ప్రదేశ్ అక్రమ బొగ్గు గనుల కేసును డీఐజీ అనీశ్‌ప్రసాద్ పర్యవేక్షిస్తారు. ఈయన ప్రస్తుతం సీబీఐ సిబ్బంది, పరిపాలన విభాగానికి డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. రాకేశ్ అస్థానాపై అవినీతి ఆరోపణలను విచారిస్తున్న డీఐజీ తరుణ్‌గౌబా.. ఇకపై చండీగఢ్ ప్రాంత కీలక బాధ్యతలు కూడా చేపట్టనున్నారు. ఆయన విన్నపం మేరకే ఈ బాధ్యతలు ఆయనకు కట్టబెట్టినట్లు సమాచారం.


గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్ : గవర్నర్ నరసింహన్ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, తెరాస పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, నిజామాబాద్ తెరాస ఎంపీ కల్వకుంట్ల కవితలు ప్రజలకు శుభాకాంక్షలను తెలియజేశారు.

ఆశ్రిత చిన్నారులకు రక్షణేదీ?

- బాలల సంరక్షణ గృహాల్లో ప్రమాణాలు కరవు
- క్రమశిక్షణ పేరిట పిల్లలకు ఆహారం బంద్
- వైద్య, విద్య రికార్డుల నిర్వహణ లేదు
- బాల, బాలికలకు ఒకే భవనంలో ఆశ్రయం
- అధ్యయన కమిటీ నివేదికలో వెల్లడి

సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాలల పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదని బాలల సంరక్షణ కేంద్రాల (సీసీఐ) కేంద్ర అధ్యయన కమిటీ అభిప్రాయపడింది. పుట్టినపుడే తల్లిదండ్రులు వదిలేసిన పసి కందులు, ఎవరూ లేని అనాథలు, వేధింపులకు గురైన బాధితులు, ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యే అభాగ్యులు.. నిస్సహాయ స్థితిలో దేశవ్యాప్తంగా ఉన్న సంరక్షణ కేంద్రాలకు చేరుతున్నారు. 91% సంరక్షణ కేంద్రాలు, గృహాలన్నీ స్వచ్ఛంద సంస్థల అధీనంలోనే ఉన్నాయని, వీటిలో బాలలన్యాయ (జ్యువనైల్ జస్టిస్ - జేజే)చట్టంలోని కనీస ప్రమాణాలు పాటించడం లేదని వెల్లడించింది. క్రమశిక్షణ పేరిట పిల్లలను కొట్టడం, తిట్టడం, అన్నం పెట్టకుండా కడుపు మాడ్చటం వంటి సంఘటనలను గుర్తించింది. తెలంగాణలోనూ ఇవే పరిస్థితులు ఉన్నట్లు వివరించింది. లైంగిక వేధింపులు, నీలిచిత్రాల బాధితులు రాష్ట్రంలో ఎక్కువగా నమోదు కావడంపై ఆందోళన వ్యక్తం చేసింది. సంరక్షణ కేంద్రాల్లో బాలబాలికలకు వేర్వేరు భవనాలు ఉండాలనే నిబంధన అమలు కావడం లేదని, పలుచోట్ల వారికి ఒకేభవనంలో ఆశ్రయం కల్పిస్తున్నారని పేర్కొంది. సంరక్షణ కేంద్రాల్లో తగిన సంఖ్యలో సిబ్బంది లేరని, నిర్వాహకులకు చట్టంపై కనీస అవగాహన లేదని వెల్లడించింది. పిల్లల వైద్య, విద్య, వ్యక్తిగత వివరాల నివేదికలు ఎప్పటికప్పుడు సిద్ధం చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు తెలిపింది.



రాష్ట్రంలో సీసీఐలలో మానసిక వైకల్యం ఉన్న చిన్నారులు 803 మంది, శారీరక వైకల్యం ఉన్నవారు 660 మంది ఆశ్రయం పొందుతున్నారు.

నివేదికలో ఏముంది?

తెలంగాణలో నీలిచిత్రాల బాధితులు (35 మంది), లైంగిక వేధింపులకు గురైనవారు (127 మంది), బాలకార్మికులుగా అక్రమ రవాణాకు గురైనవారు.. సంరక్షణ కేంద్రాల్లో ఎక్కువగా ఉన్నారు. ఇవన్నీ జిల్లా కేంద్రానికి 20 కి.మీ దూరంలోనే ఉన్నాయి. బాల్యవివాహాల నుంచి రక్షించిన చిన్నారుల్లో ఇద్దరు పదేళ్లలోపువారు కావడం గమనార్హం.

- పుట్టిన వెంటనే చిన్నారులను వదిలివేయడం లేదా ప్రభుత్వ సంరక్షణ గృహాల్లో అప్పగిస్తున్న కేసులు అధికం. అధ్యయనంలో కర్ణాటక, తెలంగాణలో దాదాపు 500 మంది చిన్నారులున్నారు. దేశంలోనే అత్యధికంగా ట్రాన్స్‌జెండర్ చిన్నారులు 31 మంది తెలంగాణలో ఆశ్రయం పొందుతున్నారు.
- ఇళ్లలో పని చేయించేందుకు అక్రమంగా రవాణా అవుతున్న బాధితుల్లో బాలికలు ఎక్కువ. అత్యధిక వేతనాలు, మంచి జీవితం పేరిట గ్రామీణ ప్రాంతాల పేద కుటుంబాల పిల్లలను తీసుకువస్తున్నారు. బాలికలకు మాయమాటలు చెప్పి, లైంగిక వ్యాపారానికి రొంపిలోకి దింపుతున్నారు. ఈ తరహా బాధితుల్లో దేశంలోనే తెలంగాణ నాలుగో స్థానంలో ఉంది. వీరిని డ్రగ్స్, ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో పావులుగా వినియోగిస్తున్నారు. ఇలాంటి వారికి మరింత రక్షణ కల్పించాల్సిన అవసరముంది.

కనీస సౌకర్యాలు అంతంతమాత్రం

చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, సౌకర్యాలు, తాగునీరు, వైద్యపరీక్షలు ఆశించిన స్థాయిలో లేవు. పరిశుభ్రతపై అవగాహన కల్పించడం లేదు. వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో సంరక్షణ కేంద్రాలు విఫలమయ్యాయి. పరిస్థితులు బాలల న్యాయచట్టం ప్రాథమిక సూత్రాలకు భిన్నంగా ఉన్నాయి. చివరకు ఆశ్రయం పొందుతున్న పిల్లల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు సరైన వ్యవస్థలు లేవు. పిల్లల సంరక్షణ, పర్యవేక్షణ సిబ్బంది తగిన సంఖ్యలో లేరు. దాదాపు 35% ఖాళీలున్నాయి.

- ఆశ్రయం పొందుతున్న చిన్నారులను క్రమశిక్షణ పేరిట దండిస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్రాల నిర్వాహకులు అంగీకరిస్తున్నారు. చిన్నారులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఇలా దండించడం బాలల న్యాయచట్టం కింద పెద్దనేరం. తెలంగాణలో బంధించడం, ఆహారం అందించకపోవడం, బెదిరించడం, అవమానించడం, కొట్టడంలాంటి దండనలు విధిస్తున్నారు. చిన్నారులు జబ్బుపడినపుడు సంరక్షణకు 'ప్రత్యేక గది' నిబంధన అమలు మూలనపడింది. స్నానపుగదులు, టాయిలెట్లు తగిన సంఖ్యలో లేవు.

- ఈనాడు, హైదరాబాద్

విద్యార్థుల తల్లిదండ్రులే ముఖ్య అతిథులు



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఈనాడు, హైదరాబాద్: విద్యా హక్కు చట్టం ప్రకారం సర్కారు బడుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత తల్లిదండ్రులతో ఏర్పాటైన విద్యా కమిటీలదే. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వారితోనే క్యాలెండర్, గోడ పత్రికలను ఆవిష్కరింపజేసింది గత కొద్ది రోజులుగా సంఘం ప్రతినిధులు ఆయా గ్రామాలకు వెళ్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి వాటిని ఆవిష్కరిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో సోమవారం ఇలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాధించాలంటే తల్లిదండ్రుల విశ్వాసం ముఖ్యమని, అందుకే వారిని అతిథులుగా పిలుస్తున్నామని చెప్పారు. పాఠశాలలను సందర్శించి పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని ఆయన తల్లిదండ్రులకు సూచించారు.

నిఘా ఉత్తర్వుల నోటిఫికేషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

దిల్లీ: కంప్యూటర్లపై నిఘా పెట్టేందుకు 10 కేంద్ర సంస్థలకు అధికారం కల్పిస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. దీనిపై ఆరు వారాల్లోగా ప్రతిస్పందన తెలియజేయాలంటూ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రానికి నోటీసు జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ అక్రమమని, చట్టవ్యతిరేకమని న్యాయవాది మనోహర్‌లాల్ శర్మ తన వ్యాజ్యంలో ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికి, ప్రస్తుత అధికార పార్టీకి ఈ నోటిఫికేషన్ ఉపయుక్తంగా మారుతుందని ఆరోపించారు.

'కృత్రిమ మేధ' కోర్సు వస్తోంది

- ఐఐటీ ఖరగ్‌పూర్ ఆధ్వర్యంలో 6 నెలల సర్టిఫికెట్ కోర్సు
- హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాలలో శిక్షణ
- మార్చి 10 నుంచి ప్రారంభం

ఈనాడు - హైదరాబాద్

నాలుగో పారిశ్రామిక విప్లవంగా పేర్కొంటున్న కృత్రిమ మేధపై ప్రతిష్ఠాత్మక ఐఐటీ ఖరగ్‌పూర్ దేశవ్యాప్తంగా సర్టిఫికెట్ కోర్సుకు శ్రీకారం చుడుతోంది. ఈ రంగంలో నిపుణులను తయారు చేయాలనే లక్ష్యంతో హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో శిక్షణ ప్రారంభించనుంది. ఇప్పటి వరకు ప్రైవేటు సంస్థలు శిక్షణ ఇస్తుండగా తాజాగా ఐఐటీనే ముందుకు రావడం విశేషం. త్వరలోనే మరిన్ని ఐఐటీలు ఆధునిక సాంకేతికతలపై స్వల్పకాలిక శిక్షణ కేంద్రాలను ప్రారంభించేందుకు అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

2020 నాటికి రెండు లక్షల కొలువులు

కృత్రిమ మేధ అన్ని రంగాల్లో దూసుకొస్తోంది. భారత్‌లో ఈ రంగంలో 2020 నాటికి రెండు లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని అధ్యయనాలు వెల్లడించాయి. అందుకే ఈ రంగంలో మానవ వనరులను తయారు చేసుకోకుంటే వెనుకబడతామని భావిస్తున్న ఐఐటీలు ఆ కొరతను పూడ్చేందుకు చొరవ తీసుకుంటున్నాయి. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం దేశంలో ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాలలో ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సును



ఐఐటీ ఖరగ్‌పూర్


ప్రారంభించాలని నిర్ణయించింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆచార్యులు, ఇతర ప్రసిద్ధ విద్యా సంస్థల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు పాఠ్యాంశాలను బోధిస్తారు. 60% పాఠ్యాంశాలను ఆచార్యులు, మిగిలిన 40 శాతాన్ని మైక్రోసాఫ్ట్ రిసెర్చ్, అమెజాన్, టీసీఎస్, బెల్ ల్యాబ్స్ తదితర పరిశ్రమల నిపుణులు బోధిస్తారు. ప్రత్యక్ష బోధనతోపాటు ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని కృత్రిమ మేధ కేంద్రం నుంచి లైవ్ తరగతులు ప్రసారం అవుతాయి. తరగతులు వారాంతాల్లోనే జరుగుతాయి. ఎంపికైన వారిలో కొందరికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. దీనిపై ఐఐటీ ఖరగ్‌పూర్ సీనియర్ ఆచార్యుడు ఒకరు మాట్లాడుతూ కొత్త ఒరవడిని సృష్టించడంలో తమ సంస్థ ముందుంటుందని చెప్పారు. 'ఐఐటీలో వైద్య విద్యను ప్రారంభించాం. న్యాయ విద్యను కూడా అందిస్తున్నాం. తాజాగా కేవలం ప్రాంగణంలోనే కాకుండా దేశంలోని, ఇతర ప్రాంతాల్లోని వారిని కృత్రిమ మేధలో నిపుణులుగా తయారు చేసేందుకు సిద్ధమయ్యాం' అన్నారు.

ఏం నేర్పుతారు?

ఇప్పటికే సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారితో పాటు బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. అందులో 16 మాడ్యూల్స్ ఉంటాయి. ఒక్కో మాడ్యూల్‌ను 12 గంటలపాటు బోధిస్తారు. గణితం, అల్గారిథం, కృత్రిమ మేధ, స్టాటిస్టిక్స్, మెషిన్ లెర్నింగ్ పద్ధతులతోపాటు, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, కంప్యూటర్ విజన్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ప్రతి పాఠ్యాంశంపై పరీక్ష నిర్వహిస్తారు. శిక్షణ తర్వాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి ధ్రువపత్రం అందజేస్తారు.

- దరఖాస్తుల ప్రక్రియ జనవరి 2న ప్రారంభమయింది. 25 వరకూ కొనసాగుతుంది.
- మొదటి బ్యాచ్‌లో 300-400 మందిని మాత్రమే శిక్షణకు ఎంపిక చేస్తారు.
- మార్చి 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఐఐటీ ఖరగ్‌పూర్‌తో మాట్లాడతాం



- ఆచార్య వేణుగోపాల్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్, ఉపకులపతి

ఐఐటీ ఖరగ్‌పూర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను నెలకొల్పాలంటే వారికి 2 వేల చదరపు అడుగుల భవనం కావాలి. ఆ కేంద్రం వల్ల మా విద్యార్థులకు కూడా ప్రయోజనం ఉంటే, వారికి కావాల్సిన భవనం విశ్వవిద్యాలయంలోనే ఇవ్వడానికి సిద్ధం. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని సంబంధిత ఆచార్యులతో మాట్లాడతాను.

వెబ్‌సైట్లో జేఈఈ మెయిన్ ప్రశ్నపత్రాలు

16న ప్రాథమిక కీ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన జేఈఈ మెయిన్ పేపర్-1, 2కు సంబంధించిన ప్రశ్నపత్రాలను జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) సోమవారం వెబ్‌సైట్లో ఉంచింది. పేపర్-1 పరీక్ష రోజుకు రెండు విడతలుగా మొత్తం ఎనిమిది సార్లు ఆన్‌లైన్ విధానంలో జరిగింది. అంటే ఎనిమిది ప్రశ్నపత్రాలున్నాయి. పేపర్-2కు మరో ప్రశ్నపత్రం. ఆ ప్రశ్నపత్రాలతోపాటు విద్యార్థులు గుర్తించిన జవాబులు నింపిన పత్రాన్ని కూడా వెబ్‌సైట్లో ఉంచారు. జేఈఈ మెయిన్ వెబ్‌సైట్లో లింకు ద్వారా ఎవరి జవాబుపత్రాన్ని వారు చూసుకోవచ్చని ఎన్‌టీఏ తెలిపింది. ఈ నెల 17వ తేదీ వరకు ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉంటాయని, వాటిని విద్యార్థులు భద్రపరచుకోవాలని సూచించింది. ఈ నెల 16వ తేదీన ప్రాథమిక కీ వెలువడనుంది. ఈ పరీక్షలకు మొత్తం 9,41,117 మంది దరఖాస్తు చేశారని అధికారికంగా మొదటిసారి ప్రకటించిన ఎన్‌టీఏ...ఎంత మంది పరీక్షలకు హాజరయ్యారన్నది మాత్రం చెప్పకపోవడం గమనార్హం. దరఖాస్తు చేసిన వారిలో దాదాపు 98 శాతం హాజరవుతారని అనధికారిక అంచనా.

పాక్ సుప్రీం కోర్టులో నవాజ్ షరీఫ్‌కు ఊరట

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు ఓ అవినీతి కేసులో ఊరట లభించింది. అక్రమాస్తుల కేసులో ఆయనకు పడిన పదేళ్ల జైలుశిక్షను నిలుపుదల చేయడాన్ని సవాలు చేస్తూ జాతీయ జవాబుదారీ సంస్థ (ఎన్‌ఏబీ) చేసిన అపీలును పాక్ సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. శిక్ష నిలుపుదల చేస్తూ ఇస్లామాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. ఈ కేసు కాకుండా నవాజ్, ఆయన కుటుంబ సభ్యులపై మరో రెండు అవినీతి కేసులు నమోదయ్యాయి. అవినీతి నిరోధక కోర్టు డిసెంబర్‌లో ఒక కేసులో నవాజ్‌కు విముక్తి ప్రసాదించింది. మరో కేసులో ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం లాహోర్ జైల్లో నవాజ్ ఈ శిక్ష అనుభవిస్తున్నారు. ఈ తీర్పునకు వ్యతిరేకంగా కూడా ఆయన ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. సుప్రీం కోర్టు తాజా నిర్ణయాన్ని నవాజ్ కుమార్తె మర్యమ్ స్వాగతించారు.

గాడిద పాలతో సబ్బులు!

చండీగఢ్: ఇక్కడ జరిగిన సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనలో గాడిద పాలతో తయారు చేసిన సబ్బులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దిల్లీకి చెందిన అంకుర సంస్థ 'ఆర్గానికో' పేరిట ఈ ప్రదర్శనలో పెట్టిన సబ్బుల స్టాల్ వద్ద జనం కిక్కిరిసిపోయారు. వందగ్రాముల సబ్బు రూ.499లు అన్నప్పటికీ సందర్శకులెవరూ వెనకాడకుండా కొనేశారు. గాడిద పాలల్లో ఔషధగుణాలు పుష్కలమని, చర్మంపై ముడతలకు అద్భుతంగా పనిచేస్తుందనీ....బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి దూరం చేస్తుందని 'ఆర్గానికో' ప్రతినిధులు తెలిపారు. గాడిద పాల ధర లీటరుకు రూ.2వేలుగా ఉన్నట్లు వెల్లడించారు. గాడిద రోజుకు గరిష్ఠంగా లీటరు పాలు మాత్రమే ఇస్తుందని చెప్పారు.

అత్తారింటికి దారేది సీరియల్‌కు అవార్డు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: ప్రముఖ సాంస్కృతిక సంస్థ వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం నట భూషణ శోభన్‌బాబు 83వ జయంతి కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ సదనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటీమణి రోజారమణికి 'శోభన్‌బాబు-వంశీ జీవితసాఫల్య పురస్కారం' ప్రదానం చేసి వెండి కిరీటాన్ని బహూకరించారు. ప్రత్యేకాంశంగా 'ఈటీవీ'లో ప్రసారమవుతున్న 'అత్తారింటికి దారేది'కి అత్యుత్తమ సీరియల్‌గా శోభన్‌బాబు-వంశీ(బర్కిలీ) 2018 అవార్డును అందజేశారు. ఈటీవీ పోస్ట్ ప్రొడక్షన్ మేనేజర్ రామారావు ఈ అవార్డును అందుకున్నారు. సీరియల్ యూనిట్ సభ్యులను ఘనంగా సత్కరించారు. దర్శకులు వి.శరత్‌బాబు, రచయిత పి.బాబా, నటీనటులు వి.హర్షిత, విజయ్‌రెడ్డి, వర్ష, దినేష్, చక్రవర్తి, నాగమణి, కృష్ణతేజ, వరలక్ష్మి, అవినాష్, సాంకేతిక కళాకారులు జి.పరమేశ్, ఎస్.రాజేందర్, చిరంజీవి, లక్ష్మణ్‌రావు, నరేష్‌లు సత్కారాలు పొందారు. కార్యక్రమంలో భాగంగా లయన్ జయంతికుమార్, పి.ఇందిర దంపతులను శోభన్‌బాబు-వంశీ విశిష్ట ఆదర్శ దంపతుల పురస్కారంతో సత్కరించారు. వంశీ అధ్యక్షురాలు డా.టి.సుధాదేవి, ప్రధాన కార్యదర్శి శైలజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వంశీసంస్థల వ్యవస్థాపకులు వంశీరామరాజు, సినీ నటి డా.జమునారమణారావు, ప్రముఖ సినీదర్శకులు రేలంగి నర్సింహారావు, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.



వంశీ ఆర్ట్స్‌థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శోభన్‌బాబు జయంతి కార్యక్రమంలో నటి రోజారమణికి శోభన్‌బాబు-వంశీ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న జమున. కార్యక్రమంలో పాల్గొన్న దైవజ్ఞశర్మ, దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీరామరాజు, శోభన్‌బాబు-వంశీ(బర్కిలీ) అవార్డు పొందిన ఈటీవీ సీరియల్ అత్తారింటికి దారేది నటీనటులు

సకల సౌకర్యాలతో రూపుదిద్దుకున్న పట్టణం	భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులు	700 ఎకరాల్లో మగర్‌పట్టా పట్టణం ఆవిర్భావం	అక్కడి ప్రత్యేకతలు పరిశీలించిన హెచ్ఎండీఏ కమిషనర్	ఇదే తరహాలో హైదరాబాద్ చుట్టుపక్కల పట్టణాలు	నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళిక	ఇక్కడి రైతుల పొలాలు ఇచ్చేందుకు సంసిద్ధత

పట్టు పట్టి.. పట్టణం కట్టి


మగర్‌పట్టాలో నిర్మించిన గృహ సముదాయాలు

ఏదైనా సాధించాలంటే సంకల్పం అవసరం.. ఒక వ్యక్తి ఆలోచన, పలువురు కర్షకుల సహకారంతో ఆ సంకల్పం సాకారమైంది. వీరి కృషికి ప్రతిరూపంగా ఒక పట్టణమే నిర్మితమైంది. ఇందుకు ఏకంగా 400 మంది రైతులు తమ భూమిని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. భూసేకరణ కోసం పైసా ఖర్చు చేయకుండా 700 ఎకరాల్లో సకల సౌకర్యాలతో పట్టణం ఏర్పడింది. పుణె సమీపంలో ఏర్పడిన మగర్‌పట్టాలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇప్పుడు ఇదే తరహా చిన్న పట్టణాలను రైతుల తోడ్పాటుతో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం తలపెట్టింది. ఇలాంటి పట్టణాలను హైదరాబాద్ సమీపంలో నిర్మించాలని మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే ఒకచోట కొందరు రైతులు పట్టణ నిర్మాణం కోసం తమ పొలాలను ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. అసలు మగర్‌పట్టా ఎలా ఏర్పడిందో తెలుసుకుంటే పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

నిర్మాణానికి బీజం


మగర్‌పట్టా పట్టణం

పుణె నగరానికి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని సతీష్ మగర్ అనే వ్యక్తికి దాదాపు వంద ఎకరాల పొలం ఉంది. దీనిపక్కనే మరో 600 ఎకరాలను సేకరించి మొత్తం 700 ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో కూడిన పెద్ద పట్టణాన్ని నిర్మించాలని పదిహేనేళ్ల కిందట సతీష్ మగర్ తలపెట్టారు. ఇందుకు రైతుల నుంచి భూమిని కొనుగోలు చేయడం భారమైన పని. అందుకే అక్కడి రైతులతో మాట్లాడి ఒప్పించారు. భూ సమీకరణ అంటే ఏమిటో తెలియని రోజుల్లో 400 మంది రైతులు తమ భూములను ఇవ్వడానికి ఒప్పుకున్నారు. తొలుత తన 100 ఎకరాలను కలిపి 400 ఎకరాల్లో ఈ మగర్‌పట్టా పేరుతో పట్టణాన్ని నిర్మించడానికి సిద్ధపడ్డారు. మొదట రైతుల భూమికి కొంతమేర పరిహారం ఇచ్చారు. తరువాత వారందరినీ సిటీ యజమానులుగా మార్చారు.

హైదరాబాద్ సమీపంలో పట్టణాల నిర్మాణం

ఇటీవల హెచ్ఎండీఏ కమిషనర్ బి.జనార్దనరెడ్డి మగర్‌పట్టాను పరిశీలించి వచ్చారు. ఆయన ఈ తరహా పట్టణాలను హైదరాబాద్ నగర పరిసరాల్లో బాహ్యవలయ రహదారికి ఆనుకుని నిర్మించాలని భావిస్తున్నారు. "మగర్‌పట్టా వాతావరణం చాలా బాగుంది. ఇదే తరహాలో రైతులను భాగస్వాములను చేసి మన దగ్గర కూడా చిన్న చిన్న పట్టణాలను నిర్మించాల్సిన అవసరం ఉంది. రైతుల నుంచి భూసమీకరణ చేసి ఇక్కడ బాహ్యవలయ రహదారికి ఆనుకుని 13 చిన్న పట్టణాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తలపెట్టింది. హెచ్ఎండీఏ నగరానికి చుట్టుపక్కల రైతుల దగ్గర భూసమీకరణ చేసి బెంగళూరు తరహాలో చిన్న పట్టణాలను నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే రైతులతో అధికారులు మాట్లాడారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని ప్రతాపసింగారంలో 400 ఎకరాలను భూసమీకరణ ద్వారా హెచ్ఎండీఏకు ఇచ్చేందుకు దాదాపు 300 మంది రైతులు ముందుకు వచ్చారు. ఈమేరకు హెచ్ఎండీఏకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇక్కడే కాకుండా మేడిపల్లి, దుండిగల్ వద్ద చిన్న పట్టణాలను నిర్మించాలని నిర్ణయించాం. వీటికోసం భూములు ఇచ్చిన రైతులకు ఈ ప్రాజెక్టులో వచ్చే లాభాల్లో వాటాలను ఇచ్చేలా ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నాం. పుణె సమీపంలోని మగర్‌పట్టా తరహా పట్టణాల నిర్మాణాలపై దృష్టి సారించబోతున్నాం" అని జనార్దనరెడ్డి తెలిపారు.

పట్టణం ఏర్పడిందిలా..

మగర్‌పట్టా నిర్మాణం ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది. ఆలోచన రేకెత్తిస్తుంది. ఇక్కడ మొత్తం 400 ఎకరాలకు గాను 100 ఎకరాల్లో ఆక్సిజన్ పార్కును ఏర్పాటు చేశారు. మిగిలిన స్థలంలో నాలుగు వలయాలను ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ ఉన్న మొదటి వలయంలో ఐటీ హబ్ కోసం 87,11,300 చదరపు అడుగుల టవర్లను నిర్మించారు. వీటన్నింటినీ ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థలకు లీజు ప్రాతిపదికన ఇచ్చారు. 1.40 లక్షల మంది ఇక్కడ ఉద్యోగాలను చేస్తున్నట్లు చెబుతున్నారు. తరువాత వలయంలో విద్యాసంస్థలు.. మూడో వలయంలో మల్టీప్లెక్సులు, వ్యాపార సముదాయాలు, మార్కెట్లు, వినోదం తదితర సౌకర్యాలను కల్పించారు. చివరి వలయంలో నివాసం ఉండేందుకు అపార్టుమెంట్లను నిర్మించారు. ఈ పట్టణం మొత్తంలో ఇప్పుడు 290 టవర్లలో 17,500 కుటుంబాలు కాపురం ఉంటున్నాయి.

మరో 800 ఎకరాల్లో విస్తరణ

మరో 800 ఎకరాల్లో ఈ పట్టణాన్ని విస్తరించబోతున్నారు. దీనికి తమ పొలాలను ఇచ్చేందుకు రైతులు ముందుకు వచ్చారు. వీరి భూమికి పరిహారం దక్కింది. దీనికితోడు పట్టణంలో నిర్మితమైన వాణిజ్య భవనాల నుంచి లీజు రూపంలో వస్తున్న నిధుల్లో కర్షకులకు కూడా వాటా కింద ఏటా కొంత మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారు. పట్టణంలో సకల సౌకర్యాలు ఉండటంతో ఇక్కడి ప్రజలకు బయటకు వెళ్లాల్సిన పనే ఉండదు. అందువల్ల దాదాపుగా అంతా సైకిళ్లనే ఉపయోగిస్తారు. ఇక్కడ ఉద్యోగాలు చేసేవారు కూడా కార్యాలయాలకు వెళ్లేందుకు సైకిళ్లనే వాడుతున్నారు. పచ్చని చెట్లతో, ఉద్యానవనాలతో కాలుష్య రహిత నగరంగా ఇది రూపుదిద్దుకుందని స్థానికులు చెబుతున్నారు.


మగర్‌పట్టాలోని ఐటీ కార్యాలయ భవనాలు

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

సంస్కృతం బోధించనున్న ముస్లిం మహిళ

వివాహమై అత్తవారింటికి వెళ్లినా, తన కల కోసం ఓ ముస్లిం మహిళ తపన చెందారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పిల్లలకు పాఠాలు చెప్పాలనే ఆశయాన్ని నిజం చేసుకున్నారు. హరియాణాలోని మేవాత్ జిల్లా అహ్మద్‌బాస్ ప్రాంతానికి చెందిన షబ్నంబానో అనే ముస్లిం మహిళ సంస్కృతం బోధించనున్నారు. సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్ కోర్సు(పీజీటీ) పూర్తి చేసిన ఆమె.. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. "పెళ్లి తరువాత నా కలను నిజం చేసుకోగలుగుతానని అస్సలు ఊహించలేదు. నా భర్త సర్ఫరాజ్ అంజుమ్ వల్లే ఇది సాధ్యమైంది. సంస్కృతాన్ని ఒకేవర్గం ప్రజలకు పరిమితం చేయడం సరికాదు. సమాజంలోని ప్రతి ఒక్కరికి సంస్కృతంపై కనీస అవగాహన ఉండాలి" అని షబ్నం పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని అల్వార్‌జిల్లా తిజారా నగరంలో జన్మించిన ఆమె..జయపురలోని రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి బీఏ పట్టా పొందారు. ఆపై పొలిటికల్ సైన్స్, సంస్కృతంలో పీజీలు పూర్తి చేశారు.

– ఈటీవీ భారత్

ప్లాస్టిక్ బుల్లెట్ల ప్రయోగంపై అసదుద్దీన్ ఆగ్రహం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జమ్ము కశ్మీర్‌లో ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగించే విధానానికి తెర తీయడం పట్ల ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ అసహనం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన ట్విటర్ వేదికగా ఎండగట్టారు. కశ్మీర్ లోయలో ఆందోళనల నేపథ్యంలో ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగిస్తామంటున్న ప్రభుత్వ తీరు సరైంది కాదని పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ భద్రత

- శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు కల్పించాలని మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ ఆదేశించారు. ఈ నెల 17 నుంచి 20 వరకు శాసనసభ, 19, 20 తేదీల్లో జరగనున్న మండలి సమావేశాలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. శాసన సభ, మండలి సమావేశాలను పురస్కరించుకొని సోమవారం కమిటీహాలులో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్, రాచకొండ పోలీస్‌కమిషనర్లు అంజనీకుమార్, మహేశ్ భగవత్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ..సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, సభ్యులకు అన్ని విధాలా సహకరించాలని సూచించారు. సందర్శకులకు సౌకర్యాలు కల్పించాలన్నారు.

శాసనమండలి ప్రాంగణం పరిశీలన

కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు, ఎమ్మెల్సీలకు ఈ నెల 17న మధ్యాహ్నం శాసనమండలి ప్రాంగణంలో ముఖ్యమంత్రి విందు ఇవ్వనున్నారు. దీనిని పురస్కరించుకొని ప్రాంగణంలో ఏర్పాట్లను మండలి ఛైర్మన్, కార్యదర్శి, అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ పలు సూచనలు చేశారు. డీజీపీ సహా ఇతర ఉన్నతాధికారులు శాసనసభ, మండలి ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు ఆదేశాలుజారీ చేశారు.


అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై సోమవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్. పక్కన శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు

ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు!

- ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం వెల్లడించనున్న మండలి ఛైర్మన్
- ఏడుకు పెరగనున్న ఖాళీలు
- విపక్ష నేత లేకుండానే జరగనున్నమండలి సమావేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లో చేరిన శాసనమండలి సభ్యులపై ఒకటి, రెండురోజుల్లో అనర్హత వేటు పడనున్నట్లు తెలిసింది. మండలి ఛైర్మన్ స్వామి గౌడ్ ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి తెరాస తరఫున గెలిచిన భూపతి రెడ్డి, శాసనసభ్యుల, గవర్నర్ కోటాల్లో నియమితులైన యాదవరెడ్డి, రాములునాయక్‌లు తెరాస నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దీనిపై అధికార పార్టీ..మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన ఆయా సభ్యులకు సంజాయిషీ నోటీసు ఇవ్వగా వారు వివరణలు సమర్పించారు. దీనిపై వాదనలు జరిగాయి. అనంతరం నిర్ణయాన్ని ఛైర్మన్ రిజర్వ్‌లో పెట్టారు. ముగ్గురు సభ్యుల తరఫున తెరాస బలమైన ఆధారాలు సమర్పించింది. భూపతిరెడ్డి నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని, యాదవరెడ్డి మేడ్చల్‌లో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారని, రాములునాయక్ ఆ పార్టీలో చేరడంతో పాటు తెరాసకు వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించారని అధికార పార్టీ సాక్ష్యాలను సమర్పించింది. వీటి ఆధారంగా పార్టీ ఫిరాయింపుల చట్టం కింద ముగ్గురు సభ్యులను అనర్హులుగా నిర్ధారించే వీలున్నట్లు తెలిసింది. ఈ నెల 17న శాసనమండలి ప్రాంగణంలో కొత్త శాసనసభ్యులతో పాటు మండలి సభ్యులకు సీఎం కేసీఆర్ విందు ఇవ్వనున్నారు. దీనికి అన్ని పార్టీల ఎమ్మెల్సీలను పిలిచారు. 19న ఉభయ సభల సమావేశం ఉంది. దీనికి ఎమ్మెల్సీలు హాజరవుతారు. ఎమ్మెల్సీలుగా ఉంటే ఈ ముగ్గురు కూడా విందుకు.. ఆ తర్వాత ఉభయసభల సమావేశానికి హాజరు కావొచ్చు. దీనిని పరిగణనలోకి తీసుకొని 17వ తేదీ లోపే ముగ్గురు సభ్యులను అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉంది.

పెరగనున్న ఖాళీలు

ఈ ముగ్గురిపై అనర్హత వేటు పడితే మండలిలో మొత్తం ఏడు స్థానాలు ఖాళీ అవుతాయి. ఇప్పటికే ఎమ్మెల్యేలుగా గెలిచిన మైనంపల్లి హన్మంతరావు, నరేందర్‌రెడ్డి (తెరాస), కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి (కాంగ్రెస్)లు మండలి సభ్యత్వ పదవులకు రాజీనామా చేశారు. వరంగల్ స్థానిక సంస్థల స్థానం నుంచి గెలిచిన కొండా మురళి తెరాస నుంచి కాంగ్రెస్‌లో చేరడంపై అధికారపార్టీ నేతలు.. మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేయగా ఆయన పదవికి రాజీనామా చేశారు. దీంతో మొత్తం నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ముగ్గురిని అనర్హులుగా ప్రకటిస్తే మొత్తం ఖాళీల సంఖ్య ఏడుకు చేరుతుంది. వచ్చే మార్చిలో మరో 9 మంది పదవీ విరమణ చేయనున్నారు. దీంతో మొత్తం ఖాళీల సంఖ్య 16కు చేరుతుంది.

విపక్ష నేత లేకుండానే...

ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు సభ్యులు ఆ పార్టీ శాసనమండలి పక్షాన్ని తెరాసలో విలీనం చేయగా, దీనిని మండలి ఛైర్మన్ ఆమోదించారు. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్‌కు మండలిలో ఇద్దరు సభ్యులే ఉన్నారు. విపక్ష హోదాకు నలుగురు సభ్యులు అవసరం కాగా వారు లేరనే కారణంతో షబ్బీర్‌అలీకి విపక్ష హోదాను రద్దు చేశారు. షబ్బీర్‌అలీ, మరో సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులుగా కొనసాగుతారు. ఈ నెల 17న జరిగే విందుకు వారు సాధారణ సభ్యులుగా హాజరవుతారు. 18న జరిగే శాసనమండలి బీఏసీ సమావేశానికి, 19న జరిగే ఉభయ సభల సమావేశానికి సైతం వారు సాధారణ సభ్యులుగానే వస్తారు.

ఉత్తమ్‌కు దక్కునో.. భట్టికి చిక్కునో!

- రేపు సీఎల్పీ నేత ఎన్నిక
- ఏఐసీసీ పరిశీలకుడిగా కేసీ వేణుగోపాల్
- నేడు శాసనసభ్యులతో సమాలోచనలు
- ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న అధిష్ఠానం



ఈనాడు – హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ నెల 17 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. సీఎల్పీ సమావేశానికి కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పరిశీలకుడిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ హాజరుకానున్నారు. సీఎల్పీ పదవి కోసం ప్రధానంగా ఇద్దరు నేతలపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రచార కమిటీ ఛైర్మన్ మల్లు భట్టివిక్రమార్కలో ఒకరు సీఎల్పీ నేతగా ఎన్నికయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉత్తమ్ పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతుండటంతోపాటు రానున్న లోక్‌సభ ఎన్నికల బాధ్యతల నేపథ్యంలో మల్లు భట్టి విక్రమార్కవైపు కాంగ్రెస్ నాయకత్వం దృష్టిసారిస్తోందని సమాచారం. ఎస్సీ వర్గానికి చెందిన భట్టివిక్రమార్క గతంలో విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ఉండటం అదనపు అర్హతగా భావిస్తున్నారు. శాసనసభకు ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఐదుగురు ఎస్టీలు కాగా ఇద్దరు ఎస్సీలు ఉన్నారు. బలహీనవర్గాలకు సీఎల్పీ పదవిని కేటాయించడం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి కొంతమేర దోహదపడే అంశంగా భావిస్తున్నారు. ఈ విషయంపై అధిష్ఠానంలో ముఖ్యులు కూడా ఆసక్తిగా ఉన్నట్లు పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట్రమణారెడ్డి, తూర్పు జయప్రకాశ్‌రెడ్డిలు కూడా తమకు సీఎల్పీ బాధ్యతలు అప్పగించాలని కోరడంతో పాటు అవకాశం ఇస్తే సమర్థంగా నిర్వహిస్తామని తెలిపారు. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్సీ, తొలిసారిగా శాసనసభకు ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా సీఎల్పీ పదవిపై ఆసక్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19 స్థానాలను దక్కించుకుంది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రచార కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్కలతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వనమా వెంకటేశ్వరరావులు సీనియర్లు. మిగిలిన వారిలో ఆరుగురు తొలిసారి శాసనసభకు ఎన్నికైన వారు కాగా ఎనిమిది మంది రెండు, అంతకంటే ఎక్కువ సార్లు ఎన్నికైనవారు ఉన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చేరుకునే కేసీ వేణుగోపాల్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో సమావేశం కానున్నారని సమాచారం.

వివాదాలకు తావులేకుండా చేయాలనే..

సీఎల్పీ నేత ఎన్నిక అధిష్ఠానానికి కూడా సమస్యాత్మకంగానే ఉన్నట్లు సమాచారం. మండలిలో కాంగ్రెస్ ప్రతిపక్షహోదా కోల్పోవడంతో సీఎల్పీపై ప్రత్యేక దృష్టిసారించారు. పలువురు పోటీపడుతున్న నేపథ్యంలో వివాదాలకు తావులేకుండా సీఎల్పీ నేత ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని భావించిన కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టిసారించింది. అందుకే సీఎల్పీ ఎన్నికకు ముందు రోజే మంగళవారం ఏఐసీసీ పరిశీలకుడిగా కె.సి.వేణుగోపాల్ హైదరాబాద్‌కు రానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా ఆ పార్టీ నేత ఆర్.సి.కుంతియా ఉన్నప్పటికీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి ఈ బాధ్యతలు అప్పగించడంపై పార్టీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల సందర్భంగా పూర్తిగా ఆర్.సి. కుంతియా ఆధ్వర్యంలో ముందుకు వెళ్లిన కాంగ్రెస్ సీఎల్పీ అంశంలో మాత్రం ప్రత్యేకంగా వ్యవహరిస్తోంది. పార్టీ టికెట్ల అంశంలో కొందరు కాంగ్రెస్ నేతలు కుంతియాపై విమర్శలు చేయడం, ఆయన నాయకత్వాన్ని ప్రశ్నించడం వంటి పరిస్థితుల నేపథ్యంలోనే కె.సి. వేణుగోపాల్‌కు ఈ బాధ్యత అప్పగించినట్లు పార్టీ ముఖ్యనేతలు పేర్కొన్నారు.

తైవాన్‌కు జలాంతర్గామి పరిజ్ఞానాన్ని ఇవ్వొద్దు

- ప్రపంచ దేశాలకు చైనా సూచన
- భారత కంపెనీ సహా ఆరు సంస్థలు డిజైన్లు ఇచ్చినట్లు వార్తలు

బీజింగ్: తైవాన్‌కు ఏ దేశమూ జలాంతర్గాముల తయారీ పరిజ్ఞానాన్ని అందించరాదని చైనా స్పష్టంచేసింది. తమతో స్నేహ సంబంధాలున్న దేశాలు 'ఒకే చైనా' సిద్ధాంతానికి కట్టుబడాలని కోరింది. తైవాన్‌తో ఎలాంటి సైనిక బంధాన్నీ కొనసాగించరాదంది. సొంతంగా జలాంతర్గాములు తయారు చేసుకోవడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తైవాన్‌కు ఇవ్వడానికి అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపినట్లు తైవాన్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీని ప్రకారం.. భారత్‌కు చెందిన ఒక సంస్థ సహా ఆరు విదేశీ కంపెనీలు జలాంతర్గాముల డిజైన్ ప్రతిపాదనలను సమర్పించాయి. వీటిపై తైవాన్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చిలో ప్రకటించే అవకాశం ఉంది. ఈ వార్తలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ సోమవారం స్పందించారు. "తైవాన్‌తో ఏ దేశమూ సైనిక సంబంధాలను ఏర్పాటు చేసుకోరాదు. దీనిపై చైనా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. అమెరికా తదితర దేశాలు ఈ అంశంలోని సున్నితత్వాన్ని, ప్రమాదాన్ని గుర్తించాలి" అని పేర్కొన్నారు.

తైవాన్ 1949లో చైనా నుంచి విడిపోయింది. ఈ వేరు కుంపటిని చైనా అంగీకరించడంలేదు. తైవాన్ తమ అంతర్భాగమేనని చెబుతోంది. ఏ దేశమూ తైవాన్‌తో దౌత్య సంబంధాలు పెట్టుకోరాదంటోంది.

ప్రాంతీయ వలయానికి ప్రాధాన్యం

- ఉత్తర-దక్షిణాది అనుసంధానానికి ప్రాంతీయ వలయ రహదారే ఆధారం
- అనుమతుల కోసం కేంద్రానికి సీఎం లేఖ
- భూసేకరణ కోసం రెండు ప్రత్యేక బృందాలు
- రింగు రోడ్డు అలైన్‌మెంట్ నివేదిక సిద్ధం

ఈనాడు – హైదరాబాద్

భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదించిన ప్రాంతీయ వలయ రహదారి (రీజనల్ రింగ్ రోడ్డు) నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ రహదారి నిర్మాణానికి భూసేకరణ కసరత్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది. భూసేకరణ కోసం రెండు ప్రత్యేక బృందాలను నియమించాలని రహదారులు- భవనాల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 334 కిలోమీటర్లతో రెండు భాగాలుగా రీజనల్ రింగ్ రోడ్ నిర్మించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ మార్గాన్ని ఎక్స్‌ప్రెస్ వేగా నిర్మించనున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద ఎక్స్‌ప్రెస్ వేగా నమోదవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పదివేల ఎకరాలు అవసరం

ప్రాంతీయ రింగు రోడ్డును పూర్తిగా నూతన మార్గంగా నిర్మించనున్నారు. చెరువులు, అడవులపై ఎలాంటి ప్రభావం లేకుండా అలైన్‌మెంట్ రూపొందించారు. ఈ మార్గం నిర్మాణానికి సుమారు పదివేల ఎకరాలకు పైగా భూమి సేకరించాల్సి ఉంది. రహదారులు- భవనాల శాఖలో ప్రస్తుతం ఉన్న భూసేకరణ విభాగంతో సంబంధం లేకుండా రెండు ప్రత్యేక బృందాలను నియమించాలని ఆ శాఖాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. భూసేకరణకు రూ. మూడు వేల కోట్ల నుంచి రూ. నాలుగు వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించనున్నాయి.

కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులను వేగవంతం చేయాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రెండో దఫా ఇటీవల లేఖ రాశారు. సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్- గజ్వేల్- జగ్‌దేవ్‌పూర్- భువనగిరి- చౌటుప్పల్ వరకు 154 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గానికి కేంద్రం జాతీయ రహదారి నంబరును కేటాయించింది. చౌటుప్పల్- షాద్‌నగర్- కంది వరకు 180 కిలోమీటర్లు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మౌఖిక అనుమతి లభించింది. ఈ నెల చివరి వారంలోగా అధికారిక అనుమతి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

అవుటర్ నగర అవసరాలకే

జాతీయ రహదారి ట్రాఫిక్ అవసరాల్లో కీలక భూమిక పోషిస్తున్న అవుటర్ రింగు రోడ్డు రానున్న రోజుల్లో నగర అవసరాలకే పరిమితమవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. శివార్లు విస్తరిస్తుండడంతో అవుటర్ రింగు రోడ్డు చుట్టూ ఇప్పటికే నివాస సముదాయాలు వస్తున్నాయి. రానున్న రోజుల్లో అవి మరింతగా విస్తరిస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జాతీయ రహదారుల ట్రాఫిక్‌ను అవుటర్ రింగు రోడ్డుపై అనుమతిస్తున్నారు. నగర విస్తరణ పెరిగే కొద్దీ ట్రాఫిక్ మరింత పెరుగుతుంది. దీంతో భవిష్యత్తులో అవుటర్‌ను నగర అవసరాలకు వాడుకోవాల్సి వస్తుంది. అప్పుడు జాతీయ రహదారి ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో ప్రాంతీయ రింగ్ రోడ్డుకు మళ్లించాలన్నది ప్రభుత్వ వ్యూహం. ప్రస్తుతం శ్రీనగర్ నుంచి కన్యాకుమారి, విజయవాడ నుంచి పుణె వెళ్లే ఉత్తర-దక్షిణ భారత అనుసంధాన జాతీయ రహదారి హైదరాబాద్ మీదుగా వెళుతుంది. హైదరాబాద్ నగరంలోని జాతీయ రహదారులన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఫలితంగా జాతీయ రహదారుల మధ్య అనుసంధానత (కనెక్టివిటీ) కొరవడింది. దీన్ని పునరుద్ధరించేందుకు ప్రాంతీయ రింగ్ రోడ్డు ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రజెంటేషన్ ఇవ్వటంతో కేంద్రం అంగీకరించినట్లు ఉన్నతాధికారి ఒకరు సోమవారం 'ఈనాడు'తో చెప్పారు. భూసేకరణ చేసి ప్రాంతీయ వలయ రహదారిని నిర్మించడానికి కనీసం అయిదారు సంవత్సరాలు పడుతుందని అంచనా వేస్తున్నారు.

కైలీ రికార్డు కొల్లగొట్టిన గుడ్డు



ఇన్‌స్టాగ్రామ్ యువ రాణి కైలీ జెన్నర్. ఈ హాలీవుడ్ భామ ఫొటో పెడితే చాలు.. లైకుల పంటే. గత ఏడాది ఫిబ్రవరిలో తన కుమార్తె చిత్రాన్ని కైలీ పోస్ట్‌చేశారు. దీనికి 18 మిలియన్లకుపైగా లైకులు వచ్చాయి. అత్యధికులు మెచ్చిన చిత్రంగా ఇది చరిత్ర సృష్టించింది. అయితే ఈ రికార్డును తాజాగా ఓ కోడి గుడ్డు బద్దలు కొట్టింది. ముదురు గోధుమ వర్ణంలో కనిపిస్తున్న ఈ గుడ్డును 'ఎగ్ గ్యాంగ్' పేరుతో ఉన్న ఖాతా నుంచి పోస్ట్‌చేశారు. దీనికి 18.2 మిలియన్ల లైకులు వచ్చాయి.

సెన్సెక్స్ ▼ 156 **35854** | నిఫ్టీ ▼ 57 **10738** | డోజోన్స్ 23935 ▼ 61 | నాస్‌డాక్ 6929 ▼ 43 | రూపాయి 70.92 ▼ 43 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 59.81 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


ఈనాడు బిజినెస్

ఘనం (+) నిఫ్టీ	14న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	14న	మార్పు%
YES BANK	195.35	6.02	WIPRO	312.55	-4.91
INFOSYS	701.90	2.69	GAIL (INDIA)	324.90	-4.05
SUN PHARMA	450.85	1.45	INDIABULLS HSG	790.95	-3.09
BAJAJ FINANCE	2544.80	1.22	TECH MAHINDRA	679.85	-2.77
MARUTI SUZUKI	7408.70	1.20	L&T	1333.90	-2.61
TATA MOTORS	182.40	1.16	INDUSIND BANK	1484.05	-2.05
BHARTI INFRATEL	280.10	1.05	VEDANTA	193.05	-1.81

విదేశీ మారకపు రేట్లు (థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.15	74.38	బహ్రెయిన్ దీనార్	173.63	198.66
పౌండ్ స్టెర్లింగ్	82.37	95.52	కువైట్ దీనార్	192.57	239.72
యూరో	73.56	85.30	ఒమన్ రియాల్	169.90	194.63
జపనీస్ యెన్/100	59.33	68.81	సౌదీ రియాల్	17.05	20.21
ఆస్ట్రేలియా డాలరు	46.08	53.32	యూఏఈ దిర్హమ్	17.45	20.40
సింగపూర్ డాలరు	47.39	56.12	మలేషియా రింగిట్	15.32	18.85
థాయ్ బాత్/100	200.92	240.29	చైనీస్ యువాన్	7.38	11.97



వాహన పరుగుకు ఈ ఏడాది బ్రేకులే

• 8 శాతం వృద్ధి అంచనాలు అందుకోలేకపోవచ్చు • జనవరి-మార్చిలో రాణించొచ్చు • విక్రయాలపై సియామ్

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ప్రయాణికుల వాహనాల విభాగం వృద్ధి అంచనా(8%)లను అందుకోలేకపోవచ్చని భారత వాహన తయారీదార్ల సంఘం(సియామ్) అంటోంది. ఏప్రిల్-డిసెంబరులో ఈ విభాగ విక్రయాలు 4.4 శాతం మాత్రమే పెరిగాయి. నవంబరు, డిసెంబరులలో విక్రయాలు పెరుగుతాయని అంచనా వేసినా.. అందుకు భిన్నంగా, బలహీనంగా నమోదయ్యాయి. కొద్ది నెలలుగా ఇంధన ధరలు పెరగడం, బీమా వ్యయాల్లో పెరుగుదల, నిధుల కొరత వంటివి వినియోగదారు సెంటిమెంటును దెబ్బతీశాయి. అయితే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో ద్రవ్యలభ్యత సంక్షోభం ఉన్నా.. జనవరి-మార్చిలో ప్రయాణికుల వాహన అమ్మకాలు రాణిస్తాయని సియామ్ అంచనా వేస్తోంది. కొత్త ఏడాది, కొత్త మోడళ్ల కోసం కొనుగోళ్లను వాయిదా వేసిన వారంతా, ఇపుడు తిరిగి షోరూములకు వస్తారని సియామ్ అధ్యక్షుడు రాజన్ వదేరా సోమవారమిక్కడ జరిగిన విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలూ..

ద్విచక్ర వాహనాల అమ్మకాలూ పెరుగుతాయని రాజన్ పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నుంచి అమలు కానున్న నూతన భద్రతా ప్రమాణాల కారణంగా ధరలు పెరగవచ్చని, అందువల్ల విక్రయాల్లో వృద్ధిపై కొంత ప్రభావం పడుతుందని తెలిపారు. గ్రామీణ విక్రయాలు అధికమై,



ద్విచక్ర వాహనాలకు సానుకూలంగా పనిచేస్తాయని సియామ్ డైరెక్టర్ జనరల్ విష్ణు మాథుర్ పేర్కొన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం మొదలయ్యే వరకు లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంక్షోభం తగ్గేంత వరకు వాణిజ్య వాహన విభాగం స్తబ్దుగా కనిపించవచ్చని సియామ్ డిప్యూటీ జనరల్ సుగతో సేన్ పేర్కొన్నారు.

మొత్తం మీద వాహన పరిశ్రమ అక్టోబరు-డిసెంబరులో తీవ్ర ఒత్తిడినైతే ఎదుర్కొంది. ఇంధన ధరలు తగ్గడం, ఉక్కు వంటి కమొడిటీ ధరలు చల్లారడం వంటివి రాబోయే నెలలకు కలిసొచ్చే అంశాలని సియామ్ అంటోంది. ప్రయాణికుల, వాణిజ్య వాహనాలపై తక్కువ పన్ను రేటు వృద్ధికి ఊతమిస్తుందని అంచనా వేస్తోంది.

డిసెంబరులో దిగాలు

అయిదో నెలా తగ్గిన ప్యాసింజరు వాహనాల విక్రయాలు

దిల్లీ: దేశీయంగా ప్రయాణికుల వాహనాల(పీవీ) విక్రయాలు 2018 డిసెంబరులో క్షీణించాయి. గత ఆరు నెలల్లో అయిదో సారి అమ్మకాలు తగ్గడం గమనార్హం. డీలర్ల వద్ద పండుగ సీజను నిల్వలే ఇంకా ఉండడంతో, ప్లాంట్ల నుంచి వారికి తక్కువ సంఖ్యలోనే కొత్త వాహనాలు పంపిణీ అవుతున్నాయి. సియామ్ తాజా గణాంకాల ప్రకారం.. గత డిసెంబరులో 2,38,692 పీవీలు అమ్ముడుపోగా.. 2017డిసెంబరులో ఇవి 2,39,723గా ఉన్నాయి. దేశీయంగా కార్ల విక్రయాలు సైతం 2% తగ్గి 1,55,159కి పరిమితమయ్యాయి. నవంబరు, సెప్టెంబరు, ఆగస్టు, జులైలలో పీవీ విక్రయాలు వరుసగా 3.43%, 5.61%, 2.46%, 2.71% చొప్పున తగ్గాయి.

మింత్రా సీఈఓ నిష్క్రమణ

దిల్లీ: ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) బాధ్యతల నుంచి అనంత్ నారాయణ్ తప్పుకున్నారని ఫ్యాషన్ ఇ-టైలర్ సంస్థ మింత్రా వెల్లడించింది. మాతృ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లో మార్పుల నేపథ్యంలో ఈయన నిష్క్రమణపై గత 8 నెలలుగా వస్తున్న ఊహాగానాలకు దీంతో తెరపడింది. మింత్రా, జబాంగ్ సీఈఓ బాధ్యతల నుంచి వైదొలగాలని నారాయణ్ నిర్ణయించుకున్నారని మింత్రా ఒక ప్రకటనలో పేర్కొంది. మింత్రా, జబాంగ్‌ల బాధ్యతలను అమర్ నగారమ్ తీసుకుంటారని, ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తారని ఆ ప్రకటన వివరించింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ అప్పటి సీఈఓ బిన్నీ బన్సల్ వైదొలగినపుడే నారాయణ్ కూడా నిష్క్రమిస్తారన్న వార్తలు వచ్చాయి. కాగా, నారాయణ్ కంటెంట్ స్ట్రీమింగ్ సంస్థ అయిన హాట్‌స్టార్‌లోకి వెళతారన్న వార్తలు వచ్చినా.. ఇంకా స్పష్టత లేదు. ఫ్లిప్‌కార్ట్ నుంచి మింత్రాలోకి ఇటీవలే వచ్చిన అమర్‌కు గ్రూప్‌తో ఏడేళ్ల అనుబంధం ఉంది.


మార్కెట్ కబుర్లు

- తెలంగాణాలో సోలార్ ఫొటోఓల్టాయిక్(ఎస్‌పీవీ) విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ నుంచి రూ.565 కోట్ల విలువైన ఆర్డరు దక్కించుకున్నట్లు **భెల్** వెల్లడించింది. ఈ ప్లాంట్లను రామగుండం(50 మె.వా.), ఇల్లెందు(39 మె.వా.), మణుగూరు(30 మె.వా.), పెగడపల్లి(10 మె.వా.)లలో ఈపీసీ పద్ధతిన నెలకొల్పుతారు.
- నిబంధనలను పాటించని కారణంగా **బజాజ్ ఫైనాన్స్** లిమిటెడ్‌పై రూ. కోటి అపరాధ రుసుము విధించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) పేర్కొంది.
- ఎస్‌బీఐ మాజీ ఎండీ బి. శ్రీరామ్, మేనేజ్‌మెంట్ కన్సలెంట్ రమా బిజాపుర్కార్‌లను స్వతంత్ర డైరెక్టర్లుగా నియమించుకున్నట్లు **ఐసీఐసీఐ బ్యాంక్** తెలిపింది. వీరిద్దరు అయిదేళ్ల పాటు ఈ బాధ్యతల్లో ఉంటారు. కాగా, వీరి నియామకానికి వాటాదార్ల అనుమతి లభించాల్సి ఉంది.

నేటి బోర్డు సమావేశాలు

★ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ★ టీవీ18 బ్రాడ్‌కాస్ట్ ★ డెన్ నెట్‌వర్క్స్ ★ నెట్‌వర్క్ 18 ★ ఎంసీఎక్స్ ★ కేపీఐటీ టెక్నాలజీస్ ★ ట్రైడెంట్

14న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	433	వరంగల్	435
చిల్లరగా(ఒక గుడ్డు)	4.95	విశాఖపట్నం	445
బెంగళూరు	445	చెన్నై	450
15వ తేదీకి		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	443	నమక్కల్	435

ప్రభుత్వ వాటా 52 శాతానికి తగ్గించండి

• ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచన

దిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీలు) ప్రభుత్వ వాటా పరిమితిని క్రమక్రమంగా 52 శాతానికి తగ్గించాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. అత్యుత్తమ కార్పొరేట్ ప్రమాణాలకు తగ్గట్లు నడుచుకునేందుకే ఇలా చేయాలని బ్యాంకులకు సూచించింది. 'మార్కెట్ పరిస్థితులు అనుకూలించినప్పుడు బ్యాంకులు ఈ దిశగా నిర్ణయాలు తీసుకోవాలి. ఈ విషయంలో వాటికి అన్ని రకాల అనుమతులు ఉన్నాయ'ని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ చెప్పారు. ఒక కంపెనీలో కనీసం 25 శాతం వాటా ప్రజల వద్ద ఉండాలన్న సెబీ నిబంధనను తృప్తిపర్చాలంటే పీఎస్‌బీల్లో ప్రభుత్వ వాటా తగ్గాల్సిన అవసరం ఉంది. కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వానికి 75 శాతానికి మించి వాటా ఉండటం గమనార్హం. కాగా.. ఇప్పటికే ఎస్‌బీఐలో ప్రభుత్వ వాటా తగ్గింపు దిశగా అడుగులు పడుతున్నాయి. క్యూఐపీ పద్ధతిలో రూ.20,000 కోట్ల విలువైన షేర్ల విక్రయించే ప్రక్రియను ఎస్‌బీఐ ప్రారంభించింది. ఈ క్యూఐపీ అనంతరం ఎస్‌బీఐలో ప్రభుత్వ వాటా 58.53 శాతానికి దిగివస్తుంది. షేర్ల విక్రయ ప్రతిపాదనకు బ్యాంకు వాటాదార్లు గత నెలలోనే ఆమోదముద్ర వేశారు. ఎస్‌బీఐనే కాకుండా మరికొన్ని బ్యాంకులు కూడా షేర్ల విక్రయం లేదా ఇతర మార్గాల ద్వారా నిధుల సమీకరించే యోచనలో ఉన్నాయి. ఇందుకు మార్కెట్లో అనువైన పరిస్థితి కోసం ఎదురుచూస్తున్నాయి. సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ లాంటి కొన్ని పీఎస్‌బీలు ఎంప్లాయిస్ షేర్ పర్చేజ్ స్కీమ్ (ఈఎస్‌పీఎస్) ఇష్యూను కూడా ప్రారంభించాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ) ఏకీకరణ ప్రక్రియను కూడా ఇప్పటికే ప్రభుత్వం ప్రారంభించిందని రాజీవ్ కుమార్ చెప్పారు.

34 శాతం తగ్గిన ఐసెక్ లాభం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐసీఐసీఐ గ్రూప్ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీస్ (ఐసెక్) ఏకీకృత ప్రాతిపదికన రూ.101.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2017-18 ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.153.9 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 34 శాతం తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.493.8 కోట్ల నుంచి రూ.404.7 కోట్లకు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ల ఒడుదొడుకులు, ఎన్‌బీఎఫ్‌సీ నగదు లభ్యత సమస్యలు, ఐపీఓ విపణి నిరాశజనకంగా ఉండటం, నియంత్రణపరమైన ఇబ్బందుల వంటివి వ్యాపార సెంటిమెంట్, పనితీరుపై ప్రభావం చూపాయని కంపెనీ తెలిపింది. బీఎస్‌ఈలో షేరు 1.32 శాతం నష్టంతో రూ.276.05 వద్ద ముగిసింది.

టాటా మెటాలిక్స్ నికరలాభం రూ.39.63 కోట్లు

దిల్లీ: డిసెంబరు త్రైమాసికంలో రూ.39.63 కోట్ల నికరలాభాన్ని టాటా మెటాలిక్స్ నమోదు చేసింది. 2017-18 ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.40.35 కోట్లతో పోలిస్తే ఇది 1.78 శాతం తక్కువ. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.490 కోట్ల నుంచి రూ.547.63 కోట్లకు పెరిగింది. టాటా స్టీల్ అనుబంధ అయిన టాటా మెటాలిక్స్ పిగ్ ఐరన్ తయారు చేస్తుంది.

18 నెలల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

• డిసెంబరులో 2.19 శాతానికి • రేట్ల కోతపై పరిశ్రమ ఆశాభావం

దిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ఠానికి పరిమితమైంది. పళ్లు, కూరగాయలు, ఇంధనం ధరలు తగ్గడంతో 2018 డిసెంబరులో 2.19 శాతానికి చేరింది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గత నవంబరులో 2.33 శాతంగా ఉండగా.. 2017 డిసెంబరులో 5.21 శాతం కావడం గమనార్హం. అంతక్రితం కనిష్ఠస్థాయి ద్రవ్యోల్బణం 2017 జూన్‌లో 1.46 శాతంగా ఉంది.

- ఆహార ద్రవ్యోల్బణం నవంబరులో -2.61 శాతంగా నమోదు కాగా.. డిసెంబరులో -2.51 శాతానికి చేరింది. కూరగాయలు, పళ్లు, ప్రోటీను అధికంగా లభించే గుడ్లు వంటి వాటి ధరలు తగ్గుతూ వచ్చాయి. అయితే మాంసం, చేపలు, పప్పు ధాన్యాల ధరలు కాస్తంత పెరిగాయి.
- నవంబరులో ఇంధన ద్రవ్యోల్బణం 7.39 శాతంగా ఉండగా.. డిసెంబరులో 4.54 శాతానికి తగ్గింది. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు నేపథ్యం.

వడ్డీరేట్లు తగ్గించాలి: పరిశ్రమల సంఘాలు

రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతంలోపు ఉంచాలన్నది ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన లక్ష్యం. తాజా పరిస్థితుల్లో రానున్న ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో కొత్త గవర్నర్ శక్తికాంత దాస్ ఆధ్వర్యంలోని ఆర్‌బీఐ కీలక రేట్లను తగ్గిస్తుందని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. 'ఆర్‌బీఐ మధ్యకాల లక్ష్యం పరిధిలోనే ద్రవ్యోల్బణం ఉన్నందున ఆర్‌బీఐ తన ధోరణిని సడలించి పెట్టుబడులకు ఊతమివ్వాలి. పరిశ్రమకు రుణ వ్యయాలను తగ్గించి, వృద్ధికి ఊతమివ్వాల'ని పరిశ్రమల సంఘం సీఐఐ పేర్కొంది.



ఆర్‌బీఐ తన విధాన ధోరణిని సడలిస్తుందనే ఆశాభావాన్ని అసోచామ్ కూడా వ్యక్తం చేసింది. తయారీ రంగం దిగాలు పడడంతో నవంబరులో పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) 17 నెలల కనిష్ఠమైన 0.5 శాతానికి చేరిన సంగతి తెలిసిందే. డిసెంబరు పరపతి విధాన సమీక్షలో కీలక రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ.. ద్రవ్యోల్బణం పెరగదన్న సంకేతాలు కనిపిస్తే రేట్లను తగ్గిస్తామని ఆర్‌బీఐ హామీనిచ్చిన సంగతి విదితమే. కాగా, మున్ముందు కూడా అంటే వచ్చే త్రైమాసికంలోనూ ద్రవ్యోల్బణం 3.5-3.7 శాతం పరిధిలోనే ఉండొచ్చని యెస్ బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త శుభదా రావు అభిప్రాయపడ్డారు.

8 నెలల కనిష్ఠానికి డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం

వరుసగా రెండో నెలా టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం కిందకు దిగివచ్చింది. ఇంధనం, కూరగాయల ధరలు చౌక కావడంతో డిసెంబరు 2018లో 3.8 శాతానికి చేరింది. ఇది 8 నెలల కనిష్ఠం. నవంబరు 2018లో ఇది 4.64 శాతం; డిసెంబరు 2017లో 3.58 శాతంగా ఉంది. ఆహార వస్తువుల ప్రతిద్రవ్యోల్బణం డిసెంబరు 2018లో 0.07 శాతానికి చేరింది. 2018 నవంబరులో ఇది 3.31 శాతంగా నమోదు కావడం గమనార్హం. ఇదే సమయంలో కూరగాయల ప్రతి ద్రవ్యోల్బణం కూడా 26.98 శాతం నుంచి 17.55 శాతానికి చేరింది. ఆరు నెలలుగా కూరగాయల ధరలు తగ్గుతూనే ఉన్నాయి. ఉల్లి ధరలు డిసెంబరులో 63.83 శాతం క్షీణించాయి. నవంబరులో ఇవి 47.6 శాతం తగ్గాయి.

ఐఐపీ రుచించలేదు

• సెన్సెక్స్‌కు 156 పాయింట్ల నష్టం • తోడైన అంతర్జాతీయ సంకేతాలు

సమీక్ష

సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలు నిరాశపరచడం, బలహీన ఆసియా సంకేతాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 43 పైసలు కోల్పోయి 70.92 వద్ద ముగిసింది. చైనా ఎగుమతులు, దిగుమతులు తగ్గడంతో మందగమన భయాలు పెరిగాయి. జపాన్ మినహా ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా మార్కెట్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,113.27 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. అయితే వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 35,691.75 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సెన్సెక్స్.. చివరకు 156.28 పాయింట్ల నష్టంతో 35,853.56 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 57.35 పాయింట్లు కోల్పోయి 10,737.60 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,692.35-10,808 పాయింట్ల మధ్య కదలాడింది.

డి-మార్ట్ షేరు ధమాల్: డి-మార్ట్ విక్రయశాలలను నిర్వహించే అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేరు బాగా నష్టపోయింది. డిసెంబరు త్రైమాసికంలో నికరలాభం 2.1 శాతానికి పరిమితమై మదుపర్లను మెప్పించకపోవడమే ఇందుకు నేపథ్యం. ఇంట్రాడేలో 11.65 శాతం కోల్పోయి రూ.1386.05 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 11.04 శాతం నష్టంతో రూ.1,395.75 వద్ద ముగిసింది.

- ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేర్లు రాణించాయి. షేర్ల బైబ్యాక్, ఆదాయ వృద్ధి అంచనాలు ప్రకటించడం కలిసొచ్చింది. ఒకానొకదశలో 3.70 శాతం పెరిగిన షేరు.. రూ.709 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2.52 శాతం లాభంతో రూ.700.90 దగ్గర స్థిరపడింది.
- కంపెనీ పునరుద్ధరణ ప్రణాళిక ఖరారయ్యే అవకాశం ఉందన్న వార్తలతో జెట్ ఎయిర్‌వేస్ షేరు 16.13 శాతం దూసుకెళ్లి రూ.294.40 వద్ద ముగిసింది.
- తదుపరి ఎండీ, సీఈఓగా రజత్ మోంగా లేదా ఒక విదేశీ బ్యాంక్ సీఈఓ ఎంపిక కావొచ్చన్న వార్తల నేపథ్యంలో యెస్ బ్యాంక్ షేరు 6.22 శాతం లాభంతో రూ.195.40 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.2,703.63 కోట్లు పెరిగి రూ.45,182.63 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు చవిచూశాయి. ఎల్ అండ్ టీ 2.64%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2.07%, వేదాంతా 1.78%, ఎన్‌టీపీసీ 1.56%, టీసీఎస్ 1.50%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.36%, హీరో మోటోకార్ప్ 1.14%, యాక్సిస్ బ్యాంక్ 1.07%, ఏషియన్ పెయింట్స్ 0.98%, పవర్‌గ్రిడ్ 0.93% చొప్పున డీలాపడ్డాయి. యెస్ బ్యాంక్ 6.22%, సన్‌ఫార్మా 1.68%, బజాజ్ ఫైనాన్స్ 1.18%, మారుతీ 1.13%, టాటా మోటార్స్ 1.11%లు రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో యంత్రపరికరాలు అత్యధికంగా 1.93% కుదేలైంది. బ్యాంకింగ్, లోహ, ఫైనాన్స్, చమురు- గ్యాస్, పీఎస్‌యూ షేర్లు అదే బాటలో నడిచాయి. ఐటీ స్క్రిప్‌లు మాత్రం స్వల్పంగా రాణించాయి. బీఎస్‌ఈలో 1508 షేర్లు ప్రతికూలంగా, 1014 స్క్రిప్‌లు సానుకూలంగాను ముగిశాయి. 192 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

ఎన్‌ఎస్‌ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 374.45 (377.15) 927301
ASIAN PAINTS 1388.60 (1403.65) 1360800
AXIS BANK LT 659.20 (666.50) 6856244
BAJAJ AUTO L 2699.15 (2720.95) 170937
BAJAJ FINANC 2544.80 (2514.20) 1021504
BAJAJ FINSER 6368.80 (6371.65) 152409
BHARTI AIRTE 331.60 (335.10) 3311854
BHARTI INFRA 280.10 (277.20) 6223594
BPCL 334.95 (337.30) 3758311
CIPLA 511.95 (510.20) 1472415
COAL INDIA L 230.90 (232.25) 2273231
DR. REDDYS 2578.80 (2588.15) 394478
EICHER MOTOR 20480.40 (20507.60) 70121
GAIL 324.90 (338.60) 7970272
GRASIM IND 813.70 (814.25) 734030
HCL TECH 937.20 (940.05) 978404
HDFC 1969.20 (1991.40) 2167796
HDFC BANK 2101.65 (2111.90) 1213790
HERO MOTOCOR 2867.00 (2899.25) 267722
HINDALCO IND 206.15 (205.85) 5204874
HINDUSTAN UN 1763.90 (1769.40) 1018068
HPCL 233.95 (233.50) 2642085
ICICI BANK 373.35 (378.55) 14844029
INDIABULLS H 790.95 (816.15) 2734257
INDIAN OIL 132.30 (131.20) 8986002
INDUSINDBANK 1484.05 (1515.15) 3615252
INFOSYS LTD 701.90 (683.50) 19312937
ITC 294.30 (295.35) 6400147
JSW STEEL LT 283.90 (288.80) 3756403
KOTAK MAHIND 1211.75 (1223.20) 1364695
LARSEN & TOU 1333.90 (1369.60) 3080984
M&M 724.55 (727.90) 1713221
MARUTI SUZIK 7408.70 (7320.50) 424152
NTPC LTD 145.55 (148.00) 4175566
ONGC 143.45 (144.65) 6028078
POWER GRID C 192.50 (194.35) 3020885
RELIANCE IND 1096.80 (1098.05) 4111782
SBI 300.40 (302.75) 10372933
SUN PHARMA 450.85 (444.40) 5784064
TATA CONSULT 1813.25 (1842.55) 3615370
TATA MOTORS 182.40 (180.30) 18935120
TATA STEEL L 470.85 (474.20) 5889917
TECH MAHINDR 679.85 (699.20) 1558602
TITAN IND 957.50 (959.30) 864306
ULTRATECH 3776.60 (3770.20) 198557
UPL LIMITED 770.40 (783.45) 1392118
VEDANTA LIMI 193.05 (196.60) 9059869
WIPRO 312.55 (328.70) 6913323
YES BANK LTD 195.35 (184.25) 98089778
ZEE ENTERTAI 448.10 (451.05) 2341591

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1307.35 (1345.60) 108921
ACC 1459.60 (1458.65) 326989
ADITYA BIRLA 96.10 (96.45) 662121
AMBUJA CEMEN 214.85 (212.85) 1231366
ASHOK LEYLAN 93.50 (94.30) 12855740
AUROBIND PHA 770.20 (769.85) 1789500
AVENUE SUPER 1397.40 (1571.65) 3662140
BANDHAN BANK 443.20 (454.40) 1802629
BANK OFBAROD 120.95 (121.15) 13655552
BEL 91.60 (92.05) 5311400
BHEL 67.80 (68.55) 4735962
BIOCON LTD 645.50 (642.50) 1857352
BOSCH LTD 19116.10 (19517.80) 18658
BRITANNIA 3113.65 (3096.85) 154975
CADILA HEALT 353.70 (348.30) 1672294
COLGATE PALM 1305.75 (1319.45) 385521
CONTAINER 682.30 (678.55) 1731024
DABUR INDIA 433.50 (421.65) 3145076
DLF LIMITED 181.15 (182.15) 3741265
GENERAL INS 258.15 (262.15) 25342
GODREJ CONSU 777.20 (778.95) 445680
HAVELLS INDI 688.55 (688.05) 515604
HDFC STAND L 392.05 (406.60) 976187
HINDUSTAN ZI 271.40 (273.50) 141400
ICICI LOMBAR 862.35 (885.00) 194925
IDEA CELLULR 35.95 (36.90) 10557786
INTERGLOBE A 1081.65 (1057.45) 568052
L&TFIN.HOLD 136.25 (141.50) 10750077
LIC HOUS.FIN 479.15 (484.10) 888839
LUPIN 834.75 (839.35) 922667
MARICO LIMIT 382.10 (381.45) 1027469
MCDOWELL 596.85 (591.60) 924828
MOTHERSON 161.75 (161.20) 1507439
MRF 66653.05 (66937.25) 5052
NHPC LTD 25.40 (25.50) 2220326
NMDC LTD 92.10 (92.20) 4137362
OIL INDIA 173.25 (174.55) 316687
ORACLE FIN S 3621.75 (3637.35) 8241
P&G HYG&HEAL 9999.30 (9998.50) 2723
PETRONET LNG 216.95 (216.70) 1639239
PIDILITE IND 1134.65 (1109.25) 1001695
PIRAMAL ENTE 2275.75 (2296.85) 276534
SAIL 50.55 (52.20) 11502355
SBI LIFE INS 620.10 (638.50) 366016
SHREE CEMENT 15496.55 (15913.20) 43144
SHRIRAM TRAN 1169.05 (1189.70) 553691
SIEMENS 1054.10 (1057.85) 311359
SUN TV LTD 579.00 (588.90) 853454
THE NEW INDI 180.05 (179.65) 28709

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 2.90 (2.80) 1875
ALPHAGEO 473.30 (464) 672
AMAR RAJA BA 762.45 (756.10) 22070
ANDHRA BANK 29.35 (29.50) 9380
ANDHRA CEMEN 5.89 (5.86) 5134
ANDHRA PAPER 443.90 (450.90) 3386
ANDHRA PETRO 63.80 (65.45) 118795
ANDHRA SUGAR 326.10 (328.50) 2156
ASTRA MICROW 83.55 (83.45) 24975
AUROBINDO PH 770.35 (769.80) 390091
AVANTEL SOFT 231.45 (231.05) 1784
AVANTI FEEDS 372.40 (376.20) 12908
AVON ORG 6.14 (6.45) 216
BALAJI AMIN 440.50 (441.90) 1147
BARTRONICS 7.29 (7.30) 9026
BHAGIRA CHEM 428.40 (427.10) 682
BHAGYA NAG 36 (34.95) 4156
BN RATHI SEC 28 (26.45) 20
BRILLIANT SE 1.08 (1.05) 54284
CAMBRIDGE TE 45.45 (43.90) 543
CIL SECURI 16.40 (17.70) 414
CONT COFFEE 266.55 (268.90) 68779
COROMAN FERT 454.90 (462.90) 3369
CUBEX TUB 13.45 (14.12) 69
CYBERMATE 2.05 (2.14) 26344
CYIENT LIMIT 602.75 (596) 26924
DECCAN CEMEN 385.50 (390.05) 11
DIVI'S LAB 1528.15 (1504.35) 31660
DIVYA GRANIT 85.50 (84.40) 9575
DR REDDY 2582.05 (2589.80) 15279
FOUR SOFT 39.15 (40.40) 526
GATI CORPN 81.95 (81.40) 45467
GAYATRI PROJ 172.85 (171.80) 4320
GMR INFRASTR 16.40 (16.70) 551103
GOLDEN CARPE 4.56 (4.56) 10
GOLDST INFRA 232.40 (227.35) 11932
GOLDSTONE EN 15.45 (15.65) 207
GRANULES (I) 87.85 (89.85) 21980
GSS AMERICA 131.25 (132.40) 15709
GVK POWER 7.55 (7.70) 77868
HBL NIFE POW 28.65 (28.30) 23174
HERITAGE FOO 523.90 (520.80) 128
HIL LTD 1978.10 (2003.05) 131
HIND FLUROCA 15 (15.65) 956
IDL INDUSTRS 271.65 (279) 373
ILFS ENGINEE 14.60 (14.60) 3780
INCAP 38 (40) 1325
IVRCL INFRAS 0.98 (0.99) 43455
JEEVAN SCIEN 36.50 (37.20) 351
KAKATIYA CEM 197.10 (195.95) 6538
KALLAM SPG 18.45 (18.65) 7116
KAVERI SEED 558.75 (557.40) 15486
KCP LTD 89.45 (89.85) 1256
KERNEX MICRO 25.60 (24.40) 1697
KNR CONSTRUC 214.90 (214.45) 5588
KREBS BIO 112.80 (110.35) 1013
LANCO INDUS 179.70 (179.20) 671
LAURUS LABS 374.60 (377.75) 5024
LOKESH MACH 44.35 (45.20) 1029
MADHUCON PRO 6.41 (6.63) 1920
MEDINOVA DIA 19.80 (19.80) 1000
MEGA SOFT 7.33 (7.39) 1816
MIC ELECTRON 1.06 (1.11) 16332
MOLD-TEK.TEC 43.50 (44) 120
MOLDTK PLA 264.90 (264.60) 2573
MSR INDIA LT 11.28 (11.77) 9559
NAGARJAGRICH 27.60 (27.90) 2646
NATCO PHARMA 684.20 (687.35) 3020
NAVA BH VENT 114.95 (115.15) 6627
NCC 88.80 (92.15) 815397
NCL IND 128.35 (129.25) 959
NEHA INTER 4.19 (4.20) 2151
NETTLINX 50.95 (51.80) 8062
NEULAND LAB 509.60 (510.75) 409
NIHAR INFO 14.50 (13.99) 160
NILE 373 (371.70) 576
NORTHGATE TE 0.77 (0.81) 23645
OIL COUNTRY 15.60 (15.70) 3158
PANYAM CEMEN 13.33 (13.30) 650
PENNER IND 38.80 (39.60) 11731
PHYTOCHEM I 40.85 (44.70) 408
PIONEER DIST 170 (166) 2177
PITTI LAMIN 63.15 (64.25) 12820
POKARNA 160.35 (156.35) 1148
PRAJAY ENGS 8.60 (8.52) 4122
PREMIER EXPL 238.70 (236.95) 1002
PRISM CEMENT 84.45 (86) 19498
PRUDENTL PHA 3.64 (3.61) 14215
RAASI REFRAC 13.11 (13.30) 984
RAIN INDUSTR 117.15 (116.75) 62853
RAM INFORMAT 40.85 (39.90) 7936
REG.CERAMIC 4.50 (4.29) 340
SAGAR CEM 646.65 (642.70) 118
SAMKRG PIST 190.45 (190.25) 1295
SATVAH. ISPA 9.20 (9.21) 301
SMS PHARMA 71.75 (72.15) 1690
SOUTH BIO TE 2.05 (2.05) 43
SREE RAYAL A 34.95 (35.15) 37516
SRI KPR INDU 17.25 (17.85) 1350
SRINIVASA SH 39.60 (41.20) 2008
STARCHIK SP 25.95 (24.80) 452
STEEL EXCHAN 14.50 (14.60) 38
SUJANA METAL 0.44 (0.42) 700
SUJANA TOWER 1.26 (1.20) 7004
SURANA TELE 4.65 (4.61) 6750
SURYALAKSH.C 42.60 (43) 2785
SURYALATA SP 127.25 (127.25) 50
SUVEN PHARMA 218.65 (224.40) 27233
TAJ GVK HOTE 180.15 (181.55) 1393
TANLA 28.90 (30.15) 33448
TERA SOFTWAR 49.30 (50.75) 4082
TRANS BIOTEK 4.48 (4.27) 15690
TRENDY KNIT 0.22 (0.21) 11300
VBC FERRO 39.25 (40.15) 10290
VICEROY HOTE 4.55 (4.75) 27515
VIJAY TEXTIL 42.85 (44.85) 5377
VIMTA LABS 294.10 (300.30) 6353
VISAKA IND 424.25 (439.25) 1982
VISTA PHARMA 28.90 (27.75) 9697
VIVIMED LABS 34.30 (34.50) 12144
VJIL CONSULT 41.90 (43.40) 3125
VST INDUS 3206.65 (3189.50) 369
YBRANT DIGIT 3 (3.32) 136989
ZENOTECH LAB 35.50 (35.30) 1266
ZENTECH 78.85 (75.85) 7077

ఏడాదిన్నరలో 10 లక్షల గదులే లక్ష్యం: ఓయో

కోల్‌కతా: ఆతిథ్య సేవల సంస్థ ఓయో హోటల్స్ అండ్ రూమ్స్ విస్తరణ యోచనలో ఉంది. ప్రస్తుతం సంస్థ ప్లాట్‌ఫామ్‌పై 4.6 లక్షల హోటల్ గదులు బుక్ చేసుకునే వీలుండగా, ఈ సంఖ్యను 10 లక్షలకు విస్తరించాలన్నది తమ లక్ష్యమని ఓయో ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) (భారత్, దక్షిణాసియా) ఆదిత్య ఘోష్ పేర్కొన్నారు. ఏడాదిన్నరలో ఈ లక్ష్యాన్ని అందుకుంటామని అన్నారు. ప్రస్తుతం హోటల్ సేవల విభాగంలో 3వ స్థానంలో ఉన్నామని, 10 లక్షల గదులు సాకారమైతే ప్రపంచంలోనే అతిపెద్ద గొలుసుకట్టు హోటల్ సంస్థగా ఓయో అవతరిస్తుందని తెలిపారు. 2023కల్లా 25 లక్షల గదులకు విస్తరించడమే తమ ప్రణాళిక అని వ్యవస్థాపకుడు, ప్రమోటర్ రితేశ్ అగర్వాల్ వెల్లడించారు.



ముంబయి విమానాశ్రయంలో

బోర్డింగ్‌పాస్‌లపై స్టాంపింగ్ లేదు

దేశంలోనే ప్రథమం



ముంబయి: ముంబయిలోని చత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, రెండో టెర్మినల్ (టీ2) ద్వారా విమానాలు ఎక్కే ప్రయాణికులు, తమ బోర్డింగ్‌పాసులపై స్టాంపింగ్ చేయించాల్సిన అవసరం లేదని నిర్వహణ సంస్థ జీవీకే కన్సార్షియం ఆధ్వర్యంలోని ఎంఐఏఎల్ తెలిపింది. అంతర్జాతీయ సంస్థలతో పాటు ఎయిరిండియా, జెట్ ఎయిర్‌వేస్, విస్తారా దేశీయ విమానాలు ఈ టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణాల్లో కాగితం పనిని గణనీయంగా తగ్గించాలన్న డిజి యాత్రలో భాగంగా, అత్యాధునిక సాంకేతికతను టీ2లో ప్రవేశ పెట్టడం వల్లే ఇది సాధ్యమైందని తెలిపింది. దేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి విమానాశ్రయంగా నిలిచిందని పేర్కొంది. ప్రయాణికులను తమ బోర్డింగ్‌పాస్‌ను సెక్యూరిటీ చెక్ పాయింట్ వద్ద స్కాన్ చేయించడం లేదా ఇగేట్ రీడర్ వద్ద మొబైల్‌ఫోన్‌ను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయిస్తే సరిపోతుంది. బోర్డింగ్ పాస్‌పై స్టాంపింగ్ చేసే బాధ్యతలు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి తగ్గుతాయి.

ఓలాలో సచిన్ బన్సల్ రూ.150 కోట్ల పెట్టుబడి

దిల్లీ: ఫ్లిప్‌కార్ట్ సహ-వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ ఓలాలో రూ.150 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖకు అందించిన పత్రాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. రూ.10 ముఖ విలువ గల 70,588 పూర్తి, తప్పనిసరిగా మార్చాల్సిన సిరీస్ జె ప్రిఫరెన్స్ షేర్లను ఒక్కోటి రూ.21,250 ధరతో కేటాయించినట్లు ఆ పత్రాలు చెబుతున్నాయి. ఆ లెక్కన బన్సల్ రూ.150 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. ఫ్లిప్‌కార్ట్‌లో 77 శాతాన్ని వాల్‌మార్ట్ కొనుగోలు చేసిన అనంతరం బన్సల్ ఈ కంపెనీని వీడిన సంగతి తెలిసిందే. కాగా, జనవరి 12న జరిగిన బోర్డు సమావేశంలో ఓలాను నిర్వహిస్తున్న ఏఎన్ఐ టెక్నాలజీస్ ఈ పెట్టుబడులకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ విషయమైన ఓలా, బన్సల్‌కు పంపిన ఇ-మెయిళ్లకు స్పందన రాలేదు.

జెట్ ఎయిర్‌వేస్‌లో ఎతిహాద్‌కు

49 శాతం వాటా?



నియంత్రణ వాటా వదులుకోనున్న గోయల్

దిల్లీ

రుణ, నగదు లభ్యత సంక్షోభంతో విలవిల లాడుతున్న జెట్ ఎయిర్‌వేస్ యాజమాన్యం మారనుందని నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌లో 24 శాతం వాటా కలిగిన ఎతిహాద్ ఎయిర్‌వేస్ పీజేఎస్‌సీ, తన వాటాను 49 శాతానికి పెంచుకునేందుకు అంగీకరించిందని పలు వార్తా సంస్థలు తెలిపాయి. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన నరేశ్ గోయల్ మెజార్టీ నియంత్రణ వాటా వదులుకునేందుకు సిద్ధపడటంతో, పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకొస్తున్నాయని సమాచారం.

జెట్ ఎయిర్‌వేస్‌లో విదేశీ విమానయాన సంస్థ అయిన ఎతిహాద్ వాటా 49 శాతానికి పెరుగుతోందని బీటీవీఐ చానల్ పేర్కొంది. ఫలితంగా సంస్థ కార్యకలాపాలతో పాటు యాజమాన్యంలోనూ ఎతిహాద్ పాత్ర అధికం కానుందని తెలిపింది. దేశీయ విమానయాన సంస్థల్లో విదేశీ విమానయాన సంస్థలు 49 శాతానికి మించి వాటా పొందేందుకు అనుమతి లేని సంగతి విదితమే. గోయల్ వాటా ప్రస్తుత 51 శాతం నుంచి 20 శాతానికి పరిమితం అయ్యే వీలుందని సీఎన్‌బీసీ-టీవీ 18 తెలిపింది. గోయల్ ఓటింగ్ హక్కులు గరిష్ఠంగా 10 శాతం మాత్రమే ఉంటాయని వెల్లడించింది. దీనిపై వెంటనే స్పందించేందుకు ఎయిర్‌వేస్ నిరాకరించింది.

పెట్టుబడులకు సంస్థలు ముందుకు వస్తున్నాయని సమాచారం వెల్లడి కావడంతోనే, సోమవారం జెట్ ఎయిర్‌వేస్ ఒక దశలో 19 శాతం దూసుకెళ్లింది. నవంబరు 15 తరవాత ఈ షేరు ఇంతగా లాభపడటం ఇప్పుడే. అయితే నిర్ణయాధికార వాటాను గోయల్ వదులుకుంటున్నారనే విషయమై, స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ సమాచారం ఇవ్వలేదు.

రెండో స్థానం నుంచి..

దేశీయంగా పూర్తిస్థాయి విమానయాన సేవలు అందించే సంస్థల్లో రెండో స్థానంలో జెట్ ఎయిర్‌వేస్ ఉండేది. రుణాలు భారంగా మారి, నగదు లభ్యత కొరవడటంతో, సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించేందుకు ఇబ్బంది పడుతోంది. మైనారిటీ వాటాదార్లతో పాటు పెట్టుబడిదార్ల నుంచి నిధుల సమీకరణకు సంస్థ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గత 11 ఆర్థిక సంవత్సరాలలో, 9 ఏళ్ల పాటు సంస్థ లాభాలు ఆర్జించలేకపోయింది.



రూ.100 కోట్ల వరకు రుణానికి పూచీ!

- రూ.1000 కోట్ల వరకు రుణాలకు వడ్డీ రాయితీ
- ఎలక్ట్రానిక్స్ నూతన విధాన ప్రతిపాదనలు

దిల్లీ: ఎలక్ట్రానిక్ పరికరాల తయారీదార్లను ప్రోత్సహించేందుకు, ఆ రంగానికి ప్రభుత్వం వరాల జల్లు ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. రూ.100 కోట్ల వరకు రుణాలకు పూచీకత్తు (క్రెడిట్ గ్యారెంటీ) ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. రూ.1000 కోట్ల వరకు రుణాలకు వడ్డీ రాయితీ కూడా ఇవ్వాలని అనుకుంటోంది. ఎలక్ట్రానిక్స్ రంగంపై రూపొందిస్తున్న కొత్త జాతీయ విధానంలో క్రెడిటీ గ్యారెంటీ ఫండ్, ఇంట్రస్ట్ సబ్‌వెన్షన్ పథకాలను ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించినట్లు సమాచారం. 'కొత్తగా తయారీ యూనిట్ నెలకొల్పాలని అనుకునేవారికి, ప్రస్తుత ప్లాంటును విస్తరించుకోవాలని యోచిస్తున్న వారికి ఒక్కో యూనిట్‌పై రూ.100 కోట్ల వరకు క్రెడిట్ గ్యారెంటీ ఇచ్చే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే పెట్టుబడుల ఆధారంగా ఈ రుణ హామీ ఇచ్చే విషయంలో కొంత వ్యత్యాసం ఉంటుంద'ని ఓ అధికారి పేర్కొన్నారు. మంజూరైన రుణ మొత్తంలో 50% వరకు రుణానికి ప్రభుత్వం రుణ హామీ ఇవ్వాలనే ప్రతిపాదనా ఉందన్నారు. ఇందుకుగాను రూ.1000 కోట్లతో ఓ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. రెండో ఏడాది తర్వాత లక్షిత రంగం నుంచి వచ్చిన స్పందనను ప్రభుత్వం సమీక్షిస్తుందని పేర్కొన్నారు. దీంతో పాటు ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీదార్లకు రుణంపై వడ్డీ రాయితీ ఇచ్చే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించాలని చాలా రోజులుగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ కోరుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం మనదేశంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు 11-12% వడ్డీకి రుణాలు లభిస్తుండగా.. ఇతర దేశాల్లో 5-7 శాతానికే రుణాలు లభిస్తున్నాయి.

గెలాక్సీ ఎం పై శామ్‌సంగ్ భారీ ఆశలు

- భారత్‌లోనే తొలిసారిగా ఆవిష్కరణ
- రూ.20,000 లోపు ధరల శ్రేణి
- ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయం



దిల్లీ: దేశీయ స్మార్ట్‌ఫోన్ల విపణిలో మళ్లీ అగ్రస్థానం దక్కించుకునేందుకు కొరియా దిగ్గజం శామ్‌సంగ్ ప్రయత్నిస్తోంది. అందుబాటు ధర, అధిక సదుపాయాలు (ఫీచర్ల)తో చైనా దిగ్గజం షియామీ, దేశీయ స్మార్ట్‌ఫోన్ విపణిలో శరవేగంతో దూసుకెళ్లడంతో శామ్‌సంగ్ అమ్మకాలపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే యువతను ఆకట్టుకునే ఫీచర్లు, అందుబాటు ధరలతో గెలాక్సీ ఎం స్మార్ట్‌ఫోన్లను ప్రపంచంలోనే తొలిసారిగా భారత్‌లోనే ఆవిష్కరించేందుకు శామ్‌సంగ్ సిద్ధమవుతోంది. రూ.20,000 లోపు లభించే ఈ శ్రేణి స్మార్ట్‌ఫోన్లను ఆన్‌లైన్‌లో శామ్‌సంగ్ వెబ్‌సైట్‌తో పాటు అమెజాన్ పోర్టల్‌లో మాత్రమే విక్రయిస్తామని, తదుపరి ఇతర పోర్టళ్ల ద్వారా కూడా విక్రయిస్తామని శామ్‌సంగ్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు ఆశిమ్ వార్సి తెలిపారు. కొత్త మోడళ్ల సాయంతో ఈ ఏడాది రెండంకెల వృద్ధి సాధించాలనేది లక్ష్యంగా వెల్లడించారు. భారత్‌లోనే ఈ స్మార్ట్‌ఫోన్లను డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. తొలుత 3 మోడళ్లు విడుదల చేస్తామని, వేగంగా ఛార్జింగ్-5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 3 కెమేరాల వంటి ఫీచర్లు వీటికి ఉంటాయని వెల్లడించారు. కొత్త మోడళ్ల ఆవిష్కరణతో పాటు ప్లాంటు సామర్థ్య విస్తరణ, వినియోగదారులు ఫోన్లను పరిశీలించుకునేందుకు ఎక్స్‌పీరియెన్స్ కేంద్రాలు నెలకొల్పేందుకు పెట్టుబడులు పెడుతున్నట్లు వివరించారు. 2018 డిసెంబరు త్రైమాసికంలో, విలువ ఆధారితంగా 40 శాతం మార్కెట్ వాటా పొందినట్లు, మార్కెట్ పరిశోధనా సంస్థ జీఎఫ్‌కే గణాంకాలను ఉటంకిస్తూ ఆశిమ్ తెలిపారు. అయితే స్మార్ట్‌ఫోన్ల సంఖ్యా పరంగా చూస్తే, షియామీ ముందుందని ఐడీసీ, కౌంటర్ పాయింట్ సంస్థలు పేర్కొనడం గమనార్హం.

మహీంద్రా 8 సీట్ల మరాజో



ధర రూ.13.9 లక్షలు

దిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) మరాజోలో కొత్త వేరియంట్‌ను విపణిలోకి విడుదల చేసింది. 8 సీట్లు ఉండటం దీని ప్రత్యేకత. ఇటీవల విడుదల చేసిన ఎం8 సెవన్ సీటర్‌తో పోలిస్తే కొత్త వెర్షన్ ధర రూ.8000 ఎక్కువ. దీని తుది ధర రూ.13.9 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించారు. మరాజో 8 సీట్ల సదుపాయాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా ఈ మోడల్‌కు మరింత ప్రాచుర్యం లభిస్తుందని మహీంద్రా చీఫ్ (అమ్మకాలు, మార్కెటింగ్- ఆటోమోటివ్ విభాగం) వీజే నక్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఏడు అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ, డైనమిక్ నియంత్రణ కలిగిన రివర్స్ పార్కింగ్ కెమేరా, 17 అంగుళాల అలాయ్ చక్రాలు వంటి సదుపాయాలు కొత్త మరాజోలో ఉన్నాయి. మహీంద్రా ఉత్తర అమెరికా టెక్నికల్ కేంద్రం, మహీంద్రా రీసెర్చ్ వ్యాలీలు సంయుక్తంగా మరాజోను అభివృద్ధి చేశాయి.

మారుతీ కొత్త వ్యాగన్ ఆర్



బుకింగ్‌లు ప్రారంభం

దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) త్వరలో విడుదల చేయనున్న వ్యాగన్ ఆర్ కొత్త వేరియంట్ బుకింగ్‌లు ప్రారంభించినట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న మారుతీ అధీకృత విక్రయశాలల్లో రూ.11,000 ముందస్తు చెల్లింపు చేసి.. మూడో తరం వ్యాగన్ ఆర్‌ను వినియోగదారులు బుక్ చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. కంపెనీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్ చేసుకునే సౌలభ్యం ఉందని వివరించింది. కంపెనీ కొత్త వ్యాగన్‌ఆర్‌ను ఈ నెల 23న విడుదల చేయనుంది. 'బిగ్ న్యూ వ్యాగన్ ఆర్' 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ లేదా 1 లీటర్ ఇంజిన్‌లలో లభించనుంది. ఆటోమేటివ్ గేర్ షిఫ్ట్ వేరియంట్‌లో సైతం లభిస్తుందని కంపెనీ తెలిపింది. సుజుకీ అయిదో తరం హార్టెక్ట్ ప్లాట్‌ఫామ్‌పై కొత్త వ్యాగన్‌ఆర్‌ను అభివృద్ధి చేశామని, దీంతో కారు స్థిరంగా, దృఢంగా, సురక్షితంగా ఉంటుందని మారుతీ పేర్కొంది. డ్రైవర్ ఎయిర్‌బ్యాగ్, యాంటీ లాక్ బ్రేకింగ్ వ్యవస్థ, ఫ్రంట్ సీట్ బెల్ట్స్ రిమైండర్, స్పీడ్ అలర్ట్ వ్యవస్థ, రేర్ పార్కింగ్ సెన్సార్ల వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి.

ఆలస్య రుసుము రద్దును సద్వినియోగం చేసుకోండి!





- సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్

? నేను దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు టికెట్లు బుకింగ్ చేసే పర్యాటక (ట్రావెల్) ఏజెంటుగా పనిచేస్తున్నాను. ఇందుకుగాను నాకు కొంత మొత్తంలో కమీషన్ వస్తుంది. వార్షికంగా నేను చేసే మొత్తం వ్యాపారం (టర్నోవరు) విలువ రూ.90,00,000 అయినప్పటికీ.. నాకు వచ్చే కమిషన్ రూ.2 లక్షలు మాత్రమే. నేను జీఎస్టీ పరిధిలోకి వస్తానా

– మహ్మద్ అజ్గర్ అహ్మద్

జీఎస్టీ చట్ట నిబంధనల ప్రకారం.. మీకు ఆదాయంగా వచ్చే కమీషన్‌ను మాత్రమే సరఫరా కింద పరిగణిస్తారు. టికెటు బుకింగ్‌ల టర్నోవరును కాదు. అందువల్ల మీ కమీషన్ నిర్దేశిత టర్నోవరు పరిమితైన రూ.20 లక్షల్లోపే ఉన్నందున జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోనక్కర్లేదు.

? ఇటీవల ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఎంఐజీ2 పథకం కింద ఓ ఫ్లాటు కొనుగోలు చేశాను. రూ.20,00,000 ఫ్లాటు ధరపై 12% జీఎస్టీని నిర్మాణదారు వసూలు చేశాడు. ఎంఐజీ2 పథకం కింద కొనుగోలు చేసే ఫ్లాటుకు 8% జీఎస్టీ వర్తిస్తుందని నేను విన్నాను. ఆ 4% జీఎస్టీ రిబేట్‌ను ఎలా పొందొచ్చు.

– సతీశ్, అనకాపల్లి

మీ ప్రశ్న ప్రకారం స్థలం విలువతో కలిపి ఫ్లాటు ధర రూ.20,00,000 అయితే మీరు నికరంగా చెల్లించాల్సిన జీఎస్టీ 8 శాతం (12%లో 2/3 వంతు) మాత్రమే. అంటే మీ వద్ద నుంచి 4% అధికంగా నిర్మాణదారు జీఎస్టీని వసూలు చేశాడు. అధికంగా వసూలు చేసిన జీఎస్టీని మీరు నిర్మాణదారు నుంచి తిరిగి వసూలు చేసుకోవాలి.

? మేం వ్యాపార కార్యకలాపాల రీత్యా దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాం. వెళ్లినప్పుడల్లా హోటళ్లలో బస చేసేందుకు ఏడాదికి మాకు రూ.15 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. హోటల్ యజమానుల దగ్గర నుంచి సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ చెల్లించినట్లుగా బిల్లులు కూడా తీసుకుంటున్నాం. అయితే ఐజీఎస్టీ ఇన్‌వాయిస్‌ను మాత్రం వాళ్లు ఇవ్వడం లేదు. ఇలాంటప్పుడు మేం జీఎస్టీ ఇన్‌పుట్‌ను ఎలా క్లెయిమ్ చేసుకోగలం? దీనివల్ల ఏడాదికి రూ.2.5 లక్షల వరకు ఇన్‌పుట్ క్రెడిట్‌ను మేం కోల్పోతున్నాం? ఈ సమస్యకు పరిష్కారం తెలియజేయగలరు.

– శ్రీనివాస్ చండోలు

మీ సమస్యకు పరిష్కారం దొరకాలంటే ముందుగా మీరు ఏయే రాష్ట్రాల్లో హోటల్ సేవలను ఎక్కువగా వినియోగించుకుంటున్నారో, అక్కడ ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ రిజిస్ట్రేషన్ తీసుకోండి, దీని ద్వారా మీరు ఐటీసీ పొందవచ్చు. అయితే ఆహారం, పానీయాలపై మీరు చెల్లించిన పన్నును ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా తిరిగి పొందే వీల్లేదు.

? టైల్లు, శానిటరీ ఉత్పత్తులు, పెయింటింగ్ వస్తువుల ప్యాకింగ్‌పై అన్ని రకాల పన్నులతో కలిపే ధర ఉంటుంది. అయితే కొంత మంది విక్రయదార్లు దీనికి అదనంగా జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీనిపై మేం ఎవరికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

– విజయ భాస్కర్

గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)లోనే అన్ని రకాల పన్నులు, సుంకాలు కలిసి ఉంటాయి. అందువల్ల ఎంఆర్‌పీకి మించి అధిక ధర వసూలు చేయడానికి వీల్లేదు. అలా చేయడం చట్టవిరుద్ధం. వారు శిక్ష, జరిమానాకు అర్హులు. ఎవరైనా విక్రయదారు ఇలా చేస్తుంటే కనుక మీరు www.consumerhelpline.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. అయితే ఫిర్యాదు చేయడానికి ముందు మీరు ఆ విక్రయదారు నుంచి ఇన్‌వాయిస్ తీసుకోవడం మంచిది.

? నేను గడువు తేదీలోగానే రిటర్న్‌లు దాఖలు చేయాలనే అనుకుంటాను. అయితే ఇన్‌వాయిస్‌ల సమస్యతో దాఖలు చేయడం ఆలస్యమవుతుంటుంది. అందుకే ఇప్పటివరకు ఆలస్య రుసుంగా చాలానే చెల్లించాను. ఇప్పుడు ప్రభుత్వం ఆలస్య రుసుం నుంచి మినహాయింపు ఇచ్చినట్లు ఓ వార్త విన్నాను. నేను ఇప్పటివరకు చెలించిన ఆలస్య రుసుమును రిఫండ్ కింద తిరిగి పొందొచ్చా.

– మధుసూధన్, కడప; గోపాల్ భట్టాడ్; సందీప్ పోతుగంటి

సెంట్రల్ ట్యాక్స్ నోటిఫికేషన్ సంఖ్య: 76/2018, తేదీ 31.12.2018 ప్రకారం.. 2017 జులై నుంచి 2018 సెప్టెంబరు కాలానికి దాఖలు చేసే రిటర్న్‌లకు ఎలాంటి ఆలస్య రుసుం పడదు. అయితే 22-12-2018 నుంచి 31-03-2019 మధ్య దాఖలు చేస్తేనే ఈ మినహాయింపు వర్తిస్తుంది. మీ విషయానికొస్తే 22-12-2018 కంటే ముందు మీరు రిటర్న్‌లు దాఖలు చేసినట్లు కనిపిస్తోంది. అందువల్ల ఆలస్య రుసుమును రిఫండ్ కింద తిరిగి పొందేందుకు మీరు అనర్హులు.

? మేం ఇప్పటివరకు జీఎస్టీ రిటర్న్‌లు దాఖలు చేయలేదు. ఒకసారి దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తే జరిమానా చెల్లించాలని చూపించింది. అయితే ఇప్పుడు జీఎస్టీ రిటర్న్‌లు దాఖలు చేయాలనుకుంటున్నాం. దీనికి ముందున్న జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను ఉపయోగించుకోవచ్చా లేదంటే కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలా? తెలియజేయగలరు.

– శ్రీచందన

సెంట్రల్ ట్యాక్స్ నోటిఫికేషన్ సంఖ్య: 76/2018, తేదీ 31.12.2018 ప్రకారం.. 2017 జులై నుంచి 2018 సెప్టెంబరు కాలానికి దాఖలు చేసే రిటర్న్‌లకు ఎలాంటి ఆలస్య రుసుం పడదు. అయితే 22-12-2018 నుంచి 31-03-2019 మధ్య దాఖలు చేస్తేనే ఈ మినహాయింపు వర్తిస్తుంది. మీ విషయానికొస్తే కొత్తగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోవడం కంటే ఆలస్య రుసుం మినహాయింపు వెసులుబాటును వినియోగించుకోవడమే ఉత్తమం. అంతే కాదు... మళ్లీ మళ్లీ ఆలస్య రుసుం నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇస్తుందనే భావనలో ఉండకుండా ఎప్పటికప్పుడు గడువు తేదీలోగా రిటర్న్‌లు దాఖలు చేసుకుంటే మీకే మంచిది. ఎందుకుంటే భవిష్యత్‌లో మరో మారు ఇలాంటి అవకాశం ప్రభుత్వం కల్పించకపోవచ్చు.

? నాకు నిర్మాణంలో ఉన్న ఫ్లాట్ల జీఎస్టీకి సంబంధించి ఓ సందేహం ఉంది. మేం 2018 జనవరి 15న ఫ్లాటు కొనుగోలు చేశాం. అయితే దాని నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. 2019 డిసెంబరు కల్లా పూర్తయ్యే అవకాశం ఉందని అంటున్నారు. నిర్మాణదారు మా వద్ద 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. అయితే స్థిరాస్తిపై మీరు రాసిన గత వ్యాసంలో స్థలం విలువ కలిసి ఉంటే 12% జీఎస్టీ కడితే సరిపోతుందని చెప్పారు. ఈ ప్రకారం చూస్తే నిర్మాణదారు మమ్మల్ని 18% జీఎస్టీ చెల్లించమనడం సబబేనా? అవిభాజ్య స్థలం వాటాలో ఫ్లాటును నిర్మిస్తే ఎంత జీఎస్టీ వర్తిస్తుంది? ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వివరాలను ఫ్లాట్ యజమానులకు నిర్మాణదారు చెప్పాల్సిన అవసరం ఉందా? లేదా? ఫ్లాటు యజమాని నుంచి కొనుగోలు చేసిన జీఎస్టీని నిర్మాణదారు నిజంగానే ప్రభుత్వానికి చెల్లిస్తున్నాడా? లేదా? అనే విషయాన్ని ఎలా తెలుసుకోవాలి? దయచేసి ఈ సందేహాలు తీర్చగలరు.

– నాగరాజు ఆర్దం

ప్రస్తుతం నిర్మాణ రంగ సేవలకు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. ఒకవేళ ఫ్లాటు ధరలో స్థలం విలువ కలిసి ఉంటే జీఎస్టీ రేటు ఇందులో 2/3 శాతానికి తగ్గుతుంది. అంటే 12 శాతం కడితే సరిపోతుంది. జీఎస్టీ నిబంధనల ప్రకారం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వివరాలను ఫ్లాటు యజమానులకు నిర్మాణదారు చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఫ్లాటు యజమాని చెల్లించిన జీఎస్టీని ప్రభుత్వానికి నిర్మాణదారు కట్టాడా లేదా తెలుసుకోవాలంటే.. నిర్మాణదారు నుంచి దాఖలు చేసిన రిటర్న్ కాపీని అడిగి తీసుకోవచ్చు. ఒకవేళ ఆ కాపీని ఆయన ఇవ్వకుంటే సమాచారం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా సంబంధిత శాఖను ఆశ్రయించొచ్చు.

గమనిక: నిర్మాణంలోని ఫ్లాట్ల జీఎస్టీకి సంబంధించి గతవారం నేను రాసిన వ్యాసంపై కొన్ని ఆరోపణలు చేస్తూ 'ఈనాడు' పత్రికకు కొందరు ఇ-మెయిళ్లు పంపించారు. ఎటువంటి ఆధారాలు, విషయ పరిజ్ఞానం లేకుండా ఏదేదో ఊహించుకుంటూ, నేను ఆ వ్యాసం రాసినట్లుగా అందులో ఆరోపించారు. అయితే ఆరోపణలకే పరిమితం కాకుండా.. నేను చెప్పిన విషయాలు తప్పని నిరూపిస్తూ మెయిల్ పంపిస్తే వాళ్లను నేను తప్పకుండా అభినందిస్తాను. కాని అలా నిరూపిస్తూ వచ్చిన మెయిల్ ఏదీ లేదు. అందువల్ల నిరాధార ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబో అలాంటి మెయిళ్లు పంపినవాళ్లే ఆలోచించుకోవాలి.

మీ సందేహాలు పంపండి

జీఎస్టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com;
businessdesk@eenadu.net

గౌన్లు.. గ్లాసులు.. జగ్గులు

- ఏ గుర్తు కేటాయిస్తే ఆ వస్తువు పంపకం
- పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి
- తొలివిడతకు 12,202 మంది అభ్యర్థులు సై!
- ఏకగ్రీవమైన 769 పంచాయతీలు, 10,654 వార్డులు
- రెండో విడతలో 25,419 నామినేషన్లు దాఖలు

ఈనాడు – హైదరాబాద్

ప్రతి ఇంటికీ డజను గాజు గ్లాసుల పంపిణీ, మరోచోట ఇంటికి రెండేసి నీళ్ల జగ్గులు. ఇంకో ఊళ్లో చిన్నారులు ఉన్న ఇంట్లో నజరానాగా గౌన్లు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు ఏయే గుర్తులు కేటాయించారో.. వీలైనంతవరకూ అభ్యర్థులు ఆ వస్తువులనే పంచుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడతకు అభ్యర్థులు ఖరారు కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి ఊపందుకుంది. ఇప్పటికే రెండు విడతల్లోని పంచాయతీలకు ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోంది. ఎన్నికల్లో పల్లె వాతావరణానికి దగ్గరగా ఉండే అనేక గుర్తులు కేటాయించారు. ప్రచారంలో భాగంగా అభ్యర్థులు ఆయా గుర్తులతో ఫ్లెక్సీలను అచ్చు వేయించుకుంటున్నారు. కరపత్రాలు, నమూనా బొమ్మలతో ప్రచారం చేస్తున్నారు. కొందరు ఏకంగా ఆ వస్తువులనే పంచిపెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

పండగ రోజు వనభోజనాలు

పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అభ్యర్థులు కొందరు కనీసం రూ.5 లక్షల వరకు వ్యయం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే 'దావత్'లు ఊపందుకున్నాయి. మందు, మాంసం పంపకాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని వనభోజనాల పేరుతో కూడా గ్రామస్థులను ఖుషీ చేసేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. మెదక్, కరీంనగర్ జిల్లాల్లో పండగ రోజు వనభోజనాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 'ఓటరు నోటిలో మన గుర్తు నానితే చాల్‌రా భై..' అంటూ కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో ఓ సర్పంచి అభ్యర్థి వేసుకుంటున్న అంచనాలను అనుచరులు ప్రస్తావిస్తున్నారు.

తేలిన ఏకగ్రీవాలు

మొదటి విడతలో పంచాయతీల్లో నామినేషన్ ప్రక్రియ అనంతరం 769 ఏకగ్రీవాలను తేల్చారు. ఇందులో సగానికిపైగా తెరాస మద్దతుదారులే ఉన్నారు. రెండోస్థానంలో కాంగ్రెస్, స్వతంత్రులు, ఆ తర్వాతి స్థానంలో భాజపా మద్దతు దారులు ఉన్నారు. తొమ్మిది పంచాయతీల్లో ఒక్క నామినేషన్ కూడా చెల్లలేదు. ఇక్కడ ఉప సర్పంచులే కీలకంగా మారనున్నారు. అత్యధికంగా కామారెడ్డిలో 133 పంచాయతీలకు 688, రాజన్న సిరిసిల్లలో 67 పంచాయతీలకు 279 నామినేషన్లు చొప్పున దాఖలయ్యాయి. మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాల్లోనూ కొన్ని పంచాయతీల్లో బహుముఖ పోటీ నెలకొంది. నామినేషన్ల దాఖలు సందర్భంగా చాలా జిల్లాల్లో పెద్ద ఎత్తున పోటీకి నిలిచిన వారు క్రమంగా మెత్తబడ్డారు. కొన్నిచోట్ల ఒక్కోపార్టీలోని ఐదారుగురు కూడా నామినేషన్లు వేశారు. పార్టీ నాయకుల బుజ్జగింపులు, తాయిలాలతో చాలామంది వెనక్కు తగ్గారు. నామినేటెడ్ పోస్టుల ఆశకూడా కొంతవరకు పనిచేసింది. చివరికి పన్నెండువేలకు పైగా బరిలో నిలిచారు. రెండో విడత ఎన్నికల్లో 14న నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. 17న ఉపసంహరణ, అభ్యర్థుల ఖరారు ఉంటాయి. మూడో విడతతో 16 నుంచి నామినేషన్ల దాఖలు షురూ కానుంది.


- తొలి విడత ప్రకటన విడుదలైన పంచాయతీలు: 4,479
- ఏకగ్రీవమైనవి: 769
- ఎన్నికలు జరిగే పంచాయతీలు: 3,701
- దాఖలైన నామినేషన్ల సంఖ్య: 27,940
- ఉపసంహరణల అనంతరం తేలిన అభ్యర్థులు: 12,202 మంది
- ప్రకటన విడుదలైన వార్డుల సంఖ్య: 39,822
- ఏకగ్రీవమైన వార్డుల సంఖ్య: 10,654
- ఎన్నికలు జరిగే వార్డులు: 28,976
- అభ్యర్థులు, గుర్తులను ప్రకటించింది: ఈ నెల 13న
- వార్డు సభ్యుల ఎన్నికకు పోటీలో నిలిచినవారు: 70,094 మంది

- రెండో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలు: 4,135
- సర్పంచి స్థానాలకు దాఖలైన నామినేషన్లు: 25,419
- ఎన్నికలు జరిగే వార్డుల సంఖ్య: 36,602
- దాఖలైన నామినేషన్లు: 91,458
- నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ: జనవరి 17

'పంచాయతీ'లోనూ గుర్తుల గుబులు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల్లో ఈవీఎంల్లో ట్రక్కు గుర్తు.. తెరాస కారు గుర్తుతో పోలి ఉండడంతో కొన్నిచోట్ల ఫలితాలే తారుమారయ్యాయి. దీన్ని సీఎం కేసీఆర్ ఏకంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులకు గుర్తుల గుబులు మొదలైంది. సర్పంచి, వార్డు సభ్యులకు కేటాయించిన గుర్తుల్లో కొన్నింటికి బాగా దగ్గర పోలికలున్నాయి. పైగా అభ్యర్థి ఫొటో కూడా ఉండదు. దీంతో ఓటరు గందరగోళానికి గురయ్యే ఆస్కారం ఉంది. పంచాయతీల విభజన తర్వాత దాదాపు అన్ని పంచాయతీల్లో ఓటర్ల సంఖ్య తగ్గిపోయింది. అయిదారుగురు ఓటర్లు తికమకపడ్డా గెలుపోటములు తారుమారవుతాయని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

- సర్పంచి బ్యాలెట్ పత్రాల్లో బ్యాట్, విమానం.. బ్లాక్ బోర్డు, పలక.. ఫోర్కు, చెంచా ఇవన్నీ దగ్గర పోలికలతో ఉన్నాయి. ఫోర్కు అంటే తెలియనివాళ్లు చెంచాకు ఓటేసే అవకాశం ఉంది. బిస్కెట్, గాలి బూర గుర్తులు అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉన్నాయి. వేణువు చూడ్డానికి ఇంకుపెన్నులా ఉంది.
- వార్డు సభ్యుల గుర్తుల్లో హాకీ బంతి, నెక్‌టై లాంటివి పాతతరం వారికి అర్థం కావు. గ్యాసు స్టవ్, గ్యాసు సిలిండర్ రెండూ ఒకటే అని భావించే ప్రమాదం ఉంది. డిష్ యాంటీనా, విద్యుత్తు స్తంభం అర్థమయ్యేలా లేవు.



సర్పంచి అభ్యర్థికి కేటాయించిన గుర్తుల్లో ఫోర్క్, చెంచాకు దగ్గరి పోలికలు.. సిరాపెన్ను మాదిరిగా ఉన్న వేణువు

జాబిల్లిపై అంతర్జాతీయ చంద్రమండల పరిశోధన కేంద్రం

ఏర్పాటుకు చైనా ప్రతిపాదన

బీజింగ్: మొట్టమొదటిసారిగా చంద్రుడి అవతలి భాగంలో రోవర్‌ను దించిన చైనా.. అదే ఊపుతో జాబిల్లిపై అంతర్జాతీయ స్థావరం ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఇందుకోసం త్రీడీ ముద్రణ పరిజ్ఞానాన్ని ఉపయోగించాలనుకుంటోంది. భవిష్యత్‌లో చంద్రుడి మీదకు మరో నాలుగు వ్యోమనౌకలను ప్రయోగించనున్నట్లు చైనా అంతరిక్ష సంస్థ ఉన్నతాధికారి వు యాన్హువా సోమవారం తెలిపారు. జాబిల్లిపై అంతర్జాతీయ చంద్రమండల పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన పరికరాలను పరీక్షించేందుకు వ్యోమనౌకను పంపుతామన్నారు. దీనిపై చైనా, అమెరికా, రష్యా, ఐరోపాల మధ్య చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. చందమామపై మౌలిక వసతుల కల్పనకు త్రీడీ ముద్రణ పరిజ్ఞానాన్ని ఉపయోగించొచ్చా అన్న దానిపై శాస్త్రవేత్తలు పరిశీలనలు జరుపుతున్నారని వివరించారు. ఈ ఏడాది చివర్లో చాంగే-5 పేరుతో ఒక వ్యోమనౌకను పంపి, దానిద్వారా చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి రప్పిస్తామన్నారు. అనంతరం చాంగే-6 ద్వారా జాబిల్లి దక్షిణ ధ్రువంనుంచి నమూనాలను తీసుకొస్తామని చెప్పారు. దాని తర్వాత ప్రయోగించే చాంగే-7తో చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో విస్తృతంగా పరిశోధనలు చేపడతామని వివరించారు. అంతిమంగా చాంగే-8 ద్వారా అంతర్జాతీయ చంద్రమండల పరిశోధన కేంద్రానికి అవసరమైన పరిజ్ఞానాలను పరీక్షిస్తామని తెలిపారు.

ఏకగ్రీవాల పరిశీలనకు ఐఏఎస్‌లు

- కలెక్టర్ల నుంచి అధికారాల బదిలీ
- వారి అనుమతి తరువాతే ఫలితాల వెల్లడి
- ఒకే నామపత్రం ఉన్నట్లు తేలిన రోజే ఉపసర్పంచి ఎన్నిక

ఈనాడు – హైదరాబాద్

ఏకగ్రీవాలకు కలెక్టర్ల అనుమతి ఉండాలంటూ ఇంతకు ముందు విధించిన నిబంధనల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఏకగ్రీవాలకు ఇక కలెక్టర్లకు బదులు సాధారణ పరిశీలకులు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 18 మంది ఐఏఎస్ అధికారులు ఇప్పటికే జిల్లాల వారీగా సాధారణ పరిశీలకులుగా నియమితులు కావటం తెలిసిందే. వీరిలో కొందరు ఒక్కో జిల్లాను, మరికొందరు రెండేసి జిల్లాలను పర్యవేక్షిస్తారు. తమకు నిర్దేశించిన జిల్లాల్లోని ఏకగ్రీవ ఎన్నికలను వారు పరిశీలిస్తారు. ఒక్కో నామపత్రం మాత్రమే దాఖలైన సర్పంచి స్థానాలతో పాటు వార్డు సభ్యుల స్థానాల వివరాలను సైతం కలెక్టర్లకు పంపాలనే నిబంధనలోనూ ఎన్నికల సంఘం ఇప్పుడు మార్పులు చేసింది. కేవలం సర్పంచి స్థానాల సమాచారాన్ని మాత్రమే సాధారణ పరిశీలకులకు ఇప్పుడు పంపితే సరిపోతుంది. నామినేషన్ల ఉప సంహరణ రోజున బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాలను ప్రకటించగానే ఆ సమాచారాన్ని పరిశీలకులకు చేరవేయాలి. ఏకగ్రీవానికి అనుమతిస్తున్నట్లైతే పరిశీలకులు అదే రోజున ఆ విషయాన్ని తెలియజేస్తారు. అనుమతి రాగానే సర్పంచి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. అక్కడ వార్డు సభ్యుల పదవులన్నీ ఏకగ్రీవమైతే.. అదేరోజున ఉప సర్పంచి ఎన్నికనుసైతం రిటర్నింగ్ అధికారి పూర్తిచేస్తారు.

అనుమతి వచ్చేవరకు ఏకగ్రీవం పెండింగ్

ఏకగ్రీవంపై నామపత్రాల ఉపసంహరణ రోజున సాధారణ పరిశీలకుల నుంచి అనుమతి రాకుంటే ఏకగ్రీవ ఫలితాలను రిటర్నింగ్ అధికారి ప్రకటించకూడదు. అనుమతి వచ్చినరోజే సర్పంచి ఫలితాన్ని వెల్లడించి..అన్ని వార్డులూ ఏకగ్రీవం అయి ఉంటే.. ఉప సర్పంచి ఎన్నికను నిర్వహించాలి. గ్రామాల్లో కక్షలకు తావులేకుండా చూసుకోవడం లక్ష్యంగా.. ఏకగ్రీవాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలనూ అందజేస్తూ ఉంటుంది. కొన్నిచోట్ల వేలం ద్వారా.. ఎవరు ఎక్కువ సొమ్ముకు పదవిని పాడుకుంటే వారికి కట్టబెట్టే పద్ధతులను అనుసరిస్తుండటంతో ఎన్నికల సంఘం ప్రస్తుత ఎన్నికల్లో ఈ తరహా నిబంధనలను విధించింది.

పోలింగ్ కేంద్రాల మార్పుల అధికారం కలెక్టర్లకు..

పంచాయతీ ఎన్నికల కోసం ఇప్పటికే ప్రకటించిన పోలింగ్ కేంద్రాల్లో అవసరమనుకొంటే జిల్లాల కలెక్టర్లు మార్పులు చేయవచ్చు. మార్పులపై తొలుత అక్కడ పోటీలో ఉన్న అభ్యర్థులతో చర్చించి, సవరణల అనంతరం ఆ సమాచారాన్ని తిరిగి వారికి చేరవేయాలి. ఇప్పటికే ప్రకటించిన పోలింగ్ కేంద్రాల్లో కొన్నింటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చాల్సి ఉందంటూ జిల్లాల నుంచి ప్రతిపాదనలు రావటంతో ఎన్నికల సంఘం తాజాగా కొన్ని నిర్ణయాలను తీసుకొంది. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండటంతో మొత్తం 1,13,190 పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. సర్పంచి, వార్డు సభ్యుల పదవులన్నీ ఏకగ్రీవమైనచోట ఇక పోలింగ్ కేంద్రాల ఆవశ్యకత ఉండదు కాబట్టి, ఇప్పటికే ఎన్నికల సంఘం ప్రకటించిన వాటిలో కొన్ని కేంద్రాలు తగ్గనున్నాయి. మరోవైపు ఇప్పటికే ప్రకటించిన వాటిలోని కొన్ని కేంద్రాలు సరైన వసతులు గల ప్రాంతాలు, భవనాల్లో లేవంటూ యాదాద్రి భువనగిరి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్ల నుంచి విజ్ఞప్తులు రావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట్ల మార్పులకు ఎన్నికల సంఘం అనుమతించింది. తాజా మార్గదర్శకాల ప్రకారం.. జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే ప్రకటించిన పోలింగ్ కేంద్రాల పరిధిలోని అభ్యర్థులతో తొలుత సంప్రదించి, ఆ తరువాతే ఆయా పోలింగ్ కేంద్రాలను ఏ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారో ప్రకటించాలి. అభ్యర్థులకు ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలిపి, మార్పులపై విస్తృత ప్రచారం చేయాలి.

నేను సర్పంచిగా కొనసాగాలా.. వద్దా?

- 2003లో ఆలగడప పంచాయతీలో ప్రజాభిప్రాయ సేకరణ
- జనామోదం పొందిన వేనేపల్లి పాండురంగారావు

ఈనాడు డిజిటల్– హైదరాబాద్

ఎన్నికల్లో గెలుపొందాక ప్రజాప్రతినిధులు అయిదేళ్ల అధికారం చెలాయించాలనుకోవడం సహజం. సగం పదవీకాలం ముగిశాక తమ పనితీరు ఎలా ఉంది, పదవిలో కొనసాగాలా, వద్దా అని ఓటింగ్ నిర్వహించే ధైర్యం ఎవరూ చేయరు. కానీ దేశంలో మొదటిసారిగా ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించిన సర్పంచిగా తెలంగాణ మట్టి మనుషుల వేదిక వ్యవస్థాపకుడు వేనేపల్లి పాండు రంగారావు గుర్తింపు పొందారు. ప్రజాభిప్రాయం తనకు వ్యతిరేకంగా వస్తే సర్పంచి పదవి నుంచి తప్పుకోవాలని భావించారు. ప్రజలు అనుకూలంగా తీర్పునివ్వడంతో 2006 వరకు పూర్తి పదవీకాలం కొనసాగారు. ఆఖర్లో మరోసారి ప్రజాభిప్రాయం కోరినా ఫలితం మారలేదు.



పాండురంగారావు

లిమ్కా బుక్‌లో చోటు

2001 పంచాయతీ ఎన్నికల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామస్థులు పాండు రంగారావును సర్పంచిగా గెలిపించారు. అప్పుడు ఆయనకు 1,600 ఓట్లు వచ్చాయి. వేనేపల్లి తన పాలనాకాలంలో విద్య, వైద్య సేవలను మెరుగుపర్చారు. సాగునీటి కాల్వల మరమ్మతులు చేయించారు. మద్యం, బహిరంగ ధూమపానం, గుట్కాలపై నిషేధం విధించారు. రెండేళ్ల పదవీకాలం పూర్తయ్యాక తన పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారో, లేదో తెలుసుకోవాలనుకున్నారు. 2003 ఆగస్టు 17న జన విజ్ఞానవేదిక, మానవ హక్కుల వేదిక, లోక్‌సత్తా వంటి సామాజిక సంస్థల పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. ఇందుకు అయిన రూ.3 వేల ఖర్చును ఆయనే భరించారు. 'ఉండాలి' 'వద్దు' అనే ఐచ్ఛికాల ద్వారా ఓటర్లు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. మొత్తం 1,789 ఓట్లు పోలవ్వగా వేనేపల్లికి అనుకూలంగా 1,710, ప్రతికూలంగా 73 ఓట్లు వచ్చాయి. ఆరు ఓట్లు చెల్లుబాటు కాలేదు. తొలిసారిగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి గెలిచిన సర్పంచిగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్-2006లో చోటు సంపాదించారు.

ఒకసారే పదవి చేపట్టాలని

ఏ పదవైనా ఒకసారి మాత్రమే చేపట్టాలనేది పాండురంగారావు సిద్ధాంతం. అందుకే పదవీకాలం ముగిశాక మళ్లీ పోటీ చేయలేదు. ప్రస్తుతం ఎంతో మంది ప్రజాప్రతినిధిని కావాలంటూ పాకులాడటం సరికాదని, ప్రజలే మెచ్చి ఎన్నికల్లో నిలబెట్టి నమ్మకంతో గెలిపిస్తే గౌరవంగా ఉంటుందనేది ఈయన అభిప్రాయం. 53 ఏళ్ల వయసున్న వేనేపల్లి తన స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. పర్యావరణం, ఇతర సామాజిక సమస్యలపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం 'తెలంగాణ కావలెను' అనే అంశంపై 2008 నవంబరులో, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల పనితీరుపై 2010 ఫిబ్రవరిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

తనిఖీల్లో చిక్కకుండా తుపాకీతో విమాన ప్రయాణం

వాషింగ్టన్: అమెరికాలో ఓ వ్యక్తి భద్రతా అధికారుల కళ్లు గప్పి తుపాకీతో విమాన ప్రయాణం చేయడం కలకలం సృష్టించింది. ఈ నెల 2న అట్లాంటాలోని హార్ట్స్‌ఫీల్డ్-జాక్సన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఓ ప్రయాణికుడు తుపాకీతో వచ్చాడు. ప్రభుత్వరంగ సంస్థ 'ట్రాన్స్‌పోర్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్(టీఎస్‌ఏ)' చెక్ పాయింట్ వద్ద తనిఖీలు నిర్వహించిన అధికారులు ఆయుధాన్ని గుర్తించలేకపోయారు. సదరు వ్యక్తి విమానంలో అట్లాంటా నుంచి టోక్యోకు ప్రయాణించాడు. అక్కడి అధికారుల తనిఖీల్లో తుపాకీ బయటపడింది. వెంటనే వారు టీఎస్‌ఏకు సమాచారం అందించారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా వేతనాలు అందకపోవడంతో టీఎస్‌ఏ సిబ్బంది చాలామంది విధులకు గైర్హాజరవుతున్నారని, ఫలితంగా విమానాశ్రయాల్లో తనిఖీలు తూతూమంత్రంగా సాగుతున్నాయని ప్రస్తుతం ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా ఘటన దాని పరిణామమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. టీఎస్‌ఏ మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించింది. విధులకు హాజరవుతున్న సిబ్బంది సంఖ్య తక్కువగా ఏమీ ఉండటం లేదని, పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపింది. అట్లాంటా విమానాశ్రయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించినట్లు ప్రకటించింది.

భూముల లెక్కలపై ఆరా

- అన్నిరకాల సమాచారం సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం
- పాసుపుస్తకాల పంపిణీ, తప్పులపై దృష్టి
- 'ధరణి'లో అప్‌లోడ్ చేసింది లేనిదీ వివరాల సేకరణ

ఈనాడు, హైదరాబాద్: మీ మండలంలో ఎన్ని పాసుపుస్తకాలు పంపిణీ చేశారు? వాటిల్లో తప్పులున్నవి ఎన్ని? పట్టా భూమి విస్తీర్ణం ఎంత? ఎంత విస్తీర్ణం ధరణి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు.. ఇలా సమగ్ర భూ వివరాలను తహసీల్దార్ల నుంచి రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం గుట్టుగా సేకరిస్తోంది. దీనికోసం మండల రెవెన్యూ సిబ్బందికి 36 అంశాలతో కూడిన చిట్టాను అందించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ 2017 జూన్‌లో రాష్ట్రంలోని ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు ప్రారంభించారు. కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లను కట్టడి చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దానిలో భాగంగానే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలను కలిపి ఏకీకృత సేవల అమలుకు ధరణి వెబ్‌సైట్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతేగాక భూ దస్త్రాలను శుద్ధిచేసేందుకు భూముల ప్రక్షాళన కార్యక్రమాన్ని(ఎల్‌ఆర్‌యూపీ) నిర్వహించింది. అంత వరకు బాగానే ఉన్నా భూముల సమాచారాన్ని ఆన్‌లైన్ చేసే క్రమంలో ఇబ్బడిముబ్బడిగా తప్పులు దొర్లాయి. దీంతో కొత్తగా ముద్రించిన పాసుపుస్తకాల్లో తప్పులు చోటుచేసుకున్నాయి. చాలా జిల్లాల్లో తప్పులు దొర్లిన వాటినే పంపిణీ చేశారు. కొన్నిచోట్ల భూముల వివరాలను ఆన్‌లైన్‌లోకి చేర్చలేదు. ధరణి ప్రాజెక్టు నేటికీ పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. ఇప్పటికి 53 లక్షల పాసుపుస్తకాలను మాత్రమే పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టిసారించినట్లు తెలిసింది. భూముల సమాచారం అంతా జిల్లా కలెక్టరేట్లు, రాష్ట్ర రెవెన్యూ శాఖ వద్ద ఉన్నప్పటికీ మండల స్థాయి నుంచి మళ్లీ సేకరిస్తుండటంపై రెవెన్యూ వర్గాల్లో అనేక రకాల చర్చలు జరుగుతున్నాయి.

ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యానికి బ్యాంకు మూల్యం చెల్లించాల్సిందే

రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తీర్పు

ఈనాడు, హైదరాబాద్: వ్యాపార నిర్వహణలో భాగంగా ఖాతాదారుడు తీసుకున్న రుణానికి ఒప్పందం ప్రకారం బ్యాంకు బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించాల్సి ఉందని, అలా చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి నష్టానికి కారణమైనప్పుడు దానికి మూల్యం చెల్లించాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇటీవల తీర్పు వెలువరించింది. ప్రీమియం చెల్లించకపోవడంతో అగ్నిప్రమాదంలో కలిగిన రూ.43 లక్షల నష్టాన్ని చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ ఖమ్మంలోని వైఎన్ ప్రెస్ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసింది. దీనిపై కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్, సభ్యులు కె.రమేశ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఖమ్మం కెనరా బ్యాంకు నుంచి రూ.20 లక్షల వరకు ప్రెస్ నిర్వహణ నిమిత్తం వైఎన్ ప్రెస్ రుణం తీసుకుంది. రుణం మొత్తం నుంచి రూ.42 లక్షలకు యునైటెడ్ బీమా కంపెనీకి ప్రీమియం బ్యాంకు చెల్లిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో 2015 మార్చిలో ప్రెస్‌లో అగ్నిప్రమాదం వాటిల్లింది. బీమా పరిహారం నిమిత్తం బ్యాంకును ఆశ్రయిస్తే ప్రీమియం చెల్లించలేదని బ్యాంకు తెలిపింది. దీంతో వైఎన్ ప్రెస్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ వాదనతో బ్యాంకు విభేదిస్తూ ప్రెస్ వాణిజ్య వ్యవహారాలు నిర్వహిస్తోందని, వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి రాదని తెలిపింది. ఈ వాదనతో విభేదించిన ధర్మాసనం.. ప్రీమియం సొమ్ము చెల్లించడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్పష్టంచేసింది. పోలీసులు రూ.6.8 లక్షల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ పరిహారంగా రూ.7 లక్షల మొత్తాన్ని కెనరా బ్యాంకు వైఎన్ ప్రెస్‌కు అందజేయాలంటూ తీర్పు వెలువరించింది. ఫిర్యాదు చేసినప్పటి నుంచి 9 శాతం వడ్డీతో సహా రూ.10 వేలు నష్టపరిహారంగా చెల్లించాలంటూ ఆదేశించింది. ఇందులో బీమా కంపెనీకి ఎలాంటి బాధ్యత లేదని తేల్చి చెప్పింది.



ఎమ్మెస్సార్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీ కేవీపీ రామచంద్రరావు, సమ్మిరెడ్డి

ఘనంగా ఎమ్మెస్సార్ పుట్టిన రోజు వేడుకలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.సత్యనారాయణరావు(ఎమ్మెస్సార్) 87వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఎంపీ కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ స్పీకర్ కె.ఆర్.సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పాతూరి సుధాకర్‌రెడ్డి, హైదరాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెస్సార్ దంపతులను ఘనంగా సత్కరించారు.

ఉత్తమ్.. సంక్రాంతి శుభాకాంక్షలు

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగను ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మూడో పెళ్లి కోసం ముప్పుతిప్పలు పెడుతున్నాడు

భర్తపై ఫిర్యాదు చేసిన ఇద్దరు భార్యలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: మూడో పెళ్లి కోసం ఇద్దరు భార్యలను చిత్రహింసలు పెడుతున్న ఓ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. మరో పెళ్లి చేసుకునేందుకు అనుమతి పత్రంపై సంతకం చేయాలంటూ హింసిస్తుండటంతో నిందితుడి రెండో భార్య ఎస్సార్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. బోరబండ సైట్-3కి చెందిన మహ్మద్ ఖాన్(38) మొదటి భార్య షబీనాబేగం ఉండగానే నాలుగేళ్ల కిందట రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు సంతానం కాగా రెండో భార్య రుక్సార్ బేగంకు నలుగురు పిల్లలున్నారు. ఇటీవల మూడో వివాహం చేసుకుంటానని, అందుకు అనుమతి పత్రంపై సంతకం చేయాలంటూ రెండో భార్యను వేధించసాగాడు. బాలింత అని చూడకుండా సోమవారం ఆమెను తీవ్రంగా కొట్టాడు. సంతకం చేయకపోతే భవనంపై నుంచి తోసేస్తానని బెదిరించాడు. మొదటి భార్యను కూడా ఇలాగే వేధిస్తుండటంతో ఇద్దరు కలిసి తమ పిల్లలను తీసుకుని బల్కంపేటలోని ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించారు. సంస్థ అధ్యక్షురాలు టి.లత వీరిని వెంట తీసుకుని ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నింగిలోకి రంగుల చుక్కలు



అంతర్జాతీయ ఉత్సవంలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం వివిధ ఆకృతుల్లో కనువిందు చేస్తున్న పతంగులు

భాగ్యనగరంలో మిఠాయిల ఘుమఘుమలు



అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌లో మిఠాయిలు కొనుగోలు చేస్తున్న ప్రజలు. అంతరచిత్రంలో ప్రదర్శనలో ఉంచిన కజ్జికాయలు, అరిసెలు



ప్రధాని నరేంద్ర మోదీకి సోమవారం తొలి 'ఫిలిప్ కాట్లర్' పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అవార్డు కమిటీ సభ్యులు

ప్రధాని మోదీకి తొలి 'ఫిలిప్ కాట్లర్' పురస్కారం

దిల్లీ: మొట్టమొదటి 'ఫిలిప్ కాట్లర్' పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ అందుకున్నారు. 'ప్రజలు (పీపుల్), ప్రయోజనం (ప్రాఫిట్), ప్రపంచం (ప్లానెట్)' కోసం చేసిన కృషి ఆధారంగా.. దేశాధినేతల్లో ఒకరికి ఏటా ఈ పురస్కారాన్ని అందజేస్తారు. భారత్ ఆర్థిక, సామాజిక, సాంకేతిక ప్రగతి కోసం మోదీ చేసిన నిస్వార్థ సేవకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. మోదీ దార్శనిక నాయకత్వంలో భారత్ నవకల్పనకు కేంద్రంగా మారిందని.. దేశంలో డిజిటల్ విప్లవం కూడా వచ్చిందని అవార్డు కమిటీ పేర్కొన్నట్లు వివరించింది. ప్రముఖ ఆర్థికవేత్త, మార్కెటింగ్ నిపుణుడు, అమెరికన్ ప్రొఫెసర్ ఫిలిప్ కాట్లర్ పేరిట ఈ అవార్డు ఏర్పాటైంది. ఎమొరీ వర్సిటీ (జార్జియా) ప్రొఫెసర్ జగదీశ్ సేథ్ మోదీకి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానికి కేంద్ర మంత్రులు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, పీయూష్ గోయల్, స్మృతి ఇరానీ, ప్రకాశ్ జావడేకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

మా ప్రభుత్వానికి ఎన్ని మార్కులు వేస్తారు?

'నమో' యాప్‌లో ప్రధాని మోదీ సర్వే

దిల్లీ: త్వరలో లోక్‌సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజల నాడిని తెలుసుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'నమో' యాప్ ద్వారా సర్వే చేపట్టారు. తమ ప్రభుత్వ పాలనతోపాటు వివిధ అంశాలపై నేరుగా పౌరుల నుంచే ఆయన అభిప్రాయాలను ఆహ్వానించారు. 'మోదీ ప్రభుత్వ పాలనకు మీరు ఎన్ని మార్కులు వేస్తారు?', 'ప్రతిపక్షాల మహాకూటమి ప్రభావం చూపుతుందని భావిస్తున్నారా?' వంటి ప్రశ్నలు ఈ సర్వేలో ఉన్నాయి. "మీ అభిప్రాయాలు చాలా ముఖ్యం. కీలకమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. సర్వేలో మీరు పాల్గొని, పాలుపంచుకోవాలని ఇతరులకూ చెప్పండి" అంటూ ట్విటర్, ఫేస్‌బుక్‌ల్లో వీడియోల ద్వారా మోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలోనూ భాజపా ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకోనున్నట్లు సమాచారం. ప్రతికూల పవనాలు ఉన్న చోట్ల సిట్టింగ్ ఎంపీలనూ మార్చే ఆస్కారమున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆండ్రాయిడ్, ఐఫోన్ వినియోగదారులకు 'నమో' యాప్ అందుబాటులో ఉంది.

పాకిస్థాన్‌లో భారత హైకమిషనర్‌పై నిఘా

దిల్లీ: పాకిస్థాన్‌లో భారత హైకమిషనర్, డిప్యూటీ హైకమిషనర్‌లను స్థానిక భద్రత అధికారి దగ్గరగా అనుసరించడం, వారిపై నిఘా పెట్టడంపై భారత హైకమిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఆందోళనను తెలియజేస్తూ పాక్ విదేశాంగ కార్యాలయానికి నిరసన లేఖను పంపింది. డిసెంబర్ 4న ఓ వివాహ విందులో పాల్గొన్న సమయంలో భారత హైకమిషనర్, డిప్యూటీ హైకమిషనర్‌లను పాక్ అధికారి వెంబడించినట్లు పేర్కొంది. ఓ దౌత్యవేత్త ఫేస్‌బుక్ ఖాతాలోకి చొరబడేందుకు హ్యాకర్లు పదే పదే ప్రయత్నించిన వ్యవహారాన్ని కూడా ఈ లేఖలో భారత హైకమిషన్ లేవనెత్తింది. ఈ చర్యలు గోప్యతకు భంగం కలిగించడం, వేధింపులకు పాల్పడటమేనని.. పాక్ విదేశాంగ కార్యదర్శి, భారత హైకమిషనర్‌ల మధ్య గత ఏడాది కుదిరిన అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది.

రఫేల్ తీర్పును సమీక్షించండి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఆప్ నేత

దిల్లీ: రఫేల్ వ్యవహారంపై ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రఫేల్ వ్యవహారంలో అవినీతి జరిగిందని, దానిపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ గతంలో నాలుగు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై తీర్పు వెలువరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి ఆధ్వర్యంలోని ధర్మాసనం... ఈ ప్రక్రియలో అనుమానించాల్సింది ఏమీ లేదని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం సమర్పించిన తప్పుడు సమాచారం ఆధారంగా ధర్మాసనం ఆ తీర్పు ఇచ్చిందని, అందువల్ల దాన్ని సమీక్షించాలని సంజయ్ సింగ్ కోరారు. సీల్డు కవరులో ఎవరి సంతకాలూ లేకుండా ప్రభుత్వం సమర్పించిన సమాచారాన్ని పిటిషన్‌దార్లకు చూపించకపోవడం సహజన్యాయ సూత్రాలను ఉల్లంఘించడమేనన్నారు. ఆ సమాచారంపై అభిప్రాయాలు చెప్పే అవకాశాన్ని కల్పించలేదని చెప్పారు.

16 కుక్కపిల్లల్ని కొట్టి చంపిన ఇద్దరు మహిళలు

ప్రభుత్వాసుపత్రిలో ఘటనపై చక్కర్లు కొడుతున్న వీడియో

కోల్‌కతా: ఒక ఆస్పత్రి ఆవరణలో 16 కుక్కపిల్లలను ఇద్దరు మహిళలు కర్కశంగా కర్రలతో కొట్టి చంపారు. కర్రలతో వెంటాడి చితకబాదడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. కోల్‌కతాలోని ఎన్.ఆర్.ఎస్.వైద్యకళాశాల-ఆసుపత్రిలో జరిగిన ఈ క్రూర చర్యను ఆసుపత్రికి పక్కనే ఉన్న దంత కళాశాల హాస్టల్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీశారు. దాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. మహిళల కర్కశత్వంపై విమర్శలు వెల్లువెత్తడంతో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ అమానవీయ చర్యపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు కళాశాల యాజమాన్యం ..డిప్యూటీ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది.

యూపీలో ఎన్‌కౌంటర్లపై దర్యాప్తునకు వినతి


దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ)లో పోలీసు ఎన్‌కౌంటర్లపై కోర్టు పర్యవేక్షణలో సీబీఐ లేదా ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సాధ్యమైనంత త్వరగా పరిశీలించడానికి సుప్రీం కోర్టు సోమవారం అంగీకరించింది. పిటిషనర్ సమర్పించిన పత్రాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై నిశిత పరిశీలన అవసరమని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే నెల 12కు వాయిదా వేసింది. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) ఈ పిటిషన్‌ను వేసింది. ఇందులో తాము భాగస్వాములమవుతామంటూ మరో సంస్థ చేసిన వినతిని తదుపరి విచారణ రోజున పరిశీలన చేస్తామని ధర్మాసనం పేర్కొంది. సదరు ఎన్‌కౌంటర్లపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నుంచి నివేదిక కోరే అంశంపైనా కోర్టు నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిబంధనలనూ పాటించిందని యూపీ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ పేర్కొన్నారు.

చరిత్రాత్మక కవాతు



వీరంతా అసోం రైఫిల్స్‌లోని మహిళా విభాగం సైనికులు. గణతంత్ర కవాతులో పాలుపంచుకున్న 'తొలి మహిళా పటాలం'గా వీరు చరిత్ర సృష్టించబోతున్నారు. దీని కోసం ఆదివారం రాజ్‌పథ్‌లో ఇలా సన్నద్ధం అవుతున్నారు.

'అగస్త్యర్‌కూడమ్'ను అధిరోహిస్తున్న తొలి మహిళ



కేరళలోని అగస్త్యర్‌కూడమ్ శిఖరం

- ఎన్నో ఏళ్లుగా స్త్రీలకు నిషేధం
- కేరళ హైకోర్టు ఉత్తర్వు ఆధారంగా అధిరోహణ

తిరువనంతపురం: ఎంతో కాలం నుంచి మహిళలకు ప్రవేశానుమతి లేని కేరళలోని'అగస్త్యర్ కూడమ్' (అత్యంత ఎత్తైన రెండో పర్వత శిఖరం)ను కె.ధన్యా సనాల్ (38) అనే వనిత తొలిసారిగా సోమవారం నుంచి ఎక్కడం ప్రారంభించారు. అగస్త్యర్‌కూడమ్‌పైకి వెళ్లడానికి మహిళలకు అనుమతిపై ఉన్న నిషేధాన్ని తొలగించిన కేరళ హైకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని ధన్యా సనాల్ ఆరోహణం మొదలుపెట్టారు. ధన్యా సనాల్ 2012 బ్యాచ్‌కు చెందిన 'ఇన్ఫర్మేషన్ సర్వీసు అధికారి'. ప్రస్తుతం ఆమె తిరువనంతపురంలో రక్షణ ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం జీన్స్, టీ షర్టు ధరించి ఓ చిన్న బ్యాగు ధరించి ధన్యా శిఖరారోహణం మొదలెట్టారు.

ఈ పర్వతశిఖరాన్ని మహిళలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఎక్కరాదంటూ ఎన్నో తరాల నుంచి గిరిజన సంప్రదాయం నిషేధిస్తోంది. అగస్త్యర్‌కూడమ్ శిఖరానికి వెళ్లే ప్రాంతం దట్టమైన అడవి కావడంతో ఇన్నేళ్ల నుంచీ మహిళలకు అనుమతిని ఇవ్వలేదని వన్యప్రాణిసంరక్షణ కేంద్రం ఉద్యోగి ఒకరు తెలిపారు. నెయ్యార్ వన్యప్రాణి సంరక్షణ ప్రాంతంలో అగస్త్యర్‌కూడమ్ ఉంది 'యునెస్కో' దీనిని వారసత్వ ప్రాంతంగా ప్రకటించింది. ఈ శిఖరాన్ని మహిళలు ఎక్కడానికి స్థానిక కని గిరిజన తెగవారు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించడం లేదు. అగస్త్య మహాముని ఇక్కడి ప్రాణికోటిని సదా సంరక్షిస్తూ ఉంటారన్నది వారి నమ్మకం. పర్వతశిఖరాగ్రాన అగస్త్య మహాముని ఆలయం ఉంది. తనకు శిఖరారోహణం ఇష్టమని, గుడిని చూడాలన్న ఉద్దేశమేమీ లేదని, స్థానికుల మనోభావాలను దెబ్బతీయాలన్న ఉద్దేశం అసలే లేదని ప్రకటించారు.



జ్యోతి దర్శనం

శబరిమలలోని పొన్నంబలమేడు కొండపై మకర జ్యోతి సోమవారం దర్శనమిచ్చింది. ఈ పవిత్ర ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు పెద్దఎత్తున భక్తులు పోటెత్తారు.

మైక్రోవేవ్ స్పెక్ట్రం కేటాయింపులో

భారీ కుంభకోణం!

- ప్రభుత్వ ఖజానాకు రూ.69,381 కోట్ల నష్టం: కాంగ్రెస్
- సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో విచారణ జరపాలని డిమాండ్

దిల్లీ: మైక్రోవేవ్ స్పెక్ట్రం (ఎండబ్ల్యూఏ) కేటాయింపులో భారీ అవినీతి చోటుచేసుకుందని, ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు మొత్తం రూ.69,381 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. ప్రభుత్వ చర్యను కాగ్ ఆక్షేపించిందని, దీనికి మోదీ సమాధానం చెప్పాలని నిలదీసింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖెడా సోమవారమిక్కడ మీడియాతో మాట్లాడుతూ- ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టెలికాం శాఖపై కాగ్ ఈ నెల 8న పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. ఎండబ్ల్యూఏ కేటాయింపు వ్యవహారంలో ప్రభుత్వ తీరును ఆక్షేపించింది. నిబంధనలకు విరుద్ధంగా 2015లో ఈ స్పెక్ట్రంను ముందు వచ్చిన వారికి ముందు (ఎఫ్‌సీఎఫ్‌ఎస్) పద్ధతిలో కట్టబెట్టారని తప్పు పట్టింది. అయితే... కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాత్రం తన హయాంలో టెలికాం విభాగం ప్రతి స్పెక్ట్రంను వేలం ద్వారానే కేటాయించిందని చెప్పుకొచ్చారు. ఖెడా ఈ విషయాలన్నింటిని ఉటంకిస్తూ- 'మైక్రోవేవ్ స్పెక్ట్రం కోసం టెలికాం విభాగం మొత్తం 101 దరఖాస్తులు వచ్చాయి. కానీ, ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదు. కేవలం ముందు వచ్చారన్న కారణంతో ఓ సంస్థకు వాటిని కట్టబెట్టారు. ఫలితంగా ప్రభుత్వం రూ.69,381 కోట్ల మేర నష్టపోయింది. రక్షణ దళాలకు స్పెక్ట్రం ఛార్జీలను మినహాయించని ప్రభుత్వం.. సదరు సంస్థకు మాత్రం రూ.45,000 కోట్ల మేర ఎలా మినహాయింపు ఇస్తుంది? 2జీ స్పెక్ట్రం వ్యవహారానికి సంబంధించి 2012లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కూడా ఈ కేటాయింపు విరుద్ధం. తమది అవినీతి లేని సర్కారు అని చెబుతున్న ప్రధాని మోదీ... దీనికి ఏం సమాధానం చెబుతారు?" అని ప్రశ్నించారు.

ఐక్యతను చాటేలా మాయా పుట్టినరోజు

- భారీగా ఏర్పాట్లు చేస్తున్న బీఎస్పీ శ్రేణులు

లఖ్‌నవూ: బీఎస్పీ అధినాయకురాలు మాయావతి మంగళవారం 63వ జన్మదినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేశాయి. ఈ వేడుకల్లో ఆమె రాజకీయ పరిస్థితులు, సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు వంటి అంశాలపై పార్టీ వైఖరిని వెల్లడిస్తారని భావిస్తున్నారు. విపక్షాలు తమ ఐక్యతను చాటుకునేందుకు ఈ వేడుకను ఉపయోగించుకునే అవకాశం ఉంది.

మాయావతి జన్మదినోత్సవం కోసం లఖ్‌నవూలో భారీగా హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. మంగళవారం ఆమె పాత్రికేయ సమావేశాన్ని నిర్వహిస్తారు. తాను రచించిన 'ఎ ట్రావెలోగ్ ఆఫ్ మై స్ట్రగుల్ రిడెన్ లైఫ్ అండ్ బీఎస్పీ మూవ్‌మెంట్' పుస్తకానికి సంబంధించిన 14న సంపుటాన్ని ఆవిష్కరిస్తారు. ఎస్పీ, ఆర్‌ఎల్‌డీ, ఐఎన్‌ఎల్‌డీ, జేడీఎస్ తదితర పార్టీల నేతలను ఈ వేడుకలకు ఆహ్వానిస్తారని భావిస్తున్నారు. ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌లు మాయావతిని కలిసి శుభాకాంక్షలు చెబుతారు. ఎస్పీ, బీఎస్పీల మధ్య పొత్తు చిగురించిన నేపథ్యంలో జిల్లా స్థాయిలో ఇరు పార్టీల నేతలు ఉమ్మడిగా వేడుకలు నిర్వహిస్తారని భావిస్తున్నారు. అనంతరం మాయావతి దిల్లీ వెళ్లి, తన కుటుంబ సభ్యులతో గడుపుతారు.



లఖ్‌నవూలో మాయావతి ఆశీర్వాదం తీసుకుంటున్న ఆర్జేడీ నాయకుడు తేజస్వి

గతవారం నుంచి లఖ్‌నవూ పర్యటనలో ఉన్న మాయావతి పార్టీ కార్యకర్తలు, నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ తీరికలేకుండా గడిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎస్పీ-బీఎస్పీ పొత్తును దెబ్బతీసేందుకు భాజపా ప్రయత్నిస్తుందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని ఆమె స్పష్టంచేసినట్లు పార్టీ నేత ఒకరు చెప్పారు. మాయావతి పుట్టినరోజును 'జన్ కల్యాణ్‌కారి దివస్'గా పార్టీ కార్యకర్తలు జరుపుకొంటారని, అణగారిన వర్గాలకు సాయం అందిస్తారని తెలిపారు.

బీ'ఎస్పీ' కూటమికి తేజస్వి సంపూర్ణ మద్దతు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కూటమికి ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భాజపాకు వ్యతిరేకంగా వికసించిన ఈ పొత్తు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఆదివారంరాత్రి ఆయనిక్కడ బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కూటమి స్ఫూర్తి కేవలం ఉత్తర్‌ప్రదేశ్‌కే పరిమితం కాలేదని, మిగతా రాష్ట్రాలకూ ఇది విస్తరించిందన్నారు. యూపీలో కొన్ని సీట్లను తమకు సర్దుబాటుచేస్తే, ప్రతిగా బిహార్‌లో కొన్నింటిని బీఎస్పీకి కేటాయించాలని ఆర్జేడీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు చర్చలు జరిగినట్లు సమాచారం. తేజస్వి మద్దతు తమ కూటమిని మరింత బలోపేతం చేస్తుందని అఖిలేశ్ వ్యాఖ్యానించారు.

రాణాను రప్పించనున్న భారత్!

- అమెరికాలో జైలుశిక్ష పూర్తికాకముందే తీసుకొచ్చేందుకు యత్నాలు

వాషింగ్టన్: 2008 నాటి ముంబయి దాడుల కేసులో దోషిగా తేలి అమెరికాలో జైలుశిక్ష అనుభవిస్తున్న కెనడా జాతీయుడు తహవ్వుర్ హుస్సేన్ రాణా(58)ను మనదేశానికి రప్పించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ముంబయిలో ఉగ్ర దాడులకు కుట్రపన్నిన ఆరోపణలపై 2009లో రాణాను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. లష్కరే తొయిబా ఉగ్రసంస్థకు సహకరించినట్లు దర్యాప్తులో తేలడంతో అతడికి జైలుశిక్ష పడింది. 2021 డిసెంబరులో విడుదల కానున్నట్లు సమాచారం. కారాగారవాసం పూర్తి కావడానికి ముందే అతణ్ని మనదేశానికి తీసుకొచ్చేందుకు అధికారవర్గాలు కృషిచేస్తున్నాయి. దిల్లీలోని జాతీయ డిఫెన్స్ కళాశాలతోపాటు పలు నగరాల్లోని చాబాద్ హౌస్‌లపై దాడులకు కుట్ర పన్నిన ఆరోపణలపై రాణాను భారత్‌కు రప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

దిల్లీలో రూ.70 దాటిన పెట్రోల్

దిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరుగుతుండటంతో, మనదేశంలో వరుసగా ఐదోరోజైన సోమవారం ఇంధన ధరలు మండాయి. దిల్లీలో లీటరు పెట్రోల్ ధర మళ్లీ రూ.70 దాటింది. పెట్రోల్‌పై 38పైసల వరకు, డీజిల్‌పై 49పైసల వరకు పెంచినట్లు ప్రభుత్వరంగ చమురు సంస్థలు ప్రకటించాయి. దీంతో లీటరు పెట్రోల్ ధర చెన్నైలో రూ72.79, దిల్లీలో రూ.70.13, హైదరాబాద్‌లో రూ74.40కు చేరింది. డీజిల్ ధర చెన్నైలో రూ67.78, దిల్లీలో రూ.64.18, కోల్‌కతాలో రూ.65.95, ముంబయిలో రూ.67.18, హైదరాబాద్‌లో రూ69.77కు పెరిగింది.

కాంగ్రెస్, ఎన్‌సీపీ పొత్తు ఖరారు

- కూటమిలో ఎంఎన్‌ఎస్ లేదన్న పవార్

ముంబయి: మహారాష్ట్రలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదిరింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాల్లోనూ 45 సీట్ల పంపకానికి సంబంధించి ఇప్పటికే అవగాహన కుదిరింది. సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ రహస్యంగా చర్చలు జరిపారు. పార్టీల బలాబలాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరిగింది. మిగిలిన మూడు సీట్లపై కొనసాగుతున్న చర్చలు కొలిక్కి వస్తే ఏ పార్టీకి ఎన్ని స్థానాలు, ఏయే స్థానాలు అన్న విషయాలు వెల్లడవుతాయి. దీనిపై ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ తమకు దక్కిన సీట్ల కోటా నుంచి ఇతర చిన్న పార్టీలకు స్థానాలు కేటాయిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వారి కోటా నుంచి వామపక్షాలకు సీట్లు ఇస్తుందని తెలిపారు. రాజ్‌ఠాక్రే ఆధ్వర్యంలోని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్)తో పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో మహాకూటమి ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఇతర చిన్న పార్టీలతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్టు చెప్పారు. రాజు శెట్టి ఆధ్వర్యంలోని స్వాభిమాని షేత్కారీ సంఘటన్ పార్టీకి కొల్హాపూర్ జిల్లాలోని హత్కానంగ్లే స్థానాన్ని కేటాయించనున్నట్టు తెలిపారు. రాజు శెట్టి గతంలో ఎన్డీయే పక్షాన ఉండగా, ఆ కూటమికి రాజీనామా చేసి ఎన్‌సీపీకి మద్దతు ఇస్తున్నారు. ఆయన వార్ధా స్థానాన్ని కూడా అడుగుతున్నారు కదా అని ప్రశ్నించగా, ఆ సీటు కాంగ్రెస్ కోటాలోకి వెళ్లిందని, దానిపై ఆ పార్టీయే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వామపక్షాలతో పాటు, బహుజన్ వికాస్ అఘాడి వంటి పార్టీలతో కాంగ్రెస్ చర్చలు జరుపుతుందని చెప్పారు. ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రేతో జరిపిన భేటీ వ్యక్తిగతమని శరద్ పవార్ స్పష్టం చేశారు. ఆ పార్టీ ముంబయి (వాయువ్య) స్థానాన్ని కోరిందన్న వార్తలను కొట్టిపారేశారు. దీనిపై రెండు పార్టీల మధ్య ఎలాంటి చర్చలు జరగలేదని అన్నారు.



రాహుల్ గాంధీ



శరద్ పవార్

కన్నయ్య కుమార్ దేశ ద్రోహానికి పాల్పడ్డారు

1200 పేజీల అభియోగ పత్రం సమర్పించిన దిల్లీ పోలీసులు



దిల్లీ: దేశద్రోహానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్, మరో తొమ్మిది మందిపై సోమవారం దిల్లీ పోలీసులు సుమారు 1200 పేజీల అభియోగ పత్రాన్ని సమర్పించారు. పార్లమెంటుపై జరిగిన దాడిలో సూత్రధారి అయిన అఫ్జల్ గురును ఉరితీసిన సంఘటనను గుర్తు చేసుకుంటూ 2016 ఫిబ్రవరి 9న జేఎన్‌యూ ఆవరణలో నిర్వహించిన సభలో భారత దేశ వ్యతిరేక నినాదాలు చేశారని అందులో పేర్కొన్నారు. కన్నయ్యతోపాటు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్యలపైనా అభియోగాలు నమోదయ్యాయి. వారిద్దరు అప్పట్లో జేఎన్‌యూ విద్యార్థులే. మిగిలిన ఏడుగురైన అకిబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రయీయ రసూల్, బషీర్ భట్, బర్సాత్‌లు కశ్మీర్‌కు చెందినవారు. వారంతా జామియా మిల్లియా ఇస్లామియా, ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయాల్లో చదువుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు సుమిత్ ఆనంద్ దీనిని మంగళవారం పరిశీలించనున్నారు. భారత వ్యతిరేక నినాదాలు చేస్తున్న గుంపును కన్నయ్య ప్రోత్సహించారని పోలీసులు ఆరోపించారు. భాజపా ఎంపీ మహేష్ గిరి, ఏబీవీపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వసంత్ కుంజ్ (ఉత్తర) పోలీసు స్టేషన్‌లో 2016 ఫిబ్రవరి 11న గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదయింది. దర్యాప్తు అనంతరం వీరి పేర్లతో అభియోగపత్రం రూపొందించారు. తగినన్ని ఆధారాలు లేవన్న కారణంతో మరో 36 మంది పేర్లను అభియోగపత్రంలో విడిగా పొందుపరిచారు.

చైనా మాంజాకు నలుగురి బలి

జైపుర్/అహ్మదాబాద్: పతంగులు ఎగురవేయడానికి ఉపయోగించిన చైనా దారం(మాంజా) రాజస్థాన్, గుజరాత్‌లలో సోమవారం మొత్తం నలుగురి ప్రాణాలను బలితీసుకుంది. మాంజాతో ముడిపడిన వివిధ ఘటనల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అహ్మదాబాద్, సూరత్, రాజ్‌కోట్, వడోదర జిల్లాల్లో గాలిపటాలు ఎగరేస్తూ ఇంటిపై కప్పు మీద నుంచి జారిపడి పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

గాజుతో దట్టమైన పూతవేసిన చైనామాంజా వాడకుండా రాజస్థాన్‌లో నిషేధం విధించినప్పటికీ చాలా మంది పట్టించుకోక పోవడంతో జైపుర్‌లో ఓ కుటుంబం పండుగవేళ అంతులేని విషాదంలో మునిగిపోయింది. ఇక్కడి విద్యానగర్ ప్రాంతానికి చెందిన కుశ్ అగర్వాల్(6)అనే బాలుడు స్థానిక పార్కులో ఆడుకుంటుండగా ఎవరో ఇద్దరు సోదరులు ఎగరేస్తున్న గాలిపటాల తాలూకు దారం(మాంజా) వచ్చి ఆ చిన్నారిని చుట్టుకుంది. మాంజా చిక్కును ఆ బాబు వదిలించుకునే ప్రయత్నం చేయగా అది గొంతుకు మరింత గట్టిగా చుట్టుకుని లోతైన గాయం చేసింది. వెంటనే బాబు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పక్కనే ఉన్న బండరాయి మీద పడటంతో మరింత తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనలో ముబారక్, అసిఫ్ అలీ అనే సోదరులను పోలీసులు అరెస్టు చేశారు.

ఇక, గుజరాత్‌లో జరిగిన ఉత్తరాయణ ఉత్సవాల్లో ముగ్గురు పతంగుల మాంజాకు బలైపోయారు. వీరిలో ఓ చిన్నారి కూడా ఉన్నారు. సోమవారం ఉదయం ఎనిమిదేళ్ల తేజీబ్ ఖాన్ సైకిలుపై వెళుతుండగా మాంజా వచ్చి అతడి మెడను చుట్టుకుంది. తీవ్ర గాయాలతో తేజీబ్ మృతి చెందాడు. అశోక్ పంచాల్(45) వీరేంద్రసిన్హ్ గరాసియా అనే వ్యక్తులు కూడా మాంజా చుట్టుకుని మరణించారు.

చైనా థర్మల్ ప్రాజెక్టును పక్కనపెట్టిన పాక్

ఇస్లామాబాద్: చైనా సహకారంతో నిర్మించదలపెట్టిన 1,320 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం పనులను పాకిస్థాన్ ఉపసంహరించుకొంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వానికి తెలియజేసింది. దేశంలో తగినంతగా విద్యుత్తు ఉత్పాదన జరుగుతున్నందున ఇంకా అదనంగా థర్మల్ కేంద్రాలు అవసరం లేదని పేర్కొంది. చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా కింద పూర్తిగా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గుతో ఈ ప్లాంటును నిర్మించాలని గతంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి చైనా ప్రభుత్వం 60 బిలియన్ డాలర్లు (రూ.4.24 లక్షల కోట్లు) రుణం ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్నందున ఇంత భారీ ప్రాజెక్టు చేపట్టడం భావ్యం కాదని భావించి ప్రస్తుత ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది.

రైల్వే ప్రయాణికులను హెచ్చరించేందుకు నీలం లైట్

దిల్లీ, ముంబయి: కదులుతున్న రైల్లో ఎక్కి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న ప్రయాణికులను హెచ్చరించడానికి రైల్వేశాఖ కొత్త ప్రయోగం చేస్తోంది. కోచ్ ముందుభాగంలో నీలం రంగు లైట్ వెలిగేలా ఏర్పాటు చేసింది. ఇది వెలిగితే రైలు కదలడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఎదురుగా వస్తున్న రైలు వల్ల ప్రమాదం జరగవచ్చు కాబట్టి, దూరంగా జరగండి అని హెచ్చరించడానికి కూడా ఇది ఉపయోగపడనుంది. ముంబయిలోని లోకల్‌రైల్లో కోచ్ గేట్ వద్ద ప్రస్తుతానికి దీన్ని ఏర్పాటు చేశారు. ఇది విజయవంతమైతే అన్ని కోచ్‌ల వద్ద రైల్వేశాఖ ఏర్పాటు చేయనుందని మధ్యరైల్వే ప్రధాన ప్రజాసంబంధాల అధికారి సునీల్ ఉదాసి తెలిపారు. "మెట్రో రైళ్లు, ఏసీ ఈఎంయూల్లో డోర్లు వాటికవే తెరుచుకోవడం, మూసుకుపోవడానికి ఏర్పాట్లు ఉన్నాయి. నాన్ ఏసీ ఈఎంయూ కోచ్‌లకు ఇలాంటి ఏర్పాటు వీలు కాదు. కాబట్టి నీలంరంగు లైట్ ఏర్పాటు చేస్తున్నారు" అని ఉదాసి వివరించారు.





త్రివేణీ సంగమంలో భక్తుల పవిత్ర స్నానాలు ★కుంభమేళా శిబిరంలో సిలిండర్ పేలడంతో వ్యాపిస్తున్న పొగ (అంతర చిత్రంలో.. మంటలను ఆర్పుతున్న సిబ్బంది)

కుంభమేళా కేంద్రంలో అగ్నిప్రమాదం

- 2 వాహనాలు, 9 టెంట్లు దగ్ధం

ప్రయాగ్‌రాజ్: ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా ఉత్సవం జరగనున్న ఓ కేంద్రం వద్ద సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక 'దిగంబర్ అనీ అఖాడా' వద్దగల శిబిరంలో వంటగ్యాస్ సిలిండర్ పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి. ఫలితంగా అక్కడి వేదికతోపాటు రెండు వాహనాలు, 9 టెంట్లు, కొంత సామగ్రి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక దళం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు స్పందించి మంటలను ఆర్పివేశాయి. ఈ ఘటనపై సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. అన్ని శిబిరాలను తనిఖీ చేసి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కుంభమేళా ఉత్సవాలు మంగళవారం అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

ఖజానాకు మద్యం కిక్

- గత ఏడాది భారీగా పెరిగిన విక్రయాలు
- 20శాతం అదనపు ఆదాయం
- పెరుగుదలకు ఎన్నికలూ ఓ కారణమే

రాష్ట్రంలో మద్యం విక్రయాలు గత ఏడాది ఖజానాకు అదనపు కిక్కునిచ్చాయి. 2017 జనవరి నుంచి డిసెంబర్ వరకు జరిగిన అమ్మకాలతో పోలిస్తే రూ.3,404 కోట్ల మేర ఆదాయం పెరిగింది. పండగలతో పాటు డిసెంబరులో జరిగిన ఎన్నికలు మద్యం విక్రయాలను భారీగా పెంచాయి. ఈ కారణాలతో 2018 జనవరి నుంచి డిసెంబర్ వరకు రూ.20వేల కోట్ల ఆదాయం సమకూరింది. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) అంచనా ప్రకారం 2018లో తెలంగాణ జనాభా 3.84 కోట్లుగా ఉంది. ఇందులో 18 ఏళ్లలోపు వారిని మినహాయిస్తే 2.61 కోట్ల మంది ఉన్నారు. వీరిలో 60% మంది మద్యం తాగుతున్నట్లు అంచనా వేస్తే ఏటా ఒక్కొక్కరు సగటున మద్యం కోసం రూ.13 వేలు ఖర్చు చేస్తున్నారు.



అత్యధిక విక్రయాలు జరిగిన జిల్లాలు... (రూ.కోట్లలో)

జిల్లా	2017	2018	అదనం
హైదరాబాద్	2,204	2,541	337
మేడ్చల్	1,867	2,190	323
రంగారెడ్డి	1,863	2,499	636
ఉమ్మడి నల్గొండ	1,746	2,078	332

గత రెండేళ్లలో అమ్మకాలు

సంవత్సరం	మద్యం కేసులు	బీరు కేసులు	ఆదాయం (రూ.కోట్లలో)
2017	3 కోట్లు	4.09 కోట్లు	16,596
2018	3.32 కోట్లు	4.85 కోట్లు	20,000
అదనం	32 లక్షలు	76 లక్షలు	3,404

– ఈనాడు డిజిటల్, హైదరాబాద్

అన్నదాత అండతోనే అభివృద్ధి

- వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి
- ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి
- కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామంలో సంక్రాంతి వేడుకల్లో..

ఈనాడు – తిరుపతి

రైతుల సహకారంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేపడుతున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. పోలవరంతో సహా పలు సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణానికి రైతులు ఎంతో సహకరించినట్లు గుర్తుచేశారు. సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో కలిసి తన స్వగ్రామంలో జరుపుకొనేందుకు ముఖ్యమంత్రి సోమవారం చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లికి వచ్చారు. ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంటకు చేరిన ముఖ్యమంత్రి.. అక్కడినుంచి నేరుగా చంద్రగిరి మండలం కాశీపెంట్ల గ్రామంలోని హెరిటేజ్‌కు చెందిన గోకుల్ ప్లాంట్‌కు వెళ్లారు. అక్కడ కొత్తగా ఏర్పాటుచేసిన నీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభించారు. పాడి రైతులు, హెరిటేజ్ సంస్థ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. 'వ్యవసాయరంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. జాతీయ వ్యవసాయ వృద్ధి రేటు 2.4 శాతంఉంటే రాష్ట్రంలో అంతకు ఐదింతలు 11 శాతం సాధించాం. నిత్యం కరవుతో విలవిల్లాడే రాయలసీమ ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాం. ఇప్పుడు తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల రైతుల కంటే ఎక్కువ ఆదాయాన్ని ఈ ప్రాంత రైతులు ఆర్జిస్తున్నారు' అని వివరించారు.



సంక్రాంతి వేడుకల్లో భాగంగా చిత్తూరు జిల్లా కాశీపెంట్లలోని గోకుల్‌ప్లాంట్‌లో ఉల్లాసంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు

సంస్థను దెబ్బతీసే ప్రయత్నం

'హెరిటేజ్ సంస్థ ఏర్పాటు చేసినప్పుడు మాకు అనుకూలంగా చేయాలని ఎవరినీ అడగలేదు. ఎక్కడా పైరవీలు చేయలేదు. పరిశ్రమలకు అనుమతులు తీసుకునే సమయంలో ఎలాంటి నిబంధనలు అవలంబిస్తారో అవే పాటించాం. సిబ్బంది వారి సమర్థతతో సంస్థను పైకి తెచ్చారు. కొన్నిసార్లు హెరిటేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నించాయి. 26 ఏళ్లుగా ఎలాంటి అపప్రద రాకుండా సంస్థను నిర్వహిస్తున్నారు. నీతి నిజాయతీతో ఉండి తప్పులు చేయకుంటే ఎవరికీ భయపడాల్సిన పని లేదు. హెరిటేజ్ సంస్థ ద్వారా నిత్యం 15 లక్షల మంది వినియోగదారులకు పాలు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ ఉండే రైతులకు బ్యాంకుల ద్వారా ఏటా రూ.వంద కోట్ల రుణాలు ఇప్పిస్తున్నారు. వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నా' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

భువనేశ్వరి భేష్

'హెరిటేజ్‌కు ఉపాధ్యక్షురాలిగా, ఎండీగా భువనేశ్వరి ప్రతిరోజు సంస్థకు కాపలాకాస్తూ వస్తున్నారు. అన్ని కేంద్రాలను స్వయంగా పరిశీలిస్తున్నారు. సంస్థను సమర్థంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మణి సైతం బాగా పనిచేస్తోంది. నైతికత, నిజాయతీతో వ్యాపారం చేస్తున్నారు. 26 ఏళ్ల కిందట ప్రారంభించిన హెరిటేజ్ నేడు సమాజానికి ఉపయోగపడేలా తయారైంది' అని ముఖ్యమంత్రి అన్నారు.

స్వగ్రామానికి సీఎం

గోకుల్ ప్లాంటులో కార్యక్రమాన్ని ముగించుకున్నాక చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లికి చేరుకున్నారు. ఇంటి వద్ద వేచి ఉన్న స్థానికులను పలకరించారు. రెండు రోజులపాటు చంద్రబాబు స్వగ్రామంలో ఉండనున్నారు. మంత్రి లోకేశ్ దంపతులు ఆదివారమే నారావారిపల్లికి చేరుకోగా, ఎమ్మెల్యే బాలకృష్ణ, నటుడు నారా రోహిత్ సోమవారం వచ్చారు. మంగళవారం సీఎం తన తల్లిదండ్రుల సమాధులను సందర్శించి నివాళులు అర్పిస్తారు. అనంతరం గ్రామంలోని నాగాలమ్మ గుడికి వెళ్లి కుటుంబసమేతంగా పూజల్లో పాల్గొంటారు.

మరో రెండ్రోజులు పొగమంచు

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వాతావరణ శాఖ

ఈనాడు, హైదరాబాద్: గాలిలో తేమ బాగా పెరిగినందున మంగళ, బుధవారాల్లోనూ పొగమంచు కురుస్తుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు సూచించారు. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తగ్గి చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ఈశాన్య భారతం నుంచి శీతల గాలులు వీస్తున్నాయన్నారు. సోమవారం తెల్లవారుజామున అత్యల్పంగా మెదక్‌లో 15, ఆదిలాబాద్, హైదరాబాద్, రామగుండంలో 16, మిగతా ప్రాంతాల్లో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పగటి పూట గరిష్ఠంగా 32 డిగ్రీల వరకూ ఉన్నందున పొడి వాతావరణం ఏర్పడుతోంది. తెల్లవారుజాము నుంచి దట్టంగా పొగమంచు కురుస్తున్నందున పలు ప్రాంతాలు తెల్లటి దుప్పటి పరిచిన చందంగా కనిపిస్తున్నాయి. రహదారులపై మంచు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని.. వాహనాల్లో తెల్లవారుజామున ప్రయాణాలు చేయరాదని ఆయన తెలిపారు.

వదంతులపై షర్మిల ఫిర్యాదు

నారాయణగూడ, న్యూస్‌టుడే: 'అయిదేళ్ల కిందట ఎన్నికల ముందు నాకు, సినీ నటుడు ప్రభాస్‌కు మధ్య సంబంధం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రానుండటంతో ఆ విషప్రచారంలో వేగం పెంచారు' అని వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సోదరి వై.ఎస్.షర్మిల అన్నారు. ఈ విషయంపై అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. తనపై తప్పుడు ప్రచారాలు సృష్టిస్తున్న వారు, దాని వెనుక ఉన్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌ను కలిసి ఆమె ఫిర్యాదు చేశారు. భర్త అనిల్‌కుమార్, మాజీ ఎంపీ సుబ్బారెడ్డి, వైసీపీ నేతలు వాసిరెడ్డి పద్మ, సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి సోమవారం కమిషనర్‌ను కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాల దాడి, తన ఒక్కదానికే జరిగిన అన్యాయంగా భావించడం లేదన్నారు. ఇలాంటి రాతలు ఇంకెంతో మంది మహిళలపైనా రాస్తున్నారన్నారు. తనపై జరుగుతున్న ఈ దుష్ప్రచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదుకు ప్రజాస్వామ్యవాదులు, నైతికత ఉన్న రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, మహిళలు మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. 'ప్రభాస్‌ను నేను జీవితంలో ఎప్పుడూ కలవలేదు. ఇది నిజం.. నా పిల్లలపై ప్రమాణం చేసి చెబుతున్నా'నని చెప్పారు. 2014 నుంచి ఈరోజు వరకు తనపై జరుగుతున్న దుష్ప్రచారాల వెనుక తెలుగుదేశం పార్టీ హస్తం ఉందని ఆరోపించారు.



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేసి వస్తున్న వై.ఎస్.షర్మిల, అనిల్‌కుమార్, వాసిరెడ్డి పద్మ, సుబ్బారెడ్డి

ఎన్నికల వేళ రాజకీయ కుట్ర

- మంత్రి పరిటాల సునీత

ఈనాడు డిజిటల్, అమరావతి: మహిళలను కించపరిచేలా సామాజిక మాధ్యమంలో పోస్టింగ్‌లు పెట్టించిన చరిత్ర వైకాపాదేనని ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. ఇలాంటి వికృత క్రీడకు సామాజిక మాధ్యమాన్ని చిరునామాగా మార్చింది ప్రతిపక్షనేత జగనేనని సోమవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. జగన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక మాధ్యమంలో తెదేపా మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ పోస్టింగ్‌లు పెట్టిన విషయాన్ని షర్మిల మరిచిపోయినా ప్రజలు మాత్రం ఇంకా మర్చిపోలేదన్నారు. షర్మిలపై జరుగుతున్న ప్రచారానికి తెదేపాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇన్నాళ్లు ఈ విషయంపై మౌనంగా ఉండి ఎన్నికల వేళ దీన్ని రాజకీయం చేయడం జగన్ కుట్రలో భాగం కాదా అని ప్రశ్నించారు.

రెండు పులుల ప్రాణాలు తీశారు

మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో 'వేట'

మంచిర్యాల పట్టణం, మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వేటగాళ్ల కర్కశత్వానికి రెండు చిరుత పులులు బలయ్యాయి. మంచిర్యాల జిల్లా రంగపేట, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ పరిసరాల్లో సోమవారం ఈ ఉదంతాలు బయటపడ్డాయి. రంగంపేట ప్రాంతంలో ఉచ్చులో చిక్కిన చిరుత కళేబరాన్ని ఓ పశువుల కాపరి గుర్తించి, మంచిర్యాల అటవీశాఖ దృష్టికి తెచ్చాడు. రంగంలోకి దిగిన డివిజన్ అధికారులు దాని మెడకు ఇనుప తీగ చుట్టుకొని ఉండటం గుర్తించారు. పాతిన చెట్టుకొమ్మ కూడా అదే తీగకు ఉండటంతో, తప్పించుకునే ప్రయత్నంలో మెడకు మరింత బిగిసి...దాని ప్రాణం పోయిందని గ్రహించారు. మరో ఘటనలో...నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గుత్ప అటవీ ప్రాంతంలో కంచెలో చిక్కిన ఓ చిరుతపులి కళేబరాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. దంతాలు, గోళ్ల కోసమే ఆ వన్యప్రాణిని వధించారంటూ నలుగురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. దాని సంచారాన్ని ఇటీవల గమనించిన స్థానికులు అటవీశాఖకు సమాచారమిచ్చారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం వచ్చినప్పటికీ, చిరుత తప్పించుకుపోయింది. ఆదివారం రాత్రి దాని కళేబరం కనిపించింది. కొన్ని శరీర భాగాలు విడిగా పడిఉన్నాయి. సోమవారం డాగ్ స్క్వాడ్‌ను తీసుకురాగా ఆ శునకం గుత్పలోని పశువులకాపరి విజయ్ ఇంటి వద్ద ఆగింది. అతడిని పట్టుకోవడంతో... తులసి, నరేందర్, రవి అనే ముగ్గురితో కలిసి చిరుత గోళ్లు, దంతాలు తొలగించినట్లు అంగీకరించాడు. పులి శరీర భాగాలను పరీక్షల కోసం అధికారులు హైదరాబాద్‌కు పంపించారు. నేరగాళ్లపై తెలంగాణ అటవీ చట్ట (1867, 1872) నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో రాములు తెలిపారు.



గుండె వైద్యుడు రమేష్‌బాబుకు ప్రతిష్ఠాత్మక పదవి

విజయవాడ, న్యూస్‌టుడే: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖకు చెందిన ప్రతిష్ఠాత్మక నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) బోర్డు సభ్యుడిగా, దక్షిణ భారత ప్రతినిధిగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు నియమితులయ్యారు. రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్‌గా రమేష్‌బాబు ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కార్డియాలజీ విభాగంలో రమేష్‌బాబును సభ్యుడిగా నియమిస్తూ ఎన్‌బీఈ డైరెక్టర్ డా. రష్మీకాంత్ దవే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేశంలో నీట్ సహా అన్ని వైద్య విద్య సంబంధిత పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన, ప్రాక్టికల్స్, సబ్జెక్ట్ నిపుణులు, పరీక్షల పర్యవేక్షకులు, ప్యానెల్ ఇన్‌స్పెక్టర్ల నియామకం వంటి అంశాలను ఎన్‌బీఈ నిర్దేశిస్తుంది. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న వైద్యుల కొరత తదితర సమస్యల పరిష్కారానికి తన పరిధి మేరకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మళ్లీ కర్ణాటకం!

- అన్ని పార్టీల్లోనూ భయం
- 'ఆపరేషన్ కమల'పై అనుమానాలు

బెంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలో రిసార్టు రాజకీయాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు మూడు ప్రధాన పార్టీల నాయకులు అత్యవసర, రహస్య సమావేశాలు నిర్వహించారు. హస్తిన వేదికగా కమలనాథులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే దిల్లీలో 100 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో కొందరిని హరియాణలోని ఒక రిసార్టుకు తరలించారు. కర్ణాటకలో ఉన్న మరో నలుగురు ఎమ్మెల్యేలు మంగళవారం ఉదయానికి దిల్లీ చేరుకుంటారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప వెల్లడించారు. తమ పార్టీ నాయకులను కాంగ్రెస్ పార్టీ కొనుగోలు చేసేందుకు బేరసారాలు ప్రారంభించిందని ఆరోపించారు. సంకీర్ణ ప్రభుత్వంలోని పెద్దలు, ముఖ్యమంత్రి కుమారస్వామి నుంచి తమ ఎమ్మెల్యేలను రక్షించుకునేందుకే వారిని రిసార్టుకు తరలించామన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా దిశానిర్దేశం చేస్తారని భాజపా ఎమ్మెల్యేలు ఆదివారమే దిల్లీకి చేరుకున్నారు. ఆదివారం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు వేచి చూడగా, కేవలం అర గంట మాత్రమే అమిత్ షా వారితో మాట్లాడారు. బుధవారంలోగా మరోమారు అమిత్‌షా వారితో సమావేశం అవుతారని, అప్పటి వరకు దిల్లీలోనే ఉంటామని యడ్యూరప్ప తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు భాజపాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, మంగళవారం మధ్యాహ్నానికి మరో ఆరుగురు భాజపాలో చేరేందుకు వస్తున్నారని మాజీ మంత్రి, భాజపా నాయకుడు ఈశ్వరప్ప దిల్లీలో సోమవారం ప్రకటించడంతో కన్నడనాట కలకలం మొదలైంది. భాజపా నాయకుల నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని సమన్వయ సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం సిద్ధరామయ్య తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు, కొందరు మంత్రులతో ఆయన సోమవారం ఉదయం సమావేశమయ్యారు. సాయంత్రం తరువాత ముఖ్యమంత్రి కుమారస్వామి, ఉపముఖ్యమంత్రి పరమేశ్వర్, సీనియర్ మంత్రి డి.కె.శివకుమార్ మరికొందరు అత్యవసరంగా సమావేశమై, తాజా పరిణామాలపై చర్చించారు. 'ఆపరేషన్ కమల' ఉండదని, సంకీర్ణ ప్రభుత్వానికి ఎటువంటి ఢోకాలేదని ప్రకటించారు.



'ఆపరేషన్ కమల'పై అధిష్ఠానం విముఖత

- తొందరపాటు చర్యలు వద్దని సంకేతాలు
- చేపట్టాల్సిందేనంటున్న రాష్ట్ర శాఖ
- దిల్లీలో కొనసాగుతున్న భాజపా ఎమ్మెల్యేలు, ఎంపీల శిబిరం

దిల్లీ: కర్ణాటకలోని జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఆపరేషన్ కమల' చేపట్టాల్సిందేనని భాజపా రాష్ట్ర నాయకత్వం ఒత్తిడి తెస్తున్నప్పటికీ.. అందుకు దిల్లీలోని కమలనాథులు ఓ రకమైన విముఖతను ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అసంతృప్త శాసనసభ్యులు మొదట రాజీనామా చేయాలని ముందస్తు షరతు విధిస్తుండడమే ఇందుకు బలాన్ని చేకూర్చుతోంది. భాజపా జాతీయ సమ్మేళనం ఈ నెల 12వ తేదీనే ముగిసినప్పటికీ కర్ణాటకకు చెందిన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు దిల్లీ శిబిరంలోనే కొనసాగుతున్నారు. దీంతో దక్షిణాదిన ఉన్న జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ సర్కారును గద్దె దించడానికి కమలనాథులు ప్రయత్నాలు చేస్తున్నట్లు వదంతులు షికారు చేశాయి. ఇందుకు సంబంధించి భాజపా అధిష్ఠానం ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు, దిల్లీలోని వెస్టర్న్ కోర్ట్ భవంతిలో కర్ణాటక భాజపా ఎమ్మెల్యేలు, ఎంపీలు సోమవారం రహస్య సమావేశం నిర్వహించుకున్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ యడ్యూరప్ప నేతృత్వంలో ఇది కొనసాగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యుల్లో ఓ వర్గం కాంగ్రెస్ అసంతృప్త శాసనసభ్యులను ఆకర్షించి, సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నుంచి అనుమతి సంపాదించాలని యడ్యూరప్పపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. "కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం 2019 సార్వత్రిక ఎన్నికల వరకు దృఢంగా ఉంటే అధికారంలో ఉన్న జేడీఎస్, కాంగ్రెస్ పార్టీలకు లాభిస్తుంది. సంకీర్ణ సర్కారు కూలిపోతే కాంగ్రెస్‌కు తీవ్ర భంగపాటే. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో త్రిముఖ పోటీలో భాజపా కనీసం 20 లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటుంది" అని ఈ వర్గం ఎంపీలు, ఎమ్మెల్యేలు యడ్యూరప్ప ముందు ఏకరవుపెట్టినట్లు తెలిసింది. మరోవైపు, కర్ణాటక కాంగ్రెస్‌లో కీలక నేత, మంత్రి డీకే శివకుమార్ ఈ నెల 13న విలేకరులతో మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు శాసనసభ్యులను భాజపా ముంబయికి అపహరించుకుపోయింది. ఆ ముగ్గురితో మాట్లాడాలన్నా అందుబాటులో లేరు" అని ఆరోపించిన సంగతి తెలిసిందే. తాజాగా దిల్లీలోని భాజపా శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యుల్లో ఓ వర్గం చేస్తున్న ప్రతిపాదనలు శివకుమార్ ఆరోపణలకు బలం చేకూర్చుతున్నాయి.

'ఎయిమ్స్'లో చేరిన కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం ఇక్కడి 'అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ' (ఎయిమ్స్)లో చేరినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆయన సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆసుపత్రికి వచ్చినట్లు తెలుస్తోంది. ఛాతి వ్యాధుల విభాగంలో చేరినట్లు ఆస్పత్రి వర్గాలు చెప్పాయి. ప్రస్తుతం వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్నారు.

రోషం చూపిన పందెంకోడి

- ఏపీలో చేతులు మారిన కోట్లాది రూపాయలు
- హైదరాబాద్, బెంగళూరుల నుంచీ తరలి వచ్చిన పందెంరాయుళ్లు

ఈనాడు, అమరావతి: కోర్టు ఆదేశాలు, పోలీసు హెచ్చరికలను తోసిరాజని సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. ముఖ్యంగా ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలు వీటికి వేదికలయ్యాయి. పందేల రూపంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. పోటీలను తిలకించేందుకు కొన్ని చోట్ల నిర్వాహకులు భారీ ఎత్తున ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. అనేక చోట్ల రాజకీయనేతలు, ప్రజాప్రతినిధులు పందేలను దగ్గరుండి మరీ ప్రోత్సహించడం గమనార్హం. పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లాలో చిన్నా పెద్దా కలిపి 500చోట్ల కోడిపందేలు బరులు వెలిశాయి. ఆకివీడు మండలం అయిభీమవరంలో వేదిక ఏర్పాటుకు రూ.5 లక్షలు ఖర్చు చేశారు. వీక్షకులు కోడి పందేలు చూడడానికి వీలుగా భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఇక్కడకు వచ్చిన కార్లే 500 వరకు ఉంటాయి. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పందెంరాయుళ్లు తరలివచ్చారు. ఈ ఏడాది ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడిమేరకు ముందుగానే ప్రారంభించారు. 11 గంటలకు ప్రారంభమైనా కేవలం పదినిమిషాల్లో బరులన్నీ పందెంరాయుళ్లతో నిండిపోయాయి. తొలిరోజు రూ.వంద కోట్ల వరకు చేతులు మారి ఉంటాయని అంచనా వేస్తున్నారు. గుండాట, కోతాటలకు అడ్డే లేదు. రెండు రోజుల వరకు పెద్దపెద్ద ప్రకటనలిచ్చిన పోలీసులు సోమవారం మాత్రం పత్తా లేకుండా పోయారు. జిల్లాలో పెద్ద పెద్ద బరుల నుంచి భారీ మొత్తంలో ముడుపులు ఇవ్వడానికి మధ్యవర్తుల ద్వారా సంప్రదింపులు జరిగినట్లు సమాచారం.




తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం కొమరగిరిలో కోడిపుంజుల పోరాటం

ఆస్పత్రిపై రాష్ట్రపతికి ఫిర్యాదు

- దంతవైద్యానికి వెళితే మోసం చేశారన్న విశ్రాంత ఉద్యోగి
- కేసు నమోదు చేసిన రాంగోపాల్‌పేట పోలీసులు

బన్సీలాల్‌పేట్, న్యూస్‌టుడే: దంతాలను శుభ్రం చేయించుకోవడానికి (డెంటల్ క్లీనింగ్) ఆసుపత్రికి వెళ్లిన తనను కిమ్స్ ఆసుపత్రి వైద్యులు మోసం చేశారని, ఫలితంగా శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని ఓ విశ్రాంత ఉద్యోగి భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి అందిన సమాచారంతో రాంగోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారా హిల్స్ ప్రాంతానికి చెందిన పాండురంగారావు (71) విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. 2017 సెప్టెంబరు 4న డెంటల్ క్లీనింగ్ కోసం సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. కన్సల్టెంట్ కాస్మోటిక్ సర్జన్ డాక్టర్లు ప్రత్యూష, ప్రసాద్, బిందు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సమస్య శాశ్వత పరిష్కారానికి చికిత్స తీసుకోవాలని, లేదంటే పక్షవాతం వచ్చే అవకాశం ఉందని సూచించడంతో ఆయన అంగీకరించారు. 2017 సెప్టెంబరు 15న ఆయన 32 దంతాలకు క్యాప్స్ అమర్చారు. ఇందుకు ఆయన రూ.5 లక్షలు చెల్లించారు. చికిత్స తీసుకున్న ఆరు నెలల తర్వాత కొత్త సమస్య ఎదురైంది. అన్నం, చపాతి, ఇతర గట్టి పదార్థాలు తినడం ఇబ్బందికరంగా మారడంతోపాటు నాలుక రుచి కోల్పోయింది. బరువు కూడా తగ్గుతుండడంతో దంత చికిత్స అందించిన వైద్యులను సంప్రదించారు. వారు సమస్య ఏమీ లేదని తేల్చారు. వైద్యులు సూచించిన మందులు వాడినప్పటికీ ఫలితం లేకపోవడంతో చికిత్స అందజేసిన వైద్యులపై భారత రాష్ట్రపతి, ప్రధానితోపాటు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు పాండురంగారావు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు రాష్ట్రపతి, ప్రధాని కార్యాలయం, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ద్వారా పోలీసులకు అందింది. వైద్యులపైన రాంగోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.


పాండ్య


రాహుల్


క్షమాపణలు చెప్పినా..

దిల్లీ: ఓ టీవీ కార్యక్రమంలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంతో ఇప్పటికే సస్పెండైన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లు బీసీసీఐకి సోమవారం భేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఐతే వారి కష్టాలు ఇంకా తొలగిపోలేదు. ఈ ఇద్దరిని బీసీసీఐ సరిదిద్దాలని, వారి కెరీర్లను నాశనం చేయరాదని సీఓఏ ఛైర్మన్ వినోద్ రాయ్ అంటుండగా.. బీసీసీఐ సభ్యులు మాత్రం వాళ్లపై విచారణ కోసం అంబుడ్స్‌మన్‌ను నియమించేందుకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సీఓఏ, బీసీసీఐ ఆఫీసు బేరర్లే విచారణ నిర్వహించాలని సీఓఏ సభ్యురాలు ఎడుల్జీ పట్టుబడుతోంది. త్వరగా విచారణ పూర్తి చేయాలనే ఉద్దేశంతో వినోద్ రాయ్ ఉన్నాడు. బీసీసీఐ కొత్త రాజ్యాంగంలోని నిబంధన 41 (సి) కింద ఆటగాళ్లపై విచారణ జరపాలని రాయ్ ఈ మేరకు బీసీసీఐ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహ్రిని ఆదేశించాడని ఓ బోర్డు అధికారి చెప్పాడు. పాండ్య, రాహుల్‌లను బీసీసీఐ ఇప్పటికే ఆసీస్ పర్యటన నుంచి వెనక్కి పిలిపించిన సంగతి తెలిసిందే. బీసీసీఐ నిర్ణయం పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ప్రపంచకప్ జట్టుకు వాళ్లు ఎంపికవడం సందిగ్ధంలో పడింది. ఎస్‌జీఎంలో అంబుడ్స్‌మన్‌ను నియమించి, విచారణ చేయించాలనుకుంటే రాహుల్, పాండ్యలపై నిర్ణయం ఆలస్యమవుతుంది.

ఫేవరెట్లు రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. అలవోకగా రెండో రౌండ్లో అడుగుపెట్టారు. ఆఖరిసారి ఈ టోర్నీలో ఆడుతున్న ఐదుసార్లు ఫైనలిస్ట్ ఆండీ ముర్రే మాత్రం తొలి రౌండ్ దాటలేకపోయాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కెర్బర్, డిఫెండింగ్ ఛాంపియన్ వోజ్నియాకి బోణీ కొట్టారు.

ముర్రే ఔట్

ఫెదరర్, నాదల్ శుభారంభం ● ఆస్ట్రేలియన్ ఓపెన్


ముర్రే

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో చివరిసారి బరిలోకి దిగిన ఆండీ ముర్రే (బ్రిటన్) కథ తొలి రౌండ్లోనే ముగిసింది. సోమవారం హోరాహోరీగా సాగిన పోరులో ముర్రే 4-6, 4-6, 7-6 (7-5), 7-6 (7-4), 2-6తో బటిస్టా అగట్ (స్పెయిన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. గాయాలతో విసిగిపోయిన 31 ఏళ్ల ముర్రే ఇదే తన చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అని, చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ కూడా కావొచ్చని ఇంతకు


ఫెదరర్

ముందు ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు టైటిల్ ఫేవరెట్లు డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), రఫెల్ నాదల్ (స్పెయిన్) టోర్నీలో శుభారంభం చేశారు. తొలి రౌండ్లో మూడో సీడ్ ఫెదరర్ 6-3, 6-4, 6-4తో ఇస్తోమిన్ (ఉజ్బెకిస్థాన్)పై నెగ్గగా.. నాదల్ 6-4, 6-3, 7-5తో డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. ఆరో సీడ్ సిలిచ్ (క్రొయేషియా), పదో సీడ్ కచనోవ్ (రష్యా) కూడా బోణీ కొట్టారు. సిలిచ్ 6-2, 6-4, 7-6 (7-3)తో టామిచ్ (ఆస్ట్రేలియా)పై, కచనోవ్ 3-6, 6-3, 6-4, 6-3తో గొజోవిక్ (జర్మనీ)పై గెలిచారు. ఇతర మ్యాచ్‌ల్లో అండర్సన్ (దక్షిణాఫ్రికా) 6-3, 5-7, 6-2, 6-1తో మన్నారినో (ఫ్రాన్స్)పై, దిమిత్రోవ్ (బల్గేరియా) 4-6, 6-3, 6-1, 6-4తో తిప్సరెవిచ్ (సెర్బియా)పై, బెర్దిచ్ (చెక్) 6-3, 6-0, 7-5తో ఎడ్మండ్ (బ్రిటన్)పై విజయం సాధించారు. మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్), ఒపెల్కా (అమెరికా), అల్బాట్ (మాల్దోవా), మెక్‌డొనాల్డ్ (అమెరికా), వెర్దాస్కో, లోపెజ్ (స్పెయిన్), సెప్పి (ఇటలీ) కూడా ముందంజ వేశారు. భారత ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తొలి రౌండ్‌ను అధిగమించలేకపోయాడు. అతడు 6-7 (7-9), 3-6, 3-6తో అమెరికాకు చెందిన తైఫో చేతిలో ఓడిపోయాడు.

కెర్బర్ ముందుకు..: మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ కెర్బర్ (జర్మనీ), మూడో సీడ్ వోజ్నియాకి (డెన్మార్క్), మరియా షరపోవా (రష్యా) రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మొదటి రౌండ్లో కెర్బర్ 6-2, 6-2తో హెర్‌కాగ్ (స్లొవేనియా)ను చిత్తుగా ఓడించింది. వోజ్నియాకి (డెన్మార్క్) 6-3, 6-4తో ఉత్వాంక్ (బెల్జియం)పై, షరపోవా 6-0, 6-0తో డార్ట్‌పై గెలిచారు. ఇతర మ్యాచ్‌ల్లో స్టీఫెన్స్ (అమెరికా) 6-4, 6-2తో టౌన్‌సెండ్ (అమెరికా)పై, బార్టీ 6-2, 6-2తో కుంకుమ్‌పై, క్విటోవా (చెక్) 6-3, 6-2తో రిబరికోవా (స్లొవేకియా)పై, సబలెంక (బెలారస్) 6-1, 6-4తో కలిన్స్కయా (రష్యా)పై విజయం సాధించారు. భారత సంతతికి చెందిన అస్త్రా శర్మ (ఆస్ట్రేలియా) కూడా రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్లో ఆమె 7-5, 4-6, 6-1తో హోన్ (ఆస్ట్రేలియా)పై గెలిచింది. బెన్సిచ్ (స్విట్జర్లాండ్), బౌల్టర్ (బ్రిటన్), సురెంకో (ఉక్రెయిన్) రెండో ప్రవేశించారు.

ఆసియాకప్ నుంచి భారత్ నిష్క్రమణ

అబుదాబి: ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నుంచి భారత్ నిష్క్రమించింది. సోమవారం జరిగిన గ్రూప్-ఎ కీలక పోరులో ఛెత్రి సేన 0-1తో బహ్రెయిన్ చేతిలో పరాజయం చవిచూసింది. ఇంజురీ సమయంలో లభించిన పెనాల్టీని జమాల్ రషీద్ (91వ ని) గోల్‌గా మలచడంతో టోర్నీలో భారత్ నాకౌట్ ఆశలు గల్లంతయ్యాయి. మ్యాచ్‌లో గోల్ చేయడానికి లభించిన అవకాశాలను భారత్ వృథా చేసుకుంది.

14కే కుప్పకూలిన చైనా


బ్యాంకాక్: క్రికెట్‌లో బుడి బుడి అడుగులు వేస్తున్న చైనా ఒక చెత్త రికార్డును మూటగట్టుకుంది. బ్యాంకాక్‌లో జరిగిన టీ20 టోర్నీలో ఆ దేశ మహిళల జట్టు 14 పరుగులకే ఆలౌటైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో మ్యాచ్‌లో చైనా ఈ అపకీర్తి సంపాదించింది. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టు 3 వికెట్లకు 203 పరుగుల భారీ స్కోరు చేసింది. బదులుగా 10 ఓవర్లే ఆడిన చైనా.. 14 పరుగులకే కుప్పకూలింది. హిన్ లి (4) టాప్ స్కోరర్.

రెజ్లింగ్ లీగ్‌లో ముంబయి బోణీ

పంచకుల: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ పంజాబ్ రాయల్స్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే షాక్ తగిలింది. సోమవారం ముంబయి మహారథి 4-3తో పంజాబ్‌ను ఓడించి లీగ్‌లో శుభారంభం చేసింది. తొలి బౌట్లో నితిన్‌పై గెలిచి ఇబ్రగిమ్ ముంబయికి ఆధిక్యం అందించగా.. అంజెలికపై మిమి (పంజాబ్) నెగ్గడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత సచిన్.. అమిత్ (పంజాబ్)పై గెలవడంతో ముంబయి 2-1తో ఆధిక్యంలో నిలిచింది. కీలక బౌట్లో అంజుపై వినీశ్ (ముంబయి) నెగ్గడంతో ముంబయి 4-2తో నిలిచింది. ఆఖర్లో పంజాబ్ ఆటగాడు బజ్‌రంగ్ నెగ్గినా ఫలితం లేకపోయింది.

సైనా, శ్రీకాంత్‌లకు సవాల్

మలేసియా మాస్టర్స్ నేటి నుంచే


శ్రీకాంత్

కౌలాలంపూర్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో అలరించిన భారత స్టార్ క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్ అసలు పోరుకు సిద్ధమయ్యారు. మంగళవారం ప్రారంభంకానున్న మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో సైనా, శ్రీకాంత్ టైటిల్‌పై గురిపెట్టారు. ఐతే అగ్రశ్రేణి క్రీడాకారులంతా బరిలో ఉండటంతో భారత స్టార్లకు ఈ టోర్నీలో గట్టి సవాల్ ఎదురుకానుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో జాయ్ జువాన్ (హాంకాంగ్)తో సైనా తలపడనుంది. ప్రిక్వార్టర్స్‌లో యిన్ యిప్ (హాంకాంగ్)తో సైనా పోటీపడొచ్చు. తొలి రెండు రౌండ్లు దాటితే క్వార్టర్స్‌లో నొజొమి ఒకుహర (జపాన్) ఎదురవ్వొచ్చు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లాంగ్ ఆగ్నస్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ పోటీపడతాడు. మహిళల డబుల్స్‌లో యాన్ జు- సిన్ యింగ్ (హాంకాంగ్)తో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప, మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వాలిఫయర్స్‌తో సిక్కి- ప్రణవ్ తమ పోరాటాన్ని ప్రారంభిస్తారు.

శ్రీకాంత్.. రూ.35 కోట్ల ఒప్పందం: భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్.. చైనా స్పోర్ట్స్ బ్రాండ్ లి-నింగ్‌తో రూ.35 కోట్లకు స్పాన్సర్‌షిప్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం నాలుగేళ్లు అమలులో ఉంటుంది.

పాక్‌కు వైట్‌వాష్ తప్పలేదు


ట్రోఫీతో దక్షిణాఫ్రికా జట్టు

మూడో టెస్టూ దక్షిణాఫ్రికాదే

జొహానెస్‌బర్గ్: పాకిస్థాన్ పోరాటం ఫలించలేదు. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌లో ఆ జట్టుకు వైట్ వాష్ తప్పలేదు. ఇప్పటికే తొలి రెండు టెస్టుల్లో ఓడి సిరీస్ చేజార్చుకున్న పాక్.. మూడో టెస్టులోనూ ఓటమి పాలైంది. చివరి టెస్టులో దక్షిణాఫ్రికా 107 పరుగుల తేడాతో నెగ్గింది. 381 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో పోరాడినా, లక్ష్యానికి చాలా దూరంలో ఆగిపోయింది. ఓవర్‌నైట్ స్కోరు 153/3తో నాలుగో రోజు, సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్.. 273 పరుగులకు ఆలౌటైంది. ఆట మొదలైన కాసేపటికే బాబర్ అజామ్ (21), సర్ఫ్‌రాజ్ (0), షఫీక్ (65) స్వల్ప వ్యవధిలో వెనుదిరగడంతో పాక్‌కు పరాభవం తప్పదని తేలిపోయింది. షాదాబ్ ఖాన్ (45 నాటౌట్) పోరాటం ఓటమి అంతరాన్ని కొంచెం తగ్గించింది. ఒలివర్ (3/74), రబాడ (3/75), స్టెయిన్ (2/80) పాక్‌ను దెబ్బ తీశారు.

ఛాంపియన్

5 అడిలైడ్‌లో భారత్, ఆస్ట్రేలియా తలపడ్డ వన్డేలు. నాలుగు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియానే గెలిచింది. ఒక్కసారి భారత్ (2012లో 4 వికెట్ల తేడాతో) నెగ్గింది.

ఒక్క మ్యాచ్‌తో కథ మారిపోయింది. తొలి వన్డేకు ముందు సిరీస్ ఫేవరెట్‌గా ఉన్న టీమ్ఇండియా.. రెండో వన్డే ముంగిట ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఆరంభ పోరులో అనూహ్య ఓటమి చవిచూసిన టీమ్ఇండియా.. మళ్లీ ఓడితే సిరీస్ కోల్పోతుంది. టీ20 సిరీస్‌ను సమం చేసి, టెస్టుల్లో అద్భుత విజయం సాధించిన కోహ్లీసేన.. వన్డే సిరీస్‌ను చేజార్చుకుంటే పర్యటనలో పైచేయి సాధించే అవకాశం కోల్పోతుంది. కాబట్టి మంగళవారం రెండో వన్డేలో గెలిచి సిరీస్‌పై ఆశల్ని సజీవంగా ఉంచుకోవాలని పట్టుదలతో ఉంది. టెస్టు సిరీస్‌లో గొప్ప విజయాన్నందించిన అడిలైడ్‌లో ఈ మ్యాచ్ జరగబోతుండటం టీమ్ఇండియాకు ఉత్సాహాన్నిచ్చే విషయం.

కొట్టాల్సిందే!

ఒత్తిడిలో టీమ్ ఇండియా

అందరి దృష్టి ధోని మీదే

ఆసీస్‌తో రెండో వన్డే నేడు

అడిలైడ్

మూడు వన్డేల సిరీస్‌లో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. ఇంకో ఓటమి చవిచూస్తే సిరీస్ కోల్పోయే ప్రమాదంలో ఉన్న భారత్.. రెండో వన్డేలో ఆతిథ్య ఆస్ట్రేలియాను ఢీకొంటోంది. టీ20 సిరీస్‌ను సమం చేసి, తిరుగులేని ఆధిపత్యంతో టెస్టు సిరీస్ గెలిచి ఉత్సాహంగా వన్డే సిరీస్‌లోకి అడుగుపెట్టిన భారత్‌కు సిడ్నీలో ఊహించని ఓటమి ఎదురైంది. ఆ మ్యాచ్‌లో బౌలర్ల ప్రదర్శనను తప్పుబట్టడానికేమీ లేదు. బుమ్రా లేకపోయినా.. బ్యాటింగ్ పిచ్‌పై ఆసీస్‌ను బాగానే కట్టడి చేశారు. చివరి ఓవర్లలో బ్యాట్స్‌మెన్ ధాటిగా ఆడటంతో ఆస్ట్రేలియా మంచి స్కోరు చేయగలిగింది. ఐతే భారత్ బ్యాటింగ్ బలం ప్రకారం చూస్తే 289 పరుగుల లక్ష్యం మరీ పెద్దదేమీ కాదు. కానీ కీలక బ్యాట్స్‌మెన్ వైఫల్యం జట్టును దెబ్బ తీసింది. రోహిత్ శర్మ గొప్ప ఇన్నింగ్స్ ఆడినా.. సహచరుల నుంచి ఆశించిన సహకారం అందలేదు. ఈ నేపథ్యంలో రెండో వన్డే ప్రధానంగా బ్యాట్స్‌మెన్‌కు పరీక్ష కానుంది.



ఉదయం 8.50 నుంచి సోని నెట్‌వర్క్‌లో


పిచ్ ఎలా ఉంది?

అడిలైడ్‌లో చివరగా జరిగిన రెండు వన్డేల్లో తక్కువ స్కోర్లు నమోదయ్యాయి. అందులో ఓ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 231 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కాపాడుకుంది. అప్పటితో పోలిస్తే పిచ్‌లో కొంచెం వేగం ఉంటుందని భావిస్తున్నారు. భారీ స్కోర్లు నమోదు కాకున్నా.. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అంచనా.

ధోని ఎలా ఆడతాడో?

రెండో వన్డేలో ధోని ఎలా ఆడతాడా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తొలి వన్డేలో భారత్ 4 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉండగా క్రీజులోకి వచ్చిన ధోని.. రోహిత్‌తో కలిసి వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. చాన్నాళ్ల తర్వాత ఓ అర్ధశతకం కూడా సాధించాడు. కానీ అతను మరీ జిడ్డుగా ఆడటం చర్చనీయాంశమైంది. 96 బంతులు ఎదుర్కొని 51 పరుగులే చేశాడతను. ఘోర పరాభవం పాలయ్యేలా ఉన్న భారత్‌కు మళ్లీ విజయావకాశాలు కల్పించడంలో ధోని పాత్ర కీలకం. అదే సమయంలో సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోవడానికీ అతనే కారణం. బ్యాటు ఝులిపించాల్సిన స్థితిలో ఔటై భారత్ ఓటమికీ ధోని కారణమయ్యాడన్న విమర్శలు వచ్చాయి. గత ఏడాది కాలంగా ధోని బ్యాటింగ్ ఇలాగే సాగుతోంది. మునుపటిలా వేగంగా ఆడలేకపోతున్నాడు. అడపా దడపా చెప్పుకోదగ్గ స్కోరు చేస్తున్నప్పటికీ.. స్ట్రైక్ రేట్ తక్కువగా ఉంటుంది. షాట్లు ఆడటానికి చాలా కష్టపడిపోతున్నాడు. అతడిలో ఒకప్పటి ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. బౌలర్లు అతడిని చూసి భయపడే పరిస్థితి లేదు. క్రీజులో బాగా ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. ఓవైపు విధ్వంసక రిషబ్ పంత్ రోజు రోజుకూ మెరుగవుతున్న నేపథ్యంలో ప్రపంచకప్‌కు తొలి ప్రాధామ్య వికెట్ కీపర్‌గా ఉండాలంటే ధోని.. ఆట మారాల్సిందే. వికెట్ కీపర్‌గా, వ్యూహకర్తగా ధోని అనుభవం జట్టుకు చాలా అవసరమే కానీ.. అతడి జట్టు అవకాశాల్ని దెబ్బ తీయకుండా చూసుకోక తప్పదు.

జాదవ్‌కు ఛాన్స్?



రెండో వన్డేకు భారత్ ఒక మార్పుతో బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి. అవకాశాల్ని సరిగా వినియోగించుకోలేకపోతున్న సీనియర్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్ స్థానంలో ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్‌ను ఆడించాలని భారత్ భావిస్తోంది. గాయం నుంచి కోలుకుని వచ్చిన జాదవ్.. సత్తా చాటడానికి ఎదురు చూస్తున్నాడు. గతంలో కొన్ని విలువైన ఇన్నింగ్స్ ఆడిన జాదవ్.. పార్ట్ టైం స్పిన్నర్‌గానూ ఉపయోగపడ్డాడు. ఇక తొలి వన్డేలో బ్యాటింగ్‌లోనూ విఫలమైన రాయుడు.. సత్తా చాటుకోవాల్సి ఉంది. కొన్నేళ్లుగా భారత విజయాల్లో అత్యంత కీలకంగా ఉంటున్నది ఓపెనర్లు రోహిత్, ధావన్.. కెప్టెన్ కోహ్లీనే. సిరీస్‌పై ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ ముగ్గురూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలి. సిడ్నీలో రోహిత్ అదరగొట్టాడు. ధావన్, కోహ్లి విఫలమయ్యారు. విరాట్ నుంచి అతడి స్థాయి ఇన్నింగ్స్ ఆశిస్తోంది భారత్. బౌలింగ్ విషయంలో జట్టు సంతృప్తితోనే ఉంది. ఐతే డెత్ ఓవర్ల స్పెషలిస్టు బుమ్రా లేని లోటు కనిపిస్తోంది. భువనేశ్వర్, షమి ఈ లోటును పూడ్చాలి. స్పిన్నర్లు కుల్‌దీప్, జడేజా నిలకడ కొనసాగించి మధ్య ఓవర్లలో ఆసీస్‌కు కళ్లెం వేయాల్సి ఉంది. మరోవైపు ఆసీస్ తొలి వన్డే విజయం ఇచ్చిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది.

నం.4పై మళ్లీ చర్చ

భారత బ్యాటింగ్ ఆర్డర్లో నాలుగో స్థానంపై మరోసారి చర్చ మొదలైంది. చాలా కాలంగా ఈ స్థానంలో స్థిరమైన ఆటగాడు కనిపించట్లేదు. ఐతే వెస్టిండీస్‌తో సొంతగడ్డపై వన్డే సిరీస్‌లో సత్తా చాటి ఆ స్థానానికి తానే సరైన వాడినని చాటుకున్నాడు రాయుడు. కెప్టెన్ కోహ్లి కూడా అతడికి మద్దతుగా నిలిచాడు. కానీ వైస్‌కెప్టెన్ రోహిత్ మాత్రం ధోని ఆ స్థానంలో ఆడితే బాగుంటుందంటున్నాడు. నం.4లో ధోని రికార్డు కూడా బాగుంది. అసలే ఒత్తిడిలో కనిపిస్తున్న ధోని.. జట్టు కష్టాల్లో ఉన్న స్థితిలోనే క్రీజులోకి వస్తుండటంతో మరింత ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే అతడిని నాలుగులో ఆడించాలని రోహిత్ కూడా అన్నట్లుంది. ఐతే ఒక మ్యాచ్ వైఫల్యంతో రాయుడి స్థానం మార్చేస్తారా అన్నది సందేహమే. రెండో వన్డేలోనూ విఫలమైతే ఏమైనా మార్పు జరుగుతుందేమో చూడాలి.

ఆసీస్ వన్డే జట్టు బాగుంది

సౌరభ్ గంగూలీ

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో ఓడి వెనకబడినా.. 2-1తో గెలిచేందుకు ఇంకా అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితులను గతంలో చాలాసార్లు ఎదుర్కొంది కూడా. తొలి వన్డేలో 4 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినా టీమ్ఇండియా స్కోరు 250 దాటింది. వన్డే, టీ20ల్లో గత మూడేళ్లుగా రోహిత్‌శర్మ అద్భుతంగా రాణిస్తున్నాడు. తొలి వన్డేలో మిగిలిన ఆటగాళ్లు ఔటవుతున్నా అతని స్ట్రైక్‌రేట్ తగ్గలేదు. అడిలైడ్‌లో జరిగే రెండో వన్డేలో భారత్

మెరుగ్గా ఆడుతుందని భావిస్తున్నా. శిఖర్ ధావన్ లాంటి ఆటగాళ్లు సరైన వార్మప్ లేకుండానే నేరుగా వన్డే సిరీస్ ఆడటానికి వచ్చారు. తొలి వన్డేలో వారి ఆటను చూస్తే ఆ విషయం తెలుస్తుంది. వన్డేల్లో ఆస్ట్రేలియా మంచి జట్టుగా కనిపిస్తోంది. టెస్టు జట్టుతో పోలిస్తే ఈ జట్టు మెరుగైనదే. డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్ వచ్చేస్తే ఆ జట్టు మరింత బలోపేతం అవుతుంది. రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్‌లకు ప్రత్యర్థులను దెబ్బ కొట్టే సత్తా ఉంది. అయితే ఉస్మాన్ ఖవాజా, ఆరోన్ ఫించ్‌ల స్ట్రైక్‌రేటే ఆసీస్‌కు ఆందోళన కలిగించే అంశం.

ధోనీ బాగానే ఆడాడు

డీన్ జోన్స్

తొలి వన్డే భారత్‌పై ఆస్ట్రేలియా విజయంలో యువ పేసర్లు రిచర్డ్‌సన్, బెరెన్‌డార్ఫ్‌లదే కీలకపాత్ర. నాలుగు పరుగులకే 3 వికెట్లు కూల్చినప్పుడే భారత్ పని అయిపోయింది. ఈ మ్యాచ్‌లో ఓటమికి ధోనిని ఎందుకు నిందిస్తున్నారన్నది అర్థం కావట్లేదు. 4 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు ఎవరైనా ఏం చేస్తారు. మొదట వికెట్ల పతనాన్ని ఆపాలి. ధోని అదే చేశాడు.

చివరి దాకా ఆస్ట్రేలియా ఆందోళనగానే ఉందంటే కారణం ధోని-రోహిత్ జోడీ వల్లే. మరి ధోనినే ఎందుకు విమర్శిస్తున్నారో తెలియట్లేదు. రిచర్డ్‌సన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను స్టార్క్ స్థానాన్ని భర్తీ చేసేలా కనిపిస్తున్నాడు. బ్యాటింగ్‌లో పీటర్ హ్యాండ్స్‌కాంబ్ ఆకట్టుకున్నాడు. అతను స్పిన్‌ను బాగా ఎదుర్కొన్నాడు. తొలి వన్డే విజయంతో ఆసీస్ ఆత్మవిశ్వాసం పెరిగింది. రెండో వన్డేలో కోహ్లి సేన విజృంభిస్తుందని అనుకుంటున్నా. ఏదేమైనా పోటీ మంచిదే. ఆస్ట్రేలియాలో మళ్లీ పోరాటపటిమ చూడడం చాలా ఆనందంగా ఉంది. కంగారూలు ఇదే జోరు కొనసాగించాలి.



రావణ వాహనంపై దేవదేవుళ్లు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల మూడో రోజు సోమవారం పార్వతీపరమేశ్వరులు రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తజన శివనామ సంకీర్తనల నడుమ స్వామి అమ్మవార్లకు శ్రీగిరి పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం జరిగింది.

బొమ్మరిల్లు స్థిరాస్తుల వేలానికి న్యాయస్థానం సమ్మతి

- **సీఐడీ అధికారుల వెల్లడి**

ఈనాడు, విశాఖపట్నం: బొమ్మరిల్లు ఫామ్స్ అండ్ విల్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ స్థిరాస్తిని వేలం వేయాలని విశాఖలోని మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయస్థానం 11న ఆదేశించిందని సీఐడీ అధికారులు సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 19 బొమ్మరిల్లు శాఖల ద్వారా యాజమాన్యం వేలాదిమంది నుంచి రూ.95,11,96,254 సేకరించింది. 2014 నుంచి చెల్లింపులు నిలిపేయడంతో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా జిల్లాల్లో ఏడు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఐడీ అధికారులు కేసును విచారించి బాధితులు 45 వేల మంది ఉన్నట్లు, వారికి సంస్థ రూ.47,67,40,840 చెల్లించాల్సి ఉందని తేల్చారు. ఆ సంస్థ స్థిర, చరాస్తులను స్వాధీనం చేసుకున్నారు. గతంలో కొన్ని చరాస్తులను వేలం వేశారు. తాజాగా కొన్ని స్థిరాస్తుల వేలానికి న్యాయస్థానం అనుమతించింది. దీంతో జి.ఒ.ఎం.ఎస్. నెంబరు 114లో పేర్కొన్న 153 ఎకరాల భూమిని, సుమారు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్లను సీఐడీ అధికారులు వేలం వేయనున్నారు.

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం డోలగోవిందపురంలోని 98 ఎకరాలు, పలాస సమీపంలోని పూండి గ్రామం కళింగరాజ్యం లేఅవుట్‌లోని స్థలాలు, సీతంపేట మండలం పులిపుట్టిలోని 25 ఎకరాలు, విజయనగరం జిల్లా ఎస్.కోటలోని కొత్త బంగారులోకం లేఅవుట్‌లో ఉన్న స్థలాలు, కొత్తవలసలోని సంస్కృతి గార్డెన్ లేఅవుట్‌లోని స్థలాలు, డెంకాడ గ్రామంలోని 49 ఎకరాలను వేలం వేయనున్నారు. వీటి ద్వారా సుమారు రూ.20 కోట్ల వరకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు సీఐడీ సీఐ మునుకోటి బుచ్చిరాజు 'ఈనాడు'కు వెల్లడించారు. మరికొన్ని భూములు, స్థలాల వేలానికి న్యాయస్థానం త్వరలో అనుమతి ఇస్తుందని పేర్కొన్నారు. బొమ్మరిల్లు బాధితులకు పూర్తిస్థాయిలో డబ్బులు తిరిగొస్తాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.

ప్రాణం మీదకు తెచ్చిన సెల్ఫీ సరదా

జలాశయంలో యువకుడి గల్లంతు

చిల్పూర్, న్యూస్‌టుడే: సెల్ఫీ సరదా యువకుడి ప్రాణం తీసింది. చరవాణిలో సెల్ఫీ తీసుకుంటుండగా యువకుడు రిజర్వాయర్‌లో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా చిల్పూర్ మండలం ఫతేపూర్‌లోని మల్లన్నగండి వద్ద చోటు చేసుకుంది. లింగాలఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన జంజిరాల రామకృష్ణ(23) తన ఐదుగురు స్నేహితులతో కలిసి మల్లన్నగండి రిజర్వాయర్ వద్దకు వెళ్లాడు. రిజర్వాయర్‌లో దిగి రామకృష్ణ సెల్ఫీ తీసుకుంటుండగా జారి నీటిలో పడిపోయాడు. ఆయన కోసం రాత్రి వరకు గాలించినా జాడ దొరకలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ రాజిరెడ్డి తెలిపారు.

దేశ రాజధాని దిల్లీలో పాకిస్థాన్ హై కమిషన్ ఉద్యోగి ఒకరు తనను అసభ్యకరంగా తాకినట్లు ఓ మహిళ ఆరోపించారు. పోలీసులు సరోజిని నగర్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించారు. ఆరోపణను పాక్ ఉద్యోగి తోసిపుచ్చారు.

ఆలయమంతా చల్లదనం

యాదాద్రిలో కొనసాగుతున్న 'చిల్లర్ ప్లాంట్' పనులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో సప్తగోపురాలతో ఆవిష్కృతమయ్యే స్తంభోద్భవుడి సన్నిధికి వచ్చే భక్తజనులకు ప్రకృతి పరంగా ఎలాంటి ఇక్కట్లు కలగకుండా కాలానుగుణంగా వాతావరణ వసతి చేకూరనుంది. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంతో చిల్లర్ ప్లాంట్ ఏర్పాటుకు యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) పనులు నిర్వహిస్తోంది. పంచ నారసింహులు స్వయంభువులుగా కొలువై ఉన్న ప్రధాన ఆలయమంతా వేసవిలో చల్లదనం..శీతాకాలమంతా వెచ్చదనం కల్పించేందుకు చిల్లర్ ప్లాంట్ ఏర్పాటవుతోంది. సుమారు రూ.10కోట్ల వ్యయంతో దీని నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం ఓల్టాస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎయిర్ కండిషన్‌కోసం 15 యంత్రాలను కొనుగోలు చేశారు. వీటి ద్వారా చల్లని, వెచ్చని గాలి వీచే సదుపాయం కలగనుంది. పుష్కరిణి సమీపాన ఏర్పాటయ్యే ప్లాంట్ నుంచి భూగర్భ కేబుల్ ద్వారా గాలి ఆలయంలోకి సరఫరా అవుతుంది. ప్రధానాలయంలోనే కాకుండా మూడంతస్తులతో నిర్మితమయ్యే శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలోనూ ఈ వసతిని కల్పిస్తారు. నిరంతరం విద్యుత్తు ఉండేందుకు రెండు విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయ కనుమదారిలో, పుష్కరిణి సమీపాన వాటి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి.

సంక్రాంతికి 6 వేల ప్రత్యేక బస్సులు: ఆర్టీసీ

జూంబాగ్, న్యూస్‌టుడే: సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ సాయంత్రం వరకూ 6వేల బస్సులను నడిపినట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ మేనేజరు యాదగిరి వెల్లడించారు. సోమవారం ఎంజీబీఎస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెగ్యులర్ బస్సులతో పాటు ఈ ఏడాది సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని పలు జిల్లాలకు వెళ్లే ప్రయాణికుల సౌలభ్యం కోసం ముందస్తుగా 5,252 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని వివరించారు. కానీ నిర్దేశించిన లక్ష్యానికంటే అధికంగా బస్సులు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. ఆర్టీసీ అధికారులు, కార్మికులు, సిబ్బంది సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన వెల్లడించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

సుఖీభవ
sukhi@eenadu.in
ఈనాడు కరీంనగర్, మంగళవారం
జనవరి 15, 2019



జవం.. జీవం.. సూర్యం!

మన బంధాలు
సన్నగిల్లుతున్నాయి
మన బంధుత్వాలు
పలుచబారుతున్నాయి
రోజురోజుకీ మనుషులకే కాదు..
పల్లెకూ ప్రకృతికీ దూరమవుతున్నాం
మన జీవనగమనాన్ని శాసించే
సూర్యుడికీ 'ముఖం' చాటేస్తున్నాం!
అత్యాధునిక సౌకర్యాల వలలో చిక్కుకొని
కృత్రిమ వెలుగుల మాయలో పడిపోయి
'ఎండకన్నెరుగని' సుకుమారులమవుతున్నాం!
ఫలితంగా...
ఎన్నెన్నో సమస్యలను నెత్తికెత్తుకుంటున్నాం
ఎన్నెన్నో జబ్బులను మూటగట్టుకుంటున్నాం
కనీసం సంక్రాంతినాడైనా కళ్లు తెరుద్దాం
పల్లెల వైపు, పచ్చని ప్రకృతి వైపు
పరుగులు పెట్టే తరుణంలోనైనా
ఎండ ప్రసాదించే 'భోగ భాగ్యాల'
విలువను గ్రహిద్దాం!!
సూరీడి వెచ్చటి ఒడిలో చల్లగా జీవించే
మార్గాలను అన్వేషిద్దాం!!

భూమ్మీద జీవకోటి మొత్తానికి శక్తి కేంద్రం సూర్యుడే. ఆయన కిరణాల నుంచి ప్రసరించే శక్తి లభించకపోతే ప్రాణులకు మనుగడే లేదు. చెట్ల పచ్చదనానికైనా.. జీవుల వెచ్చదనానికైనా సూర్యుడే ఆధారం. కాల గమనానికి, ఆహార చక్రానికి మాత్రమే కాదు.. మన ఆరోగ్య చక్రానికీ ఆయనే మూలం. మన నిద్ర, మెలకువల దగ్గర్నుంచి.. హుషారు, ఉత్సాహం వంటివన్నీ భానుడి వెలుగుతో ముడిపడినవే. రెండు, మూడు రోజులు సూర్యుడు కంటికి కనబడకపోతే నిస్సత్తువ, నిరాశ ఆవహించటం అందరికీ తెలిసిందే. అందుకే జవమూ జీవమూ అయిన సూర్యుడిని అనాదిగా దేవుడిగానూ కొలుస్తూ వస్తున్నాం. సూర్య నమస్కారాలతో అటు ఆధ్యాత్మిక సంపదను ఇటు ఆరోగ్య సిరులను దక్కించుకోవటం ఆరంభించాం. ఒక్క మనదేశంలోనే కాదు.. చాలాదేశాల్లోనూ సూర్యుడిని దేవుడిగా ఆరాధించటం కనబడుతుంది. ప్రాచీన గ్రీస్, అరేబియాలో సూర్యరశ్మిని చికిత్సల కోసమూ ఉపయోగించుకోవటం గమనార్హం. ప్రాచీన ఈజిప్టులో ఎండను సూక్ష్మక్రిములను నాశనం చేయటానికీ వాడుకునేవారు. గ్రీకు చరిత్రకారుడు హిరోడాటస్ 6వ శతాబ్దంలోనే ఎండ ప్రయోజనాలను నమోదు చేశాడు. ఆయన ఒకసారి మధ్యధరా ప్రాంతానికి వెళ్లినపుడు.. యుద్ధంలో మరణించిన సైనికుల పుర్రెల తీరుతెన్నుల్లో తేడాలుండటం విస్మయం కలిగించింది. ఈజిప్టు సైనికుల పుర్రెలు మందంగా, గట్టిగా.. పర్షియా సైనికుల పుర్రెలు పలుచగా, పెళుసుగా ఉండటం ఆయనను ఆలోచింపజేసింది. అప్పట్లో ఈజిప్టువాళ్లు నున్నగా గుండు కొట్టించుకునేవాళ్లు, సూర్యుడిని ఆరాధించేవారు. అదే పర్షియా వాసులు ఎండ నుంచి కాపాడుకోవటానికి నిండుగా తలపాగా చుట్టుకునేవారు. ఎముకల పటుత్వంలో తేడాకు సూర్యరశ్మి ప్రభావమే కారణమని ఆయన ఆనాడే ఊహించాడు. ఇదొక్కటే కాదు. ఆధునిక జీవనశైలి మోసుకొస్తున్న ఎన్నెన్నో జబ్బుల గండాలను దాటటానికి మనకు సూర్యుడే దిక్కని అధ్యయనాలు, అనుభవాలు నొక్కి చెబుతున్నాయి.

ఉత్సాహం ఉరకలు!

ఆకాంక్షలు నెరవేరకపోవటమో, లక్ష్యాలను చేరుకోలేకపోవటమో.. కారణమేదైనా ఇప్పుడు ఎంతోమంది నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. ఉత్సాహం ఉడిగిపోయి జావగారిపోతున్నారు. వీటికి సూర్యరశ్మి మంచి విరుగుడు. మన కంటికి ఎండ వెలుగు తాకినప్పుడు అది రెటీనా ద్వారా మెదడులోకి చేరుకొని సెరటోనిన్ హార్మోన్ విడుదలయ్యేలా చేస్తుంది. దీని మూలంగా రక్తంలో ఎండార్ఫిన్ల స్థాయులు పెరుగుతాయి. దీంతో ఆనందం, సంతోషం వంటి భావనలు పుంజుకుంటాయి. మనసులో ఉల్లాసం నెలకొంటుంది. ఆందోళన, ఉద్రిక్తత తగ్గుతాయి. మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఏకాగ్రత కూడా మెరుగవుతుంది. కాబట్టి ఎప్పుడైనా నిరుత్సాహం ఆవరించినా, నిరాశ చుట్టుముట్టినా అలా ఎండలోకి వెళ్లి 'వెలుగుల' ఉత్సాహాన్ని నింపుకోవటానికి ప్రయత్నించండి.

కమ్మ కమ్మటి నిద్ర!

మొదట్నుంచీ మన జీవితం వెలుగు, చీకట్ల మీదే నడుస్తోంది. పగటిపూట బయటకు వెళ్లటం, పనులు చేసుకోవటం.. చీకటి పడుతుండగా ఇంటికి చేరుకోవటం, పడుకోవటం వంటివి అనాదిగా పరిణామక్రమంలో భాగంగానే అబ్బుతూ వచ్చాయి. చీకటి పడుతున్నకొద్దీ పీయూషగ్రంథి ఉత్తేజితమై మెలటోనిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంటుంది. మనకు కళ్లు మూతలు పడటానికి, నిద్ర ముంచుకురావటానికి మూలం ఇదే. ఉదయం పూట ఒంటికి ఎండ తగిలినవారికి రాత్రిపూట మెలటోనిన్ హార్మోన్ మరింత త్వరగా ఉత్పత్తి అవుతుండటం విశేషం. దీంతో పడుకోగానే వెంటనే నిద్ర పట్టేస్తుందన్నమాట. కాబట్టి నిద్రలేమితో బాధపడేవారు, కాన్పు తర్వాత కుంగుబాటుకు గురయ్యేవారు, చలికాలంలో విచారంతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే ఎండ తగిలేలా చూసుకోవటం మంచిది.

గుండెకు మేలు!

ఎండకు గుండెకు సంబంధమేంటని చాలామంది ఆశ్చర్యపోవచ్చు గానీ గుండె ఆరోగ్యానికీ ఎండ ఎంతగానో మేలు చేస్తుంది. మన చర్మం పొరల్లో నైట్రిక్ ఆక్సైడ్ దండిగా నిల్వ ఉంటుంది. చర్మానికి ఎండ తగిలినపుడు ఇది ఉత్తేజితమై రక్తంలోకి విడుదలవుతుందని స్కాట్లాండ్ అధ్యయనాలు చెబుతున్నాయి. రక్తనాళాలు విప్పారటానికి నైట్రిక్ ఆక్సైడ్ దోహదం చేస్తుంది కాబట్టి రక్తపోటు కూడా తగ్గుముఖం పడుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటే గుండెపోటు, పక్షవాతం వంటి ముప్పులూ తగ్గుతాయి. ప్రస్తుతం గుండెజబ్బులు, పక్షవాతం వంటి సమస్యలతో ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. సిస్టాలిక్ రక్తపోటు 20 ఎంఎంహెచ్‌జీ తగ్గినా గుండె రక్తనాళాల సమస్యలతో సంభవించే ఇలాంటి మరణాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు. అంటే ఎండ- గుండెకు భరోసా నిస్తూ.. ఎక్కువకాలం జీవించటానికీ తోడ్పడుతుందన్నమాట.

అతి ప్రధానం విటమిన్ డి

ఎండ ప్రయోజనాల్లో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది విటమిన్ డి. ఇది అన్ని విటమిన్ల లాంటిది కాదు. ఆహారం ద్వారా లభించేది కొద్దిగానే. సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాల సాయంతోనే మన చర్మం దీన్ని చాలావరకు తయారు చేసుకుంటుంది. మన శరీరంలోని ప్రతి కణంలో సుమారు 25,000 నుంచి 35,000 జన్యువులుంటాయి. వీటిల్లో దాదాపు 3వేల జన్యువులపై విటమిన్ డి ప్రభావం చూపుతుంది. తిన్న ఆహారంలోని క్యాల్షియాన్ని శరీరం సక్రమంగా గ్రహించుకోవటానికి విటమిన్ డి అత్యావశ్యకం. ఎముకలు ఏర్పడటానికి, బలోపేతం కావటానికి, క్షీణించకుండా ఉండటానికి క్యాల్షియం అత్యవసరమన్నది తెలిసిందే. రోగనిరోధకశక్తి పుంజుకోవటంలోనూ విటమిన్ డి కీలకపాత్ర పోషిస్తుంది. తెల్లరక్తకణాలు చురుకుగా పనిచేసేలా చూస్తూ.. హానికారక క్రిములతో శరీరం సమర్థంగా పోరాడటంలో సాయం చేస్తుంది. రక్తనాళాలను ఆరోగ్యంగానూ ఉంచుతుంది. అంతేకాదు.. క్లోమంలోని బీటా కణాలను ప్రేరేపించి ఇన్సులిన్ ఉత్పత్తి సజావుగా సాగేలా కూడా చేస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే- విటమిన్ డి కణ విభజనను నియంత్రించటం. అంటే ఇది క్యాన్సర్లు దరిజేరకుండానూ కాపాడుతుందన్నమాట. తగినంత విటమిన్ డి గలవారికి పెద్దపేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, క్లోమ క్యాన్సర్ వంటి రకరకాల క్యాన్సర్ల ముప్పు 60% తక్కువగా ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఎంతోమంది నిస్సత్తువ, నీరసం, కండరాల నొప్పుల వంటి వాటితో బాధపడటం చూస్తూనే ఉన్నాం. వీటికీ విటమిన్ డి కళ్లెం వేస్తుంది. అంతేనా? నాడుల పనితీరునూ మెరుగుపరుస్తుంది. ఇలా నడుస్తున్నప్పుడు తూలిపోవటం, పాదాలకు స్పర్శ తగ్గటం వంటి సమస్యలు దరిజేరకుండానూ కాపాడుతుంది. అందుకే దీన్ని ఆధునిక కాలంలో ముంచుకొస్తున్న జీవనశైలి సమస్యలన్నింటికీ సంజీవని అని చెప్పుకోవచ్చు. దీన్ని ఎలాంటి ఖర్చు లేకుండా.. కోరినవారికి కోరినంత అందించేది సూరీడే! అరగంట సేపు చర్మానికి ఎండ తగిలితే 50,000 ఐయూల విటమిన్ డి రక్తంలోకి విడుదలవుతుంది. అదే మనలాంటి ముదురు చర్మం గలవారిలోనైతే 8,000-10,000 ఐయూల విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది. కాబట్టి మనం ఇంకాస్త ఎక్కువసేపు ఎండలో విహరించాల్సి ఉంటుందన్నమాట.

బరువు అదుపు!

ఇప్పుడు ప్రపంచమంతా అధిక బరువుతోనే సతమతమవుతోంది. ఎవర్ని చూసినా బరువు తగ్గించుకోవాలని చూసేవారే. దీనికి కూడా ఎండ పరిష్కార మార్గం చూపుతోంది. మన చర్మం పైపొర కింద తెల్ల కొవ్వు కణజాలం ఉంటుంది. ఇది కేలరీలను ఖర్చు కానీయకుండా నిల్వ చేసుకోవటానికే ప్రయత్నిస్తుంటుంది. అయితే చర్మానికి ఎండ తగిలినపుడు దానిలోని నీలం కాంతి తరంగాలు లోపలికి చొచ్చుకెళ్లిపోయి ఈ తెల్ల కొవ్వు కణజాలం పరిమాణం తగ్గేలా చేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఇలా కణాల నుంచి కొవ్వు బయటకు రావటానికీ మార్గం సుగమమవుతోంది. దీంతో కణాలు ఎక్కువ కొవ్వును నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా బరువు కూడా అదుపులోకి వస్తుంది.

ఇన్‌ఫెక్షన్లకు కళ్లెం!

బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల వంటివి దరిజేరకుండా చూడటంలోనూ సూర్యరశ్మి తోడ్పడుతుంది. ఎండలోని వేడి సూక్ష్మక్రిములను చంపుతుందనేది తెలిసిందే. అంతేకాదు.. సూర్యరశ్మి సమక్షంలో మన చర్మం తయారుచేసుకునే విటమిన్ డి ఒక రకం పాలీపెప్టైడ్‌ను (క్యాథెలిసిడిన్) మరింత ఎక్కువగా విడుదలయ్యేలా చేస్తుంది. ఈ క్యాథెలిసిడన్ బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లను సమర్థంగా ఎదుర్కొనేలా శరీరానికి తోడ్పడుతుంది. కీళ్లవాతం, ఆస్థమా వంటి సమస్యలు తీవ్రం కాకుండానూ చూస్తుంది. చలికాలంలో ఫ్లూ, బ్రాంకైటిస్ వంటి ఇన్‌ఫెక్షన్లు.. కీళ్లనొప్పులు, ఉబ్బసం వంటి సమస్యలు ఎక్కువగా వేధిస్తుండటానికి కారణం ఇదే కావొచ్చని పరిశోధకులు అనుమానిస్తున్నారు. అందువల్ల చలి పెడుతుందని దుప్పటి ముసుగేసుకొని ఇంట్లోనే కూచోవటం కన్నా ఆరుబయట ఎండ నీడలో కాసేపు సేదతీరటం మంచిది.

మధుమేహానికి పగ్గం!

కేవలం విటమిన్ డి మూలంగానే కాదు.. నేరుగా సూర్యరశ్మి కూడా స్వీయ రోగనిరోధక జబ్బులు.. అంటే మన రోగనిరోధకశక్తి పొరపాటున మన మీదే దాడి చేయటం వల్ల తలెత్తే సమస్యల (మధుమేహం వంటివి) బారినపడకుండా కాపాడుతుంది. రోగనిరోధక వ్యవస్థలో భాగమైన టీఎన్ ఆల్ఫా, ఇంటర్‌ల్యూకీన్ 10 వంటి సైటోకైన్లు అనవసరంగా ఉత్తేజితం కాకుండా ఎండలోని అతినీలలోహిత కిరణాలు నియంత్రణలో ఉంచుతాయి. రోగనిరోధక వ్యవస్థలోని ఇతర కణాలను అణిచి ఉండే టీ కణాల పనితీరు పుంజుకునేలా కూడా చేస్తుంది. ఫలితంగా రోగనిరోధక శక్తి నియంత్రణ కోల్పోకుండా పనిచేస్తుంది. ఇవన్నీ స్వీయ రోగనిరోధక జబ్బులు తలెత్తకుండా కాపాడతాయి.

సోరియాసిస్ నియంత్రణ

సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాల సమక్షంలో కాల్సిటోనిన్ జీన్-రిలేటెడ్ పెప్టైడ్ (సీజీఆర్‌పీ) విడుదలవుతుంది. ఇది చాలారకాల సైటోకైన్లను నియంత్రిస్తుంది. ఇలా రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించకుండానూ చూస్తుంది. అందువల్ల సోరియాసిస్ వంటి చర్మ సమస్యలు నయం కావటానికి సూర్యరశ్మి తోడ్పడగలదని పరిశోధకులు చెబుతున్నారు.

చురుకుగా జీవక్రియలు!

మన శరీరంలో జీవక్రియలన్నీ ఒక లయబద్ధంగా సాగుతాయి. రాత్రవుతూనే నిద్ర ముంచుకొస్తుంది. తెల్లారగానే మెలవకు వచ్చేస్తుంది. భోజనం వేళకు కడుపులో ఆకలి రగులుతుంది. ఇవన్నీ రంచనుగా ఒక సమయానికి జరగటంలో మన ఒంట్లోని జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్) తోడ్పడుతుంది. ఇది సజావుగా గాడి తప్పకుండా పనిచేటయంలోనూ సూర్యరశ్మి కీలకపాత్ర పోషిస్తుంది. సాధారణంగా మన మెదడు మధ్యలోని హైపోథలమస్ గ్రంథిలో ప్రధాన జీవగడియారం (సుప్రాఖియాస్మాటిక్ న్యూక్లియస్) నిక్షిప్తమై ఉంటుంది. రోజంతా ఆయా వేళలకు అనుగుణంగా రకరకాల జీవక్రియలు జరగటానికి ఎప్పటికప్పుడు సంకేతాలు పంపిస్తుంటుంది. వీటిని ఆయా అవయవాలు, కణాల్లోని చిన్న చిన్న జన్యు గడియారాలు గ్రహించి అందుకు అనుగుణంగా స్పందిస్తుంటాయి. అందుకే జీవగడియారం దెబ్బతింటే ఇలాంటి క్రియలన్నీ అస్తవ్యస్తమవుతాయి. ఫలితంగా నిద్ర సమస్యలు, ఊబకాయం, రోగనిరోధకశక్తి తగ్గటం వంటివి సమస్యలు ముంచుకొస్తాయి. అయితే సూర్యరశ్మితో ఇలాంటి సమస్యలను దూరం చేసుకోవచ్చు. ఎందుకంటే రెటీనాలోని గ్యాంగ్లియాన్ కణాలకూ ప్రధాన జీవగడియారానికి నేరుగా సంబంధం ఉండటం గమనార్హం. రోజూ ఉదయం పూట ఒంటికి ఎండ తగిలేలా చూసుకుంటే జీవగడియారం అస్తవ్యస్తమైనా తిరిగి గాడిలో పడుతుందన్నమాట. జీవక్రియలన్నీ మళ్లీ పుంజుకుంటాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం- వారానికి 2-3 సార్లు చర్మం మీద 5 నుంచి 15 నిమిషాల సేపు ఎండ పడేలా చూసుకుంటే విటమిన్ డి తగినంత తయారయ్యేలా చూసుకోవచ్చు. కానీ ముదురు చర్మం గల మనలాంటి వాళ్లు మరింత ఎక్కువసేపు ఎండ తగిలేలా చూసుకోవటం మంచిది. చర్మం మీద నేరుగా ఎండ పడితేనే విటమిన్ డి తయారవుతుంది.
- ఎండ తీవ్రంగా ఉంటే చర్మం వెంటనే చురుక్కుమంటుంది. కాబట్టి వీలైనంతవరకు ఉదయం పూట ఎండ తగిలేలా చూసుకోవటం మంచిది. ఎండకాలంలో ఈ విషయాన్ని మరవరాదు.

పిత్తాశయంలో రాళ్లు.. ఆపరేషన్ తప్పనిసరా?

సమస్య: నా వయసు 26 సంవత్సరాలు. పిత్తాశయంలో 2 ఎం.ఎం. సైజు రాళ్లు ఉన్నట్టు తేలింది. డాక్టర్లు పిత్తాశయాన్ని తొలగించాలని అంటున్నారు. ఆపరేషన్ చేయించుకోవాలంటే భయంగా ఉంది. పరిష్కారమేంటో చెప్పండి?

- జంపాల సతీశ్ (ఈమెయిల్ ద్వారా)



సలహా: మీరు కడుపునొప్పి ఉందో లేదో తెలియజేయలేదు. ఒకవేళ నొప్పి లేకపోతే అత్యవసరంగా ఆపరేషన్ చేసి, పిత్తాశయాన్ని తొలగించాల్సిన అవసరమేమీ లేదనే చెప్పుకోవచ్చు. పిత్తాశయంలో రాళ్లు ఏర్పడటం అరుదైన సమస్యేమీ కాదు. తరచుగా చూస్తూనే ఉంటాం. అయితే కొద్దిమందిలోనే ఇవి సమస్యలు తెచ్చిపెడుతుంటాయి. ఆహారంలోని కొవ్వు పదార్థాలు జీర్ణం కావటానికి పైత్యరసం అవసరం. పిత్తాశయం చేసే ప్రధానమైన పని కాలేయం నుంచి విడుదలయ్యే ఈ పైత్యరసాన్ని నిల్వ ఉంచటమే. మనం ఆహారం తినగానే ఇది నాళం ద్వారా పేగుల్లోకి చేరుకొని, జీర్ణక్రియకు తోడ్పడుతుంది. కారణమేంటో తెలియదు గానీ కొందరిలో ఈ పిత్తాశయంలో రాళ్లు (గాల్‌స్టోన్స్) ఏర్పడుతుంటాయి. ఇవి ఇసుక రేణువులంత సైజు దగ్గర్నుంచి గోల్ఫ్ బంతి అంత సైజు వరకూ ఉండొచ్చు. రాళ్లు ఉన్నా కూడా నూటికి 75% మందిలో ఎలాంటి లక్షణాలు, బాధలు ఉండవు. కానీ కొందరిలో పిత్తాశయానికి ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు, రాళ్లు కిందికి జారి నాళంలో ఇరుక్కుపోవచ్చు. కొందరిలో క్లోమగంధ్రి నాళానికి రాళ్లు అడ్డుపడి క్లోమగ్రంథి వాపు (పాంక్రియాటైటిస్) తలెత్తొచ్చు. దీంతో తీవ్రమైన నొప్పి, కామెర్ల వంటి సమస్యలు మొదలవుతాయి. అందువల్ల మీకు ఇటీవల కడుపునొప్పి ఏమైనా వచ్చిందా? కామెర్లు ఏమైనా వచ్చాయా? పాంక్రియాస్ వాపు ఉందా? పైత్యరస నాళం సైజు ఎలా ఉంది? కాలేయం పనితీరు ఎలా ఉంది? వంటి వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఇందుకు ఆయా లక్షణాలను పరిగణనలోకి తీసుకోవటంతో పాటు రక్త పరీక్ష, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అన్నీ నార్మల్‌గా ఉంటే ఆపరేషన్ అవసరం లేదు. కాబట్టి మీరు ఒకసారి నిపుణులైన గ్యాస్ట్రోఎంటరాలజిస్టును సంప్రతించటం మంచిది. అవసరమైన పరీక్షలు చేసి ఏం చేయాలన్నది నిర్ణయిస్తారు. ఒకవేళ ఆపరేషన్ చేసి పిత్తాశయాన్ని తొలగించాల్సి వచ్చినా పెద్ద ఇబ్బందులేవీ ఉండవు. క్రమంగా పైత్యరస నాళమే కాస్త పెద్దగా తయారవుతుంది. ఇలా పైత్యరసం కొంత దానిలోనే నిల్వ ఉండటానికి వీలుగా మారుతుంది. కొందరు రాళ్లతో మున్ముందు హఠాత్తుగా సమస్యలు తలెత్తుతాయన్న భయంతో ముందుగానే ఆపరేషన్ చేయించుకోవాలని చూస్తుంటారు. అలాంటి భయాలు పెట్టుకోవద్దు. పిత్తాశయంలో రాళ్లు ఉన్నప్పుడు చాలా సందర్భాల్లో ముందుగా నొప్పి, కామెర్ల వంటి లక్షణాలు కనబడ్డ తర్వాతే ఇతరత్రా తీవ్ర సమస్యలు మొదలవుతుంటాయని గుర్తించాలి.



—డా॥ కె.జగన్మోహనరావు
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య - సలహా, **సుఖీభవ,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

గట్టిగా ఊదగలరా?

శ్వాస పరిగా ఆడక ఇబ్బంది పడుతున్నారా? విడవకుండా దగ్గు వేధిస్తుందా? పిల్లికూతలు వినబడుతున్నాయా? అయితే ఒకసారి శ్వాస వేగాన్ని తెలిపే 'స్పైరోమెట్రీ' పరీక్ష చేయించుకోండి. దీంతో దీర్ఘకాల ఊపిరితిత్తుల సమస్య సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) ఉంటే బయటపడుతుంది. ఇది చాలా తరచుగా కనబడే సమస్య. తీవ్రమైంది కూడా. కానీ చిత్రమేంటంటే సీవోపీడీతో బాధపడుతున్నా అది ఉన్నట్టు కూడా చాలామందికి తెలియనే తెలియదు. దీంతో ఎంతోమంది లక్షణాలు ఉద్ధృతమయ్యాక ఆసుపత్రిలో చేరుతుంటారు. అప్పుడు చికిత్స కూడా కష్టమవుతుంది. కాబట్టి అనుమానాస్పద లక్షణాలు కనబడినప్పుడు ఒకసారి స్పైరోమెట్రీ పరీక్ష చేయించుకోవటం మంచిది. ఇది చాలా తేలికైంది. గుండెల నిండా గాలి పీల్చుకొని చిన్న యంత్రానికి అమర్చిన గొట్టంలోకి గట్టిగా ఊదితే చాలు. దీంతో ఎంత గాలిని వదులుతున్నారు? ఎంత వేగంగా ఊదుతున్నారు? అనేవి బయటపడతాయి. వీటిని బట్టి సీవోపీడీ ఉందో లేదో తేలుతుంది. సమస్య తీవ్రత కూడా బయటపడుతుంది.

ఈనాడు సినిమా

సిరుల పండగ సంతోషం నిండుగ









ఇంటి ముంగిట రంగవల్లులు
బంతిపూల తోరణాలు
గాదెల నిండా ధాన్యపు రాశులు
పాలపొంగళ్ల ఘుమఘుమలు
గంగిరెద్దుల గంటల చప్పుళ్లు
ఆకాశంలో ఇంద్రధనుస్సుతో పోటీపడే పతంగులు
కొత్త అల్లుళ్లు.. కొంటె మరదళ్లు కలసి చేసే సందళ్లు
ఊరంతా ఉత్సాహం
అందరిలోనూ ఉప్పొంగే ఉల్లాసం...

- తెలుగింటికి సంక్రాంతి శోభ వచ్చిందనడానికి ఇదే తార్కాణం. ఈ సందడంటే తెలుగు సినిమాకి ఎంతిష్టమో! అందుకే వీలు కుదిరినప్పుడంతా తెరపై చోటిస్తుంటుంది. సినిమాకీ, సంక్రాంతి పండగకీ విడదీయలేని అనుబంధం ఉంది. కొత్త సినిమాతోనే సంక్రాంతి పండగ పరిపూర్ణమైనట్లు భావిస్తుంటారు తెలుగువాళ్లు. మూడు నాలుగు సినిమాలు బాక్సాఫీసు ముందుకు వరస కడుతుంటాయంటే కారణం అదే. పది రోజుల ముందే చిత్ర పరిశ్రమకి సంక్రాంతి కళ వచ్చేస్తుంటుంది. ఈసారి కూడా అంతే. అయితే సినిమాల హంగామా ఎంతున్నా తారలు ఈ పండగని కుటుంబంతో కలసి సరదాగా జరుపుకొంటుంటారు. సంక్రాంతి పండగ ఎంత ప్రత్యేకమో మన తారలు చెబుతున్నారిలా...



అంత అనుబంధం

"చిన్నప్పుడు మద్రాసులో సంక్రాంతి జరుపుకొన్న రోజులు బాగా గుర్తుకొస్తుంటాయి. అక్కడ భోగి బాగా చేసేవాళ్లు. పొద్దున్నే భోగి మంటలు వేసుకోవడం, రకరకాల పిండి వంటలు సిద్ధం చేయడం చాలా బాగా అనిపించేది. ఈ పండగ రోజున అందరూ కలసి భోంచేసేవాళ్లం. ఇలా అందరినీ కలిపే పండగలు తక్కువగా వస్తుంటాయి. హైదరాబాద్ వచ్చాకైతే పతంగులు ఎగరేయడం ఎక్కువగా కనిపించింది. ఒక సినిమావాడిగానూ, ప్రేక్షకుడిగానూ ఈ పండగ వస్తోందంటే కొత్త సినిమాలు ఏం విడుదలవుతాయా అని ఆలోచిస్తుంటాం. సినిమాలకీ, సంక్రాంతికీ అంత అనుబంధం. సినిమాలకి వెళ్లాలన్న ఆసక్తి ఎప్పుడో కానీ రావడం లేదు. సంక్రాంతి అలా కాదు, సరదాగా థియేటర్‌కి వెళ్లి కొత్త సినిమాని చూసొద్దామనే కోరిక పుట్టిస్తుంటుంది. అందుకే సంక్రాంతి అనగానే కొత్త సినిమాలు విడుదలవుతుంటాయి. నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన సినిమాలు బాగా ఆడాయి. 'ఎఫ్2'తో సంక్రాంతి అల్లుడిగానూ సందడి చేస్తున్నా".

– వెంకటేష్

ఈ సంక్రాంతికి ఆ లోటు తీరింది

"సంక్రాంతికి ఎక్కువగా బాబాయ్ సినిమాలు విడుదలయ్యేవి. అందుకనే పండగ వస్తుందనగానే ఉత్సాహంతో ఆ సినిమాల కోసం ఎదురు చూసేవాణ్ని. సహజంగానే మా ఇంట్లో ఎప్పుడూ పండగ వాతావరణమే ఉంటుంది. సంక్రాంతి వచ్చిందంటే అది మరింత పెరుగుతుంది. రామకృష్ణ థియేటర్ దగ్గరికి వెళ్లి, మేడ ఎక్కి పతంగులు ఎగరేసేవాళ్లం. నా సినిమాలు సంక్రాంతికి ఎప్పుడూ రాలేదు. పండగ అయిన తర్వాత విడుదల చేసిన 'పటాస్' బాగా ఆడింది. 'ఎన్టీఆర్ కథానాయకుడు'లో నేను నాన్న పాత్ర చేయడం, అది బాబాయ్ సినిమా కావడం నాకు ఆనందాన్నిచ్చింది. పండగకి నా సినిమా రాలేదన్న లోటు 'ఎన్టీఆర్ కథానాయకుడు'తో తీరిపోయింది".

– కల్యాణ్‌రామ్

భలే సందడి

"మాది పంజాబీ కుటుంబం. సంక్రాంతిని అక్కడ లోహ్రి పేరుతో జరుపుకుంటారు. ఆ రోజు మా ఇంట్లో పూజ ఉంటుంది. ఆ తర్వాత రుచికరమైన వంటకాలుంటాయి. కానీ చిన్నప్పుడు ఇవేవీ పట్టేవి కావు. లోహ్రి అంటే మా అందరికీ గాలిపటాల పండగే. పిల్లలంతా ఒక చోట చేరి సందడిగా జరుపుకొనేవాళ్లం. కథానాయికని అయ్యాక సంక్రాంతిని చాలావరకు సెట్స్‌లోనే జరుపుకొన్నా. తెలుగిళ్లలో సంక్రాంతి సందడి భలే ఉంటుంది. వారం ముందే హడావుడి మొదలైపోతుంది. రెండు మూడేళ్లుగా ఈ పండగని కుటుంబంతో కలిసి జరుపుకొనే అవకాశం లభిస్తోంది".

– కాజల్

పల్లెటూళ్లలో పండగంటే ఇష్టం

"సంక్రాంతి అనగానే పాజిటివ్ వైబ్రేషన్స్ వస్తుంటాయి. ఏడాదిలో వచ్చే తొలి పండగనో, మరేంటో తెలియదు కానీ.. సంక్రాంతి గురించి ఉత్సాహంగా ఎదురు చూస్తుంటాం. నాకు పండగ అనగానే మా అమ్మమ్మ ఊరే గుర్తుకొస్తుంది. అక్కడ పచ్చటి వాతావరణం మధ్య సెలవుల్ని, పండగల్ని జరుపుకొన్న రోజులు పదే పదే గుర్తుకొస్తుంటాయి. కథానాయికని అయ్యాక నా సినిమాలు సంక్రాంతికి చాలానే విడుదలయ్యాయి. ప్రతి పండగకి నాది ఏదో ఒక సినిమా ఉండాలనిపిస్తుంది. పండగ రోజుల్లో ఊళ్లల్లో జాతర జరుగుతుంటుంది కదా, అక్కడికి అందరితోపాటు వెళ్లి సరదాగా ఆ వాతావరణాన్ని చుట్టి రావాలనిపిస్తుంటుంది. ఆ కోరిక ఎప్పుడు తీరుతుందో మరి".

– కీర్తి సురేష్

చిన్నప్పుడు సరదా సరదాగా

"కథానాయికని అయ్యాక సంక్రాంతి అనగానే సినిమా సందడే గుర్తుకొస్తుంది. నేను నటించిన చిత్రాలు కూడా కొన్ని సంక్రాంతి సందర్భంగానే విడుదలై విజయం సాధించాయి. తెలుగు లోగిళ్లలో సంక్రాంతికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో 'శతమానం భవతి' చేస్తున్నప్పుడు మరింత బాగా అర్థమైంది. సంక్రాంతి నేపథ్యంలోనే సాగే ఆ చిత్రం, ఈ పండగ సందర్భంగానే విడుదలై విజయం సాధించింది. నా సంక్రాంతి జ్ఞాపకాల్లో ఆ సినిమా కూడా చేరింది. చిన్నప్పుడైతే ఈ పండగని మరింత ప్రత్యేకంగా జరుపుకొనేవాళ్లం. కేరళలోనూ మకర సంక్రాంతిని ఘనంగా జరుపుకొంటారు. ఆ రోజు స్కూల్లో నా స్నేహితులందరినీ ఇంటికి పిలిచేదాన్ని. వాళ్లతో కలసి తినడం, గాలిపటాలు ఎగరేయడం ఎంత సరదాగా ఉండేదో. ఆకాశంలో రంగు రంగుల గాలిపటాలు ఎగరడం చూస్తూ గడపడం అదో ఆనందం".

– అనుపమ పరమేశ్వరన్

పాటకు పురస్కారం



సోమవారం కేరళలోని శబరిమలలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ గాయని పి.సుశీలను ఆ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కె.సురేంద్రన్ 'హరివరాసనమ్' పురస్కారంతో సత్కరించారు.



శ్రియ

చంద్ర మహాచంద్ర


'కె.జి.ఎఫ్'తో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు యశ్. ఆయన కన్నడంలో నటించిన 'చంద్ర' తెలుగులో 'మహాచంద్ర' పేరుతో విడుదల కాబోతోంది. ప్రేమ్‌కుమార్, శ్రియ ప్రధాన పాత్రధారులు పోషించారు. రూప అయ్యర్ దర్శకత్వం వహించారు. నిర్మాత షానవాజ్ మాట్లాడుతూ "విభిన్నమైన కథతో తెరకెక్కిన చిత్రమిది. ఇందులో యశ్ ఒక ప్రముఖమైన పాత్రని పోషించారు. శ్రియ నటన ఆకట్టుకుంటుంది. ఫిబ్రవరిలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం అందరినీ మెప్పిస్తుంది" అన్నారు.

అమెరికాలో ఆరంభిస్తారు



అనుష్క

క్రాస్ ఓవర్ చిత్రాలపై ఆసక్తి కనబరుస్తున్నారు దర్శకనిర్మాతలు. భిన్న పరిశ్రమలకి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు కలసి ఓ సినిమా తీస్తే దాన్నే క్రాస్ ఓవర్ చిత్రం అంటారు. అలాంటి చిత్రాల్ని పలు భాషల్లో మార్కెట్ చేయడానికి వీలుంటుంది. అలా తెలుగు, తమిళంతో పాటు హాలీవుడ్ పరిశ్రమలకి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు కలసి ఓ చిత్రం చేయబోతున్నారు. హారర్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఆ చిత్రంలో అనుష్క శెట్టి, మాధవన్, అంజలి, షాలిని పాండే, అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజు ప్రధాన పాత్రలు పోషిస్తారు. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కోన వెంకట్, గోపీసుందర్, షనీల్ డియో, గోపీమోహన్, నీరజ కోన తదితర సాంకేతిక బృందం ఈ చిత్రం కోసం పనిచేయబోతోంది. "అమెరికాలో మార్చి మాసం నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఈ ఏడాది ద్వితీయార్ధంలో చిత్రాన్ని విడుదల చేస్తాం. త్వరలోనే ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాల్ని ప్రకటిస్తామ"ని చిత్ర నిర్మాతలు టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్ ఓ ప్రకటనలో తెలిపారు.



అజయ్ దేవగణ్

హాలీవుడ్ కోతి బాలీవుడ్‌కి

'ది హ్యాంగోవర్ 2', 'జార్జ్ ఆఫ్ ది జంగిల్ అండ్ నైట్ ఎట్ ది మ్యూజియమ్' లాంటి హాలీవుడ్ చిత్రాల్లో నటించి పాపులర్ అయింది ఓ కోతి. దాని పేరు క్రిస్టల్. ఇప్పుడు అది బాలీవుడ్ వెండితెరపై కోతి చేష్టలు చేయనుంది. అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'టోటల్ ధమాల్'. ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. అజయ్ భుజాలపై కూర్చొంది క్రిస్టల్. చొక్కా, ప్యాంటు వేసుకొని దర్జాగా చూస్తోంది. ఈ స్టిల్‌కు మంచి స్పందన లభిస్తోంది. 'ధమాల్' సిరీస్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. అనిల్‌కపూర్, మాధురీ దీక్షిత్ మళ్లీ 18 ఏళ్ల తర్వాత ఈ చిత్రంలో కలసి నటిస్తున్నారు. రితేష్ దేశ్‌ముఖ్, అర్షద్‌వార్సి, ఇషా గుప్తా తదితరులు కీలక పాత్రధారులు. వచ్చే నెల 22న విడుదల కానుంది.



కంగనా రనౌత్, రేఖ

కంగన నిజ జీవితంలోనూ ఝాన్సీరాణే

- రేఖ

ఒకప్పటి అందాల తార రేఖ, ఇప్పటి సోయగాల సుందరి కంగనా రనౌత్ ఒక్క చోట చేరారు. కంగనాపై ఎంతో ఆప్యాయతను వ్యక్తపరిచారు రేఖ. సీనియర్ నటి రేఖకు ఎంతో మర్యాద ఇచ్చింది కంగన. ముంబయిలో జరిగిన 'మరాఠీ గౌరవ్' అనే కార్యక్రమంలో రేఖకు పురస్కారాన్ని అందజేసింది కంగన. పురస్కారం అందుకున్నాక కంగనపై తనకున్న ప్రేమను మాటల్లో వ్యక్తం చేశారు రేఖ. "బాలీవుడ్ నటీమణుల్లో నాకు కంగన అంటే ఎంతో ఇష్టం. నాకే ఓ కూతురు ఉంటే కంగనాలానే ఉండేది. కంగన సినిమాలోనే కాదు నిజ జీవితంలోనూ ఝాన్సీ రాణి లక్ష్మీబాయే" అంటూ కంగనాను ప్రశంసలతో ముంచెత్తారు రేఖ. ఆ వేడుకలో రేఖ ఎంతో ప్రేమతో బహూకరించిన నలుపు, బంగారు రంగు చీర ధరించి సందడి చేసింది కంగన. ఇద్దరూ కలసి వేసిన స్టెప్పులు ఆహుతుల్ని అలరించాయి. ప్రస్తుతం కంగన 'మణికర్ణిక' ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉంది.

దర్శకుడు కట్టా రంగారావు కన్నుమూత



ప్రముఖ దర్శకుడు కట్టా రంగారావు (62) సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 'ఇంద్రధనుస్సు'తో దర్శకుడిగా పరిచయమైన ఆయనకి భార్య వనజతో పాటు కుమారులు రోహిత్, సాకేత్ ఉన్నారు. 'అలెగ్జాండర్', 'నమస్తే అన్నా', 'ఉద్యమం', 'ఆఖరి క్షణం', 'బొబ్బిలి బుల్లోడు', 'వారెవ్వా మొగుడా', 'చెప్పుకోండి చూద్దాం'తో పాటు ఒక కన్నడ చిత్రానికీ దర్శకత్వం వహించారు రంగారావు. తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం జాయింట్ సెక్రెటరీగా కొనసాగుతున్న ఆయన 1957 మే 5న సూర్యాపేట జిల్లా, మేడారం గ్రామంలో వెంకటరామయ్య, అనసూయమ్మ దంపతులకి జన్మించారు. హైదరాబాద్‌లో చదువుకుంటూనే, విద్యార్థి సంఘాల కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన సినిమాలపై మక్కువతో మద్రాసు వెళ్లారు. చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మొగుడు కావాలి' చిత్రానికి దర్శకత్వ శాఖలో పనిచేశారు. అనంతరం ప్రముఖ దర్శకుడు కట్టా సుబ్బారావు దగ్గర పలు చిత్రాలకి పనిచేశారు. పాటల రచయితలుగా సుద్దాల అశోక్‌తేజ, గురుచరణ్, మాటల రచయితగా ఎమ్.ఎస్.నారాయణ, గాయకుడిగా వడ్డేపల్లి శ్రీనివాస్‌ని, కన్నడ హీరో రమేష్ అరవింద్‌ని తన చిత్రాలతోనే పరిచయం చేశారు కట్టా రంగారావు. 38 ఏళ్లుగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న ఆయన 'ఉద్యమం' చిత్ర కథకిగానూ నంది పురస్కారాన్ని అందుకొన్నారు. తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీగా, ట్రెజరర్‌గా, జాయింట్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. పలు అవార్డుల జ్యూరీ కమిటీల్లోనూ కొనసాగారు. పన్నెండేళ్లుగా తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం బలోపేతంపైనే దృష్టిపెట్టిన రంగారావు హఠాన్మరణం సంఘానికి తీరని లోటని, ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు అధ్యక్షుడు ఎన్.శంకర్. కట్టా రంగారావు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన మేడారంలో సోమవారం సాయంత్రం జరిగాయి.

వసుంధర

ఒక్కటి చాలండీ





పండగ అనగానే లెహెంగాలు, చీరలు, చుడీదార్, సల్వార్లు... వంటివే ఎక్కువగా వేసుకుంటాం కదా. అయితే ఆ దుస్తులకు తగ్గ యాక్సెసరీలు ఎంచుకున్నప్పుడే వాటికి నిండుదనం వస్తుంది. అదెలాగంటే...

- అనార్కలీలు, ఫ్రాక్ స్టైల్ కుర్తీలు, పొడవాటి కుర్తా, పలాజోల్లాంటివి ఎంచుకుంటున్నప్పుడు కాస్త పెద్దగా ఉండే జుంకాలు పెట్టి చూడండి. అవీ పూసలు, రాళ్లు పొదిగినవయితే ఆ అందమే వేరు.
- అంగార్ఖా కుర్తీలు, చీరల్లాంటివి కట్టుకుంటున్నారా.. ఎప్పుడూ పెట్టుకునే జుంకాలు వద్దు. బదులుగా షాండ్లియర్ ఇయర్‌రింగ్స్ అదిరిపోతాయి. ఒకవేళ డిజైనర్ సల్వార్‌సూట్లు ప్రయత్నిస్తుంటే మాత్రం... చెవికి ముందువైపే కాదు, వెనుకవైపు కూడా డిజైను ఉండేవి ప్రయత్నించాలి. మరీ ఆడంబరంగా ఉన్నాయనుకుంటే హూప్స్ సరిపోతాయి.



- జార్జెట్ చీరలు.. పొడవాటి కుర్తీల మీదకు డ్రాప్ ఇయర్‌రింగ్స్ సరైన ఎంపిక. ఇవి చిన్నగా ఉంటాయి కానీ చూడముచ్చటగా కనిపిస్తాయి. డిజైనర్ లెహెంగాల మీదకు ఇయర్‌కఫ్స్ బాగుంటాయంటారు డిజైనర్లు.

పోట్లీ బ్యాగు: డిజైనర్ చీరలు, కాస్త డీప్‌నెక్ లెహెంగాలు, భారీగా ఉండే సల్వార్‌సూట్లు ఎంచుకుంటున్నప్పుడు మెడ నిండా బోలెడు నగలు వద్దు. స్టేట్‌మెంట్ తరహాలో ఒక చోకర్ చాలు. నిండుగా ఉంటుంది. చేతులకు ఆధునిక డిజైనులో ఒక కడా ఉండేలా చూసుకుంటే చాలు.



- చెప్పులు కూడా హీల్స్ కాకుండా జ్యూతీల్లాంటివి ఉండాలి. హ్యాండుబ్యాగు పోట్లీ తరహాలో ఉండేది ఎంచుకుంటే ఆహార్యానికి నిండుదనం వచ్చినట్లే.



చిరుయజ్ఞం

ఇప్పుడొచ్చారయ్యా! చిరుధాన్యాలు నెత్తినెత్తు'కొనమంటున్నారు'! పొద్దున అది తిను.. పొద్దుమీకి ఇది తిను.. అని యూట్యూబ్‌లో లెక్చర్లు.. ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్లు.. ఇదే ప్రయత్నాన్ని ఈ చెల్లెండ్లు ఎప్పట్నుంచో చేస్తున్నారు.. కాసుల కోసం కాదు వీరి ఆరాటం. డాబుల కోసం అంతకన్నా కాదు. అందరికీ ఆరోగ్యం వీరి లక్ష్యం.. చిరుధాన్యాలే సరిధాన్యాలంటూ ఊరూరా ప్రచారం నిర్వహిస్తున్నారు. చిరుయజ్ఞంలో మరెందరో ఆడపడుచులను భాగస్వాములను చేస్తున్నారు. ఇంటింటా ధాన్యరాసులు తొణికిసలాడే సంక్రాంతి వేళ.. పల్లెపల్లెకూ చిరుధాన్య రాసులను పరిచయం చేస్తూ.. ఆరోగ్య క్రతువును అలుపెరగకుండా సాగిస్తున్నారు.



చిరు చెల్లెండ్ల కమిటీ... దీన్ని తెలంగాణ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఏర్పాటు చేసింది. పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2012లో ఈ కమిటీ ప్రారంభమైంది. మొదట్లో ఇది ఆ గ్రామాలకు మాత్రమే పరిమితం. 32 గ్రామాల్లో, పన్నెండువందల మంది సభ్యులు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు ఈ మహిళల సంఖ్య పెరిగింది. చిరుధాన్యాల సాగుతోపాటు వాటి ప్రాముఖ్యాన్ని ఇప్పుడు వీళ్లు మిగతా రాష్ట్రాల్లోని రైతులకు వివరిస్తున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ పంటల సాగు, వాటి ఉపయోగాలపై సమావేశాలు, సదస్సులు నిర్వహించారు. నిర్వహిస్తున్నారు. అలా ఈ కమిటీలో చెల్లెండ్ల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు చేరింది. జాతీయస్థాయి గుర్తింపు కూడా తెచ్చుకున్నారు.

సేంద్రియ పద్ధతిలోనే...

పెసలు, మినుములు, సెనగలు, కుసుమలు, తైదలు... వంటివన్నీ ఎప్పటినుంచో పండిస్తున్నవే. వాటితోపాటు రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, వరిగెలు, ఊదల్లాంటి చిరుధాన్యాలు పండించడమే తమ లక్ష్యం అంటారీ సభ్యులు. పైగా అన్నింటినీ సేంద్రియ పద్ధతిలో పండిస్తారు. అందుకు అవసరమైన ఎరువులు కూడా వీళ్లే తయారు చేసుకుంటారు. ఇలా పండించిన పంటల్ని స్థానికంగానే కాదు, హైదరాబాద్‌లోనూ విక్రయిస్తారు. ఇందుకోసం సంచార వాహనాల్ని ఎంచుకుంటారు. అలాగే జహీరాబాద్‌లోనే చిరుధాన్యాలకు సంబంధించిన ఓ శాశ్వత స్టాల్‌ని ఏర్పాటు చేశారు. అక్కడ వాటన్నింటినీ అమ్మడమే కాదు, ఎలాంటి పదార్థాలు చేసుకోవచ్చో వివరిస్తారు. కేక్‌లు, బిస్కెట్లు, అటుకుల్లాంటి వాటిని తయారుచేసి మరీ అమ్ముతున్నారు. ఇదంతా వాళ్లకు సంబంధించి ఒక కోణమే. తమలా ఇతర రైతుల్ని కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చిరుధాన్యాల్ని పండించడం వల్ల కలిగే లాభాల్ని మిగతా వాళ్లకు వివరిస్తున్నారు. అధిక దిగుబడులు, రసాయనాలు ఉన్న ఎరువులు కాకుండా... ఇలాంటివి ఎంచుకోవడం వల్ల కలిగే లాభాల్ని చెబుతున్నారు. 'చిరుధాన్యాల్ని పండించడం సులువు. పెట్టుబడి చాలా తక్కువ. ఒకవేళ ఏదయినా సమస్య ఎదురై, పంట పోయినా నష్టం చాలా తక్కువ. శ్రమ తక్కువ. లాభాలు ఎక్కువ. ఇతర జీవరాశులకు మేత దొరికి... పరోక్షంగా పర్యావరణానికి కూడా మేలు చేసినవాళ్లమవుతాం. అందుకే రైతులకే కాదు, ఇతర మహిళలు, స్వయంసహాయక బృందాల్ని కూడా ఇటువైపు రమ్మంటూ ప్రోత్సహిస్తున్నాం. కాలేజీలు, స్కూళ్లకు వెళ్లి... చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే లాభాల్ని కూడా వివరిస్తున్నాం...' అని చెబుతారీ కమిటీ సభ్యులు.

ఎప్పుడో చేయాల్సింది...



'పలురకాల ఎరువులు, రసాయనాలతో పండిస్తున్న పంటల వల్ల అనేక అనారోగ్యాల బారిన పడుతున్నాం. అందుకే సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న ఈ చిరుధాన్యాలను పంపిణీ చేసి, ఆరోగ్యాన్ని కాపాడాలనేదే మా ప్రయత్నం. ఈ పని ఎప్పుడో చేయాల్సింది కానీ... ఇప్పుడిప్పుడే వీటికి ఆదరణ పెరుగుతోంది. మా వంతుగా మేం కూడా అవగాహన అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇతర రాష్ట్రాల రైతులతో కూడా చర్చిస్తున్నాం...' అని చెబుతోంది భారత చిరుధాన్యాల చెల్లెండ్ల కమిటీ సభ్యురాలు చంద్రకళ. కేంద్ర ప్రభుత్వం వీళ్లను గుర్తించి ఈ కమిటీని 'భారతీయ చిరుధాన్యాల చెల్లెండ్ల కమిటీ'గా ప్రకటించింది. అలా ఇది జాతీయ స్థాయిలో ఘనత వహించింది.

బండెనెక బండి...

సంక్రాంతి సందర్భంగా నెలరోజుల పాటు పదహారు ఎడ్లబండ్లపై వివిధ ప్రాంతాలకు వెళ్తారీ మహిళలు, ఇతర రైతులు. వీళ్ల లక్ష్యం చిరుధాన్యాలపై అవగాహన కల్పించడమే. పైగా ఆ బండ్లను కూడా చిరుధాన్యాలతో అలంకరిస్తారు.

– టేకూర్ అంజయ్య, న్యూస్‌టుడే జహీరాబాద్



నటి స్నేహని కదిలిస్తే... సినిమా విషయాల కన్నా సంప్రదాయాలు, పిల్లల పెంపకం గురించే ఎక్కువగా మాట్లాడుతుంది. అమ్మగా, ఇల్లాలిగా జీవితంలోనూ తన పాత్రల్ని విజయవంతంగా పోషిస్తున్న ఆమె.. తాజాగా వినయ విధేయ రామలో నటించింది. సంక్రాంతితో తనకు ఉన్న అనుబంధం, పిల్లాడి గురించి కబుర్లు చెప్పుకొచ్చిందిలా...

నెలరోజులూ పూజలే



మాది తెలుగు మూలాలున్న కుటుంబమే. నాన్న రాజారాం నాయుడు. నేను దుబాయ్‌లో పెరిగినా చివరకు తమిళనాడులో స్థిరపడ్డా. దానికి కారణం మావారు ప్రసన్న. మేమిద్దరం 'అచ్చముండు.. అచ్చముండు' అనే తమిళ సినిమాలో నటిస్తున్నప్పుడు ప్రేమలో పడ్డాం. మా ఇంట్లో వెంటనే పెళ్లికి ఒప్పుకొన్నా... ప్రసన్న ఇంట్లో ఏడాది పాటు గొడవలయ్యాయి. చివరకు 2012లో మా పెళ్లైంది. అంతకు ముందు వరకూ పండగల సమయంలో అమ్మ ఏవేవో చేస్తే తినేదాన్ని. ఏదో గడిపేసేవాళ్లం. కానీ ఇప్పుడు ఓ ఇల్లాలిగా పండగల్ని ఆనందిస్తున్నా. పండగల సమయంలో కుటుంబసభ్యులంతా ఒకచోట కలిసేలా చూసుకుంటాం. అందుకు ప్రణాళికలు వేసుకుంటాం.


నెలంతా పూజలు: తమిళనాడులో సంక్రాంతి అంటే పెద్ద పండగ. మేం కూడా నెల మొదటి రోజు నుంచీ పూర్తయ్యేవరకూ విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తాం. ప్రతిరోజూ గుమ్మంలో ఆకట్టుకునే ముగ్గులు ఉండాల్సిందే. సంక్రాంతి రోజున అయితే రంగురంగుల ముగ్గులతో ఇల్లంతా నింపేస్తాం. ఈ నెల రోజులు అసలు మాంసాహారం జోలికి వెళ్లం. నాకు మితిమీరిన సెంటిమెంట్లు లేవు గానీ... దేవుడిని నమ్ముతా. సంప్రదాయాలను అనుసరిస్తా. అమ్మావాళ్లకంటే అత్తింటి వాళ్లకి సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కువ. నేను అవన్నీ నేర్చుకున్నా. ఆచరిస్తున్నా. ఇప్పుడు మా అబ్బాయి విహాన్‌కి నాలుగేళ్లు. ఏదైనా చెబితే అర్థం చేసుకుంటున్నాడు. అందుకే ఏ పండగ వచ్చినా దాని ప్రత్యేకత వివరిస్తుంటా. నా పనుల్లో వాడినీ భాగస్వామ్యం చేస్తుంటా. అప్పుడే కదా నేర్చుకుంటాడు. చేయాల్సిన పనులే కాదు, చేయకూడనివీ చెబుతుంటా. ఓ అమ్మగా వీలైంతవరకూ జంక్‌ఫుడ్ పెట్టను. ఏదయినా ఇంట్లో వండిన ఆహారానికే ప్రాధాన్యం. వాడికోసమే ఆచీతూచీ సినిమాలు ఎంచుకుంటున్నా.

బరువు తగ్గా: ప్రసవం అయ్యాక బరువు పెరగడం మామూలే. నేనూ అంతే. బాబు పుట్టిన కొన్నిరోజులకు ఓ తమిళ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అయితే బరువు తగ్గాలని చెప్పారు. కష్టమైనా సన్నబడేందుకు ప్రయత్నించా. ప్రసన్న ఫిట్‌నెస్ ఫ్రీక్. తనే నాకు ట్రైనర్‌గా మారాడు. అలా మూడు నెలల్లో ఏడు కేజీల బరువు తగ్గా. ఆ సినిమాలో నన్ను నేను చూసుకుని చాలా ఆశ్చర్యపోయా. ఇకపైనా ఇలాగే ఉండాలనుకుంటున్నా.

- సహకారం: ఈటీవీ

బంగారం వెండి

14న ముగింపు-క్రితం



తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,088	3,069
వెండి (గ్రా)	42.60	42.70

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	33,380	33,230	32,800	32,600	32,750	32,700	33,420	33,150	32,980	32,980
ఆర్నమెంట్	31,180	31,040	30,400	30,400	30,280	30,310	30,880	30,690	30,680	30,680
వెండి(కిలో)	40,249	40,360	40,400	40,400	40,300	40,300	40,400	40,200	40,500	40,500

చిక్కటి పాయసం... పొంగే గారెల కోసం!

పండగల సమయంలో నిల్వ ఉండే పిండివంటలే కాదు... అప్పటికప్పుడు పులిహోర, పాయసం, గారెల్లాంటివీ చేసుకుంటాం. అవి రుచిగా రావాలంటే ఈ చిట్కాలు పాటించి చూడండి.



- పాయసం కోసం పాలు వాడతాం కదా... పాలు కాచేందుకు అడుగు మందంగా ఉండే గిన్నెను తీసుకోండి. పాలు మరిగేకొద్దీ గిన్నె మాడకుండా, ఆ వాసన పాలకు అంటకుండా ఉంటుంది. ఒకవేళ పాయసం మరీ పల్చగా అయ్యిందనుకుంటే... పావుకప్పు జీడిపప్పును పదిహేను నిమిషాలు నానబెట్టి, రుబ్బి అందులో కలిపి వేడిచేయాలి. కాసేపటికి పాయసం చిక్కగా మారడమే కాదు, రుచీ బాగుంటుంది.
- ఎలాంటి బజ్జీలయినా కరకరలాడేలా రావాలనుకుంటే... సెనగపిండిలో చెంచా చొప్పున మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి కలిపితే చాలు.
- గారెలు పొంగినట్లుగా, గుల్లగా రావాలనుకుంటే... మినప్పప్పు రుబ్బేటప్పుడు కాసిని మరమరాలు లేదా అటుకులు కలపాలి. ఈ రెండు అందుబాటులో లేకపోతే కొద్దిగా అన్నం కూడా వాడొచ్చు.
- మసాలా వడలు కరకరలాడేలా రావాలనుకుంటే పచ్చిసెనగపప్పుతోపాటు కొద్దిగా మినప్పప్పు కూడా నానబెట్టాలి. వడలు విరిగిపోవు. రుచీ బాగుంటాయి.
- బూరెల్లో ఉపయోగించే పూర్ణం కాస్త పల్చగా అయ్యిందా... ఇంకే పిండి కలపకుండా ఆ మిశ్రమాన్ని పొయ్యిమీద పెట్టండి. మంట తగ్గించి నెమ్మదిగా కలుపుతోంటే కాసేపటికి గట్టిపడుతుంది.

రంగవల్లిక

ఈటీవీ తెలంగాణ జనవరి 13, 2019 విజేతలు

ముగ్గుల పోటీ

1. ఏ.సుచరిత, జైనథ్ - ఆదిలాబాద్
2. పి.పద్మ, మీర్‌పేట్ - హైదరాబాద్
3. ఏ.వాణిలక్ష్మీ, సనత్‌నగర్ - హైదరాబాద్
4. వి.సురేఖ, బోయిన్‌పల్లి - సికింద్రాబాద్
5. సిహెచ్.సుకేసిని, మంచిర్యాల
6. టి.సంధ్య, బెల్లంపల్లి
7. పి.సుస్మిత, సికింద్రాబాద్
8. సిహెచ్.సుజాత, సూర్యాపేట 9. బి.స్రవంతి, భూపాలపల్లి
10. ఎస్.లక్ష్మీనందిని, మంగొల్లు - కృష్ణాజిల్లా.



ఈ చుక్కల్ని గోపురంలా వచ్చేలా పెట్టుకోవాలి కాబట్టి.. అడుగునుంచీ మొదలు పెట్టాలి.

అడుగున 29 చుక్కలు పెట్టాలి.


సరిచుక్క పద్ధతిన రెండువైపులా 27, తరువాత 25 చుక్కలు పెట్టాలి.

ఇప్పుడు మొదటి 3 చుక్కలు కాకుండా తరవాతి 3 చుక్కల్ని 11 వరుసలు పెట్టాలి. ఇదేవిధంగా ఇంకోవైపు చేయాలి.

ఇప్పుడు కొద్దిగా వదిలేసి మళ్లీ 29- 27- 25 చొప్పున సరిచుక్కలు రెండువైపులా పెట్టాలి.

తరువాత గోపురంలా రావడానికి పైభాగాన ఒక చుక్క వచ్చేవరకూ సరిచుక్కలు పెట్టుకుంటూ వెళ్లాలి.

చదువు
వైవిధ్య



ఉత్తరాన హిమాలయాలు.. దక్షిణాన హిందూ మహాసముద్రం.. పైన చైనా.. అడుగున ఆస్ట్రేలియా.. ముందుకెళితే అమెరికా.. వెనక్కి మళ్లితే ఆఫ్రికా.. మనం వెళ్లి చూశామా? కాదు.. మ్యాప్ ఆధారంగా చెప్పేశాం. మందిరాలు, మసీదులు, రోడ్లు, రైలు పట్టాలు, కుంటలు, కాలువలు, చెరువులు... ఒకటేమిటి భూమి మీద కనిపించే అన్నింటినీ కచ్చితమైన దూరంలో.. కరెక్టయిన దిక్కులో అలా రాసి పెట్టేశారు. ఎవరు? ఇంకెవరు మన కార్టోగ్రాఫర్లే. అంటే మ్యాపులను (పటాలు) అధ్యయనం చేసేవారు. భూగోళాన్ని చుట్టేసి ఎప్పటికప్పుడు పటాలపై పెట్టేయాలంటే ఎంత మంది కావాలో ఊహించండి. జాగ్రఫీని ఎంజాయ్ చేసేవారికి ఇది ఆసక్తికరమైన ఉద్యోగం. శాటిలైట్ల సాయంతో మరింత అభివృద్ధి చెందుతున్న ఈ కార్టోగ్రఫీ (పటాల అధ్యయన శాస్త్రం) ఇప్పుడో పెద్ద ఉపాధి ప్రపంచం. కొత్త కోర్సులు, కొలువులు కోరుకునే వారికి సరైన మ్యాపింగ్ మార్గం.





పటం గీయగలరా?

బోర్డు మీద పెద్ద పటాన్ని ఉంచి, దానిలో ఫలానా దేశాన్నో, ప్రాంతాన్నో గుర్తించమని టీచర్ పిల్లలను అడుగుతుంటారు. ఒక తెలియని ప్రదేశానికి టూర్‌కు వెళతాం. మంచి రెస్టారెంట్ ఎక్కడ ఉందో, చూడదగ్గ ప్రదేశాలింకేమున్నాయో చూస్తాం. వెళ్లడానికి గూగుల్ మ్యాప్ తెరుస్తాం. ఒకటి పేపర్ ద్వారా గుర్తించేదైతే, మరొకటి డిజిటల్ సాయం. రెండింటి లక్ష్యం ఒక ప్రదేశాన్ని గుర్తించడమే. మనకు ఇంత వీలుగా ఉన్నవాటిని ఎవరు అందుబాటులోకి తీసుకొచ్చారో తెలుసా? వారే కార్టోగ్రాఫర్లు. పటాలు (మ్యాపులు), సంబంధిత అంశాలను అధ్యయనం చేసే కార్టోగ్రఫీలో కెరియర్ కొత్తగా, భిన్నంగా ఉండటమే కాదు; ఉపాధికి కూడా బాగా ఉపయోగకరం!

నిత్య జీవితంలో ప్రతి సందర్భంలో శాటిలైట్ టెక్నాలజీ, జీఐఎస్‌ల వాడకం పెరుగుతోంది. దీంతో కార్టోగ్రఫీ మంచి కెరియర్‌గా ఎదుగుతోంది. ఇందుకు తగ్గట్టుగా ఎన్నో సంస్థలు ప్రత్యేకమైన కోర్సులనూ అందిస్తున్నాయి. ఈ పరిజ్ఞానం సంపాదించినవారు సాధారణ ప్రజలకు సాయపడేలా మ్యాపులను రూపొందిస్తారు. పూర్వం నావికులు ఎక్కువగా వివిధ ప్రదేశాలను కనుక్కోవడానికి మ్యాపులను ఉపయోగించేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఇది తప్పనిసరి అయింది. వివిధ రెస్టారెంట్ల నుంచి ఏ సమయంలోనైనా కావాల్సిన ఆహారాన్ని ఆర్డర్ చేసి, తెప్పించుకోగలుగుతున్నాం. వెళ్లాల్సిన ప్రదేశాలకు క్యాబ్‌లను బుక్ చేసుకుంటే... నేరుగా మన ఇంటి ముందుకు వచ్చి సేవలను అందిస్తున్నారు. ఇదంతా కార్టోగ్రాఫర్లు, జియో ఇన్ఫర్మాటిక్ నిపుణుల కృషి ఆధారంగానే సాధ్యమవుతోంది.

శాస్త్రీయ, కళాత్మక అంశాలు కార్టోగ్రఫీలో భాగం. గ్లోబలైజేషన్ కారణంగా ప్రపంచ సమాచారం అంతా ఒకేచోట అది కూడా డిజిటల్, దృశ్యరూపకంగా ఉండటం తప్పనిసరి అయింది. దీంతో కార్టోగ్రాఫిక్ నిపుణుల అవసరం బాగా పెరిగింది. వీరు అక్షాంశాలు, రేఖాంశాలు, ఎత్తులు మొదలైన అంశాల సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి వాటికి సంబంధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా అందిస్తారు. తద్వారా ఒక ప్రదేశంలో జనాభా, భూభాగాన్ని ఉపయోగిస్తున్న తీరు, వాతావరణ మార్పులు, జనాభా వయసు, వారి ఆదాయం, జీవన పరిస్థితులు వంటి అంశాలన్నింటినీ అంచనా వేయగలుగుతున్నారు.

అన్ని అంశాల్లోనూ...

కార్టోగ్రాఫర్లు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్స్‌ను తరచుగా ఒక ప్రదేశాన్ని పక్కాగా గుర్తించడానికి ఉపయోగిస్తున్నారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జీఐఎస్) కూడా వీరు ఉపయోగించే సాధనాల్లో ఒకటి. వీరు రిమోట్ సెన్సింగ్ సిస్టమ్స్, జియోడెటిక్ సర్వేలను ఉపయోగించి గ్రాఫిక్‌లు, డిజిటల్ రూపంలో మ్యాపులను తయారు చేస్తుంటారు. ఇవి వాతావరణ సంబంధిత అంశాలు, రైల్వే లైన్లు, విమాన మార్గాలను తెలుసుకోవడంలోనూ, సముద్ర మార్గాలను గుర్తించడంలోనూ తోడ్పడుతున్నాయి. ప్రకృతి వనరులు, పర్యావరణం, వ్యవసాయానికి సంబంధించిన వివరాల సేకరణ, నగర- పట్టణ ప్రణాళికల రూపకల్పన, ట్రాఫిక్ హెచ్చుతగ్గులు తెలుసుకోవడం, రవాణా, ప్రకృతి వైపరీత్యాలు మొదలైన అంశాల్లో సహకరిస్తాయి.



కోర్సులు అందిస్తున్న కొన్ని సంస్థలు

★ అన్నామలై యూనివర్సిటీ, చెన్నై ★ బర్ద్వాన్ యూనివర్సిటీ, వర్ధమాన్ ★ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సర్వేయింగ్ అండ్ మ్యాపింగ్, హైదరాబాద్ ★ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముంబయి ★ జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీ, దిల్లీ ★ ఎంఎస్ యూనివర్సిటీ, వడోదర ★ ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ ★ పండిట్ రవిశంకర్ శుక్లా యూనివర్సిటీ, రాయ్‌పుర్ ★ ఐఐటీ- ఖరగ్‌పుర్, రూర్కీ, కాన్పూర్ ★ సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో ఇన్ఫర్మాటిక్స్ ★ నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, హైదరాబాద్ ★ ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం

ఈ నైపుణ్యాలుండాలి

❑ జాగ్రఫీ, పర్యావరణ అంశాలపై ఆసక్తి ఉండాలి. ❑ ఊహాశక్తి తప్పనిసరి. ❑ ప్రాథమిక ఐటీ పరిజ్ఞానం ఉంటే మేలు. విశ్లేషణ, సమస్యా పరిష్కార నైపుణ్యాలుండాలి. ❑ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించగల స్వభావం అవసరం. ❑ ఎలాంటి పరిస్థితుల్లోనైనా, కొన్నిసార్లు ఏకధాటిగా గంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. అందుకే సహనం అవసరం.

ఏమేం కోర్సులున్నాయ్?

భూగోళశాస్త్రం (జాగ్రఫీ)లో ఆసక్తి ఉన్నవారికి కార్టోగ్రఫీ అనుకూలమైన కోర్సు. చాలావరకు డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ జాగ్రఫీ కోర్సుల్లో కార్టోగ్రఫీలో కొంత భాగం కలుస్తుంది కూడా. అయితే కొన్ని సంస్థలు మాత్రం ప్రత్యేకంగా దీనిపైనే కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సులు డిప్లొమా, గ్రాడ్యుయేట్, మాస్టర్స్ స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

సర్టిఫికేషన్ స్థాయిలో: సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కార్టోగ్రఫీ అందుబాటులో ఉంది. ఇంటర్మీడియట్/ తత్సమాన కోర్సును జాగ్రఫీ సబ్జెక్టుగా పూర్తిచేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి మూడు నెలల నుంచి ఏడాది వరకూ ఉంటుంది.

డిప్లొమా: డిప్లొమా ఇన్ జియో ఇన్ఫర్మాటిక్స్ అందుబాటులో ఉంది. ఇంటర్మీడియట్/ తత్సమాన కోర్సును జాగ్రఫీ సబ్జెక్టుగా పూర్తిచేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి రెండు నుంచి మూడేళ్ల వరకూ ఉంటుంది.



గ్రాడ్యుయేషన్: బీఈ (జియో ఇన్ఫర్మాటిక్స్), ఇంటర్మీడియట్/ తత్సమాన కోర్సును జాగ్రఫీ సబ్జెక్టుగా పూర్తిచేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి- నాలుగేళ్లు.

బీఎస్‌సీ (జాగ్రఫీ), బీఏ (జాగ్రఫీ) కోర్సులకు ఇంటర్మీడియట్/ తత్సమాన కోర్సును జాగ్రఫీ సబ్జెక్టుగా పూర్తిచేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి- మూడేళ్లు.

బీటెక్ (జియో ఇన్ఫర్మాటిక్స్): ఇంటర్మీడియట్/ తత్సమాన విద్య పూర్తిచేసినవారు అర్హులు. కోర్సు కాలవ్యవధి- నాలుగేళ్లు

పీజీ: పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జాగ్రఫికల్ కార్టోగ్రఫీ, ఎంఏ (జాగ్రఫీ), ఎంఈ (జియో ఇన్ఫర్మాటిక్స్), ఎంఎస్‌సీ (జాగ్రఫీ), ఎంఎస్‌సీ (జియో ఇన్ఫర్మాటిక్స్), ఎంటెక్ (రిమోట్ సెన్సింగ్ అండ్ జాగ్రఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్), ఎంఫిల్ (జాగ్రఫీ) కోర్సులున్నాయి. కోర్సుల కాలవ్యవధి- రెండేళ్లు. ఏదేని గ్రాడ్యుయేషన్ కోర్సు చేసినవారు అర్హులు.

డాక్టొరల్: పీహెచ్‌డీ (జియోమాగ్నటిజమ్), పీహెచ్‌డీ (జాగ్రఫీ) కోర్సులున్నాయి. కోర్సు కాలవ్యవధి- మూడేళ్లు. ఏదేనీ పీజీ కోర్సు 55% మార్కులతో పూర్తిచేసినవారు అర్హులు.

ప్రవేశ ప్రక్రియ ఒక్కో సంస్థకు ఒక్కోలా ఉంది. సంస్థ, ఎంచుకున్న కోర్సును బట్టి, ప్రవేశ పరీక్షలున్నాయి. కొన్ని సంస్థలు తమకంటూ ప్రత్యేకమైన ప్రవేశపరీక్షను నిర్వహిస్తుండగా, మరికొన్ని జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశపరీక్షల స్కోరు ఆధారంగా ఎంచుకుంటున్నాయి. కొన్ని సంస్థలు వచ్చిన దరఖాస్తుల్లో నుంచి ఎంపిక చేసినవారికి వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి, ఆపై కోర్సుల్లోకి ప్రవేశాలను కల్పిస్తున్నాయి. ఈ సంస్థలకు సంబంధించిన ప్రవేశ ప్రకటనలు సాధారణంగా జూన్, జులై, సెప్టెంబరు నెలల్లో విడుదలవుతాయి.

ఉద్యోగావకాశాలు



ప్రపంచవ్యాప్తంగా కార్టోగ్రాఫిక్ నిపుణుల అవసరం పెరిగింది. వివిధ అవసరాలకు తగ్గట్టుగా డిజిటల్ పరంగా, దృశ్యపరంగా ప్రతి దేశ సమాచారం తప్పనిసరి అయ్యింది. భారీ పరిశ్రమల అభివృద్ధికీ ఇది ఎంతో సాయపడుతోంది. ప్లానర్లు, ఇంజినీర్లు, యుటిలిటీ సంస్థలు, ఏజెన్సీలు, నిర్మాణ సంస్థలు, సర్వేయర్లు, ఆర్కిటెక్ట్‌లు మొదలైనవారికి తమ వృత్తిలో భాగంగా కార్టోగ్రాఫర్లు/ మ్యాపులు అవసరమవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల అంచనా, పర్యాటక రంగం, జియొలాజికల్, మినరల్స్‌ను వెలికితీయడానికి, రక్షణ వ్యవస్థలోనూ జీఐఎస్ పాత్ర ప్రధానం.

మంచి నైపుణ్యాలున్నవారికి ఎన్నో అవకాశాలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ చక్కటి ఉద్యోగావకాశాలున్నాయి. పబ్లిషింగ్, సర్వేయింగ్, కన్జర్వేషన్ సంస్థలూ వీరిని ఎంచుకుంటున్నాయి. ప్రభుత్వ రంగంలో ముఖ్యంగా రక్షణ శాఖ, పర్యాటకం, రవాణా సంస్థల్లో వీరి అవసరం ఎక్కువ. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీలను ఉపయోగించే సంస్థలకూ వీరి సేవలు అవసరమే. స్థానిక ప్లానింగ్ విభాగాలు, చమురు సంస్థలు, కమర్షియల్ మ్యాప్ పబ్లిషర్లు, జియొలాజికల్ సర్వే సంస్థల్లో ఉద్యోగావకాశాలుంటాయి. ఎన్‌జీఓలు, జనాభా గణన, గ్రామీణాభివృద్ధి, వాతావరణ అంశాలపై పని చేసే అభివృద్ధి సంస్థల్లోనూ వీరి నియామకాలుంటాయి. వివిధ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు కూడా వీరిని ఎంచుకుంటున్నాయి. గూగుల్, యాపిల్, నాసా, ప్రపంచ బ్యాంకు, యునెస్కోతోపాటు రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ ఎనర్జీ, సైబర్‌టెక్ సిస్టమ్స్, టీసీఎస్, ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, జియోఫినీ టెక్నాలజీస్, మాగ్నా సాఫ్ట్ టెక్నాలజీ సర్వీసెస్ మొదలైనవి వీరిని నియమించుకుంటున్న ప్రముఖ సంస్థల్లో ఉన్నాయి.

చాలా సంస్థలు వీరిని జీఐఎస్ నిపుణులు, అనలిటిక్స్, సైంటిస్టులు, రిసెర్చర్లు, ఆర్కైవిస్ట్, సర్వే ఇంటర్వ్యూయర్ టీచర్, అర్బన్ ప్లానర్, అసిస్టెంట్ కార్టోగ్రాఫర్ సర్వేయర్, ఇతర హోదాలకు ఎంచుకుంటున్నాయి. బాగా అనుభవమున్నవారిని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, ఇన్‌స్ట్రక్టర్లు, రిసెర్చర్లుగా తీసుకుంటారు.

కోర్సు, అనుభవంతోపాటు ఎంపికైన సంస్థ, అది ఉన్న ప్రదేశాన్ని బట్టి వేతనాల్లో మార్పులుంటాయి. సాధారణంగా ప్రారంభ వేతనం రూ.15,000 నుంచి రూ.20,000 వరకూ లభిస్తుంది. విదేశాల్లో అయితే ఏడాదికి రూ.5,00,000 నుంచి రూ.10,00,000 వరకూ పొందగలుగుతారు. అనుభవం పొందే కొద్దీ వేతనంలో గణనీయమైన మెరుగుదల ఉంటుంది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

టెక్నికల్ అసోసియేట్ పోస్టులు

బెంగళూరులోని సౌత్ వెస్టర్న్(నైరుతి) రైల్వే- ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు-ఖాళీలు:** సీనియర్ టెక్నికల్ అసోసియేట్- 33, జూనియర్ టెక్నికల్ అసోసియేట్- 48. మొత్తం ఖాళీలు- 81. **అర్హత:** పోస్టును అనుసరించి డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ, గేట్ ఉత్తీర్ణత. **వయసు:** ఎస్‌టీఏ పోస్టులకు 20-33 ఏళ్లు; జేటీఏకు 18-33 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** ఎస్‌టీఏ పోస్టులకు గేట్ స్కోరు, జేటీఏకు విద్యార్హత మార్కుల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది: 01.02.2019.

వెబ్‌సైట్: www.rrchubli.in

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రిసెర్చ్

గాంధీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రిసెర్చ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు.
పోస్టు-ఖాళీలు: ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్- 29, ప్రాజెక్ట్ ట్రేడ్స్‌మెన్- 02, ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్- 07, ప్రాజెక్ట్ టెక్నీషియన్- 06. మొత్తం ఖాళీలు- 44. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది: 31.01.2019.

వెబ్‌సైట్: www.ipr.res.in

వాక్-ఇన్స్

ఎస్వీవీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, పాలిటెక్నిక్‌లలో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ. **ఖాళీలు గల కళాశాలలు:** కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(ప్రొద్దుటూరు), ఏహెచ్ పాలిటెక్నిక్(బనవాసి/ మడకశిర), లైవ్‌స్టాక్ రిసెర్చ్ స్టేషన్(సిద్దరామాపురం/ మహానంది). **విభాగాలు:** వెటర్నరీ అనాటమీ, వెటర్నరీ ఫిజియాలజీ, అనిమల్ న్యూట్రిషన్, వెటర్నరీ మైక్రోబయాలజీ, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో బీవీఎస్సీ, ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. **ఇంటర్వ్యూ తేది:** 25.01.2019.

వేదిక: ఎక్స్‌టెన్షన్ హాల్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, ప్రొద్దుటూరు.

వెబ్‌సైట్: www.svvu.edu.in

ప్రవేశాలు

బిట్‌శాట్ 2019

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ పిలానీ) పరిధిలోని పిలానీ, గోవా, హైదరాబాద్ ప్రాంగణాల్లో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే బిట్‌శాట్ 2019 ప్రకటన విడుదలైంది. **కోర్సులు:** బీఈ, బీఫార్మసీ, ఎంఎస్సీ **విభాగాలు:** బీఈ- కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మ్యానుఫ్యాక్చరింగ్. ఎంఎస్సీ- బయోలాజికల్ సైన్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్. **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ లేదా బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 20.03.2019.
ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేదీలు: మే 16 నుంచి 26 వరకు.
వెబ్‌సైట్: www.bits-pilani.ac.in

అప్రెంటిస్‌షిప్

ఫ్యాక్ట్‌లో అప్రెంటిస్ శిక్షణ

ఉద్యోగమండల్(కేరళ)లోని ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్(ఫ్యాక్ట్)లో కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులు.

అప్రెంటిస్ ఖాళీలు: టెక్నీషియన్ (డిప్లొమా)- 57, ట్రేడ్- 98. మొత్తం: 155. **విభాగాలు:** కెమికల్, కంప్యూటర్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫిట్టర్, మెషినిస్ట్, ప్లంబర్, కార్పెంటర్, పెయింటర్ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ/ ట్రేడ్ సర్టిఫికేట్ ఉత్తీర్ణత.

వయసు: 23 ఏళ్లకు మించకూడదు. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 23.01.2019. **వెబ్‌సైట్:** http://fact.co.in/

బయోటెక్నాలజీలో ఏ ఉద్యోగాలు?

» మా అమ్మాయి బీటెక్ (బయోటెక్నాలజీ) రెండో సంవత్సరం చదువుతోంది. చదువు పూర్తయ్యాక తనకు ఉన్న ఉద్యోగావకాశాలను తెలపండి. **- సురేష్ మహేంద్రకర్**

జీవకణాలకు అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని బయోటెక్నాలజీగా పిలుస్తారు. సూక్ష్మజీవుల పాత్ర మానవాళి జీవితంలో కీలకపాత్ర పోషిస్తుంది. జీవ మనుగడకూ దోహదం చేస్తుంది. నాలుగేళ్ల బయోటెక్నాలజీ కోర్సు ఇంటర్ డిసిప్లినరీ కావడం వల్ల వివిధ శాఖల్లో మంచి ఉద్యోగాలున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, ఔషధ, పర్యావరణ రంగాల్లో నిపుణులను తయారు చేయడం ఈ కోర్సుల ముఖ్యోద్దేశం. కాబట్టి, ఈ రంగంలో నిపుణులకు మెడికల్ ల్యాబ్స్, రిసెర్చ్ ల్యాబ్‌ల్లో ఉద్యోగావకాశాలుంటాయి. ఉన్నత చదువులు చదవాలనుకునేవారు ఎంటెక్, ఎంఎస్‌సీలను ఎంచుకోవచ్చు.

అదనంగా ఏ కోర్సులు?

» ఫార్మా-డి పూర్తిచేశాను. అదనంగా ఏమేం కోర్సులు చేస్తే మేలు?
- గుగులోతు రవీంద్ర నాయక్

నూతన, సమకాలీన కోర్సు కావడంతో ఫార్మా-డి పూర్తిచేసినవారికి మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఔషధ, బయోటెక్నాలజీ సంస్థల్లో మెడికో మార్కెటింగ్, ఔషధ నియంత్రణ పట్టాల డాక్యుమెంటేషన్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్, డ్రగ్ ఎక్స్‌పర్ట్, కమ్యూనిటీ ప్రాక్టిషనర్ వంటి వివిధ ఉద్యోగావకాశాలను పొందొచ్చు. మేనేజ్‌మెంట్ రంగంలో అడుగుపెట్టాలనుకుంటే నైపర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారు అందించే ఎంబీఏ (హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్)లో చేరొచ్చు.

హెల్త్ అనలిటిక్స్ రంగంలో మంచి అవకాశాలున్నాయి. ఎక్కువ వేతనంతో ఉద్యోగాలను పొందే వీలుంటుంది. ఇవేకాకుండా ఏఏపీసీ వారు అందించే సీఆర్‌సీ, సీపీసీ (సర్టిఫైడ్ ప్రొఫెషనల్ కోడర్), సీఐసీ, మెడికల్ డాక్యుమెంటేషన్, ఫార్మకో విజిలెన్స్, ఎస్‌ఓపీ ప్రిపరేషన్, పేషెంట్ సేఫ్టీ వంటి తక్కువ వ్యవధి గల కోర్సులను చేసినా మంచి ఉద్యోగాలను పొందొచ్చు.

డిజైనర్ ఇంజినీర్ కావాలనుంది!

» ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాను. డిజైనర్ ఇంజినీర్ కావాలనుంది. చేరే విధానం, అందించే కళాశాలల వివరాలను అందించండి. **- నీరజ్ రాజ్**

ఆర్కిటెక్ట్/ డిజైన్ ఇంజినీర్ కావాలనుకునేవారు 10+2 (ఎంపీసీ) అభ్యసించి ఉండాలి. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఫర్ ఆర్కిటెక్చర్ (ఎన్‌ఏటీఏ) వారు నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా బి.ఆర్క్‌లో ప్రవేశాన్ని పొందొచ్చు. ఇది అయిదేళ్ల వ్యవధి గల కోర్సు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఐఐటీ-రూర్కీ, ఎన్ఐటీ- తిరుచ్చి వంటి ప్రసిద్ధ విద్యాసంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

